# శివకామి శపథం

**తమిళ మూలం: కల్కి**

**తెలుగు అనువాదం: కె. నాగరాజన్ (2021-22)**

**email: knr_sh@yahoo.com**
**website: http://taoofeverything.in/**

This translation is dedicated to
'Paranjyothi'

# Project Madurai
மதுரை தமிழ் இலக்கிய
மின்தொகுப்புத் திட்டம்

***

கல்கியின்
சிவகாமியின் சபதம்
பாகம் - 1 பூகம்பம்
(அத்தியாயங்கள் 1-47)

kalkiyin2
civakAmiyin2 capatam
part-1 (chapters 1- 47)
in tamil script, TSCII format

***

Etext in Tamil Script - TSCII format (v. 1.7)
Etext preparation: Mr. Bhaskaran Sankaran and colleagues of Anna University - KBC Research Center, MIT - Chrompet Campus, Chennai, India.
Proof-reading: Ms. Gracy & Ms Parimala, Anna Univ-KBC Center, Chennai (TAB version) & tiru N D LogaSundaram, selvi L Selvanayagi Chennai (TSCII version)
Etext prep in pdf format: Dr. K. Kalyanasundaram, Lausanne, Switzerland

This pdf file is based on InaimathiTSC font embedded in the file. Hence this file can be viewed and printed on all computer platforms: Windows, Macintosh and Unix without the need to have the font installed in your computer.

© Project Madurai 2003

You are welcome to freely distribute this file, provided this header page is kept intact.

# Acknowledgements

**Special thanks** to my daughters Samragni and Manogna and my best friend and my children's mother Rashmi for their support and encouragement through-out all my translation adventures, starting with **Ponniyin Selvan.**

Nagarajan

# శివకామి శపథం

## మొదటి భాగం

# పరంజ్యోతి యాత్ర

# అధ్యాయం - 1

## ప్రయాణీకులు

వసంత ఋతువులో  ఒకనాటి సాయంకాలం వేళ. మహేంద్ర తటాక తీరం వెంబడి ఇద్దరు ప్రయాణీకులు  కంచి మహానగరం వైపు నడిచి వెళుతున్నారు.

వారిలో ఒకాయన ఆరడుగుల , బలిష్ట దేహంగల ఆజానుబాహువు. కావి దుస్తులు ధరించిన బౌద్ధ సన్యాసి. కఠినవ్రతాలవల్లనో  లేక అతికష్ట కార్యాలవల్లనో గాని ఆయన దేహం చాల గట్టిపడివుంది. ఆయన ముఖవైఖరేమో  భక్తి, ప్రేమలను గాక ఒకవిధమైన భయాన్ని కలిగించేలాగుంది.

ఇంకొక ప్రయాణీకుడు  మంచి దేహకట్టు,  ముఖవర్చస్సు  కలిగిన పద్దెనిమిదేళ్ల యువకుడు. ప్రయాణీకులిద్దరు చాల దూరం నడిచి అలిసిపోయినట్లు కనిపిస్తున్నారు.

“ప్రధాన నగరం ఇంకా ఎంత దూరముంది?” అని అడిగాడు యువకుడు.

“అదిగో!” అని సన్యాసి చూపించిన దిక్కున దట్టమైన చెట్ల మధ్యనుంచి దూరాన మేడలు, వాటిపైని విమానాలు  అగుపించాయి.  యువకుడు  ఆ దృశ్యాన్ని కాసేపలా చూస్తూ నిలబడ్డ  తర్వాత, “ఇంకొక ఘడియలో చేరవచ్చా?” అని అడిగాడు.

“అంతే ఉంటుంది.”

“అలాగైతే నేను కాసేపిక్కడ కూర్చొని వస్తాను. తొందరగా వెళ్ళాలంటే మీరు వెళ్ళండి" అని చెప్పి చేతిలోవున్న మూటను, బడితను దారివారగా ఉంచి, చెరువు గట్టున కూర్చొన్నాడు.

సన్యాసి కూడ దగ్గరలోనే పశ్చిమదిక్కుగా చూస్తూ కూర్చొన్నారు.

అస్తమిస్తున్న సూర్యుని ఎర్రని కిరణాలు  పశ్చిమాన సగం ఆకాశాన్ని అరుణవర్ణంతో పులిమినట్లగుపించింది.

సూర్యుడస్తమిస్తున్న దిక్కున మహేంద్ర తటాకంలో ని స్వచ్ఛమైన నీరు ఆ ఎర్రటి సూర్యకిరణాలు పడి కరిగించిన బంగారంలాగ మెరుస్తూంది.

కానీ ఆ తటాకపు ఉత్తర తీరాన అందుకు విరుద్ధమైన దృశ్యం కానవస్తూంది. ఆ తీరాన ఉన్న పెద్ద గుండ్రాళ్ల నీడ చెరువు నీటిపైన పడుతుండడం వల్ల నీరు చిక్కటి నీలవర్ణందాల్చినట్లు కనిపిస్తూంది. గట్టున ఒంటికాలి జపం చేస్తున్న తెల్లని కొంగలు  ఉన్నట్లుండి  గుంపుగా ఎగిరి పైకి వెళుతున్నాయి. అవి ఆకాశాన తేలుతూ వెళుతుంటే, అవన్నీ కలగలిసిన  ఆ కమనీయ దృశ్యం ఎవరికైనా ఉల్లాసాన్ని పుట్టించి

మనసును గాలిలో తేలిపోయేలా చేస్తుంది.

ఇదంతా కాసేపు మౌనంగా చూస్తూ కూర్చొన్న యువకుడు  తనలో తాను మాట్లాడుకొంటున్నట్లు, "దీన్ని మహేంద్ర తటాకం కాదు, మహేంద్ర సముద్రం అనాలి!" అన్నాడు.

అది వినీ విననట్లు సన్యాసి, "ఇప్పుడు తటాకంలో నీరు తక్కువగా ఉంది. ఆశ్వయుజ, కార్తీక మాసాల్లో కుంభవృష్టితో ఇది పొంగి పొర్లుతున్నప్పుడు చూస్తే నీకు మతి తప్పుతుంది! అప్పుడు నిజమైన సముద్రంలాగే ఉంటుంది!" అని చెప్పి లేచారు సన్యాసి.

"బయల్దేరేశారా, స్వామీ?" అని అడిగాడు యువకుడు.

"అవును, పరంజ్యోతి! నాతో రావడం నీకెలాగూ ఇష్టం లేనట్లుంది!" అని చెప్పేసి సన్యాసి ముందుకు  నడవనారంభిం చారు.

పరంజ్యోతి అనే ఆ యువకుడు కూడ తన మూటను, కర్రను చేత తీసుకొని ఆయన వెంబడే నడవనారంభించాడు.

**బాట వచ్చేవాళ్ళు, పోయేవాళ్లతో** చాల సందడిగా  ఉంది. ప్రయాణీకులెక్కిన బళ్ళు, వరి బస్తాలు, ఎండు గడి ఎక్కించిన బళ్ళు బారులు తీరి బాట వెంబడి వెళుతున్నాయి.

బాటకు అవతలివైపంతా కనుచూపు మేరకు  కోతకొచ్చిన వరి పొలాలు. అక్కడక్కడ పొలాల్లో ఇళ్ళు కట్టుకొని నివాసమున్న రైతులు గడ్డి మోపులు కడుతున్నారు. అప్పుడే కోసిన వరి పంట నుంచి ఇంపైన వాసన 'ఘుమ్మ'ని వస్తూంది.

కాస్త దూరం వెళ్ళగానే ఒక అందమైన గ్రామం కానవచ్చింది. అది దాటిన తర్వాత కొత్త వరి పంట సువాసనకు బదులు మల్లెల సువాసన ప్రయాణీకులను  కమ్ముకొని పులకింపజేసింది.

కనుచూపు మేరకు నందనవనాలు,  మల్లె పొదలు. బొండు మల్లె పొదల మీద ఆకాశంలో ఉన్న చుక్కలు వచ్చి వాలినట్లు బొండుమల్లె పూలు చూడ ముచ్చటగా కానవచ్చాయి.

"ఇన్నేసి పూలను వీళ్ళేం చేస్తారు?" అని అమాయకంగా ఆడిగాడు యువకుడు.

"వీటిలో సగం గుళ్లలో అర్చనకు సమర్పిస్తారు. మిగతా సగం కంచి నగరంలోని స్త్రీ దేవతల జడలను అలంకరిస్తాయి... అదిగో!" అని చటుక్కున ఆగారు సన్యాసి.

సరసరమని ఒక పాము దారికడ్డంగా  వెళ్ళి నందనవనంలో మాయమైంది.

పాము మరుగైన తర్వాత ఇద్దరూ మౌనంగా ముందుకు సాగారు.

ఉన్నట్లుండి పరంజ్యోతి  ఫక్కున నవ్వాడు.

"దేన్ని తలుచుకొని నవ్వావు?" అని అడిగారు సన్యాసి.

పరంజ్యోతి కాసేపు ఏం మాట్లాడక, తర్వాత "అదికాదు, స్వామీ! మధ్యాహ్నం మీరు ఆ పామును చంపి నన్ను కాపాడారు కద? మీరు బౌద్ధ భిక్షువులు కద? జీవహత్య చేయవచ్చా అని తలచినప్పుడు నవ్వొచ్చింది!" అన్నాడు.

"తనను చంపవచ్చిన పగవారిని కూడ చంపవచ్చు కద?" అన్నారు బౌద్ధ భిక్షువు.

"కానీ ఆ పాము మిమ్మల్ని చంపరాలేదు కద? అది నన్నే కద చంపవచ్చింది?" అని తేలికగా అన్నాడు యువకుడు.

"నా శిష్యుని నేను కాపాడవద్దా?" అన్నారు సన్యాసి.

"శిష్యుడా? ఎవరు?"

"అవును. నీవొకసారి నా ప్రాణాన్ని కాపాడావు. అందుకు ప్రతిగా..."

"మీ ప్రాణాన్ని నేను కాపాడానా? ఎప్పుడు??"

"మూడు వందలేళ్ళ  క్రితం..."

"ఏమి!"

"మునుపొక జన్మలో."

"ఓహో! మీరు త్రికాల జ్ఞానులైన మునివర్యులని తెలియక అడిగాను. క్షమించండి."

సన్యాసి మౌనంగా ముందుకు సాగాడు.

మళ్ళీ పరంజ్యోతి, "స్వామీ! ఇక ముందు రాబోయేది  కూడ మీకు మీ జ్ఞానదృష్టితో చూడగలరు కద?" అని అడిగాడు.

"రాబోయేది ఒకటి చెప్పనా?"

"చెప్పండి."

"ఈ రాజ్యానికి పెద్ద యుద్ధం రాబోతోంది."

"పెద్ద యుద్ధమా?"

"అవును. మహా భయంకరమైన యుద్ధం. పాలారు నది రక్తపుటేరుగా ప్రవహించబోతూంది. మహేంద్ర తటాకం రక్త తటాకం కాబోతూంది."

“అయ్యో! భయంగా ఉంది. చాలు, స్వామీ1”

కాసేపటి తర్వాత మళ్ళీ, “రాజ్యం గురించిన సమాచారం నాకెందుకు స్వామీ? నా గురించి ఏమైనా తెలిస్తే చెప్పండి!" అన్నాడు.

“ఈ రాత్రి నీకొక కష్టం ఎదురు వస్తుంది.”

“శివ, శివా! మంచిమాట ఏదైనా చెప్పకూడదా?”

“బుద్ధభగవానుని దయవల్ల ఆ కష్టం తీరిపోతుంది.”

“నేను శైవుడిని కద? బుద్ధభగవానుడు నాపైన దయ చూపుతాడా?”

“బుద్ధుని కరుణకు ఎల్లల్లేవు.”

“అదిగో! ఆ వస్తున్నదెవరు?” అని అడిగాడు పరంజ్యోతి.

సంధ్యాకాలపు మసక వెలుతురులో వారి వైపు ఒక అపూర్వమైన  ఆకారం వస్తుండడం కనిపించింది.

“చూస్తే తెలియడం లేదా? దిగంబర శ్రమణ మునులు వస్తున్నారు!” అన్నారు బౌద్ధ సన్యాసి.

“శ్రమణ మునివర్యులు ఇంకా ఇక్కడున్నారా?”

“మూడొంతులు పాండ్య రాజ్యానికి వెళ్ళిపోయారు. మిగిలినవారు కూడ త్వరలో వెళ్ళిపోతారు.”

ఆ శ్రవణ ముని బౌద్ధ సన్యాసిలాగ బలిష్టంగా లేడు. బక్కపలచగా ఉన్నాడు. కౌపీనం మాత్రమే ఆయన ధరించిన వస్త్రం. ఒక చేత కమండలం, ఇంకొక చేత నెమలి ఈకలతో చేసిన విసనకర్ర పట్టుకొన్నారు. చంకలో ఒక చిన్న చాప.

ఆయన దగ్గరికి రాగానే , బౌద్ధ భిక్షువు, “బుద్ధం శరణం గఛ్చామి!” అన్నారు. శ్రమణ ముని, “అరుగర్ దీవించుగాక!” అన్నారు.

“చీకటి పడే సమయాన స్వాములు ఎక్కడికి ప్రయాణం చేస్తున్నారు?” అని బౌద్ధ సన్యాసి అడిగారు.

శ్రమణ ముని, “ఆహా! ఈ రుద్రభూమిలో నాకేం పని? తొండైమండలం  శ్మశానమై పోయింది కద? నేను పాండ్యరాజ్యానికి వెళుతున్నాను" అన్నారు.

“ఈ దినం ఏదైనా విశేషముందా?” అని బౌద్ధ భిక్షువు అడగగా, శ్రమణ ముని, “ఉంది, విశేషముంది. కోట తలుపులు  మూసేయబోతున్నారు" అని చెబుతూనే వేగంగా ముందుకు సాగారు.

“ఒకప్పుడు ఈ పల్లవరాజ్యంలో శ్రమణులు చెప్పిందే చట్టంగా ఉండేది. వారు గీచిన గీటు దాటక మహేంద్ర చక్రవర్తి నడుచుకొనేవారు. ఇప్పుడు...” అని చెప్పి బౌద్ధ సన్యాసి ఆపేశారు.

“ఇప్పుడు, ఏమి?” అని పరంజ్యోతి అడిగాడు.

“ఇప్పుడు శైవ, వైష్ణవుల మాటే  ఈ రాజ్యంలో చలామణి అవుతోంది.”

“ఓహో!” అన్నాడు పరంజ్యోతి. తర్వాత, “ఏదో కోట తలుపులు మూయడం గురించి చెప్పారే శ్రమణ ముని, అదేమిటి?” అని అడిగాడు.

“అదిగో చూడు!” అన్నారు సన్యాసి.

ఆ సమయాన బాటలో ఒక మలుపు తిరిగారు. ఎదురుగా కంచి మహానగరం కోట దక్షిణపు వాకిలి కనిపించింది. బ్రహ్మాండమైన  ఆ కోట వాకిలి తలుపులు మూయబడివున్నాయి.

~~~
~~~

# అధ్యాయం - 2

## రాజధాని

**కోట** గోడ చుట్టూ సుమారు నూరడుగుల వెడల్పున్న అగడ్త ఉంది. రాజబాట ఆ అగడ్త దగ్గర రెండుగా చీలి ఒకదారి కుడివైపు, ఇంకొక టి ఎడమవైపు అగడ్త వెంబడే వెళుతున్నాయి. రాజబాట వెంబడి వస్తున్న పాదచారులు, బళ్ళు ఆ రెండు బాటల్లోను ముందుకు వెళుతున్నారు.

అగడ్త మీదుగా కోట దక్షిణపు వాకిలిని చేరడానికి ఒక ఇరుకైన కొయ్య వంతెన ఉంది. బౌద్ధ భిక్షువు ఆ వంతెన మీదుగా ముందుకు సాగగా, పరంజ్యోతి కూడ అయన వెంట వెళ్ళాడు.

కోటలోపలికి ఇంత ఇరుకైన వంతెన మీద బళ్ళు, ఇతర వాహనాలు ఎలా వెళ్ళగలుగుతాయని పరంజ్యోతి ఆశ్చర్యంతో అడగగా, బౌద్ధభిక్షువు కోట తూర్పు వాకిలి, ఉత్తరపు వాకిలి ముందు చాల పెద్దవైన వంతెనలున్నాయని, వాటిమీదుగా ఏనుగులు కూడ వెళ్ళవచ్చని వివరించారు బౌద్ధ భిక్షువు.

కోటవాకిలిని చేరుకోగానే, భిక్షువు, “మరుదప్పా!” అని పిలిచారు. వెంటనే గోడపైనుంచి ఒక కాపలా సైనికుడు కిందికి చూసి, భిక్షువును గుర్తుపట్టి, కిందికి వచ్చి, వాకిలి లోపలున్న ఇంకొక చిన్న వాకిలిని తెరిచాడు. భిక్షువు, పరంజ్యోతి లోపలికి రాగానే వాకిలి మూశాడు మరుదప్ప.

పరంజ్యోతి లోపలికి వెళ్ళగానే నగరంలో దేదీప్యమానంగా వెలుగుతున్న అనేక వీధి దీపాలను, అటూ ఇటూ సందడిగా వీధుల్లో తిరుగుతున్న ప్రజలను సంభ్రమంగా చూస్తూ నిలబడ్డాడు. ఎందుకంటే పరంజ్యోతి అంత పెద్ద నగరాన్ని ఇంతవరకు చూసి ఎరగడు.

భిక్షువు తనకు వాకిలి తెరిచిన కాపలా సైనికుడుని ఉద్దేశించి, “మరుదప్పా! ఈ రోజెందుకు సందడి తక్కువగా ఉంది? కోట వాకిలి ఎందుకింత తొందరగా మూశారు?” అనిఅడిగారు.

అందుకా సైనికుడు, “స్వామీ! మీకు తెలియదా? ఈ రోజు చక్రవర్తి సభలో శివకామి అమ్మగారి నాట్య అరంగేట్రం/రంగప్రవేశం కద? అందుకే జనాలకు అంత వేడుక ఈ రోజు” అన్నాడు.

“ఏ శివకామి అమ్మ?” అని అడిగారు భిక్షువు.

“ఇంకెవరు? ఆయనర్ కుమార్తె శివకామి అమ్మగారే.”

ఇంతవరకు మౌనంగా ఉన్న పరంజ్యోతి ఉన్నట్లుండి, “ఎవరు? ఆయనర్ శిల్పాచార్యులా?” అని అడిగాడు.

“అవును!” అని చెప్పి, కాపలా సైనికుడు పరంజ్యోతిని గుచ్చి చూస్తూ, “స్వామీ! ఈ అబ్బాయెవరు?” అని అడిగాడు.

“ఇతడు నా శిష్యుడు. నువ్వు ముందుకు చెప్పు. ఈ రోజు శివకామి రంగప్రవేశం ఉంది. తర్వాత?”

“సభ చేరి, రంగప్రవేశం జరుగుతుండగా, ఉన్నట్లుండి ఒక దూత వచ్చి చక్రవర్తికి ఒక అత్యవసరమైన సమాచారాన్ని అందజేశాడట. వెంటనే చక్రవర్తి సభనుంచి వెళ్ళిపోయారట. ఆయనతోబాటు కుమార చక్రవర్తి, మంత్రివర్గం కూడ వెళ్ళిపోయారట. అస్తమించగానే కోట తలుపులన్నీ మూసేయాలని ఆజ్ఞ వచ్చింది. నాకు తెలిసిందంతే. ఏమైనా యుద్ధం వస్తుందా, స్వామీ? అయినా మన చక్రవర్తిని ఎదిరించే రాజు ఈ భూమండలం మీద ఎవడున్నాడు?” అన్నాడు మరుదప్ప.

“”అలా చెప్పలేం, మరుదప్పా! నేటి రారాజు రేపు ... అయినా అదంతా మనకెందుకు? నీకొడుకెలా ఉన్నాడు?” అని అడిగారు బౌద్ధ భిక్షువు.

“మీ దయవల్ల క్షేమంగా ఉన్నాడు, స్వామీ!” అన్నాడు కాపలా సైనికుడు. ఒకప్పుడు అతని కొడుకును పాముకాటునుంచి భిక్షువు కాపాడాడు. ఆ కృతజ్ఞత ఇప్పటికీ ఉంది మరుదప్పకు.

భిక్షువు కాపలా సైనికునికి వెళ్ళొస్తానని చెప్పి ముందుకు సాగారు. పరంజ్యోతి ఆయనతో బాటే నడుస్తూ, “స్వామీ! మూసిన కోట వాకిలి మీకు మాత్రం ఎలా తెరవబడింది?” అని అడిగాడు.

“అంతా ఈ కావి బట్టల మహిమ!” అని చెప్పేసి, “శ్రమణులు, బౌద్ధులు రాజకీయ వ్యవహారాలలో తలదూర్చరు. అది పోనీ! నీ ఉద్దేశం ఏమి? నాతోబాటు బౌద్ధవిహారానికి వస్తావా?” అని అడిగారు భిక్షువు.

“లేదు, స్వామీ! నావుక్కరసర్ మఠంలో తప్ప ఇంకెక్కడా నేను బస చేయకూడదని నా తల్లి ఆజ్ఞ.”

“అలాగైతే ఇక్కడే మనం విడిపోవాలి. ఆ మఠం ఏకాంబరేశ్వర దేవాలయం దగ్గరుంది.”

“స్వామీ! ఆ కోవెల ఎక్కడుంది?”

“అదిగో చూడు! ఆ కోవెల విమానం కనిపిస్తుంది" అని వేలెత్తి చూపించారు భిక్షువు.

ఆయన చూపిన దిక్కున ఆ విశాలమైన నగరంలో పరంజ్యోతికి అనేక విమానాలు [1] కనిపించాయి. కాబట్టి ఏ విమానాన్ని గుర్తుగా ఉంచుకొని వెళ్ళాలో తోచలేదు.

---

1 విమానాలు = కలశంలాంటి పైభాగమున్న గోపురాలు

ఈ వృత్తాంతం జరిగిన కాలంలో, అంటే సుమారు (శివకామి శపథం 1946 లో రచించబడింది) పదమూడు వందల ఇరవై సంవత్సరాలకు మునుపు దక్షిణాదిలోనే సుప్రసిద్ధమైన కంచి మహానగరంలో అనేకమైన గుళ్ళు, మాళిగలు ఉండేవి. అయితే, ఇప్పటిలాగ ప్రధాన ద్వారంపైన గాక, గర్భగుడి మీద మాత్రం విమానముండేది. దేవాలయాలు మాత్రం కాదు, మాళిగల మీద కూడ ఎత్తైన విమానాలుండేవి. అందుకే దిక్కు తోచక ఎటు వెళ్ళాలని భిక్షువును అడిగాడు పరంజ్యోతి.

“ఇక్కడినుంచి దారి చెప్పడం కష్టం. ఈ వీధిలోనే నేరుగా వెళ్ళు. మధ్యమధ్య ఆ దేవాలయానికి ఎలా వెళ్ళాలో విచారించుకొని వెళ్ళు" అని చెప్పి భిక్షువు ఇంకొక దిక్కున వెళ్ళిపోయారు.

ఆ మహానగరానికి మొట్టమొదటిసారిగా వచ్చిన ఆ పల్లెటూరి అబ్బాయి అక్కడి అద్భుతాలన్నిటినీ కళ్ళింత చేసుకొని చూస్తూ మెల్లగా ముందుకు నడిచివెళ్ళసాగాడు. ఆ నగరంలో అన్ని వీధులూ విశాలంగా ఉన్నాయి. ప్రతి ఇల్లూ ఒక మాళిగలా గ కపిపిస్తూంది. అంగళ్ళలో సువిశాల భారత దేశం నలుమూలల నుంచి వచ్చిన వస్తువులు కళ్ళు మిరుమిట్లుగొలుపుతున్నాయి. అప్పుడప్పుడు అక్కడక్క డ గుమిగూడి ఆనాటి విశేషమైన శివకామి అమ్మగారి రంగప్రవేశం గురించి మాట్లాడుకొంటున్న జనాలను ఏకాంబరేశ్వర దేవాలయానికి దారి అడిగి తెలుసుకొంటున్నాడు. కానీ కొత్తగా ఆ మహానగరాన్నిచూస్తున్న సంభ్రమంలో మునిగి, మఠానికి వెళ్ళేందుకు అంతగా తొందరపడక, నింపాదిగా నడిచి వెళ్ళసాగాడు.

అలా వెళుతూ వీధి మలుపు తిరుగుతుండగా ఉన్నట్లుండి , కాస్త దూరన్నుంచి పెద్దగా కేకలు, ఏదో గందరగోళం వినిపించాయి. ఎవరో, “కోవెల ఏనుగుకు మదమెక్కింది ! పరుగెత్తండి ! పరుగెత్తండి!” అని ఎవరో హెచ్చరించగా, అందరూ తలా ఒక దిక్కున చెల్లా చెదరై పరుగిడసాగారు.

పరంజ్యోతి ఒక్క క్షణం చేష్టలుడిగి నిలబడ్డాడు. తాను కూడ పరుగెత్తాలా, ఎటువైపు అని ఆలోచిస్తుండగానే అతని ముందు జరిగిన సంభవాలు అతని దృష్టిని ఆకట్టుకొన్నాయి. ఆ వీధిలో కాస్త దూరాన ఒక పల్లకి, అందులో సౌందర్యమే రూపందాల్చినట్లున్న ఒక యువతి, ఆమెతో ఆమె తండ్రిలా కనిపిస్తున్న ఒక పెద్దాయన కనిపించారు. ఆ పల్లకి మోస్తున్న బోయీలు వారి వెనుక వినవచ్చిన కేకలు, కోలాహలం విని పల్లకిని అక్కడే వదిలిపెట్టి పారిపోయారు.

అదే సమయాన అతడి వెనుక అతి సమీపాన భూమి దద్దరిల్లేటట్లు నడుస్తూ ఆ మదపుటేనుగు రావడం కనిపించింది.

అది గమనించిన పరంజ్యోతి ఒక్క క్షణం ఆగాడు. మరుక్షణం ఒక తీర్మానానికొచ్చి, చటుక్కున చేతి మూటను కింద పెట్టాడు. అందులోనుంచి ఒక శూలం మొనను తీసి, తన చేతనున్న కర్ర చివర దాన్ని

బిగించాడు. తనని సమీపిస్తున్న ఆ ఏనుగు వైపు తన బలాన్నంతా ఉపయోగించి గురి చూసి విసిరాడు.

ఆ శూలం ఆ ఏనుగు ఎడమ కన్ను పక్క లోతుగా దిగింది! అంతే! ఆ ఏనుగు దిక్కులు పిక్కటిల్లేలాగ ఘీంకరించి, ఆ శూలాన్ని తొండంతో పట్టి పీకి కింద పడేసి తొక్కేసి, వెనుదిరిగి చూసింది. ఇక అక్కడుంటే ప్రమాదమని గ్రహించి, పల్లకి ఉన్న దిశకు వ్యతిరేక దిశలో కాలికి బుద్ధి చెప్పాడు. ఏనుగు తన పెద్ద దేహాన్ని ఇటు తిప్పి అతన్ని వెంబడించే లోగా చాల దూరం పరుగెత్తి ఒక సందులో దూరి అంతే వేగంగా పరుగెట్టాడు. కాసేపటికి ఒక విశాలమైన వీధిని చేరుకొన్నాడు. అక్కడ అతనికెదురుగా కొన్ని ఏనుగులు, వాటి మావటీలు వాటిని పురిగొల్పగా, వేగంగా వస్తుండడాన్ని చూశాడు. అవి ఆ మదమెక్కిన ఏనుగును అదుపులోకి తీసుకు రావడానికి వెళుతున్న ఏనుగులని గ్రహించి పరుగునాపి దారి పక్కగా ఒదికి నిలబడ్డాడు.

రోజంతా ప్రయాణం, ఇప్పుడీ ప్రమాదం నుంచి పరుగు - వీటితో బాగా అలిసిపోయిన పరంజ్యోతి దారి పక్కనున్న బల్లమీద కూర్చొని కాస్త విశ్రాంతి తీసుకోసాగాడు.

ఆకాశాన పూర్ణ చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. చల్లని గాలి వీస్తూంది. అలసట కాస్త తీరిన తర్వాత నెమ్మదిగా ఆలోచించసాగాడు పరంజ్యోతి. “తాను వచ్చిన కార్యమేమి? చేసిందేమి" అని అనుకొన్నప్పుడు, ఆ మదపుటేనుగు మీద శూలం విసిరింది తలుచుకొని తనకు తానే ఆశ్చర్యపోయాడు. తానెందుకు అలా చేశాడు? ఆ మదపుటేనుగుకు చిక్కివుంటే తన గతేమి? తనమీదే ప్రాణాలు పెట్టుకొన్న తల్లిని మళ్ళీ చూడగలిగేవాడా?

పల్లకిలో ఆసీనురాలైన ఆ యువతి ముఖం, ఆ పెద్దాయన ముఖం అతని మనోనేత్రం ముందు మళ్ళీ తోచాయి. అవును; ఆ మదపుటేనుగు వల్ల వారికే ప్రమాదం కలగకూడదనే తాను దాని మీద శూలం విసిరాడు. వారెవరై ఉండవచ్చు? ఒకవేళ.. ఆమే శివకామి అమ్మగారా? ఆ పెద్దాయన ఆమె తండ్రి ఆయనర్ శిల్పాచార్యులా?

ఇలా ఆలోచిస్తూనే ఆ బల్ల మీదే మెల్లగా నిద్రలోకి జారిపోయాడు పరంజ్యోతి.

~~~
~~~

# అధ్యాయం - 3

## దేవుడే కాపాడాడు!

**మదపుటేనుగు** మీద ఆ యువకుడు శూలం విసరడం, వెర్రెక్కిన ఆ మదపుటేనుగు వెనుదిరిగి అతన్ని వెంబడించి పరుగెత్తడం పల్లకిలోవున్న పెద్దాయన, యువతి చూశారు. అతని ధీరత్వాన్ని, తెంపరితనాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు.

తర్వాత అతనికేమైందని విచారిద్దామని పల్లకి దిగి ఎవరినైనా అడుగుదామని చుట్టూ చూస్తే ఆ వీధంతా నిర్మానుష్యంగా ఉంది. ఆ అబ్బాయికి ఏమైందోనని ఇద్దరూ దిగులు పడసాగారు.

పల్లకినుంచి దిగిన తర్వాత ఆయన అమ్మాయిని దగ్గరకు తీసుకొని, "భయపడ్డావా, అమ్మా?" అని అడిగారు. అందుకు ఆమె తానేమీ భయపడలేదని బదులిచ్చింది.

"సమయానికి ఆ అబ్బాయి వచ్చి ఆ మదపుటేనుగు మీద శూలం విసిరివుండకపోతే మన గతేమి?" అన్నదా అమ్మాయి.

"పల్లకి ముక్కలు చెక్కలైవుండేది" అన్నారా పెద్దాయన.

"అయ్యో!"

"అందుకే బోయీలను పల్లకిని కిందపెట్టి పారిపోమన్నాను. మనం కూడ దిగి పక్కింటి లోపల దూరివుండవచ్చు. అయితేనేం, వచ్చిన ప్రమాదం వీడింది" అన్నారు పెద్దాయన.

కాసేపటికల్లా పారిపోయిన వారందరూ మెల్లగా తిరిగి రాసాగారు. వారిలో కొందరు ఆయనర్ ఆచార్యులను, వారి కుమార్తెను గుర్తుపట్టి, "ఆహా! ఆయనర్, ఆయన కుమార్తె శివకామి కద! మంచివేళ! దేవుడే వారిని కాపాడాడు!" అన్నారు. వెంటనే తక్కిన వారందరూ అలాగే చెప్పుకోసాగారు.

పెద్దాయన మాత్రం, దేవుడే కాపాడినా, ఆ దేవుడు ఆ అబ్బాయి రూపంలో కద వచ్చి కాపాడాడు, అనుకొన్నారు. ఆ అబ్బాయి జాడలేమైన వారికి తెలుసేమో అని విచారించి చూశారు. కానీ ఎవరూ ఆ అబ్బాయి ఎటు పరుగెత్తాడో, తర్వాత ఏమయ్యాడో చెప్పలేకపోయారు.

ఆయనర్ ఏనుగు చివరిగా నిలబడ్డ చోటుకు వెళ్ళి పరిశీలనగా చూశారు. అక్కడ పడివున్న శూలాన్ని, విప్పిన మూటను చూసి, చేతికి తీసుకొని పల్లకి దగ్గరికి తిరిగి వచ్చారు. శివకామి ఆ శూలాన్ని తీసుకొని దానివైపు ఆశ్చర్యంతో చూడసాగింది.

ఆయనర్, “శివకామి! ఇక్కడ వేచివుండడం వృధా. మనం వెంటనే బయల్దేరి ఇంటికి వెళదాం. అన్ని వివరాలు రేపటికవే తెలుస్తాయి" అన్నారు.

తండ్రీ కూతుళ్ళు పల్లకి ఎక్కనుండగా, దూరాన ఐదారు గుర్రాలు వేగంగా ఇటువైపే రావడం కానవచ్చింది. వాటిలో ముందుగా వస్తున్న ఒక తెల్ల గుర్రం మీద ఆజానుబాహువైన ఒక గంభీరమైనపురుషుడు , వెనక ఇంకొక గుర్రంమీద అంతటి రాజలక్షణాలున్న యువకుడు కానవచ్చారు. వారి వెనుక వస్తున్న గుర్రాలమీద శూలాలు చేతబట్టిన వీరులు వచ్చారు.

మొదటి గుర్రం మీద వస్తున్నది పల్లవ చక్రవర్తి మహేంద్రపల్లవులని  చుట్టూవున్న ప్రజలు గుర్తుపట్టగానే , “మహేంద్ర మహాపల్లవులకు జయహో! త్రిభువన చక్రవర్తికి జయహో! కుమార చక్రవర్తి మహామల్లుకు జయహో!” అన్న జయఘోషలు చేశారు.

ఆ శ్వేతాశ్వాల మీద ఏతెంచిన వారు మహేంద్రపల్లవ చక్రవర్తి , ఆయన ఏకైక పుత్రుడు నరసింహవర్మ అని తెలియగానే ఆయనర్, శివకామి చాల ఆశ్చర్యపడ్డారు. శివకామి బిడియంగా తన తండ్రి వెనక ఒదిగి నిలబడింది. కానీ ఆమె కళ్ళు మాత్రం చక్రవర్తి వెనుకనున్న కుమార చక్రవర్తి మీదే నిలిచాయి.

చక్రవర్తి, “ఆచార్యా!  ఇదేమి వైపరీత్యం? నేను విన్నది నిజమేనా?” అని అడిగారు.

ఆయనర్, “ప్రభూ! ఏకాంబర స్వామి దయవల్ల ఆపద తప్పింది!” అన్నారు.

చక్రవర్తి శివకామిని ఆప్యాయంగా చూసి, “బిడ్డా! నేను నీ రంగప్రవేశ నాట్యాన్ని పూర్తిగా చూడక వెళ్ళిపోయానని మనస్తాప పడ్డావా?” అని అడిగారు.

అందుకు శివకామి బదులు చెప్పక బిడియంగా నేలవైపు చూపులు సారించగా, ఆయనర్, “ప్రభూ! అమ్మాయికి అంతమాత్రం తెలియదా? ఏదో అత్యవసర కార్యం వల్లనే మీరు మధ్య లేచి వెళ్ళారని గ్రహించింది" అన్నారు.

అందుకు చక్రవర్తి, “అవును, ఆయనర్‌గారూ! అదంతా తర్వాత వివరంగా చెబుతాను. మంత్రివర్గంతో మంత్రాలోచన ముగియగానే మీ గురించి విచారించాను . మీరు అప్పటికే తిరిగి వెళ్ళిపోయారని తెలిసింది. మీరు ఈ రోజే మీ ఇంటికి తిరిగి వెళ్ళాలనుకొన్నారా? నిజమే! మీరు మీ శిల్పకళను విడిచి ఒక్క రోజు కూడ ఉండలేరని తెలుసు" అన్నారు.

“అవును, ప్రభూ1 ఇప్పుడు పూర్ణచంద్రుడు ప్రకాశిస్తూ రాత్రిని పట్టపగలు చేయగా, ఇప్పుడే ఇంటికి వెళదామని నిశ్చయించాను" అన్నారు ఆయనర్.

అప్పుడు ఆయన వెనుకనున్న అశ్వం మీదినుంచి కుమార చక్రవర్తి దిగి, తండ్రిని సమీపించి,

“నాన్నా! ఆ మదపుటేనుగు మీద శూలం విసిరిన యువకుని గురించి విచారించలేదే!” అని చెప్పి, ఆయనర్ వైపు చూస్తూ, “అతడు ఎక్కడికి వెళ్ళాడని మీకేమైనా తెలుసా?” అని అడిగారు.

“అదే తెలియరావడం లేదు. శూలాన్ని విసిరిన వెంటనే మెరుపులా మాయమైపోయాడు. కానీ అలా పరుగెత్తినందువల్లే బతికిపోయాడు. దేశాంతరంగా వచ్చిన పిల్లాడిలాగున్నాడు" అన్నారు ఆయనర్.

కుమార చక్రవర్తి నరసింహవర్మ తనని సమీపించగానే  మళ్ళీ తల దించుకొంది శివకామి. అందాక చేతనున్న శూలం చేయిజారి కిందపడింది.

వెంటనే దాన్ని గమనించి కుమార చక్రవర్తి దాన్ని తీసుకోవడానికి సమీపించగా, శివకామి తీసి ఆయన చేతికిచ్చింది. అప్పుడు వారి చేతివేళ్ళు ఒక్క క్షణం తగిలి, విద్యుదాఘాతం తలిగిన వారిలా చివ్వున వెనక్కు అడుగేశారిద్దరూ.

నరసింహవర్మ కాస్త సంబాళించుకొని, ఆయనర్ వైపు చూసి, “మిమ్మల్ని కాపాడింది ఈ శూలమే కద?” అని అడిగారు.

“అవును, పల్లవకుమారా!” అని చెప్పి ఆయన ఇంకా ముందుకేదో చెప్పబోగా, ఆయనకడ్డొచ్చి, తమ తండ్రివైపు తిరిగి, “నాన్నా! ఆ అబ్బాయి గనక ఈ శూలాన్ని విసిరి ఆ ఏనుగును ఆపివుండకపోతే, పల్లవసామ్రాజ్యం తన మహాశిల్పిని కోల్పోయేది కద!” అన్నారు.

అందుకు చక్రవర్తి, “మహాశిల్పిని మాత్రమే కాదు, పల్లవ సామ్రాజ్యం తన సుప్రసిద్ధ నాట్య కళాకారిణిని కూడ కోల్పోయివుండేది" అని శివకామివైపు ఆప్యాయంగా చూసి, “బిడ్డా! ఈ రోజు నీ నాట్యం అద్భుతంగా ఉంది. పూర్తిగా చూడలేకపోయాను" అన్నారు.

తర్వాత ఆమె తండ్రిని చూసి, “ఆచార్యా! మీతో మాట్లాడవలసిన విషయాలు చాల ఉన్నాయి. వీలు చూసుకొని, రేపుగాని, ఎల్లుండిగాని  మహాబలిపురం  వస్తాను" అని చెప్పి బయలుదేరేందుకు సిద్ధపడ్డారు.

అప్పుడు కుమార చక్రవర్తి తమ వెనుక నిలబడ్డ అశ్వవీరులలో ఒకని చూసి, “బయటి ఊరినుంచి వచ్చిన యువకుడెవరున్నా కూడ ఈ రాత్రి లోపల పట్టి రేపు ఉదయం రాజభవనానికి తీసుకొని రమ్మని కోట రక్షణాధికారికి  నా ఈ ఆజ్ఞను తెలియజెప్పు!” అని ఆజ్ఞాపించారు.

వెంటనే చక్రవర్తి, ఆయన కుమారులు తమ తమ గుర్రాలెక్కి వెళ్ళారు. వారటు వెళ్ళగానే ఆయనర్, ఆయన కుమార్తె పల్లకెక్కారు. కాపలావారు పల్లకి చుట్టు కాపలా కాస్తూ రాగా, అది కంచి కోట దిగువ (దక్షిణపు) వాకిలి వైపు సాగింది. •

# అధ్యాయం - 4

## దుశ్శకునం

**పరంజ్యోతి** వీధి పక్కనున్న బల్లమీద నిద్రకొరిగి పావుగంట కూడ కాలేదు. ఎవరో మాట్లాడుకొంటున్న శబ్దం వినగానే ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. వీధిలో ఇద్దరిలా మాట్లాడుకోవడం వినిపించింది.

“ఈ రోజు కోవెల ఏనుగుకు మదపిచ్చెక్కిందట!”

“అలా కోవెల ఏనుగుకు పిచ్చెక్కడం దుశ్శకునమట. దేశానికేదో పెద్ద విపత్తు రాబోతూంది అని అందరూ అనుకొంటున్నారు.”

“అసలా ఏనుగుకు ఎలా పెర్రెక్కిందట?”

“ఎవరికి తెలుసు? కానీ ఎవరో బయటి ఊరినుంచి వచ్చిన అబ్బాయొకడు దాని మీద శూలం విసిరినందువల్లే దానికి పెర్రెక్కిందట"

...

ఆ తర్వాత వారు మాట్లాడుకొన్నది పరంజ్యోతికి వినిపించలేదు. “శూలాన్ని విసిరినందువల్లే ఏనుగుకు పెర్రెక్కింది!” అన్న మాట చెవిన పడగానే అతడికి ఇంకొక విషయం గుర్తొచ్చింది. ఏనుగు మీదికి శూలం విసిరిన చోటే తన మూటను వదిలి పరుగెత్తి వచ్చేశాడు. అందులో నావుక్కరసర్, ఆయనర్ శిల్పాచార్యులకు రాసిన పత్రాలున్నాయి. వాటితోబాటు తన బట్టలు, కాస్త డబ్బు ఉన్నాయి. కాబట్టి ఎలాగైనా వెదికి ఆ మూటను తెచ్చుకోవాలి. కానీ ఈ మహానగరంలో దిక్కు తెలియక పరుగెత్తి వచ్చేసిన తాను తిరిగి ఆ చోటును వెతికి పట్టుకోగలడా? అయినా కూడ, ఆ మూట ఇంకా అక్కడే ఉంటుందా?

పొద్దు పోను పోను వీధుల్లో జనసంచారం తగ్గిపోసాగింది. ఇళ్ళ తలుపులు మూసివేయబడుతున్నాయి. వీధి దీపాలను కూడ చాల వరకు ఆర్పేస్తున్నారు. ఆ చోటు ఇప్పుడు తానున్న చోటుకు ఏ దిశలో ఉందన్నది కూడ తెలియకుంది. ఎలా కనిపెట్టడం? అదృష్టవశాత్తు పూర్ణచంద్రుని ప్రకాశం వల్ల వెలుతురుంది. అది ఆకాశాన నడి నెత్తికి వస్తున్నందువల్ల అర్ధరాత్రి అయివుండాలని గ్రహించాడు. రోజంతా ప్రయాణం, తర్వాత ఈ సంఘటన. తిండి, నీరు లేవు. దానితో చాల అలిసిపోయి, రాత్రికి ఎక్కడైనా పడుకోవడానికి చోటు దొరికితే చాలని అనుకొంటూ మెల్లగా ముందుకు నడిచి వెళ్ళసాగాడు.

కానీ ఎలా ఆ చోటును చేరుకోవడం ? దారి అడగడానికి వీధుల్లో ఎవరూ లేరు కూడాను. ఈ మహానగరం లో, వేలకొద్ది మాళిగలు, మంటపాలు ఇళ్ళున్న మహానగరంలో తనకి ఒక్క రాత్రి నిద్రపోవడానికి తావు లేదా?

ఇలా అనుకొంటూ వెళుతుండగా ఒక వీధి మలుపున ఎవరో ఇద్దరు వస్తూండడం కనిపించింది. చూస్తే వారు నగర కాపలాభటుల్లాగున్నారు. ఇతన్ని చూడగానే వారే ఆగారు.

“ఎవరబ్బాయ్ నీవు? అర్ధరాత్రి ఎక్కడికి వెళ్ళడానికి బయల్దేరావు?” అని అడిగారు.

“బయటి ఊరినుంచి వచ్చాను" అన్నాడు పరంజ్యోతి.

“అంటే?”

“చోళదేశం నుంచి వచ్చాను."

“ఉరయూరా?”

“కాదు, శెంగాట్టంగుడి అనే చిన్న గ్రామం.”

“అక్కడినుంచి ఇక్కడికెందుకొచ్చావు?”

"నావుక్కరసర్ మఠంలో తమిళం నేర్చుకోవడానికి వచ్చాను. అక్కడికెలా వెళ్ళాలో దారి చూపగలరా?”

ఇది విని కాపలా భటుల్లో ఒకడు రెండవవాడివైపు చూసి నర్మగర్భంగా నవ్వి, “ఓ! అలాగే! మేమే నిన్నక్కడికి తీసుకొని వెళ్ళి విడిచిపెడతాం, రా!” అన్నాడు.

అందుకు పరంజ్యోతి అలాగేనని చెప్పి వారి వెంట వెళ్ళాడు. కాసేపటికి వారు ఎత్తైన ప్రాకారపు గోడలతో ఉన్న ఒక పెద్ద కట్టడాన్ని సమీపించారు. దాని ముందు వచ్చి ఆగారు.

“ఇదేనా మఠం?” అని అడిగాడు పరంజ్యోతి.

“అవును! చూస్తే ఇది మఠం లాగ అగుపించడం లేదా?” అని అడిగాడు కాపలావాడు.

కానీ ఎందుకో పరంజ్యోతికి అది మఠం కాదనే అనిపించింది. దాని ప్రధాన ద్వారం తాళం వేయబడివుంది. లోపల దీపాలేవీ వెలగడం లేదు. పూర్తి నిశ్శబ్దంగా ఉంది. ఇదీ అని తెలియని సందేహం కలిగింది అతడి మనసులో.

కాపలాభటుల్లో ఒకడు ప్రధానద్వారం వద్దనున్న కాపలావాడికి ఏదో చెప్పాడు. వెంటనే ద్వారం తెరవబడింది.

"రా, తమ్ముడూ!" అని చెప్పి వారిద్దరు అతన్ని లోపలికి తీసుకొని వెళ్ళారు. లోపలంతా చీకటి మయం. కాస్త ముందుకు వెళ్ళిన తర్వాత ఒక చీకటి కొట్టు ముందుకు వచ్చి ఆగారు. లోపల కాస్త గడ్డి, ఒక చాప ఉన్నాయి.. మూల ఒక కుండలో నీళ్ళున్నట్లుంది. ఆ గదిని చూపించి, "రాత్రి ఇక్కడే పడుకో! ఇప్పుడు మఠంలో అందరూ నిద్రపోతున్నారు. పొద్దున లేచి వారిని కలిసి మాట్లాడుకోవచ్చు" అన్నాడు మొదటి కాపలా భటుడు.

పరంజ్యోతి లోపలికి వెళ్ళక తటపటాయించడం చూసి, "ఏం, తమ్ముడూ1 ఇక్కడ బస చేయడం ఇష్టం లేదా? లేదంటే బయటికి వెళ్ళవచ్చు" అన్నాడు..

"అదేం లేదు. రాత్రి ఇక్కడే పడుకొంటాను" అని చెప్పి గది లోపలికి వెళ్ళాడు.

అప్పుడా కాపలా భటుడు, "తమ్మూడూ! ఇది మఠమే! కానీ నావుక్కరసర్ మఠంకాదు, రారాజైన మహేంద్ర చక్రవర్తి మఠం!" అని చెబుతూనే  తలుపు వేశాడు.

వెంటనే గది తలుపు బయటినుంచి తాళం వేయబడ్డ శబ్దం వినిపించింది!

~~~
~~~

# అధ్యాయం - 5

## ముద్దుల కొడుకు

**పొన్ని** నది పరవళ్ళు తొక్కుతూ తన వేవేల ఉపనదులతో అతి సారవంతం చేసి బంగారం పండించే దక్షిణ చోళనాడులో శెంగాట్టంగుడి అనే గ్రామం ఉండేది. అక్కడ మామాత్తియార్ అనే ఒక పురాతనవంశంలో పుట్టిన పిల్లాడు పరంజ్యోతి. చోళదేశ ప్రాభవం మహోన్నత స్థితిలో ఉన్నప్పుడు అతని ముత్తాతలు చోళదేశపు సైన్యంలో దళపతులుగాను, సైన్యాధిపతులుగాను విరాజిల్లారు. కానీ తర్వాత పల్లవ సామ్రాజ్యం బలం పుంజుకొని , చోళనాడు ప్రాభవం కుంగిపోయింది. కాబట్టి గత కొన్ని తరాలుగా పరంజ్యోతి వంశీకులు యుద్ధవిద్యలను వదిలిపెట్టి వ్యవసాయవృత్తిని చేపట్టారు.

పరంజ్యోతి చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయి, తల్లి ముద్దు బిడ్డగా పెరిగాడు. ఎంచేతనో వాడికి చదువొంటబట్టలేదు. 'మొరటువాడు', 'తుంటరి' అని చుట్టుపక్కల పేరు తెచ్చుకొన్నాడు. కానీ చదువుకు బదులు వీరవిద్యల్లో చురుకుదనం సహజంగా వచ్చింది. వీరాధివీరులని పేరుగాంచిన అతడి ముత్తాతల వీరరక్తం అతడి నరనరాల్లో ప్రవహిస్తుండగా, విలువిద్య, ఖడ్గవిద్య, మల్లవిద్య మొదలైన అన్ని యుద్ధవిద్యల్లోను ఆరితేరాడు.

పరంజ్యోతి తల్లి వడివళగి తన ఏకైకపుత్రుని ప్రాణానికి ప్రాణంగా చూసుకొనేది. కానీ వాడి మొరటు ప్రవర్తన, చేష్టలు ఆ తల్లికి చాల దిగులునిచ్చాయి. ఆమె కళలకు, శివభక్తికి పేరుగాంచిన కుటుంబంనుంచి వచ్చిన వనిత. ఆమె అన్నగారు తిరువెంగాట్టు అనే ఊరిలో పేరుగాంచిన వైద్యులు; మహా శివభక్తులు, తమిళభాషలోనే గాక ఉత్తరదేశ భాషల్లోను నిష్ణాతులు.

అటువంటి ఆమె అన్నగారి పెద్దకూతురు 'ఉమైయాళ్' అందంలోను, గుణంలోను సాటిలేనిది. అలాగే చదువులోను, శివభక్తిలోను పేరుగాంచినది.

ఆ అమ్మాయికి తన కొడుకునిచ్చి పెళ్ళి చేయాలని పరంజ్యోతి తల్లి ఆశపడేది. కానీ చదువురాని తన మొరటు కొడుక్కి తన అన్నగారు కూతురినిస్తారా అన్న సందేహం, దిగులు ఆమె మనసులో గూడు కట్టుకొన్నాయి.

తన కుమారునికి చదువు చెప్పించాలని ఆ తల్లి చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి. వాడికి చదువు చెప్పేందుకు ఏర్పాటు చేసిన ప్రతి అయ్యవారు చాలరోజులు ఉండేవారు కారు. తల్లి దగ్గరికి వచ్చి, “అమ్మా! మీ కొడుకు చాల చురుకు, ఒకసారి చెప్పింది వెంటనే అర్థం చేసుకొంటాడు. కానీ ఆ

ఒక్కసారి వాడు వినేలా చేసేలోపు మా తలప్రాణం తోకకొస్తూంది. ఇక మావల్ల కాదు" అని చెప్పి వెళ్ళిపోయేవారు. దానితో పరంజ్యోతి చదువు మూలపడింది.

ఇందువల్ల పరంజ్యోతి అమ్మ చాల దిగులుపడేది. ఒకయేడు పొంగల్ (అంటే, సంక్రాంతి) పండుగకు వారు పరంజ్యోతి మామ ఇంటికి వెళ్ళారు. అక్కడ ఒక సందర్భాన పరంజ్యోతి అమ్మతో ఆమె అన్నగారు తమ కూతురు పెళ్ళి గురించి దిగులుపడుతున్నానని చెప్పడం పరంజ్యోతి చెవిన పడింది.

ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత ఒకరోజు పరంజ్యోతి అలవాటు ప్రకారం ఊరంతా తిరిగి ఇంటికి వచ్చి చూడగా, వాళ్ళమ్మ ఒక మూల పడుకొని ఏడుస్తుండడం గమనించాడు. దగ్గరికి వెళ్ళి పక్కనే కూర్చొన్నాడు. కానీ ఎందుకు ఏడుస్తున్నావని అడగడమో, ఏడవకని ఓదార్చడమో చేయలేదు.

అందుకు బదులు, “అమ్మా! నేనొక నిర్ణయానికొచ్చాను. అందుకు నీవడ్డు చెప్పకూడదు. అదేమంటే, నేను కంచికి వెళ్ళాలనుకొంటున్నాను" అన్నాడు.

అది విని అమ్మగారు అదిరిపడి లేచి కూర్చొన్నది. “కంచికా? ఎందుకు?” అని అడిగింది.

“అవును. కంచికి వెళ్ళి చదువు నేర్చుకోవాలనుకొంటున్నాను" అన్నాడు.

“చదువు నేర్చుకోవడానికి కంచికి వెళ్ళనేల? ఈ ఊళ్ళోనే నేర్చుకోలేవా?”

“నేనీ ఊళ్ళో ఉన్నంతవరకు నాకు చదువబ్బదు. మంచి విద్యాభ్యాసం కావాలంటే కంచికే వెళ్ళాలని అందరూ చెబుతున్నారు. నేనంతా విచారించి తెలుసుకొన్నాను" అన్నాడు పరంజ్యోతి.

అతడు చెప్పింది నిజమే. ఆ కాలంలో భరతఖండంలోనే కంచి మహానగరం సకల విద్యలకు, కళలకు కాణాచి అని పేరుగాంచింది. చిత్రం, శిల్పం, నాట్యం మొదలైన కళలు నేర్చుకోవడానికి, వేదాలు, తమిళభాషాసాహిత్యం నేర్చుకోవడానికి సుప్రసిద్ధమైన పాఠశాలలుండేవి.

వీటన్నిటికన్న అప్పటికి కొంతకాలం క్రితం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఒక సంభవం జరిగింది. అదేమంటే, సాటిలేని మేటివీరుడు, మహాబుద్ధిశాలి అయిన మహేంద్ర పల్లవ చక్రవర్తి జైనమతాన్ని విడనాడి శైవమతాన్ని తీసుకోవడమే.

ఇంతకీ పల్లవ చక్రవర్తి ఉన్నట్లుండి జైన మతాన్ని వదిలి శైవమతాన్ని ఎందుకు, ఎలా స్వీకరించారు? ధర్మసేనుడన్న మారుపేరుతో జైనమునిగా పేరుగాంచిన నావుక్కరసర్ స్వామి. తర్వాత ఆయన సహోదరి తిలకవతి శివభక్తి ప్రభావంవల్ల జైనమతం వీడి శైవమతాన్ని స్వీకరించారు. అంతమాత్రమేకాదు, ఇంపైన తమిళభాషలో ఎన్నెన్నో భక్తిగీతాలు రచించి, పాడి వినిపించారు. ఆ భక్తిగీతాలను మధురమైన తమిళంలో విన్న పల్లవ చక్రవర్తి పరవశించిపోయి వెంటనే శైవమతాన్ని

స్వీకరించారు. ఈ వృత్తాంతం తమిళనాడంతా వ్యాపించింది. నావుక్కరసర్ స్వామివారు చక్రవర్తి కోరిక మేరకు కంచికి వచ్చి మఠాన్ని స్థాపించారు. ఆ మఠంలో దైవతమైన తమిళభాషను, ఇంపైన పాటలను నేర్పిస్తారన్న మాట దేశమంతా విస్తరించింది. పరంజ్యోతి అది విని మంత్రముగ్ధుడైనవాడిలాగ కంచి మీదే గురి ఉంచాడు.

తన ఏకైకపుత్రుని వీడి ఉండాలనే దిగులు ఒకవైపు వేధిస్తున్నా కూడ, చివరికి తన కుమారుడు కంచి మహానగరంలో సుప్రసిద్ధమైన మఠంలో చదువు నేర్చుకోబోతాడన్న ది పరంజ్యోతి తల్లికి అమితమైన సంతోషాన్ని కలిగించింది. వెళ్ళేందుకు కొన్ని రోజులకు ముందు పరంజ్యోతి తల్లి దగ్గరకు వచ్చి, ''అమ్మా! మామకు చెప్పు. నేను కంచికి వెళ్ళి చదువు నేర్చుకొని తిరిగి వచ్చేదాక ఉమైయాళ్‌ని ఎవరికీ ఇచ్చి పెళ్ళి చేయవద్దని చెప్పు" అన్నాడు. అది ఆ తల్లికి మరింత సంతోషాన్ని కలిగించింది.

పరంజ్యోతి తీర్మానం అతడి మామకు కూడ చాల సంతోషాన్నించింది. ఆయనకు నావుక్కరసర్ స్వామి పరిచయం ఉండడం వల్ల, ఆయనకు ఒక పత్రాన్ని రాసి పరంజ్యోతికిచ్చారు. అలాగే ఆయన స్నేహితులైన ఆయనర్ శిల్పాచార్యులకు కూడ పరంజ్యోతికి శిల్పకళ నేర్పించమని వేడుకొంటూ ఇంకొక పత్రాన్ని రాసిచ్చారు.

ఒక మంచి ముహూర్తాన పరంజ్యోతి కంచికి బయల్దేరాడు. తల్లి వద్ద, మామవద్ద ఆశీస్సులు, తక్కినవారి దగ్గర సెలవు తీసుకొన్నాడు. వెళుతూ, వెళుతూ తనవైపే చూస్తూంటుందని తెలిసిన ఉమైయాళ్ వైపు చివరిగా ఒక చూపు చూసి ముందుకు సాగాడు.

బయల్దేరేటప్పుడు, చివరిగా పరంజ్యోతి మామగారు అతడికి ఒక సలహా ఇచ్చారు. ''నీవు ఆ శూలాన్ని దారిలో నీ ఆత్మరక్షణకోసం తీసుకొని వెళుతున్నావని తెలుసు. అయితే కంచి నగరం శివార్లు చేరగానే దాన్ని దూరంగా విసిరి పడేసేయ్" అన్నారు.

~~~~
~~~~

# అధ్యాయం - 6

## ఆ తాడు రహస్యమేమి?

**చెరసాల** గదిలో చింకిచాప మీద పడుకొని తన పరిస్థితిని గురించి ఆలోచిస్తున్న పరంజ్యోతికి తన మామ చివరిగా చేసిన హితబోధ గుర్తుకొచ్చి నవ్వుకొన్నాడు. కంచికి చేరేలోపు శూలాన్ని దూరంగా విసిరిపేయమన్నాడు. మరి తానలాగే చేశాడు కూడాను! పెధవది పెళ్ళి ఆ మదమెక్కిన ఏనుగు మీద పడి తనకీ గతి పట్టించింది. అందులోను ఈ కంచి మహానగరంలో అడుగుపెట్టిన మొదటిరోజే!

చటుక్కున అతడికి ఆ బౌద్ధ భిక్షువు గుర్తొచ్చాడు. ఆయనిప్పుడెక్కడున్నాడో? పెళుతూ, పెళుతూ ఒక మాటన్నాడు కద, తనకు ఏదో విపత్తు ఎదురు కాబోతోందని? అది నిజమైంది కద!

ఆరోజు మధ్యాహ్నం తాను ఆ భిక్షువును కలుసుకొన్న సంభవాన్ని గుర్తుతెచ్చుకొన్నాడు. దారిలో కంచి ఇంకా ఎంత దూరముందని విచారించగా, ఇంకొక కోసు దూరం మాత్రమే ఉందని తెలియవచ్చింది. అలాగైతే దారి పక్కనున్న చెట్టు కింద కాస్త సేదదీరి నింపాదిగా సాయంత్రం లోపల నగరం ఛేరవచ్చని ఒక చెట్టుకింద పడుకొన్నాడు, తన మూటను తల కింద, బడితను పక్కన పెట్టుకొని.

కాసేపటికల్లా దూరాన ఒక బౌద్ధ భిక్షువు వస్తూండడం కనిపించింది. బయల్దేరే ముందు బౌద్ధ, జైన సన్యాసుల నుంచి దూరంగా ఉండమని తన అమ్మగారు చెప్పిన హెచ్చరిక గుర్తుకొచ్చి, ఆ భిక్షువు తనని దాటి పెళ్ళేవరకు నిద్ర నటిద్దామని నిశ్చయించుకొన్నాడు.

కానీ అందుకు విరుద్ధంగా ఎవరో తన దగ్గర వచ్చి నిలబడ్డట్టు అనిపించగా కళ్ళుతెరిచాడు. ఆ భిక్షువు తన సమీపాన నిలబడి తననే గుచ్చి చూస్తున్నారు. ఆయన చేతిలో చచ్చిన ఒక ఐదడుగుల పొడవున్న నాగుపాము పేలాడుతూంది.

మరుక్షణం అదిరిపడి లేచి నిలబడ్డాడు పరంజ్యోతి. “స్వామీ! ఏమీ విచిత్రం? ఎందుకీ చచ్చిన పామును నా ముందు చూపుతున్నారు? దూరంగా విసిరేయండి!” అని అడిగాడు.

“అబ్బాయీ! ఈ అడవి ప్రదేశంలో ఒంటరిగా చెట్టు కింద పడుకొని నిద్రపోవచ్చా? ఇది నిన్ను కరిచివుంటే నీ గతేమి? సమయానికి నేను వచ్చి దీన్ని కొట్టడం వల్ల బతికిపోయావు!” అంటూ దాన్ని దూరంగా విసిరేశారు.

పరంజ్యోతి వస్తున్న నవ్వును దాచుకొని, “స్వామీ! నా తల్లికి నేనొకడినే కొడుకుని. ఈ విషయం తెలిస్తే ఆమె మీకు చాల కృతజ్ఞతలు తెలుపుతుంది.” అన్నాడు.

తర్వాత తన మూటను, కర్రను తీసుకొని సిద్ధమయ్యాడు. "స్వామీ! తమ దివ్యనామం ఏమిటో? మా అమ్మ అడిగితే చెప్పగలను..." అన్నాడు. "నన్ను నాగనంది అంటారు. నీవెక్కడికి వెళుతున్నావు?" అని అడిగారు.

అందుకు పరంజ్యోతి, "నేను కంచికి వెళుతున్నాను. మీరు?"

"నేను కూడ అక్కడికే వెళుతున్నాను. రా, ఇద్దరం కలిసి వెళదాం" అన్నారు.

~

పేరుకు తగ్గట్టు రూపమున్న ఆ భిక్షువుకు నిజంగానే త్రికాలజ్ఞాముందో, లేక ఏదో తోచింది చెప్పారో తెలియదు గాని, ఆయన చెప్పిన మాటల్లో ఒకటి నిజమైంది. ఇక రెండవది, ఈ ఆపదనుంచి బుద్ధ భగవానుని దయవల్ల బయటపడతానని - అది కూడ నిజమౌతుందా?

నిజానికి పరంజ్యోతి తానున్న పరిస్థితిని గురించి ఏమాత్రం దిగులు పడలేదు. తానేం తప్పు చేయలేదని, పొరబాటున తనని బంధించి చెరపట్టారని, పొద్దున నిజానిజాలు తెలిసిన వెంటనే తనను విడుదల చేస్తారని దృఢంగా నమ్మాడు.

కాబట్టి, రాత్రి నెమ్మదిగా నిద్రపోవడమని నిశ్చయించుకొన్నాడు. కానీ తనకి నిద్రే రావడం లేదు. ఎందుకని ఆలోచించగా, కడుపులో ఏమీ లేదని, విపరీతమైన ఆకలి వల్లే నిద్ర పట్టడం లేదని గ్రహించాడు. ఆహా! ఈ కంచి మహానగరంలో బయటి ఊరినుంచి వచ్చిన అతిథులకు దొరికే సత్కారమిదేనా? భోజనం కూడ ఇవ్వకుండ చెరసాలలో పడేస్తారా?

ఇలా పరంజ్యోతి ఆలోచిస్తుండగా, ఉన్నట్లుండి ఆ గదిలో ఒక మార్పు రావడాన్ని గమనించాడు. అదేమంటే, అంతవరకు చిమ్మచీకటి కమ్ముకొన్న ఆ గదిలోకి కాస్త వెలుతురు రాజొచ్చింది. ఎక్కడినుంచబ్బా అని ఆలోచిస్తూ కలయజూడగా, అది గది చూరులోవున్న చిన్న రంధ్రంనుంచి అని తెలిసింది. ఆహా! చంద్రుడు సరిగ్గా పైకి రాగానే ఆ చంద్రకిరణాలు గదిలోకి ఆ చూరులోనున్న రంధ్రంలోనుంచి వస్తున్నాయి అని గ్రహించాడు. కానీ రాను రాను ఆ రంధ్రం పెద్దది కావస్తూంది - చూడగా ఒక చిన్న తలుపు తెరుచుకొన్నట్లు అనిపిస్తూంది. అందులోనుంచి ఉన్నట్లుండి ఒక పెద్ద నాగుపాము తలకిందులుగా వేలాడడదం చూడగానే అదిరిపడ్డాడు. ఛ! ఛ! అది పాము కాదు, తాడు మాత్రమే. మధ్యాహ్నం తన ముందు ఆ భిక్షువు పాము తలకిందులుగా పట్టుకొని చూపించినప్పటినుంచి తానా భ్రమలోనే ఉన్నాడు.

చూస్తుండగానే ఆ తాడు తన చేతికందేటంత కిందికి వచ్చింది,

దాన్ని చూస్తూ పరంజ్యోతి అమితాశ్చర్యానికి లోనయ్యాడు. ఎవరో తనను ఇక్కడి నుంచి

తప్పించి కాపాడేందుకు ఈ తాడు సాయమందిస్తున్నారనడంలో సందేహం లేదు. కానీ, ఎవరు? తనకీ ఊరిలో ఎవ్వరూ తెలియదు. తానిక్కడ బంధించబడ్డ విషయం ఎవ్వరికీ తెలిసే అవకాశమే లేదు. అలా ఉండగా, ఈ అనుకోకుండా వచ్చిన అవకాశాన్ని అందుకోవడం వివేకవంతమైన పనేనా? ఇందులో కుట్ర ఏమైనా ఉందా, లేదా? అన్న సందేహం అతన్ని వెనుకంజ వేయించింది. మరొక చెంప తన మీద ఇంతటి శ్రద్ధ తీసుకొని కాపాడాలనుకొంటున్న వారెవరని తెలుసుకోవాలని అమితమైన ఆతురత అతడిలో పుట్టి అతన్ని ముందుకు తోయసాగింది. కిం కర్తవ్యం? చివరికి అతన్ని చంపేస్తున్న ఆకలిదే పైచేయయ్యింది.

ముందు అడుగేసి ఆ తాడును గట్టిగా లాగి పరీక్షించాడు. దాన్ని పైన గట్టిగా కట్టివున్నారని, తన భారాన్ని తట్టుకోగలదని దృఢపరుచుకొన్నతర్వాత దాన్ని పట్టుకొని పైకెక్కసాగాడు.

~~~
~~~

# అధ్యాయం - 7

## వెన్నెల ప్రాంగణం

**ఆయనర్** వద్ద, శివకామి వద్ద సెలవు తీసుకొని పల్లవ చక్రవర్తి, కుమార పల్లవ చక్రవర్తి తమ శ్వేతాశ్వాలను అధిరోహించి అతివేగంగా అంతఃపురంవైపు దూసుకెళ్ళారు. ద్వారం వద్ద భటుల జయఘోషలను స్వీకరించి, ముందుకు వేగంగా వెళ్ళి విశాల మైదానంలాగున్న వెన్నెల ప్రాంగణంలో బారులు తీరి నిల్చోన్న వీరుల వద్దకు వెళ్ళి ఆగారు. వీరుల జయఘోషలు ఆగిన తర్వాత సేనాధిపతి ముందుకొచ్చి చక్రవర్తికి నమస్కరించి నిలబడ్డారు.

చక్రవర్తి, "సేనాధిపతీ! దూతలకు అన్ని విషయాలు వివరించడమైనదా? బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్నారా?" అని ప్రశించారు.

"అవును, ప్రభూ! అందరు దూతలూ సిద్ధం. ఎవరెవరు ఏఏ దిక్కున వెళ్ళాలని నిర్ణయించబడింది. అందరూ మీ ఆజ్ఞ కోసం వేచివున్నారు" అన్నారు సేనాధిపతి.

చక్రవర్తి నరసింహవర్మను చూసి, "అబ్బాయి! చాల పొద్దుపోయింది. నీ తల్లి నీకోసం ఎదురుచూస్తుంటుంది. వెంటనే వెళ్ళి సంగతి సందర్భాలు వివరించు. ఇద్దరూ భోజనం చేసి పై మేడ మీద వేచివుండండి. నేను దూతలను పంపించేసి వెంటనే వచ్చి మిమ్మల్ని కలుసుకొంటాను" అన్నారు.

చక్రవర్తి జైనమతం పాటించే రోజుల్లో రాత్రి భోజనాన్ని విడిచిపెట్టారు. ఆ మతాన్ని వదిలి శైవమతాన్ని స్వీకరించిన తర్వాత కూడ ఆ పద్ధతి వదిలిపెట్టలేదు.

"అలాగే తండ్రీ! వెళుతున్నాను. కానీ, అన్ని సైన్యాలు వచ్చి చేరేవరకు వేచివుండాలా, లేక సిద్ధమైన సైన్యదళాలను తీసుకొని యుద్ధానికి వెళ్ళడమా?"

చక్రవర్తి చిన్నగా నవ్వి, "అందుగురించి తర్వాత ఆలోచిద్దాం. ఇప్పుడు తల్లిని చూసేందుకు వెళ్ళు" అన్నారు.

మహామల్లు వెళ్ళిన తర్వాత చక్రవర్తి సేనాధిపతిని చూసి, "కళిప్పగైయారే! దూతలకు చెప్పి పంపవలసిన సమాచారమిది: తొండైమండలంలోను, చోళ మండలంలోను ఉన్న ఒక్కొక్క కోటలోను వెయ్యిమంది వీరులున్న దళాన్ని ఏ క్షణాన్నైనా బయల్దేరేందుకు సిద్ధంగా ఉంచాలి. తెలిసిందా?" అన్నారు.

"అర్థమైంది, ప్రభూ!"

“కోటను భద్రపరిచేందుకు  అన్ని సన్నాహాలు పూర్తి అయ్యాయా?”

“దూతలు తప్ప, ఇంకెవరినీ విచారించక కోటలోపలకు రానివ్వకూడదని ఆజ్ఞ వేశాను. అలాగే, బయటికి వెళ్ళేవారి మీద కూడ ఒక కన్ను వేసి ఉంచమని ఆజ్ఞాపించాను. ఎవరిమీదైనా సందేహం కలిగితే వెంటనే బంధించి చెరలో వేయమని చెప్పాను.”

“కోట చుట్టూ అగడ్తలు పకడ్బందీగా  ఉన్నాయా? సేనాపతీ1 పల్లవసామ్రాజ్యానికే  ఈ కోట ప్రాణం. ఈ కోటకు ఏమాత్రం అపాయం కలిగినా, పల్లవసామ్రాజ్యానికే ఆపద.”

“ప్రభూ! పల్లవ సామ్రాజ్యాన్ని రక్షించేందుకు కావేరి నది నుంచి కృష్ణ వరకు లక్షలాది వీరులు సిద్ధంగా ఉన్నారు.”

“నిజమే. కానీ వారు వీరోచితంగా పోరాడేందుకు కావలసిన కత్తులు, శూలాలు సిద్ధమా"

సేనాపతి మౌనందాల్చారు.

“దక్షిణచోళనాడులో కత్తులను, శూలాలను చాల నైపుణ్యంతో తయారు చేస్తారులాగుంది. కోవెల ఏనుగు పైకి విసరబడ్డ శూలాన్ని చూశారా, సేనాపతీ?”

“లేదు, ప్రభూ!”

“ఆ శూలం మీద ఏమని చెక్కివుందో తెలుసా? 'మామాత్తియార్' అని. అది దక్షిణచోళరాజ్యంలో వీరాధివీరులని పేరుగాంచిన  క్షత్రియవంశానికి చెందినది కద?”

“అవును, ప్రభూ!”

“ఆ శూలాన్ని విసిరినవాడు దక్షిణచోళరాజ్యానికి చెందినవాడైవుండాలి. అలా శూలం విసరగల శూరులు వెయ్యిమంది ఉంటే, ఈ కోట కాపలా గురించి దిగులే లేదు.”

“పల్లవసామ్రాజ్యంలో అలా శూలం విసరగల వీరులు వేలకొద్ది ఉన్నారు ప్రభూ!”

“ఆ శూలం విసిరిన అబ్బాయి లక్షలో ఒకడు. అతన్ని వెంటనే కనిపెట్టాలి.”

సేనాపతి మౌనందాల్చారు.

“ఇంకొక విషయం. కావిబట్టలు కట్టినవారిని గురించిన ఆజ్ఞలను మార్చాలి. ఆయనర్‌ని, ఆయన కుమార్తెను చూసి మాట్లాడిన తర్వాత తిరిగివస్తున్నప్పుడు ఒక కాషాయవస్త్రధారి  చటుక్కున ఒక ఇంటి వెనక దాక్కున్నాడు..”

“ఏమాజ్ఞ ప్రభూ!”

"రాజవిహారం మీద నిఘా ఉంచి ఆ కొత్త బౌద్ధ భిక్షువెవరో కనిపెట్టాలి."

"వెంటనే ఏర్పాట్లు చేస్తాను, ప్రభూ!"

తర్వాత  సేనాపతి  ఒక్కొక్క దూతను పిలిచి ఏ దిక్కున, ఏ సమాచారంతో వెళుతున్నాడో పల్లవ చక్రవర్తి కి తెలియజేశాడు. దూతలు (నిజానికి రహస్య గూఢచారులు) చక్రవర్తికి నమస్కరించి, సెలవు తీసుకొని తమ తమ దారిన వేగంగా నిష్క్రమించారు.

~~~
~~~

# అధ్యాయం - 8

## భువన మహాదేవి

**మహామల్లు** తన తండ్రి మాట ప్రకారం అంతఃపురానికి వెంటనే వెళ్ళారు. వెన్నెల ముంగిలిని దాటుకొని ముందుకు వెళ్ళగానే అక్కడే వేచివున్న సేవకులు ఆయన గుర్రాన్ని తీసుకొని అవతలికి తీసుకొని వెళ్ళారు. కుమార చక్రవర్తి అతివేగంగా నడుస్తూ అంతఃపురం లోపలి గదులవైపు వెళ్ళసాగారు.

ఆ అంతఃపురంలో అత్యంత శిల్పకళాసౌందర్యంతో విరాజిల్లుతున్న ఒక వాకిలిని నరసింహవర్మ సమీపించగానే, లోపలినుంచి, “బిడ్డా! వచ్చావా!” అని ఒక గొంతు వినిపించింది.

పల్లవసామ్రాజ్య పట్టమహిషి భువన మహాదేవి  వాకిలి వద్ద వచ్చి నిలిచారు. ఆవిడ గంభీరమైన రూపం, ప్రౌఢ సౌందర్య వదనం, “త్రిభువన చక్రవర్తిని" అని పల్లవ సామ్రాజ్య ప్రజలు ఆవిడను వేనోళ్ళ కొనియాడడం ముమ్మాటికి నిజమని తెలియజేస్తున్నాయి.

“అమ్మా!”అని పిలుస్తూ అరుదెంచిన కుమారుని ఇరుహస్తాలతో దగ్గరకు తీసుకొని, “బిడ్డా! నేడు...” అని చెప్పబోయే లోపల, “అమ్మా! తమను చాల వేడుకోంటున్నాను. మీరు నాకు ఒక వరం ఇవ్వాలి!" అన్నారు

భువనమహాదేవి  ముఖంలో ఒక చిరునవ్వు వెలిసింది.

“అలాగే, బిడ్డా! తప్పక ఇస్తాను. అలాగే నీవు కూడ నాకొక వరం ఇవ్వాలి" అన్నారు మహాదేవి.

“ఇదేమి విచిత్రం! పిల్లలు తల్లిని వరం కోరవచ్చు గాని, తల్లి తన కుమారుని  వరం కోరడం ఎక్కడైనా ఉందా?” అనగానే తల్లి మోమున చిరునవ్వు మరుగైంది.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు. నరసింహవర్మ తన కిరీటాన్ని, ఇతర ఆభరణాలను తీసి పెట్టి, కాళ్ళు చేతులు శుభ్రం చేసుకొని, తల్లితో పూజామందిరానికి వచ్చారు. అక్కడ అప్పటికే పూజలు పూర్తయినందువల్ల దేవునికి నమస్కరించి , భోజనమందిరానికి  వెళ్ళారు.

ఇద్దరూ భోజనానికి కూర్చోగానే, తల్లి, “బిడ్డా! ఈ రోజు ఉన్నట్లుండి కోట తలుపులన్నీ మూసివేయబడ్డాయి. అంతఃపురమంతా అల్లకల్లోలంగా ఉంది. ఏం జరుగుతోందో  తెలియడం లేదు. నువ్వైనా నాకు చెబుతావా? లేక, ఆడవాళ్ళకిదంతా తెలియనవసరం  లేదని నీవు కూడ అనుకొంటున్నావా?” అన్నది.

"అమ్మా! అలా ఏం లేదు. భోజనమైన తర్వాత డాబా మీదకు వెళ్ళి కూర్చోగానే అంతా చెబుతాను" అన్నారు నరసింహవర్మ.

అలాగే భోజనం తర్వాత తల్లీకొడుకులు అంతఃపురపు పైమేడ డాబామీదికి వెళ్ళి అక్కడున్న పాలరాతి మేడ మీద ఆసీనులయ్యారు.

ఇద్దరూ పూర్ణచంద్రుని, ఆ వెన్నెల్లో కమనీయంగా కనిపిస్తున్న కంచి మహానగరపు అందాలనుచూస్తూ కాసేపు మౌనంగా కూర్చొన్నారు.

ఉన్నట్లుండి నరసింహవర్మ , "అమ్మా! రేపటినుంచి రాత్రిభోజనానికి నాకోసం వేచివుండకు" అన్నారు.

తల్లి మౌనందాల్చారు. రాజప్రాసాదంలో పగటి భోజనం ఆహ్వానితులతో కిటకిటలాడుతూంటుంది - కవిపుంగవులు, సామంతులు, విదేశీ దూతలు మొదలైనవారితో. కాబట్టి మహారాణివారికి తమ కుమారునితో, పతిదేవులతో ఏకాంతంగా విషయాలు మాట్లాడుకోవడానికి అవకాశం దొరికేది రాత్రిభోజనసమయంలో మాత్రమే. ఇక అది కూడ లేకపోతే, ....

తల్లి, కుమారుడు తనకు ఏం చెబుతానన్నాడో అది చెబుతాడని ఓపిగ్గా వేచిచూస్తూంది. కుమారుని మనసేమో ఇంకెక్కడో ఉంది - ఇప్పటికి ఆయనర్, శివకామి కోట దక్షిణపు వాకిలి దాటి తమ ఇంటికి వెళ్ళే దారిన పల్లకిలో వెళుతూంటారు...

తల్లి, "బిడ్డా!" అని పిలిచింది. నరసింహవర్మ, "ఇంత పెద్దవాడినయ్యాను, మన సామ్రాజ్యంలో ఉన్న అందరు మల్ల వీరులను జయించి 'మహామల్లు' అన్న బిరుదు కూడ పొందాను. ఇప్పటికీ నన్ను మీరిద్దరూ బిడ్డా అని పిలుస్తారేమి?" అని కాస్త అసహనంగా అన్నారు.

"తలిదండ్రులకు వారి పిల్లలు ఎప్పటికీ బిడ్డలే. కాబట్టి నీ తల్లి నిన్ను బిడ్డా అని పిలవడం తప్పేం లేదు!" అన్న మాట వినిపించగానే ఇద్దరూ ఉలిక్కిపడి ఆ మాట వినిపించిన వైపు తిరిగి చూసి, లేచి నిలబడ్డారు. చక్రవర్తి వచ్చి పాలరాతి మేడ మీద కూర్చోగానే ఇద్దరూ మళ్ళీ కూర్చొన్నారు. అవును. చక్రవర్తి వారిద్దరికీ తెలియకుండ మెల్లగా మేడ మీదికి వచ్చి వారి వెనుక నిలిచి వారి సంభాషణను వింటూన్నారు.

"దేవీ! అబ్బాయి ఏమైనా చెప్పాడా!" అని అడిగారు చక్రవర్తి.

"ఇంకా ఏమీ చెప్పలేదు స్వామీ! మనిద్దరి గురించీ కొరత మాత్రమే చెబుతున్నాడు." అన్నారు మహారాణి.

“మరింకేం చేయను, నాన్నగారూ! కోటలోపల అన్యులు ప్రవేశించారని వార్త అందిన తర్వాత కూడ చేతులు కట్టుకొని కూర్చొనివుండడమా? సేనాధిపతి కలిప్పగైయార్ సైన్యాన్ని కూడదీసి సిద్ధం చేసేలోపు కలియుగమే అంతమైపోతుంది లాగుంది! ఇప్పటికి మన సైన్యం యుద్ధానికి బయల్దేరి ఉండాలి కద?” అని ఉద్వేగంగా అన్నారు నరసింహవర్మ.

“పల్లవ సామ్రాజ్యంలో అన్యులు ప్రవేశించారా?” అని భువనమహాదేవి ఆశ్చర్యం, అపనమ్మకం కలగలిసిన గొంతుతో అడిగారు.

“అవును, దేవీ1 కొద్దికొద్దిగా కాదు. పెద్దసైన్యంతోనే ఉన్నట్లుండి ప్రవేశించారు.”

“పల్లవేంద్రా! మంత్రాలోచన సభలో నేను మాత్రం నోరు తెరవకూడదని ఎందుకు కట్టడి చేశారు? అందరూ ఏదేదో మాట్లాడుతున్నప్పుడు ఉడికిపోతున్న నా మనస్సును ఎలాగో అదుపులో ఉంచాను...”

మహామల్లు మాటకు అడ్డుపడి మహేంద్ర చక్రవర్తి తమ పట్టమహిషిని చూసి ఇలా చెప్పారు: ”నరసింహుడు ఇంకా చిన్నపిల్లాడిగానే ఉన్నాడు. వచ్చిన యుద్ధం ఎంత పెద్దదని వాడికి తెలియసేలేదు. ఇద్దరూ వినండి. వాతాపి రాజు సత్యాశ్రయ పులకేశి ఒక పెద్ద సైన్యంతో తుంగభద్ర నదిని దాటి మన రాజ్యంలో ప్రవేశించివున్నాడు. . పులకేశి సైన్యంలో లక్షలాది పదాతివీరులు, వేలకొద్ది ఏనుగులు, పెద్ద మహిషాలు పూనిన వందలకొద్ది బండ్లు, పదహారు వేల అశ్వవీరులు ఉన్నారట. చాలకాలంగానే ఈ యుద్ధసన్నాహాలు చేస్తున్నాడట. ఇది మన గూఢచారులు అప్రమత్తంగా ఉండక చాల ఆలస్యంగా తెలుసుకొన్నారు. అప్పటికే పులకేశి రాక్షస సైన్యం మన సరిహద్దు కాపలా సైనికులను కర్కశంగా మట్టుబెట్టి ముందుకు వస్తున్నారు. ఆ మహాసైన్యాన్ని ఎదుర్కొనేటంత పెద్ద సైన్యం, తగిన యుద్ధ సామగ్రి మనవద్ద తక్షణం లేవు. కాబట్టే మన సైన్యాలు వెనుదీస్తున్నాయి. పల్లవసామ్రాజ్యానికి వచ్చిన ఆపద చాల పెద్దది. కానీ మన కులదైవం దయవల్ల అంతిమ విజయం మనదే అవుతుంది" అన్నారు.

తండ్రి మాట్లాడి ముగించే వరకు ఓపిగ్గా ఉన్న నరసింహవర్మ, “తండ్రీ! పల్లవసైన్యం వెనుదీయడమా? ఇదెంత అవమానం? తండ్రీ1 నాకనుమతి ఇవ్వండి. మన దగ్గర సిద్ధంగా ఉన్న దండును తీసుకొని నేనిప్పుడే బయల్దేరుతాను" అని ఆవేశంగా అన్నారు.

“ఓపిక, నరసింహా, ఓపిక! పల్లవసైన్యానికి నీవు నాయకత్వం వహించి ముందుకు నడిపించే వేళ తప్పక వస్తుంది. అంతవరకు నేను చెప్పినట్లు నడుచుకో...ఈ రోజు రాత్రి ఒక ముఖ్యమైన కార్యం ఉంది. నాతోబాటు వస్తావా?”

“అడగనేల? తప్పక వస్తాను, నాన్నగారూ"

“దేవీ! ఈ రోజునుంచి నేను నరసింహుని ఒక చిన్నపిల్లాడిగా కాక, నా సహచరుడిగానే

ఎంచబోతున్నాను. నీవు కూడ అలాగే భావించి నడుచుకో. ఈ రోజునుంచి నరసింహునికి  మంత్రాలోచన సభలో బాగం వహించే హక్కును కూడ ఇస్తున్నాను. నీవు కూడ అతన్ని 'బిడ్డా' అని సంభోదించకు" అన్నారు చక్రవర్తి.

భువనమహాదేవిని  శయనించేందుకు వెళ్ళమని చెప్పి, తండ్రీకొడుకులు  అంతఃపురంనుంచి నిర్గమించారు.

~~~
~~~

# అధ్యాయం - 9

## విడుదల

**పరంజ్యోతి** ఆ తాడు పట్టుకొని చూరులోని ఆ రంధ్రంగుండా కప్పు చేరుకోగానే, రెండు బలమైన ఇనుప హస్తాలు అతని భుజాలను పట్టి పైకెత్తాయి. అతడు ఎవరలా చేయూతనిచ్చి తనని పైకి లాగారని చూడగా, వెన్నెలలో అది బౌద్ధ భిశువు నాగనందేనని చూసి అమితాశ్చర్యానికి లోనయ్యాడు. ఏదో అడగబోయేలోగా, భిక్షువు పెదవుల మీద వేలుంచుకొని మాట్లాడవద్దని , తన వెంట రమ్మని సైగ చేశారు.

ఆ పెద్ద భిక్షువుతోబాటు ఇంకొక యువ భిక్షువు కూడ ఉండడాన్ని అప్పుడు గమనించాడు పరంజ్యోతి. ఆ యువ భిక్షువు కూడ పరంజ్యోతితోబాటు  పెద్ద భిక్షువు వెంట ముందుకు నడిచారు. ఆ చెరసాల కప్పు మీదినుంచి కిందికి దిగకుండ అతి జాగ్రత్తగా ఒక ఇంటి కప్పు మీదినుంచి ఇంకొక పెంకుల కప్పు మీదుగా, ఏ మాత్రం పెంకులను కదిపి శబ్దం చేయకుండ  ముందుకు సాగారు భిక్షువులిద్దరూ. పరంజ్యోతి కూడ కాస్త కష్టపడుతూ  వారి వెంట నడిచాడు.

అలా ఏడెనిమిది కట్టడాలు దాటిన తర్వాత, ముంగిట పన్నీరు పూల చెట్లు దట్టంగా పెరిగివున్న ఒక ఇంటి వద్దకు వచ్చారు. పెద్ద భిక్షువు వీధి రెండు దిక్కులా బాగా పరికించి చూసి, ఎవ్వరూ లేరని రూఢి చేసుకొన్న తర్వాత ఆ పన్నీరు పూల చెట్లలో ఒక దాని కొమ్మను పట్టుకొని నిశ్శబ్దంగా కిందికి దిగారు. వారి వెంట చిన్న భిక్షువు, పరంజ్యోతి కూడ దిగారు.

ఆ కట్టడమే  కంచి మహానగరంలో అతి ప్రసిద్ధమైన  రాజ విహారం! బుద్ధభగవానుని ప్రతిమ ఒకటి ఆ విహారంలో ఉన్న గర్భగృహాల్లో ఒకదానిలో ప్రతిష్ఠించబడివుంది..

ఆ కాలంలో పల్లవ రాజులు తాము ఏ మతాన్ని పాటించేవారైనా  కూడా అన్ని మతాలను సమాన దృష్టితో చూస్తూ ఆదరించేవారు. ఆయా మతాల స్థాపనకు, పెంపుదల కోసం మాన్యాలివ్వడం పరిపాటి. అలాంటి రాజ్యాంగ మాన్యం పొందినది ఆ రాజవిహారం.

ఆ కాలంలో కంచిలో కొందరు ధనికులు కూడ బౌద్ధమతాన్ని స్వీకరించారు. అంతేగాక ఆ ధనికులు విహారాలకు విరివిగా ధనసహాయం కూడ చేసేవారు. ధనదాసనే అటువంటి ధనికుడొకడు, తీవ్రంగా జబ్బుపడ్డ తన కుమారుడు కోలుకొంటే రాజవిహారాన్ని నవీకరిస్తానని మొక్కుకొన్నాడు. అలాగే అతని కొడుకు కోలుకోగానే రాజవిహారాన్ని నవీకరించాడు.

ఆ సుందరమైన భవనాన్ని చూసి మైమరచిపోయిన పరంజ్యోతి, “ఆహా! ఎంతందంగా ఉందీ

కట్టడం!” అన్నాడు. వెంటనే పెద్ద భిక్షువు వెనక్కి తిరిగి అతడి నోరు మూశారు. ఆ సమయాన వారు పన్నీరు చెట్ల నీడనుంచి ఇవతలికి వచ్చి రాజ విహారం ముందున్న బయలు ప్రదేశానికి  వచ్చివున్నారు.

అప్పుడు రాజవిహారానికి  ఎదురుగా ఉన్న ఎత్తైన పెద్ద కట్టడాల క్రీనీడ నుంచి రెండు శ్వేతాశ్వాలు ముందుకు వచ్చాయి. వాటి మీద ఇద్దరు వీరులు కానవచ్చారు, ఒకరు మధ్యవయస్కుడు, ఇంకొతను యువ వీరుడు. ఆ రెండు అశ్వాలు రాజవిహారాన్ని సమీపించగానే, పెద్ద వీరుడు, “బుద్ధం శరణం గచ్చామి!” అన్నాడు. రెండవ వీరుడు, “ధర్మం శరణం గచ్చామి" అన్నాడు.

“స్వామీ! రాత్రి రెండు జాముల తర్వాత ఎవరూ బయట తిరుగాడకూడదని తెలియదా" అని ప్రశ్నించాడు పెద్ద వీరుడు.

“తెలుసు. కానీ అది బౌద్ధ సన్యాసులకు  కూడ వర్తిస్తుందని తెలియదు" అన్నారు పెద్ద భిక్షువు.

“ఈ నడి రాత్రి ఎక్కడికి బయల్దేరారు?”

“ఈ అబ్బాయి నా శిష్యుడు. కంచికి కొత్త. ఈ రోజే ఇక్కడికొచ్చాడు.  దిక్కు తెలియక దారి తప్పాడు. నేనతన్ని కనిపెట్టి  తీసుకొని వచ్చాను.”

“ఈ అబ్బాయిది ఏ ఊరో?”

“దక్షిణచోళదేశంలో శెంగాట్టంగుడి.”

“సరే. తమ దివ్యనామం?”

“నాగనంది అంటారు.”

“ఇకమీదట అర్ధరాత్రి ఎక్కడికీ బయల్దేరకండి, స్వామీ! మీ శిష్యునికి కూడ చెప్పివుంచండి.”

ఆ వీరులిద్దరూ తమ గుర్రాల మీద అక్కడినుంచి వెళ్ళిన తర్వాత ముగ్గురూ రాజవిహారం లోపల ప్రవేశించారు.

మన ముగ్గురు నిశాచరులు విహారం లోపలికి రాగానే, బౌద్ధభిక్షువు పరంజ్యోతిని చూసి, “అబ్బాయీ! ఈ రోజు నీవెంతటి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకొన్నావో తెలుసా?” అన్నారు.

పరంజ్యోతి ఆయన్ని ఎగాదిగా చూసి, “స్వామీ! ఏ ఆపద గురించి చెబుతున్నారు?” అని అడిగాడు.

“పెద్ద ప్రమాదం! ఈ విహారం వాకిలి ముందే వచ్చింది. ఆ రెండు గుర్రాల మీద వచ్చినవారెవరో తెలుసా?”

“నాకెలా తెలుస్తుంది స్వామీ? నేను కంచికి కొత్త కద?”

భిక్షువు పరంజ్యోతి చెవిలో మెల్లగా, “మహేంద్ర పల్లవ చక్రవర్తి, ఆయన కుమారుడు మహామల్లు  నరసింహవర్మే!” అన్నారు.

పరంజ్యోతి నిజంగానే  నెత్తి మీద పిడుగు పడ్డట్లు అదిరిపడ్డాడు. “నిజంగానా?” అని ఆశ్చర్యంతో అడిగాడు.

“అవును! ఇద్దరూ మారు వేషం వేసుకొని నగర పర్యాటనకు బయల్దేరారు. మారువేషధారణలో మహేంద్రపల్లవ చక్రవర్తికి సాటి ఈ భరతఖండంలోనే  ఎవరూ లేరు.”

పరంజ్యోతి కాసేపాలోచించిన తర్వాత, “వారివల్ల నాకేం అపాయం?” అని అడిగాడు.

భిక్షువు పరిహాసంగా నవ్వి, “ఏం అపాయమనా అడుగుతున్నావు? ఏనుగు మీద శూలం విసిరింది నీవేనని వారికి తెలిస్తే నీవు బతకడం దుర్లభం. ఆ చక్రవర్తి కుమారుడున్నావు చూశావూ? తనని మించిన వీరులింకెవ్వరూ లేరని మహాగర్వం. తనతో మల్లయుద్ధంలో ఎటువంటి వీరుడైనా ఓటమి ఒప్పుకోవాలి. లేకపోతే యమపురికి ప్రయాణం కట్టిస్తాడు.”

“కొట్లాటకు వస్తే నేను వెనుకంజ వేసేవాడిని కాను, గురుదేవా! అది చక్రవర్తి కుమారుడు కానీ, ఇంకెవరైనా కానివ్వండి!” అన్నాడు పరంజ్యోతి.

“అది తెలిసే నిన్ను హెచ్చరిస్తున్నాను. నీవు కోవెల ఏనుగు మీద శూలం విసిరిన తర్వాతే దానికి మదపిచ్చి పట్టిందని నీమీద నింద మోపి శిక్షిస్తారు.”

పరంజ్యోతికి గుండె 'కలుక్కు'మంది. తాను వీధి బల్లమీద పడుకొనివున్నప్పుడు యధాలాపంగా అక్కడికి వచ్చి మాట్లాడుకొన్న  ఇద్దరు పుర ప్రజల సంభాషణ గుర్తొచ్చి, భిక్షువు చెప్పింది నిజమేననిపించింది.

“అలాంటి అన్యాయాలు కూడ ఉన్నాయా?”

“పరంజ్యోతీ! ఈ కంచి పల్లవుల కులవృత్తే అది. ఇప్పటికి నూటయేభై సంవత్సరాలకు మునుపు నీలాగే విద్యాభ్యాసం కోసం మయూరశర్మ అనే అబ్బాయి ఈ నగరానికి వచ్చాడు. వాడి వీరత్వాని చూసి అసూయపడ్డ రాకుమారుడు వాడి మీద తప్పుడు నింద మోపి చెరసాలలో పడేయించాడు.”

“తర్వాతేమైంది?”

“వాడెలాగో తప్పించుకొని పారిపోయి, కృష్ణానది తీరాన తనదైన రాజ్యాన్ని స్థాపించుకొని, పల్లవ రాజులమీద పగ సాధించాడు. బుద్ధభగవానుని దయవల్ల నీవు కూడ ఈ ఆపదనుంచి తప్పించుకొంటావు.”

"స్వామీ! ఆ రాబోయే ఆపదలలా ఉండనీ. ప్రస్తుతం నన్ను పట్టి పీడిస్తున్న ఆపద నా ఆకలి. దయచేసి నాకు అన్నం పెట్టించండి. లేకపోతే ఆకలివల్లే చచ్చిపోతానేమోననిపిస్తూంది."

నాగనంది అతన్ని వంటగదికి పిలుచుకొని వెళ్ళి భోజనమిప్పించారు. తర్వాత అతన్ని ఒక మంటపపు వసారాకు పిలుచుకొని వెళ్ళి, "పరంజ్యోతీ! నీవిక్కడే నెమ్మదిగా నిద్రపో. నీకొక ముహూర్తకాలం ఇస్తున్నాను, నిద్రపోవడానికి. సూర్యోదయానికి మునుపే మనమీ కోట విడిచి బయటపడాలి" అన్నారు.

పరంజ్యోతి వెంటనే దీర్ఘనిద్రలో మునిగిపోయాడు.

~~~
~~~

# అధ్యాయం - 10

## కనికట్టు మాయ

**పరంజ్యోతి** మంటపం వసారాలో పడుకొన్న వెంటనే నిద్రపట్టింది. కానీ, మంచినిద్ర అని చెప్పలేం. ఎందుకంటే, అతన్ని ఏవేవో పీడకలలు పట్టి పీడించసాగాయి.

ఒక కలలో ఐదారు నాగనందిలాంటి బౌద్ధభిక్షువులు అతని చుట్టుముట్టారు. వారిలో చేత దీపం పట్టుకొన్న ఒక భిక్షువు దీపాన్ని పైకెత్తి పట్టుకొని చూసి, "ఈ అబ్బాయి ముఖంలో దివ్యకళ ఉంది. మహావీరుడవుతాడు, లేదా మహాత్ముడవుతాడు!" అన్నారు.

ఇంకొక కలలో ఒక మదపుటేనుగు అతన్ని తరుముకొచ్చింది. దాని బారినుంచి తప్పించుకోవడానికి పరంజ్యోతి అతివేగంగా పరుగెత్తి వెళ్ళి కనిపించిన ఒక పన్నీరు పూల చెట్టెక్కాడు. అది దగ్గరికి రాగానే నిండుగా పూలున్న ఒక కొమ్మను విరిచి దానిపైకి విసిరాడు. వెంటనే అశ్వారూఢులైన ఇద్దరు వీరులొచ్చి, "ఒరే పాపిష్ఠి వెధవా! కోవెల ఏనుగును చంపేశావు కద?" అని గర్జించారు.

చివరిగా, నాగనంది భిక్షువే కలలో అతని సమీపానికొచ్చి నిలబడ్డారు. కానీ ఆయన ముఖం మాత్రం పడగెత్తిన నాగుపాము లాగుంది! ఆ పాము తన పొడపైన నాలుక చాచి అతని ముఖాన్ని మెత్తగా తాకి నిమరసాగింది!

పరంజ్యోతి పిచ్చి కేకలేస్తూ అదిరిపడి లేచి కూర్చొన్నాడు. చూస్తే నిజంగానే ఆ బౌద్ధ భిక్షువు అతని ముందు నిలబడివున్నారు.

"అబ్బాయీ! ఎందుకలా భయపడి కేకలేశావు? ఏమైనా పీడకల కన్నావా?" అని అడిగారు భిక్షువు.

"లేదు, లేదు! ఉన్నట్లుండి మీరు నన్ను తాకగానే ఉలిక్కిపడ్డానంతే" అన్నాడు పరంజ్యోతి.

"పొద్దు పొడిచేందుకు ఇంకా ఒక ముహూర్తకాలం మాత్రమే ఉంది. అంతలోపల మనం కోటనుంచి బయటపడాలి."

"ఎందుకు స్వామీ?"

"బుద్ధభగవానుని ఆజ్ఞ."

"ఎవరికి?"

"నాకే. నిన్ను ఆపదనుంచి తప్పించమని ఆజ్ఞ. నా మీద నీకింకా నమ్మకం కలగలేదా?" అని నాగనంది వేడుకోలు తొణికే స్వరంతో అడిగారు.

పరంజ్యోతి మౌనందాల్చాడు.

"పోనివ్వు. కనీసం ఒక ముహూర్తకాలం పాటు నామాట విని నేను చెప్పినట్లు చేస్తావా? నిన్ను కోటనుంచి అవతలికి చేరవేసిన తర్వాత నీ ఇష్టం" అని భిక్షువు వేడుకొంటున్నట్లు అడిగినప్పుడు పరంజ్యోతికి నిరాకరించ మనసు రాలేదు.

"అలాగే కానివ్వండి, గురుదేవా!"

"అయితే, నీ కళ్ళకు గంతలు కట్టి పిలుచుకొని పోవలసివస్తుంది. నీకు సమ్మతమేనా?"

పరంజ్యోతి ఒక్క క్షణం ఏమనాలో తోచక, తర్వాత ,"ఎలాగైనా సరే!" అన్నాడు.

వెంటనే నాగనంది భిక్షువు ఒక బట్ట తీసుకొని అతడి కళ్ళకు కట్టాడు. తర్వాత అతని చేయి పట్టుకొని ముందుకు నడిపించుకొని వెళ్ళసాగాడు. పరంజ్యోతికి గుండె దడదడలాడుతున్నా, ఎలాగో దిటవు పరచుకొని ముందుకు నడిచాడు. తాము నడిచి వెళుతున్న రీతిని గమనించి, ఆయన తనని కావాలనే చుట్టు తిప్పి తీసుకొని వెళుతున్నాడని సందేహించాడు. అయినా ఏం పలకలేదు. ఎంతసేపటికీ గమ్యం చేరినట్లు ఆయన నోరువిప్పి చెప్పకపోయేటప్పటికి, పరంజ్యోతి ఇక ఓపిక పట్టలేక, ఇంకా ఎంతసేపని అడిగాడు. అలా రెండు మూడు సార్లడిగి, ఇదిగో వచ్చేశాం, వచ్చేశాం అన్న సమాధానం విన్న తర్వాత, చివరికి, భిక్షువు, "పరంజ్యోతి! మనం రావలసిన చోటికి వచ్చేశాం. కనికట్టు శోధన ముగిసింది!" అని చెప్పి అతడి కళ్ళగంతలు విప్పారు.

కళ్ళు తెరిచి చూడగా, తాము కోట బయట, అగడ్త దగ్గర ఉన్నట్లు గ్రహించాడు. పూర్ణచంద్రుని వెండి కిరణాలు ఆ అగడ్త నీటిమీద పడి ఆ నీరు కరిగిన వెండిలాగ మెరుస్తూంది. అగడ్తకవతల చెట్లు దట్టంగా పెరిగిన వనప్రదేశం కానవచ్చింది.

అగడ్తలో ఒక పడవ తేలుతూంది. అందులో యువభిక్షువు చేత తెడ్డుతో సిద్ధంగా కూర్చొనివున్నాడు. నాగనంది భిక్షువు పడవలోకెక్కి, పరంజ్యోతిని కూడ ఎక్కమని సైగ చేశారు.

"ఈ అగడ్తను దాటేందుకు పడవెందుకు? ఈదుకొంటూ దాటవచ్చుగా?" అని కాస్త అమాయకంగా అడిగాడు పరంజ్యోతి.

"అవును. కానీ ఈతరాని వారు పడవలోనే దాటాలి. అంతకన్న ముఖ్యమైన కారణం ఇంకొకటుంది. అటువైపు చూడు!" అన్నారు. ఆయన వేలెత్తి చూపిన చోట అగడ్తలో ఒక పెద్ద మొసలి తన

భయంకరమైన నోటిని తెరిచింది.

"అయ్యో!" అన్నాడు పరంజ్యోతి.

"ఇలాంటి మొసళ్ళు వందల కొద్ది ఈ అగడ్త పక్కనే బారులుగా ఉన్న బోనుల్లో ఉంటాయి. యుద్ధం వచ్చినప్పుడు వాటిని బోనుల్లోనుంచి అగడ్తలోకి విడిచి పెడతారు" అన్నారు భిక్షువు.

"అంటే, యుద్ధం రావడం నిశ్చయమా?"

"మరి, ఎందుకని ఈ ఆర్భాటాలన్నీ అనుకొన్నావు?"

పరంజ్యోతి మళ్ళీ మౌనందాల్చాడు.

పడవ అగడ్త అవతలి గట్టు చేరింది.

~~~
~~~

# అధ్యాయం - 11

## ఆయనర్ శిల్పి

**ఆకాశాన్నంటే** ఎత్తుగా ఎదిగి దట్టంగా ఉన్న చెట్లతో కూడిన ఒక అడవి. ఆ అందమైన అడవి మధ్య ఒక చిన్న బయలు ప్రదేశంలో ఒక శిల్పగృహం.

మనోహరమైన  వసంతమాసంలో ఒక చల్లని ఉదయకాలం.. ఎత్తైన ఆ చెట్ల మీదుగా వసంత మలయమారుతం వీస్తుండగా చెట్ల ఆకుల గలగలలు,  పక్షుల ఇంపైన కిలకిలారావాలు.

ఆ శిల్పగృహం చుట్టూ ఉన్న చెట్లకింద పెద్ద పెద్ద నల్లటి గుండ్రాళ్ళున్నాయి. ఆ గుండ్రాళ్ళ మీద ఒక్కొక్కరే లేదా ఇద్దరు ముగ్గురుగా అనేకమంది యువశిల్పకళాకారులు  పనిచేస్తున్నారు. వారి ఉలుల శబ్దాలు, పక్షుల కిలకిలారావాలతోను, ఆకుల గలగలలతోను కలిసి 'మధు'రమైన సంగీతాన్ని అందిస్తున్నాయి.

అటువంటి సంగీత ప్రవాహం మధ్య ఉన్నట్లుండి ఇంటినుంచి 'ఘల్లుఘల్లు'మన్న శబ్దం వినిపించింది. మీటనొక్కినట్లు అందరు యువ శిల్పకళాకారులు తన తమ పనిని ఆపేసి విన్నారు. వారందరి ముఖాలు ఏకకాలంలో వికసించాయి.

ఎందుకంటే, ఆ 'ఘల్లుఘల్లు'మన్న శబ్దం వారి గురువైన ఆయనర్ శిల్పాచార్యుల కుమార్తె శివకామి దేవి కాలి గజ్జెల శబ్దమని వారికి తెలుసు కాబట్టి. మూడు రోజులుగా ఎందుకోగాని ఆమె విచారంలో మునిగివుండి  నాట్యం చేయడంలేదు. ఈ రోజే మళ్ళీ గజ్జెలు కట్టుకొని నాట్యం చేయ మొదలిడింది. అదే ఆ ఘల్లుఘల్లుమన్న శబ్దం.

కాసేపు ఆ మధురమైన శబ్దాన్ని వింటూండి, తర్వాత ఆ యువశిల్పులందరూ తమ తమ పనిలో నిమగ్నమైనారు.

ఆయనర్ శిల్పి గృహంలో అడుగెట్టే ముందు, ఆయన ఎందుకిలా అడవి మధ్య, జనసమూహానికి  చాల దూరంగా ఇల్లు కట్టుకొని శిల్పకళా(ప్ర)వృత్తిని కొనసాగిస్తున్నారని తెలుసుకొందాం.

**దక్షిణాన** పాండ్య రాజ్యం ఎల్లలనుంచి ఉత్తరాన కృష్ణానదీతీరం వరకు విస్తరించిన విశాల పల్లవ సామ్రాజ్యంలో కంచిని రాజధానిగా చేసుకొని మహేంద్రపల్లవ చక్రవర్తి ఏలుతున్న కాలంలో తమిళనాడులో ఒక అపూర్వమైన 'కళా పునరుజ్జీవనం' వికసించింది.

తమిళనాడెల్లా శిల్పకళాకారులు, చిత్రకారులు పైకొచ్చి అద్భుతమైన శిల్ప, చిత్రకళాఖండాలను సృష్టించసాగారు. గుండ్రాళ్లను తొలిచి దేవాలయాలను నిర్మించే శిల్పకళ, శిలాఫలకాల మీద శిల్పాలను చెక్కే శిల్పకళ రాజ్యమంతటా విస్తరించింది.

అదే సమయాన తమిళనాడులో శైవ, వైష్ణవ మతాలు కొత్త ఊపిరిగొని పెంపొందసాగాయి. శైవులు, వైష్ణవులు స్థలయాత్ర నెపంతో దేశమంతా తిరిగి తమ తమ మతాలను ప్రచారం చేయసాగారు.

ఇందువల్ల తమిళనాడులో గత కొన్ని శతాబ్దాలుగా బౌద్ధ, జైన మతాలవారికి, శైవ, వైష్ణవ మతాల వారికి మధ్య తీవ్ర చర్చలు, పోటీలు కొనసాగుతున్నాయి.

ఈ పోటీలు కళాప్రపంచంలోకి కూడ పాకింది. బౌద్ధులు, జైనులు శైవ, వైష్ణవులతో పోటీ పడి శిల్ప, చిత్రకళాకారులను తమ తమ మతాలకు చెందిన కళాఖండాలను సృష్టించమని ఒత్తిడి చేసేవారు - శైవులు శివాలయాలను, వైష్ణవులు పెరుమాళ్ళ (విష్ణు) ఆలయాలను దేశమంతా నిర్మించగోరారు. అదే సమయాన బౌద్ధులు తమ బౌద్ధ విహారాలను, జైనులు తమ జైనవిహారాలను నిర్మించగోరారు. అందుకోసం కావలసిన ముడి సరుకైన గుండ్రాళ్ల కోసం, రాతిబండల కోసం కూడ పోటీ అధికమైంది!

కాబట్టి వాటిని నిర్మించేందుకు పేరుగాంచిన శిల్ప, చిత్రకళాకారుల కోసం కూడ గిరాకీ అధికమయ్యింది.

అటువంటి బలమైన పోటీకి గురైన శిల్పకళాకారుల్లో ఆయనర్ శిల్పి కూడ ఒకరు.

**కంచి** మహానగరంలో పుట్టి, పెరిగి, అక్కడే విద్యాభ్యాసం చేసి, శిల్పకళ, చిత్రలేఖనం కూడ నేర్చినవారు ఆయనర్. చిన్నవయసులోనే 'మహా శిల్పి' అని పేరుగాంచారు. ఆయన కీర్తి హెచ్చు కాను, కాను ఆయన సృష్టించే కళాఖండాల కోసం, ఆయనను చూసి మాట్లాడేందుకు, తమకు కావలసిన శిల్పాలను చేసివ్వమని అడిగేందుకు వచ్చేవారి సంఖ్య అధికం కాసాగింది. అలా వచ్చినవారికి అతిథిసత్కారాలు చేయడంలోనే ఆయన సగం కాలం వెచ్చించవలసిరాగా, తమ శిల్పకార్యం కొనసాగించేందుకు సమయం చాలకపోయేది.

ఇలా కొంతకాలం సాగిన తర్వాత, ఇలా కుదరదని చెప్పి, నగరానికి చాల దూరంగా ఇల్లు కట్టుకొని అక్కడ తమ శిల్పకార్యాలను కొనసాగించాలని నిశ్చయించుకొన్నారు. ఆయనలా నిశ్చయించడానికి ఇంకొక ముఖ్యకారణం కూడ ఉంది. ఆయన శిల్పకళను మాత్రమేగాక, నాట్యశాస్త్రాన్ని కూడ క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆయన కుమార్తె శివకామి చిన్నవయసులోనే నాట్యంలో ప్రావీణ్యత సాధిస్తుందనేందుకు సూచనలు కానవచ్చాయి. తమ కుమార్తె నాట్యం చేస్తూండగా, వివిధ నాట్యభంగిమలను శిలల మీద అపూర్వ శిల్పకళారూపంలో సృష్టించాలని కలలు కనసాగారు.

ఇదంతా ఆలోచించి నిశ్చయించుకొన్న తర్వాత పల్లవ చక్రవర్తికి తమ కోరికను విన్నవించుకొన్నారు. చక్రవరి అందుకంగీకరించి, నగరం వెలుపల, రాజమార్గంనుంచి కాస్త తొలగివున్న ఒక అందమైన వన్యప్రదేశాన్ని ఎంపిక చేసి ఇచ్చారు.

ఆయనర్ శిల్పి, తమ కుమార్తె తోను, పతిని కోల్పోయిన తమ అక్కగారితోను ఆ వన్యప్రదేశంలో శిల్పగృహాన్ని నిర్మించుకొని, తమ శిల్పకార్యాలను నెమ్మదిగా కొనసాగించసాగారు.

కానీ ఆయన ఆశయం పూర్తిగా నెరవేరిందని చెప్పడం కష్టం. ఎందుకంటే, ఆయన అడవిలో ఇల్లు కట్టుకొని వెళ్ళిపోయినా, కొంత మంది శిల్పకళాభిమానులు ఎలాగో దారి తెలుసుకొని ఆయన ఇంటికి రాసాగారు. అలా వస్తున్నవారిలో పల్లవ చక్రవర్తి, ఆయన కుమారుడు మహామల్లు ముఖ్యమైనవారు.

ఒకరోజు పల్లవ చక్రవర్తి తమ కుమారునితో సముద్రతీరం వెంబడి వెళుతున్నప్పుడు, మల్లైనదీముఖద్వారం వద్ద  అటూ ఇటూ చాల దూరం వరకు పెద్ద పెద్ద గుండ్రాళ్ళు విస్తరించివుండడాన్ని గమనించారు. వెంటనే ఆయనకు ఒక అద్భుతమైన ఆలోచన తోచింది. ఈ రాళ్ళను తొలిచి మహాశిల్పకళాఖండాలను ఎందుకు సృష్టించకూడదు? అలా చేసి ఆ ప్రదేశాన్ని ఒక స్వప్నలోకంగా మార్చాలని తీర్మానించారు.

వెంటనే చక్రవర్తి ఆశయం నెరవేర్చేందుకు తమిళనాడు నలుమూలల నుంచి వేలకొద్దీ శిల్పులు అక్కడికి వచ్చి పని చేయనారంభించారు.

పల్లవచక్రవర్తికి ఆయనర్ శిల్పాచార్యుల మీద చాల గురి ఉండడం వల్ల తరచూ ఆయన ఇంటికి వచ్చి, శిల్పులు చేస్తున్న పనితీరును పరిశీలించమని కోరేవారు అలా చక్రవర్తి,  తమ కుమారునితో వేంచేసినప్పుడల్లా ఆయన చెక్కిన నాట్యశిల్పాలను చూసి మెచ్చుకొనేవారు. అది మాత్రమేగాక, ఆయన కుమార్తె శివకామిని నాట్యమాడమని చూసి ఆనందించేవారు.

శివకామి నాట్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత నాట్య అరంగేట్రం (రంగప్రవేశం) తమ సభలోనే చేయాలని చక్రవర్తి ఆదేశించారు.

ఆ రంగప్రవేశం ఎలా మధ్యలో ఆగిపోయిందన్నది మనం ఈ వృత్తాంతం మొదటి అధ్యాయంలో చూశాము.

~~~
~~~

# అధ్యాయం - 12

## దైవ కళ

**అడవి** మధ్యనున్న ఆ శిల్పగృహ సౌందర్యాన్ని చూసేందుకు రెండు కళ్ళు చాలవంటే అతిశయోక్తి కాదు. ఆ గృహాన్ని సమీపించి, ముందు వసారా దాటి, లోపల అడుగుపెట్టగానే కళ్ళు చెదిరే శిల్ప, చిత్రకళాఖండాలు నలువైపులా తోచి మనని ఆ కళాలోకంలోకి తీసుకొని వెళతాయి.

ప్రధానద్వారం దాటి లోపలి ప్రాంగణం మధ్య ఒక ఎత్తైన మంటపం కనిపిస్తుంది. ఆ మంటప స్తంభాల మీద అద్భుత శిల్పకళాచాతుర్యప్రదర్శన మనకు కానవచ్చి, అవి మంటపం కప్పును మోసేందుకు ఉద్దేశించబడ్డాయో లేక లోకాతీత శిల్పకళాసౌందర్యాన్ని కళాపిపాసకులకు అందించేందుకసే అక్కడ స్థాపించబడ్డాయో అన్న సందేహాన్ని కలిగిస్తున్నాయి.

ఇక మంటపం లోపలికడుగు పెట్టగానే నలువైపులా వివిధ వర్ణ కుడ్యచిత్రాలు, కుడ్యశిల్పాలు చూసేందుకు రెండు కళ్ళు చాలవనిపిస్తుంది. వాటిలో ప్రముఖంగా నటరాజస్వామి నటన భంగిమలు - తాండవ నటనం, నాద నటనం, కుంచిత నటనం మొదలైనవి - కానవస్తాయి. వాటితోబాటు, ఒక లేజవరాలి అనేక నాట్యభంగిమల చిత్రాలు కానవస్తాయి.

ప్రధానద్వారానికి, మంటపానికి మధ్యనున్న బయలు ప్రాంగణంలో పెద్ద గుండ్రాళ్ళు, రాతిబండలు, సగం పని పూర్తి చేసిన శిల్పఖండాలు, పక్కనున్న ఒక గదిలో పూర్తిచేయబడ్డ శిల్పాలు కానవస్తాయి. మంటపం గోడల మీద చూసిన చిత్రాల్లోని యువతి ఆ శిల్పాల్లో కానవస్తుంది.

కానీ ఇప్పుడు వీటన్నిటికన్న మనని అత్యధికంగా ఆకర్షించేది ఆ మంటపం పక్కనున్న ఒక గదిలోని దృశ్యం.

అక్కడ ఆయనర్ శిల్పాచార్యుల కుమార్తె శివకామి కాలి గజ్జెలు ఘల్లుఘల్లుమంటుండగా భువనమోహనంగా నాట్యమాడుతూంది. కాస్త దూరాన ఆమె తండ్రి కూర్చొని ఆమె నాట్యభంగిమలను శ్రద్ధతో చూస్తున్నారు. ఉన్నట్లుండి, "నిలు!" అన్నారు. శివకామి వెంటనే ఆ భంగిమలో చిత్తరువులాగ కదలకుండ నిలిచింది. ఆయన తన పక్కనున్న శిల్పాన్ని దగ్గరకు తీసుకొని దాని కనుబొమలను ఉలితో మెత్తగా సరిదిద్దారు. తర్వాత, "అమ్మా, శివకామి! చాలు, ఇక్కడ వచ్చి కూర్చో, బిడ్డా!" అన్నారు.

శివకామి అలాగే వచ్చి ఆయన పక్కగా కూర్చొంది. ఆయన తన పైబట్టతో ఆమె ముఖంపైని స్వేదబిందువులను మెత్తగా అద్దారు. తర్వాత, "అమ్మా! నీవెంత అద్భుతంగా నాట్యం చేస్తున్నావు!

ఇప్పుడు నాట్యశాస్త్రాన్ని రచించిన ఆ భరతమునే దిగివస్తే నీ నాట్యాన్ని చూసి నాట్యకళా సూక్ష్మాలను నేర్చుకోవాలి!" అన్నారు.

"చాలు, నాన్నా! చాలు. నాకేం నచ్చలేదు " అన్నది శివకామి.

"నచ్చలేదా? ఏం నచ్చలేదు? ఎందుకు?" అని ఆదుర్దాగా ప్రశ్నించారు తండ్రి.

"ఆడపిల్లగా పుట్టడమే నచ్చలేదు."

"శివకామి! ఇదేమిటి? మూడురోజులుగా ఒంట్లో బాగాలేదన్నావు. ఈరోజెందుకిలా విరక్తిగా మాట్లాడుతున్నావు? నామీద కోపమా?" అని అడిగారు ఆయనర్ శిల్పి.

"మీమీదెందుకు కోపం, నాన్నా? నాట్యశాస్త్రాన్ని రచించిన ఆ భరతముని మీదే నా కోపమంతాను. ఎందుకీ నాట్యాన్ని నేర్చుకోవాలి?" అన్నది శివకామి.

"అదేమలాగంటున్నావు, తల్లీ! అన్ని కళలకు పునాది నాట్యమేనన్నది మహాపండితులు కూడ ఒప్పుకొన్న సత్యం. నాట్యమే శిల్పకళకు, చిత్రకళకు, సంగీతానికి కూడ మూలం. ఇది సంగీతశాస్త్రాన్ని రచించిన రుద్రాచార్యులే నా దగ్గర ఒప్పుకొన్నారు!" అన్నారు శిల్పాచార్యులు.

"ఎవరు? ఆ పొడవాటి తెల్లటి గడ్డం ఉన్న ముసలాయనేనా?"

"అవునమ్మా! నీ నాట్యరంగ ప్రవేశం చూసేందుకనే ముదిమి మీదపడ్డా, ఊతకర్ర సాయంతో సభకు వచ్చారు. నీ నాట్యం మధ్యలో ఆగిపోయి సభ చెదరిపోయిన తర్వాత, నా దగ్గరికి వచ్చి, 'ఆచార్యా! ఈ రోజు మీ కుమార్తె నాట్యం చూసిన తర్వాత నాట్యశాస్త్రం పఠించకుండ సంగీత శాస్త్రం రచించి నేనెంత పెద్ద పొరబాటు చేశానో తెలియవచ్చింది. నాట్యమే సంగీతకళకు కూడ మూలం!' అన్నారు. అలా ఉన్నప్పుడు, నీవెందుకు నాట్యం నేర్చుకోవడం వల్ల ఏం ప్రయోజనమని చింతిస్తున్నావు?"

"అసలు ఈ కళల వల్ల ఏం ప్రయోజనం?"

"అమ్మా! నేనొక ప్రశ్న అడుగుతాను. ఉత్తరమివ్వు.  పూలెందుకు పూస్తున్నాయి? పక్షులెందుకు కిలకిలమంటున్నాయి? అవన్నీ చూస్తూ, వింటూ మనం ఆనందిస్తున్నాం కద? ఆహ్లాదకరంగా ఉందని మైమరచిపోతున్నాం కద? మరి కళలు కూడ చూసి, విని ఆనందించడానికే కదా, బిడ్డా! ఈరోజెందుకిలా మాట్లాడుతున్నావు?" అన్నారు తండ్రి.

అప్పుడు శివకామి చేరడేసి నల్లని కళ్ళలో రెండు అశ్రుబిందువులు తొణికాయి. అది గమనించిన ఆయనర్ అదిరిపడి కాసేపు మౌనందాల్చారు.

తర్వాత, "అమ్మా! నాకు అర్థమైంది. నీ వయసు అమ్మాయిలు ఇప్పటికి పెళ్ళి చేసుకొని

కాపురానికి వెళ్ళేవారు. ఇప్పుడు మీ అమ్మే ఉంటే, నీకు పెళ్ళి చేసేవరకు నన్ను నిద్రపోనిచ్చేది కాదు. నేనేమో నిన్ను చిరుప్రాయంనుంచి నేనే పెంచి పెద్ద చేసి చదువు చెప్పించాను. నీవు నాట్యకళలో ప్రవీణురాలవుతావని నీ చిన్నప్పుడే నేను గ్రహించి, నీకు నాట్యకళను నేర్పించాను. అది కూడ నా శిల్పకళకు దోహదమవుతుందన్న ఆశతోనే. కానీ నా కర్తవ్యాన్ని మరిచిపోలేదు. భరతముని నాట్యశాస్త్రంలో వివరించిన నూటఎనిమిది నాట్యభంగిమల్లో నలభైఎనిమిది భంగిమలను శిల్పరూపంలో రూపొందించాను. ఇక మిగిలిన అరవై భంగిమలకు శిల్పరూపమివ్వగానే నీకు తగిన వరుని చూసి పెళ్ళి చేసేస్తాను!" అన్నారు తండ్రి.

అదివిన్న శివకామి కళ్ళు తుడుచుకొని తలెత్తి తండ్రిని చూసి, "నాన్నా! నాకు పెళ్ళి వద్దని ఎన్నిసార్లు చెప్పాను? మళ్ళీ అదే మాటెందుకు ఎత్తుతారు? నాకేమీ వద్దు. నేను మిమ్మల్ని ఒంటరిగా వదిలి ఎక్కడికీ పోలేను" అన్నది.

నిజానికి శివకామికి పెళ్ళిచేసి పంపడం ఆయనకు ఇష్టంలేదు. ఆమెను చిన్నప్పటినుంచి కంటికి రెప్పలా చూసుకొంటూ పెంచారాయన. చదువు, నాట్యకళ తానే నేర్పించారు. తన బిడ్డను విడిచి ఒక్క నిమిషం కూడ తాను ఉండలేనని తలిచారాయన. కానీ ఏదో ఒకరోజు పెళ్ళిచేసి పంపక తప్పదు కద అన్న ఆలోచన కూడ ఆయన్ని వేధిస్తూండేది. కాబట్టి అప్పుడప్పుడు ఆయన ఆమె పెళ్ళి గురించి ప్రస్తావించేవారు. ఆమె, 'నాకు పెళ్లి వద్దు' అన్నప్పుడల్లా ఆయన లోలోపల ఆనందపడేవారు.

ఈరోజు శివకామి ఉత్తరం ఆయనకు ఓదార్పునిచ్చినా, ఆయన సందిగ్ధాన్ని వెలిబుచ్చారు:"అదెలాగమ్మా! నేను నీకు పెళ్ళిచేయక నా ఇంట్లోనే ఉంచుకొంటే, నలుగురూ ఏమంటారు? నీకు తగిన అబ్బాయిని చూసి పెళ్ళి చేయవలసిందే. కానీ ఈ వెధవ యుద్ధమొకటి వచ్చిపడింది. దానివల్ల మన యువ చక్రవర్తి పెళ్ళికూడ తాత్కాలికంగా ఆగిపోయేటట్లుంది."

అప్పుడు శివకామి ముఖాన ఒక విచిత్రమైన మార్పు కానవచ్చింది. ఉద్రేకంతో ఆమె సుందరవదనం మరింత అందంగా కానవచ్చింది.

ఆయనర్ ముందుకు చెబుతూ, "అవునమ్మా! కుమార చక్రవర్తికి ఈయేడు పెళ్ళి చేయాలని భువనమహాదేవి చాల కుతూహలంతో ఉన్నారు. కానీ యుద్ధం తర్వాతే పెళ్ళని చక్రవర్తి చెప్పేశారట."

శివకామి క్రోధం తొణికిసలాడుతున్న గొంతుతో, "నాన్నా! ఎవరు పెళ్ళి చేసుకొన్నా, చేసుకోకపోయినా, నేను మాత్రం పెళ్ళి చేసుకోను!" అన్నది.

ఆయనర్, "అదెలాగమ్మా! శైవమతంలో పుట్టినపిల్ల పెళ్ళిచేసుకోకుండ ఎలా ఉండవచ్చు?" అన్నారు.

అందుకు శివకామి, “నేను బౌద్ధమతంలో చేరిపోయి, భిక్షుణి అవుతాను!” అన్నది.

అదే సమయాన వారి వాకిలి దగ్గర ఎవరో "బుద్ధం శరణం గచ్ఛామి!” అనడం వినిపించి ఇద్దరూ ఉలికిపడి తిరిగిచూశారు. అక్కడ నాగనంది భిక్షువు, ఆయన వెనుక ఆశ్చర్యంతో లోపలికి తొంగి చూస్తూ పరంజ్యోతి కనిపించారు.

~~~
~~~

# అధ్యాయం - 13

## అమర సృష్టి

**బుద్ధభిక్షువు** గొంతు వినగానే ఆయనర్ శిల్పి గబగబ లేచి, "రండి, గురుదేవా, రండి!" అని ఆహ్వానించారు. శివకామి తొందర తొందరగా లేచి అవతలున్న ఒక దూలం దగ్గరకు వెళ్ళి నిలబడింది.

భిక్షువు లోపలికొచ్చి, నలువైపుల కలయజూసి, "ఆయనర్! నేను మునుపటిసారి వచ్చివెళ్ళిన తర్వాత కొత్త శిల్పాలు చెక్కారులాగుంది?" అన్నారు.

"అవును, స్వామీ! ఇదిగో చూడండి, ఈ వరుసలో ఉన్నవన్నీ కొత్తగా చెక్కినవే!" అని చాల కుతూహలంతో చూపించారు.

భిక్షువు ఆయనర్ శిల్పి చూపించిన శిల్పశ్రేణిని చూచాయగా చూసేసి, దూరాన స్తంభం పక్కన నిలుచొన్న శివకామిని చూసి, "ఏమిటి, ఆ స్తంభం పక్కన నిలిచినది కూడ ఒక కొత్త శిల్పమేనా?"అని చిన్నగా నవ్వుతూ అడిగారు. సాధారణంగానే కటువుగా తోచే ఆయన ముఖం చిరునవ్వుతో ఇంకా వికారంగా తోచింది.

ఆయనర్ శిల్పి నవ్వుతూ, "లేదు, స్వామీ! అది నా కుమార్తె శివకామి!... బిడ్డా! ఇదిగో, నాగనంది గురుదేవులు వచ్చివున్నారు, ఆయనకు నమస్కరించు!" అన్నారు.

అప్పుడు శివకామి భిక్షువు వెనక నిలబడివున్న యువకుని కడగంటి చూపుతో చూస్తూంది. తండ్రి పిలవగానే భిక్షువు వైపు తిరిగింది.

**పరంజ్యోతి** మెల్లగా లోపలికడుగు పెట్టాడు. స్తంభం చాటున నిలబడ్డ యువతిని, శిల్పాచార్యులను చూసిన వెంటనే వారిని ఎక్కడో చూసినట్లనిపించి, ఒక్క క్షణం ఆలోచించాడు. వెంటనే గుర్తొచ్చింది - సాయంత్రం కోవెల దగ్గర పల్లకిలో చూసినది వీరినేనని, తాను శూలం విసిరి మదపుటేనుగు బారినుంచి తప్పించింది వీరినేనని.

ఆమె తననే ఓరకంట గమనించడం గ్రహించి తలెత్తి చూడలేక చుట్టూ గోడల మీది వర్ణచిత్రాలను, శిల్పాలను చూడసాగాడు. ఇప్పటివరకు అంతటి అద్భుత సౌందర్య కళాఖండాలను చూడనందువల్ల ఇప్పుడు వాటన్నిటినీ విప్పారిన కళ్ళతో చూస్తూ దిగ్భ్రమించాడు.

శిల్పకళాఖండాలను మెల్లగా పరికించి చూస్తూన్న పరంజ్యోతికి ఉన్నట్లుండి వాటిలో ఏదో

అనిర్వచనీయమైన రహస్యముందనిపించింది. వెంటనే తెలిసివచ్చింది అదేమని - ఆ శిల్పాలు ఆ అద్భుత సౌందర్య నాట్యకళామణి శివకామి దేవినే ప్రతిబింబిస్తున్నాయని. వెంటనే అతనికి ఆమె పట్ల దేవతల పట్ల కలిగేటటువంటి భక్తిభావం ఏర్పడింది.

**శివకామి** తండ్రి మాట వినగానే నాగనంది భిక్షువువైపు తిరిగి వినయంగా నమస్కరించింది. ఆయన, “బుద్ధ భగవానుని దయవల్ల నీ కోరిక నెరవేరుతుంది. త్వరలోనే నీవు భిక్షుణివి కాగలవు" అని దీవించారు.

అది విన్న ఆయనర్ శిల్పికి ఆయన దీవెన నచ్చలేదు. శివకామికి కూడ భిక్షువు దీవెన చాల చిరాకు కలిగించింది. ఆయనర్ శిల్పి కాస్త అసహనంగా, “స్వామీ! బిడ్డ ఏదో సరదాగా అలా అన్నది గాని, నిజంగా భిక్షుణి కావాలని కోరుకోవడంలేదు. అదాలా ఉండనివ్వండి. నాలుగు రోజుల క్రితం కంచిలో శివకామి రంగప్రవేశం జరిగింది. ఆహ్! అప్పుడు మీరక్కడ లేకపోయారు కద!" అన్నారు.

“అంతా విన్నాను. ఆ తర్వాత జరిగిన సంభవాలు కూడ తెలుసుకొన్నాను. మీరిద్దరు ఆ మదపుటేనుగు బారిన పడకుండ తప్పించుకొన్నారట కద?” అన్నారు భిక్షువు.

“అవును, స్వామీ1 అంతా ఆ దేవుని దయ... తమకు తీరికే కద? ఈ రోజు భిక్ష మా ఇంట్లో స్వీకరించాలి" అని భిక్షువును చూస్తూ అన్నారు శిల్పాచార్యులు.

“ఓ! తప్పక. మీకు అధిక శ్రమ కాకపోతే...” అని భిక్షువు చెప్పి ముగించేలోపు, “శ్రమా? అది నా భాగ్యం" అన్నారు ఆయనర్ శిల్పి .

తర్వాత ఇద్దరు మంటపంనుంచి ప్రాంగణంలోకొచ్చి అక్కడున్న రెండు పెద్ద బండరాళ్ళ మీద కూర్చొన్నారు. ఆయనర్ శివకామిని కూడ వచ్చి కూర్చోమన్నారు, కానీ ఆమె కూర్చోక కాస్త దూరాన నిల్చొంది.

ఆయనర్ శిల్పి కాస్త మెల్లగా, “గురుదేవా! అజంతా చిత్రాల గురించి ఏమైనా సమాచారం తెలిసిందా?” అని అడిగారు .

భిక్షువు అది విననట్లు, “ఆయనర్ శిల్పాచార్యా1 దైవ సృష్టికన్న మీరు సృష్టిస్తూన్న ఈ శిల్పాలే అమరమైనవని నాకనిపిస్తూంది!” అన్నారు.

“స్వామీ...” అని శిల్పాచార్యులు ఏదో చెప్పబోగా, భిక్షువు ఆయనను ముందుకు చెప్పనివ్వక, “శిల్పాచార్యా! నేను ముఖస్తుతి చేయడం లేదు. నిజంగానే నాకనిపించింది చెప్పాను. దేవుడు సృష్టించిన మానవదేహం నూరేళ్ళకే పరిమితం. కానీ మీ శిల్పసృష్టి ఎన్నో వేలసంవత్సరాలపాటు మాసిపోక

ప్రకాశిస్తూంటాయి కదా!" అన్నారు.

"గురుదేవా! మీరు చెప్పే గొప్పతనమంతా శివకామికే చెల్లుతుంది. నాట్యకళలో బిడ్డ సాధించిన అద్వితీయ నైపుణ్యంవల్లనే కద నేనీ అద్భుత శిల్పాలను సృష్టించగలుగుతున్నాను!...ఆహా! మీరు బిడ్డ అరంగేట్రానికి ఉండకపోయారు కదా! రుద్రాచార్యులు అమ్మాయి నాట్యం చూసి దిగ్భ్రమించిపోయారంటే నమ్మండి!" అన్నారు ఆయనర్ శిల్పి.

"అవునవును, ఆయనర్ ఆచార్యా! నావుక్కరసర్ శివకామి రంగప్రవేశం చూసివుంటే, చక్రవర్తి విరచితమైన 'మత్తవిలాసం' నుంచి తీసుకొని అభినయించిన ఘట్టాన్ని చూసి చాల రసాస్వాదం చేసేవారు కద. మధుపానం చేసిన బౌద్ధ భిక్షువు, కాపాలికుడు దెబ్బలాడుకొన్న ఘట్టం చాల రసవత్తరంగా ఉండేది కద?" అన్నారు భిక్షువు.

అది విన్న ఆయనర్ శిల్పి ముఖం కుంగింది. "స్వామీ! హాస్యరసాన్ని అభినయించి చూపేందుకు ఆ ఘట్టాన్ని ఎన్నుకొన్నది శివకామి. అంతేగాని మహాత్ములైన బౌద్ధ భిక్షువులను పరిహాసం చేసే ఉద్దేశంతో కాదు" అన్నారు.

**మహా** రసికులు, సకల కళాకోవిదులైన మహేంద్ర పల్లవ చక్రవర్తి జైనమతస్థులుగా ఉన్నప్పుడు 'మత్తవిలాసం' అనే హాస్యనాటకాన్ని రచించారు. అందులో బౌద్ధ భిక్షువులు, కాపాలికులు చాల పరిహాసానికి గురైనారు. అందులో ఒక ఘట్టాన్ని శివకామి అభినయించేందుకు ఎంచుకొంది. అందుగురించే పైన పేర్కొన్న సంభాషణ జరిగింది. భిక్షువు సంభాషణను ఇలా ముందుకు కొనసాగించారు:

"వాస్తవమే; హాస్యరసాన్ని అభినయించేందుకు అది తగిన ఘట్టమే. కాపాలికుడు భిక్షువు పిలక పట్టుకొని లాగబోయి, పిలకకు బదులు బోడి తల చేతికి తగిలి ముందుకు పడిపోయినప్పుడు సభికులందరూ భలే నవ్వుకొన్నారట. కానీ అంతలోపలే ఏదో యుద్ధం గురించిన వార్త వచ్చి, చక్రవర్తి సభనుంచి లేచి  వెళ్ళిపోయారని, సభ కూడ చెదిరిపోయిందని విన్నాను. నిజమేనా?" అన్నారు.

"అవును, స్వామీ1 అదే మాకు చాల మనఃక్లేశాన్ని కలిగించింది. అసలీ యుద్ధమనేది ఎందుకు వస్తూంది? ప్రజలెందుకు ఒకరినొకరు చంపుకొంటున్నారు?" అని అడిగారు.

"ఆచార్యా! ఈ పేద భిక్షువును అలాంటి పెద్ద ప్రశ్నలడిగితే ఏం ప్రయోజనం? చక్రవర్తులను, రారాజులను, రాకుమారులను, సేనాపతులను అడిగితే తెలియవచ్చు. బుద్ధభగవానుడు లోకంలో ప్రేమ, శాంతి నెలకొనాలనే బౌద్ధమతాన్ని స్థాపించాడు. అందుకోసం భిక్షువుల సంఘాన్ని కూడ స్థాపించాడు. ఆ భిక్షువులను రాజసభలో అవహేళన చేసే కాలమిది! యుద్ధం ఎందుకు వస్తుందని నన్నడిగితే ఏం ప్రయోజనం?"

తండ్రి ఆ మాచెడ్డ బౌద్ధ భిక్షువుతో వాగ్యుద్ధంలో చిక్కుకొని సతమతమౌతున్నారని గ్రహించింది శివకామి. ఆమె కళ్ళనుంచి కోపాగ్నికణాలు వీచాయి. “నాన్నా! బుద్ధభగవానుడు ప్రేమను, అహింసాధర్మాన్ని బోధించాడు. కానీ కొందరు కపట భిక్షువులు ప్రజలను వంచించి మోసం చేస్తున్నారు. వారివల్లనే యుద్ధం మొదలైన విపరీతాలు కలుగుతున్నాయి!” అన్నది శివకామి.

ఆయనర్ శిల్పికి 'ఇదెక్కడి బెడదరా, బాబూ!' అనిపించింది. శివకామిని ఎలాగైనా అక్కడినుంచి అవతలికి పంపించాలనుకొని, “బిడ్డా! నీవు కావాలంటే వెళ్ళి అత్తతో ...” అని ఏదో చెప్పబోయారు.

అంతలో నాగనంది, “ఆయనర్! నేనే ఓడిపోయాను. శివకామి చాల తెలివైనది. తను చెప్పినమాటలో చాల నిజముంది" అన్నారు.

ఇక ఎలాగైనా మాట మార్చక తప్పదని ఆయనర్ శిల్పి అటూ ఇటూ చూడసాగారు. దూరాన నిలబడి చిత్రాలను, శిల్పాలను చూస్తున్న పరంజ్యోతిని చూసి, “స్వామీ! ఆ అబ్బాయెవరు? మీ శిష్యుడా?” అని అడిగారు.

~~~
~~~

# అధ్యాయం - 14

## తామర కొలను

**పరంజ్యోతి** అక్కడున్న ఇద్దరు పెద్దలు తన గురించే మాట్లాడుకొంటున్నారని గ్రహించి అటువైపు తిరిగి చూశాడు.

అప్పుడు భిక్షువు ఆయనర్ శిల్పితో, “లేదు, శిల్పాచార్యా! ఆ అబ్బాయి నా శిష్యుడు కాడు. మీ శిష్యుడు కావడానికే కంచికి వచ్చాడు! పరంజ్యోతీ! ఇలా రా” అన్నారు.

పరంజ్యోతి వారి సమీపానికొచ్చాడు.

అప్పుడే అతన్ని బాగ చూడగలిగిన ఆయనర్ శిల్పి ఆశ్చర్యంతో, “ఎవరీ అబ్బాయి? ఎక్కడో చూసినట్లుందే!” అన్నారు.

“నాన్నా! మీకు తెలియడం లేదా? ఆరోజు మదమెక్కిన ఏనుగు మీద శూలం విసిరారే, ఆయనే!” అన్నది శివకామి చాల ఉత్సాహంగా.

పరంజ్యోతి ఆమెవైపు కృతజ్ఞతాభావంతో చూశాడు.

ఆయనర్ శిల్పి ఆశ్చర్యం, ఆప్యాయత పొంగిన గొంతుతో, “ఏమేమి? ఆ వీరయువకుడు, మహామల్లే మెచ్చుకొన్న వీరయువకుడు, ఇతడేనా? ఇతడిదే ఊరు? ఇన్ని రోజులూ ఎక్కడున్నాడు? మిమ్మల్నెప్పుడు కలిశాడు?...” అని ప్రశ్నల వర్షం కురిపించారు. సాధారణంగా ఆయనర్ తమ శిల్పకార్యంలో తప్ప ఇంకే విషయంలోను ఇంత ఆసక్తి చూపించరు.

“సిద్ధులు నివసించే పర్వతానికి వెళ్ళి తిరిగి వస్తున్నప్పుడు దారిలో ఈ అబ్బాయిని కలిశాను...” అని భిక్షువు ముందుకు చెప్పబోయేలోగా, ఆయనర్ శిల్పి పరంజ్యోతి గురించి పూర్తిగా మరిచిపోయి, “సిద్ధ పర్వతానికి వెళ్ళారా? అక్కడి చిత్రాలను చూశారా? వాటి గురించి ఏమైనా సమాచారం దొరికిందా?” అని ఆతురతతో అడిగారు.

భిక్షువు, “చూశాను, ఆయనర్‌గారు! దాని గురించి తర్వాత  చెబుతాను. అక్కడినుంచి తిరిగివస్తున్నప్పుడు దారిలో ఒక చెట్టు కింద ఈ అబ్బాయి నిద్రపోతుండడం చూశాను. అప్పుడే ఒక నాగం అతన్ని సమీపిస్తుండడం చూసి, వెంటనే దాన్ని చంపి, ఇతన్ని కాపాడాను" అన్నారు.

“భలే, భలే! తమ దివ్యనామం నాగనంది! ఇతన్ని కాటువేయకుండ నాగంనుంచి కాపాడారు! ఇతడేమో శూలం విసిరి నాగంనుంచి మమ్మల్ని కాపాడాడు! బాగుంది!” అంటూ నవ్వారు ఆయనర్ శిల్పి.

నాగం అన్న పదానికి సర్పం, ఏనుగు అని రెండర్థాలుండడం వల్ల ఒకే పదాన్ని రెండు సందర్భాల్లో ఉపయోగించి వినోదించారు.

భిక్షువు, "నేనితన్ని కాపాడినందువల్ల అనేక కార్యాలు సాధ్యమయ్యాయి. ఇతడు మీకు తాళపత్రం తీసుకొనివచ్చాడు" అన్నారు.

"తాళపత్రమా? ఎవెరినుంచి?"

"తిరువెంగాట్టు నమశ్శివాయ వైద్యులనుంచి. ఇతడాయన మేనల్లుడు."

ఆయనర్ కుతూహలంతో లేచి నిలబడి, "నా ప్రియస్నేహితుని మేనల్లుడివా, నీవు? నీ పేరేమిటబ్బాయ్?" అని అడుగుతూనే పరంజ్యోతిని దగ్గరికి తీసుకొన్నారు ఆయనర్. తర్వాత, "పత్రమెక్కడ?" అని అడిగారు.

పరంజ్యోతి నాగనందివైపు చూశాడు. భిక్షువు, "ఆచార్యా! ఆ తాళపత్రం కనిపించకుండా పోయింది. మదపుటేనుగు మీద శూలం విసిరి, ఆ తొందరపాటులో తన మూటను అక్కడే వదిలి పరుగెత్తాడు పరంజ్యోతి. ఆ మూటలోనే ఉంది ఆ పత్రం" అన్నారు.

అప్పుడు ఆయనర్, "అవును! నేనా చోటికి వెళ్ళి చూడగా ఆ మూట కనిపించింది. దాన్ని తీసుకొచ్చి ఇంట్లో పెట్టాను. కానీ మరుసటిరోజు రాజభటులొచ్చి అది కావాలని అడిగి తీసుకొని వెళ్ళిపోయారు. పోనివ్వండి. నా ప్రియస్నేహితుని మేనల్లుడని తెలిసిన తర్వాత పరిచయ పత్రమెందుకు? శివకామీ! మనని పెద్ద ప్రమాదం నుంచి తప్పించినది ఈ అబ్బాయే! నీ కృతజ్ఞతలు తెలుపుకో!" అని తన కుమార్తెకు సూచించారు.

శివకామి పరంజ్యోతివైపు ఒక్క చూపు చూసేసి, "నేనెందుకు కృతజ్ఞతలు చెప్పాలి? ఈయన్ని ఎవరు వీధికడ్డమొచ్చి ఏనుగు మీద శూలం విసరమన్నారు?" అన్నది.

శివకామి కఠినమైన మాటలు వింటున్న ముగ్గురికి చివుక్కుమంది.

నాగనంది ఆయనర్ని చూసి, "మీ అమ్మాయికి ఒంట్లో బాగోలేదా?" అని మెల్లగా అడిగారు.

"అదంతా ఏం లేదు, స్వామీ! నాలుగు రోజులుగా కాస్త నిరాసక్తంగా ఉంది. అంతే" అనేసి, ఎలాగైనా అమ్మాయిని అక్కడినుంచి అవతలికి పంపాలని, "చూడమ్మా! లోపలికి వెళ్ళి అత్తకు చెప్పు, అతిథులు వచ్చారు, భోజనం తయారు చేయమని" అని చెప్పి శివకామిని ఇంటి లోపలికి పంపించారు. శివకామి లోపలికి వెళుతూండగా, నాగనంది భిక్షువు తండ్రితో అన్న మాటలు చెవిన పడ్డాయి: "ఆయనర్గారూ! ఈ వయసులో ఆడపిల్లల మనసులో ఏ ఆలోచనలు తోస్తూంటాయో తెలుసు కద?

మన్మధబాణాలతో ప్రేరేపించబడ్డ భావాలు!".

అది విన్న శివకామికి లోలోపలే కోపం పొంగుకొచ్చింది. "ఈ భిక్షువు మా చెడ్డ భిక్షువు. మనసులోను విషం, నాలుకమీదా విషం" అని తనలోతాను అనుకొంది.

ఇంటి రెండవ భాగంలో శివకామి అడుగుపెట్టగానే ఆమె పెంపుడు పక్షులు కిలకిలలాడుతూ ఆమెను స్వాగతించాయి. రతి అన్న జింకపిల్ల మాత్రం మౌనంగా వచ్చి ఆమె సమీపాన నిలుచొంది. శివకామి పక్షులతో, "చూడండి! రతికి మాత్రమే నా మనసర్థమయ్యింది. కాబట్టి తామర కొలనుకు నాతో తను మాత్రమే వస్తుంది. మీరెవ్వరూ రాకూడదు! రా, రతీ!" అంటూ ముందుకు, ఇంటి మూడో భాగంలోకి వెళ్ళింది. అక్కడ అడుగుపెడుతూనే కమ్మని వాసనలు అది వంటగదని తెలియజేశాయి. అక్కడ వంట చేస్తున్న అత్తను చూసి, "అత్తా! ఈ రోజు మన ఇంటికి ఇద్దరు అతిథులు వచ్చారు. మునుపొకసారి వచ్చారే, గండుపిల్లి మూతి  భిక్షువు, ఆయన వచ్చివున్నారు!' అన్నది.

అత్త, "బిడ్డా! పెద్దల గురించి అలా మాట్లాడకూడదు. ఇప్పుడు రతిని వెంటబట్టుకొని ఎక్కడికి బయల్దేరావు?" అని అడిగింది.

"నాన్న ఆ భిక్షువుతో మాటల్లో దిగారు. అది ముగిసి వారు భోజనానికి వచ్చేలోపు నేను కాసేపు తామర కొలనుదాక వెళ్ళి వస్తాను!' అంటూనే జింకపిల్లలా గంతులేస్తూ పెరటివైపు పరుగెత్తింది శివకామి, రతి వెంటరాగా.

కాసేపు అడవి మార్గాన వెళ్ళిన తర్వాత ఒక కొలను కానవచ్చింది. అందులో తామర, కలువ, నీలోత్పలం మొదలైన అందమైన పూలు విరబూసివున్నాయి. ఆ కొలను గట్టున కూర్చొని శివకామి రతిని చూస్తూ, "నా అరంగేట్రానికి ఈ భిక్షువు రాలేదని నాన్న ఎందుకు నిరాశ పడుతున్నారో? ఎవరి మెచ్చుకోలు కోసం రాత్రింబగళ్ళు కష్టపడ్డానో, ఆయన ఆ రోజు రాలేదు. ఈ పల్లవ మహారాజ్యంలోనే మహారసికులని పేరుగాంచినవారు రాలేదు. ఏడేళ్లకు మునుపు నా గడ్డం పట్టుకొని తాను కూడ నాట్యం నేర్చుకొంటానని ఎవరు నన్ను బతిమాలారో, ఆయన రాలేదు. అటువంటప్పుడు, ఇంకెవరు వస్తేనేమి, రాకపోతేనేమి?" అన్నది.

అదే సమయాన అడవిలో కాస్త దూరాన ఒక మేలుజాతి గుర్రం వచ్చి ఆగింది. దానిమీదినుంచి ఒక వీరుడు శబ్దం చేయకుండ కిందికి దిగి తటాకంవైపు వచ్చాడు.

~~~
~~~

# అధ్యాయం - 15

## రతి రాయబారం

**శివకామి** గుర్రం మీద వచ్చిందెవరని తెలిసినా తెలియనట్లు నటిస్తూ కొలను గట్టున అలాగే శిలలాగ నిలుచొంది.

కుమార చక్రవర్తి మహామల్లు నరసింహవర్మ మెల్లగా నడిచివచ్చి ఆమె పక్కన కొలను గట్టున నిలబడి తేటగావున్న కొలను నీటిని చూశారు. అందులో తన ముఖం, పక్కనే శివకామి ముఖం ప్రతిబింబించగానే ఆయన పెదవుల మీద చిరునవ్వు విరిసింది. అది శివకామి కూడ గమనించి, చటుక్కున ముఖం పక్కకు తిప్పుకొంది. తర్వాత అటువైపు కాస్త దూరాన నిలబడి తమనే చూస్తున్న జింకపిల్లను చూసి, "రతీ! ఎవరీయన? ఎందుకిక్కడికి వచ్చారని అడుగు!" అన్నది.

అది విన్న నరసింహవర్మ ముఖాన ముఖాన చిరునవ్వు మాయమైంది. కనుబొమలు ముడిపడ్డాయి. ఆయన కూడ జింకపిల్లను చూసి, "రతీ! నీ యజమాని ఇప్పుడు ఈ భరతఖండంలోనే పేరుగాంచిన భరతనాట్యశిఖామణి అయింది కద? పాత స్నేహాలెక్కడ గుర్తుంటాయి?" అన్నారు.

ఇది విన్న శివకామి ఉద్రేకపూరిత స్వరంతో, "రతీ! ఆశ్చర్యమే తెలియని పల్లవ చక్రవర్తి కుమారులకు నా కోటి నమస్కారాలు చెప్పు! దానితోబాటు ఇది కూడ చెప్పు! మూడులోకాలేలే చక్రవర్తి కుమారులు ఈ పేద శిల్పి కూతురితో స్నేహం చేయడం సాధ్యమా? ఆ అందని పండుకోసం ఆశపడడం నా బుద్ధిహీనతేనని తెలుసుకొన్నాను, రతీ!" అన్నది.

నరసింహవర్మ కాస్త పరిహాసంగా, "రతీ! నీ యజమానికి ఇది గుర్తు చేయి. భరతనాట్య శాస్త్రంలో ఆరితేరిన ఆమె ఇప్పుడు నాట్యరంగంలో నిలబడిలేదు. తననిప్పుడు నృత్తం, నృత్యం, నటనం అంతా పక్కకు పెట్టి నాతో సహజంగా మాట్లాడమని చెప్పు!" అన్నారు.

ఇప్పుడు శివకామి నిజంగానే కోపోద్రిక్తురాలైంది. "అవును, రతీ! అవును! ముల్లోకాలేలే చక్రవర్తి కుమారులెక్కడ? ఈ పెదపిల్ల ఎక్కడ? ఆయన కోసం దేశదేశాల రాకుమార్తెలు తపస్సు చేస్తుంటారు! ఆయనకు ఈ పేదపిల్ల జ్ఞాపకమెక్కడుంటుంది?" అన్నది.

నరసింహవర్మ ఇప్పుడు ప్రేమ తొణికే స్వరంతో, "శివకామీ! ఈరోజెందుకిలా మాట్లాడుతున్నావు? ఈ రాజ్యం, పదవి ఎలా ఉన్నా, నాకు నీమీదున్న అచంచల ప్రేమ తెలియదా?" అన్నారు.

దానికీ శివకామి మనసు మారలేదు. మళ్ళీ జింకపిల్లను చూసి, “రతీ! కథల్లోను, కావ్యాల్లోను పురుషుల నయవంచన గురించి ఎంతో విన్నాను. కానీ వారెవ్వరూ కంచి కుమారచక్రవర్తికి సాటిరారు!” అన్నది.

ఇది విని నరసింహవర్మకు నిజంగానే ఎనలేని కోపం వచ్చింది. “శివకామీ! ఈరోజెందుకిలా మాట్లాడుతున్నావు? నేను నిన్ను చూడాలని, ఎన్నెన్నో విషయాలు చెప్పాలని ఉత్సాహంతో వస్తే, నేను వచ్చిందే నీకు ఇష్టంలేనట్లుంది. సరే, నేను వెళతాను!” అని వెనుదిరిగి ఒకడుగు వేశారు.

అప్పుడు శివకామి మెల్లగా వెక్కివెక్కి ఏడుస్తూ, “రతీ! ఆయన వెళ్ళేటట్లయితే వెళ్ళనీ. కానీ నిందను నామీద మోపి వెళ్ళవద్దని చెప్పు" అన్నది.

నరసింహవర్మ ముందుకడుగు వేయక, “మరి నేనేం తప్పు చేశాను? అది చెప్పేసి కోపగించుకొంటే బాగుంటుంది" అన్నారు.

శివకామి మళ్ళీ జింకపిల్లను చూసి, “మరి ఆరోజు నా అరంగేట్రానికి ఎందుకు రాలేదని అడుగు" అన్నది.

అది విని నరసింహవర్మ గలగలా నవ్వేసి, “ఆ మాట మొదటే అడిగివుండవచ్చు కద? నీ అరంగేట్రాన్ని నేను చూడలేదని ఎవరన్నారు? అమ్మతో పైమేడలో కూర్చొని చూశాను - కింద సభలో నీకు కనిపించేటట్లు కూర్చొంటే నీవు నన్ను చూసి బిడియపడి బాగా నాట్యం చేయలేవేమోనని అనుకొన్నాను. అదీగాక, పైన కూర్చొని, అమ్మకు నీ నాట్యకళ గురించిన సూక్ష్మాలను వివరిస్తూన్నాను. అందుకే ఇంత ఆర్భాటమా?” అన్నారు.

ఇది విని శివకామి ముఖం ఆనందంతో విప్పారింది. “మరి ఈ విషయాన్ని ముందే ఎందుకు చెప్పలేదు?” అని అడిగింది.

“చెప్పేందుకు నీవు నాకవకాశమిస్తేనే కద? ఇంకా ఎన్నో విషయాలు నీకు చెప్పాలి. పద, నీ సింహాసనం మీద కూర్చొందాం" అంటూ ఆయన ఆమె చేతిని పట్టుకొని పిలుచుకొని వెళ్ళబోగా, చటుక్కున చేతిని విడిపించుకొని ఛెంగున కొలను గట్టెక్కింది శివకామి.

వారిద్దరిని అలా చూసిన రతి, ఇక వారిద్దరి మధ్య తాను రాయబారం చేయవలసిన అవసరం లేదని అర్థం చేసుకొన్నట్లు, గట్టుమీద పెరిగిన లేత గడ్డిని మేయసాగింది.

~~~
~~~

# అధ్యాయం - 16

## పెళ్ళికి అడ్డంకి

**కొలను** గట్టున బల్లమీద మీద ఇద్దరూ కూర్చొన్న తర్వాత కూడ శివకామి ముఖం అటువైపు తిప్పుకొనివుండడం చూసి నరసింహవర్మ, “శివకామీ! ఇంకా నామీద కోపం పోలేదా? ఇలా నీవు హఠం పట్టడం చూస్తే నీకు నామీద నిజంగానే ప్రేమలేదనుకోవలసి వస్తుంది!” అన్నారు.

శివకామి చటుక్కున ఇటు తిరిగి ఆయన వైపు తలెత్తి చూసి, “అదే ఉంటే, మూడు రోజులుగా నేను మీకు జ్ఞాపకం రాలేదా?” అని అడిగింది.

“ఈ మూడురోజులుగా నేను కూడ నిన్ను చూడాలని తపించిపోతున్నాను. కానీ అనివార్య రాజ్యకార్యాల వల్ల వీలుపడలేదు. నీకు తెలుసు కద? పల్లవ సామ్రాజ్యంలో మునుపెన్నడూ లేని మహాయుద్ధం రాబోతోందని?”

“అంతా విని తెలుసుకొన్నానులెండి. పాపం, యుద్ధం వస్తూందని దిగులా?”

“ఏమన్నావు? క్షత్రియవంశంలో పుట్టిన నాకు యుద్ధమంటే దిగులా? భయమా? ఎన్నటికీ కాదు. యుద్ధమంటే క్షత్రియులకు ఉత్సాహమే. మా తాతగారు సింహ విష్ణువర్మ కాలంనుంచి పల్లవరాజ్యంలో యుద్ధమే లేదు. సైనికుల కత్తులు, శూలాలు తుప్పుబట్టివున్నాయి. యుద్ధరంగంలో అవి రాసుకొనే శబ్దాలు వింటే ఉత్సాహోద్రేకాలు పొంగుతాయేగాని, దిగులు, భయమేమిటి? కానీ నీ కళ్ళనుంచి వెలువడుతున్న తీక్షణవీక్షణాల వేడి చూస్తూంటేనే కాస్త భయమేస్తూంది".

శివకామి పొంగుకొస్తున్న నవ్వును అదిమిపట్టి, “పురుషులే ఇంతే. వాక్చాతుర్యంతో నిజాన్ని మరుగు చేసేస్తారు" అని గొణిగింది. కానీ అది నరసింహవర్మ చెవిన పడనే పడింది.

“నింద మీద నింద మోపుతున్నావు కద? నేనే నిజాన్ని దాచాను?” అని నిలదీసి అడిగారు.

“మరి, మీరు యుద్ధానికి భయపడ్డారనా చెప్పాను? వీరాధివీరులైన మీరు యుద్ధానికి ఎందుకు భయపడతారు? యుద్ధం రావడం వల్ల పెళ్ళి ఆగిపోయిందనే మీరు దిగులుపడుతున్నారనే కద నేనన్నాను?”

శివకామి ఈ మాటన్నప్పుడు ఆమె ముఖం సిగ్గుతోను, కోపంతోను ఎర్రబారింది. ఇదివిన్న నరసింహవర్మ ఆశ్చర్యంతో, “శివకామి! ఏమంటున్నావు? ఎవరి పెళ్ళి ఆగిపోయిందిప్పుడు?” అన్నారు.

"ఓహో! ఏమీ తెలియనట్లు మాట్లాడుతున్నారే! సరే, నేనే చెబుతాను. త్రిభువన చక్రవర్తి మహేంద్రపల్లవుల కుమారులైన మహామల్ల నరసింహవర్మగారికి తగిన రాకుమారిని చూసి పెళ్ళి చేసేందుకు దేశం నలుమూలలకు దూతలను పంపేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయట. కానీ ఉన్నట్లుండి ఎవరో ఒక దుష్టుడు పల్లవరాజ్యంలోకి సైన్యంతో దండెత్తివచ్చాడట. అందువల్ల కుమారచక్రవర్తి వివాహం తాత్కాలికంగా ఆగిపోయిందట" అన్నది శివకామి.

నరసింహవర్మ గలగలమని నవ్వేసి, "ఇందుకేనా నన్నింత వేధించావు? ఒకవేళ మీ తండ్రిగారేమైన నీ పెళ్ళి నిశ్చయం చేసేశారేమోననుకొన్నాను" అన్నారు.

"నా పెళ్ళా? భలే అన్నారు. నాన్నగారు తరచూ నా పెళ్ళి ప్రస్తావన తెస్తూనే ఉన్నారు. తమ శిష్యులలో గట్టివాడిని చూసి నాకు ముడిపెట్టేస్తానని చెబుతూనేవున్నారు. కానీ నేను పెళ్ళే చేసుకోనని చెప్పేశాను. బౌద్ధమతం తీసుకొని, భిక్షుణిగా దేశపర్యాటన చేయబోతున్నాను!" అన్నది.

అది విని ఉలిక్కిపడ్డ నరసింహవర్మ, "ఏమిటి? నీవెందుకు భిక్షుణివి కావాలి? ఎందుకు నీకంత విరక్తి వివాహమంటే? మహామేధావి, లోకజ్ఞాని అయిన నీ తండ్రి మాట ప్రకారం ఆయన శిష్యులలో అతిసమర్థుడని ఆయన ఎన్నుకొన్న అబ్బాయిని నీవు తప్పక వివాహం చేసుకొనే తీరాలి!" అని కాస్త కఠినంగానే అన్నారు.

"నన్ను ఎవరో ఒక దద్దమ్మకు అంటగట్టడంలో మీకెందుకంత శ్రద్ధ? అంతఃపురంలో పుట్టి పెరిగిన రాకుమార్తెలెందరో మిమ్మల్ని వివాహం చేసుకోవడానికి వేచివున్నారు కద? అందుకు నేనేమైనా అడ్డొచ్చానా?" అని ఎదురు ప్రశ్నవేసింది శివకామి.

"జాగ్రత్త, శివకామి! ఎవరిని దద్దమ్మ అంటున్నావో కాస్త ఆలోచించుకో! నీ తండ్రి ఆయనర్ శిల్పాచార్యుల శిష్యుల్లోనే అతిసమర్థవంతుడు నేనేనని నీకు తెలియదా? ఆ విషయం ఆయనే ఎన్నోసార్లు చెప్పారు కద? కాబట్టి మీ తండ్రికి నేనేకద కృతజ్ఞతలు చెప్పుకోవాలి?" అన్నారు నరసింహవర్మ.

శివకామి చటుక్కున తలెత్తి చూసి, "ప్రభూ! ఎందుకీ పేదపిల్లకు లేని ఆశలు చూపుతున్నారు?" అని చెప్పి, ఇక ముందుకు మాట్లాడలేక ఏడ్వసాగింది.

నరసింహవర్మ ఆమె చేతులు పట్టుకొని మళ్ళీ బల్లమీద తమ చెంత కూర్చుండబెట్టుకొని, "శివకామి! నీవు ఇంకా నన్ను అర్థంచేసుకోలేదా? నీవిలా కన్నీళ్ళు విడుస్తుంటే..." అని ఆయన ఇంకా ముందుకేదో చెప్పబోయేలోపు, శివకామి వెక్కుతూనే, "ప్రభూ! ఇవి ఆనందబాష్పాలు, దుఃఖాశ్రువులు కావు" అన్నది.

~~~
~~~

# అధ్యాయం - 17

## శూలం మీద ఆన

**నరసింహవర్మ** తమ అంగవస్త్రంతో శివకామి కన్నీళ్ళు తుడిచి, "ఆలోచిస్తూంటే, ఒక విషయం నాకు చాల ఆశ్చర్యం కలిగిస్తోంది" అన్నారు.

చటుక్కున తలెత్తి ఆయన వైపు చూసింది శివకామి. ఆమె కళ్ళలోని ప్రశ్నార్థకమైన చూపు, "ఏమా ఆశ్చర్యకరమైన విషయం?" అని అడుగున్నట్లుంది.

నరసింహవర్మ శివకామిని కళ్ళప్పగించి చూస్తూ, "శివకామి! నీకు గుర్తుందో లేదో, మూడేళ్ళ క్రితం నేను, చక్రవర్తి తరచూ మీ ఇంటికి వచ్చేవాళ్ళం. మమ్మల్ని చూడగానే నీవు పరుగెత్తుకొని వచ్చేదానివి. మనమిద్దరం ఎన్నెన్నో ఆటలు ఆడుతుండేవాళ్ళం. నీవు భరతనాట్యం చేస్తూన్నప్పుడు నేను నీ దగ్గరికి వచ్చి నాకు కూడ నేర్పమని బతిమాలేవాడిని. సరేనని నీవు నాకు నేర్పించేదానివి. కాని నాకు సరిగ్గా వచ్చేది కాదు. అది చూసి నీవు పకపక నవ్వేదానివి. ఒక్కోసారి మీ తండ్రిగారు శిల్పాలు చెక్కేందుకు తెచ్చిపెట్టిన శిలల మధ్య దాగుడుమూతలాడేవాళ్ళం. నీవు ఆ రాళ్ళ మధ్య శిలలాగ మెదలకుండ నిలబడేదానివి. నిన్ను చూసి కూడ చూడనట్లు ముందుకు వెళ్ళేవాడిని. నా వెనకనుంచి నీ నవ్వు వినిపించగానే నేను వెనుదిరిగి వచ్చి నిన్ను పట్టుకొనేవాడిని. అలా చిన్నపిల్లల్లాగ ఎంతో సంతోషంగా ఆడుకొనేవాళ్ళం. మన తండ్రులు కూడ చూసి సంతోషించేవారు. అదంతా ఇప్పుడు తలుచుకొంటే ఒక తీయని కలలాగుంది" అన్నారు.

"ప్రభూ! నేనేదో మారిపోయానన్నారు. ఏ విషయంలో మారిపోయాను?" అని అడిగింది శివకామి.

"మంచిదైంది నీవు నాకు గుర్తు చేసినందుకు. నాకు పదహారేళ్ళ ప్రాయం వచ్చినప్పుడు నా తండ్రి నన్ను దేశయాత్రకు తీసుకొని వెళ్ళారు. ఉత్తరాన నాగార్జునకొండ వరకు, దక్షిణాన చిత్ర పర్వతంవరకు యాత్ర చేశాము. పశ్చిమాన కావేరి నది జన్మస్థలం వరకు యాత్రచేశాము. యాత్ర ముగించుకొని తిరిగివచ్చేందుకు మాకు మూడేళ్ళు పట్టింది..."

"ఆ మూడేళ్ళు నాకు మూడు యుగాలుగా ఉండేవి" అన్నది శివకామి.

"మూడేళ్ళ తర్వాత నేను తిరిగివచ్చి నిన్ను చూస్తే నీవు పాత శివకామిలాగ లేవు. దేవలోకపు రంభో, ఊర్వశో ఆయనర్ ఇంటికి వేంచేసినట్లనిపించింది. మునుపటిలా పరుగెత్తి వచ్చి నా చేతులు పట్టుకొని

తీసుకొని వెళ్ళలేదు. బదులుగా, నన్ను చూడగానే ఒక స్తంభం వెనక దాక్కొన్నావు. అప్పటి ఆటపాటలన్నీ మర్చిపోయినట్లుండేదానివి. ఒక్కోసారి ఏ కారణం లేకనే నీ కళ్ళల్లో కన్నీళ్ళు తొణికేది. అప్పుడప్పుడు గట్టిగా నిట్టూర్చేదానివి. నాకిందతా ఏమీ అర్థమయ్యేది కాదు. ఇప్పుడూ అర్థం కావడం లేదు. అన్నిటికన్న విచిత్రమేమంటే, ఒక్కోసారి నాకు తెలియకుండ నేను కూడ పెద్దగా నిట్టూర్చేవాడిని..." అన్నారు నరసింహవర్మ. అది విని ఫక్కున నవ్వింది శివకామి.

ఆయన ఇలా ముందుకు కొనసాగించారు. "నేను నాలోకూడ ఒక మార్పు గమనించాను. నేను ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, ముఖ్యమైన రాజకార్యాల్లో నిమగ్నమైవున్నా కూడ నీ జ్ఞాపకమే వస్తూంది. ఇలాంటి పరిస్థితిలో ఒకనాడు ఇదే తామర కొలను గట్టును మనం కలుసుకొన్నాం. నీవు నేనెందుకు మూడేళ్ళుగా నిన్ను చూడలేదని నాతో జగడమాడావు. చివరికి నేను నిన్నెటికీ మరిచిపోనని చేతిలో చెయ్యేసి ఒట్టువేయించుకొన్నావు. నాకు నవ్వొచ్చింది. నిన్ను ఒక్క క్షణం కూడ మరువలేకున్నప్పుడు ఈ ఒట్టెందుకు అని. నీ తృప్తికోసం అలాగే ఒట్టువేసి చెప్పాను. ఆ తర్వాత ఈరోజే మనం మళ్ళీ కలుసుకొంటున్నాం. నీవు ఇక్కడ ఉంటావో ఉండవో అనుకొంటూనే వచ్చాను. కానీ నీవిక్కడున్నావు. మన మనస్సులెంత బాగా తెలుసుకొన్నాయో కద?"

"ఇదంతా చెప్పినవారు నా మొదటి ప్రశ్నకు మాత్రం ఉత్తరమివ్వలేదేమి?" అన్నది శివకామి.

"ఏమా ప్రశ్న? కాస్త గుర్తు చేస్తే మంచిది" అన్నారు మహామల్లు.

"మదురైకి, వంచికి పెళ్ళిదూతలను పంపించే ఏర్పాట్లు చేసినమాట నిజమేనా?"

నరసింహవర్మ చిన్నగా నవ్వేసి, "ఆ మాట నిజమే. తన కుమారునికి పెళ్ళి చేయాలని ఏ తల్లికి ఆశ ఉండదు? నా తల్లి ఏర్పాట్లవి! కానీ నేను నా మనసులోని మాటను చక్రవర్తికి తెలియజేసేందుకు తగిన సందర్భం కోసం ఎదురుచూస్తున్నాను. అంతలో ఈ యుద్ధం వచ్చి, అందుకు అవకాశమే లేకుండ చేసేసింది!" అన్నారు.

"ప్రభూ! నాకెందుకో నెమ్మది లేదు. మూడేళ్ళ క్రితం ఎలా ఉండేవారమో అలా పిల్లల్లాగ మళ్ళీ ఉండకూడదా అనిపిస్తూంది" అన్నది శివకామి.

"అది సాధ్యం కానే కాదు. అందుకు రెండుకారణాలున్నాయి. ఈ యుక్తవయస్కురాలైన శివకామిని చూసిన తర్వాత ఆ బాల శివకామిని నేనూహించుకోలేను. అంతకన్న ముఖ్యంగా, ఇప్పటికే చక్రవర్తి నేను యుద్ధరంగానికి వెళ్ళేందుకు ఆక్షేపిస్తున్నారు. నేను పిల్లవాడిలాగ ఉంటే, సమ్మతిస్తారా?"

"ప్రభూ! మీరుకూడ నిజంగానే యుద్ధరంగానికి వెళతారా?" అని దిగులుగా అడిగింది శివకామి.

"తప్పక వెళతాను. నూరేళ్ళుగా అన్యులు అడుగుపెట్టని పల్లవసామ్రాజ్యంలో ఇప్పుడు

చాళుక్యులు అడుగుపెట్టారు. వారిని మట్టుపెట్టక ఊరుకోవడమా?"

"మీరే ఎందుకు వెళ్ళాలి? పల్లవసైన్యం లేదా? పల్లవ సైన్యాధిపతులు లేరా?"

"పల్లవ సైనికులు అన్యులను ఎదిరించి పోరాడుతున్నప్పుడు నేనిక్కడ అంతఃపురంలో సుఖంగా కూర్చొని భోజనం చేస్తూ రాజమాతలతో పరాచికాలాడుతుండాలా? అలాగైతే ఆయనర్ శిల్పి కుమార్తె ప్రేమకు పాత్రుడనవుతానా?"

శివకామి, "ప్రభూ! మీరు యుద్ధరంగానికి వెళ్ళేందుకు నేనడ్డు నిలవడంలేదు. వెళ్ళి విజయవంతంగా తిరిగిరండి. కానీ..." అన్నది.

"కానీ...?"

"మీరు నవ్వివోరంటే చెబుతాను. వల్లికి సుబ్రమణ్యస్వామి శూలం మీద ఒట్టు వేసినట్లు మీరు కూడ మీ శూలం మీద ఒట్టువేసి చెప్పండి, యుద్ధరంగంలో కూడ నన్ను మరువనని."

నరసింహవర్మ చిన్నగా నవ్వి, "అంతేకద? ఇప్పుడే ఒట్టువేసి చెబుతాను" అని శూలాన్ని ఎత్తారు. కానీ మధ్యలోనే ఆపేశారు.

శివకామి, "ప్రభూ! ఎందుకు ఆగిపోయారు?" అని ఆదుర్దాగా అడిగింది.

"ఈ శూలం నాది కాదు. ఇంకొకరి శూలం మీద ఒట్టువేసి చెప్పడం సబబో కాదో అని ఆలోచిస్తున్నాను" అన్నారు నరసింహవర్మ.

"ఇది మీది కాదా? మరెవ్వరిది?"

"నాలుగు రోజుల క్రితం మదమెక్కిన కోవెల ఏనుగుమీదికి శూలం విసిరి మిమ్మల్ని కాపాడాడు కద? ఆ వీరయువకుడిది. అతన్ని చూసి దీన్ని తిరిగి ఇచ్చేయాలని మూడు రోజులుగా నగరం, నాడూ వెతుకుతున్నాం. ఇంకా కనిపించలేదు."

"ప్రభూ! అతడు ఉండే చోటు చెబితే నాకేమిస్తారు?"

"అతడుండే చోటు నీకు తెలుసా? వెంటనే చెప్పు, శివకామి! నన్నే నీ సొంతం చేసిన తర్వాత ఇచ్చేందుకు ఇంకా ఏముంది?" అన్నారు నరసింహవర్మ.

"ఆ యువకుడు ఇప్పుడు మా ఇంట్లోనే ఉన్నాడు."

నరసింహవర్మ తుళ్ళిపడి లేచి, "ఏమంటున్నావు, శివకామి? ఆ అబ్బాయి మీ ఇంటికెలా వచ్చాడు?" అని అడిగారు.

"నేను మీకు చెప్పాను, గుర్తుందా? ఒక బౌద్ధ భిక్షువు తరచూ నాన్నను చూసేందుకు

వచ్చేవారని, వచ్చినప్పుడల్లా నన్నుకూడ ఉత్తర దేశానికి రమ్మని పిలిచేవారని? ఆ నాగనంది భిక్షువే ఆ యువకుని పిలుచుకొని వచ్చారు" అన్నది శివకామి.

"ఆహా! చక్రవరి చెప్పింది నిజమైంది...శివకామి! అదిగో విను!" అన్నారు నరసింహవర్మ.

అప్పుడు దూరాన భేరి శబ్దం, శంఖనాదం, గుర్రపు డెక్కల శబ్దం కలగలిసి వినిపించాయి.

"ఎవరు? చక్రవర్తేనా?" అన్నది శివకామి.

"అవును; నేను వెంటనే వెళ్ళి చక్రవర్తిని కలుసుకోవాలి. నిన్ను మీ ఇంట్లో కలుసుకొంటాను" అన్నారు.

"అలాగే. మీరు యుద్ధరంగానికి వెళ్ళే మునుపు మళ్ళీ ఇక్కడికొస్తారా?"

"తప్పక వస్తాను, శివకామి!" అని చెప్పేసి, వేగంగా వెళ్ళి గుర్రమెక్కి బయల్దేరారు నరసింహవర్మ. శివకామి కూడ ఉత్సాహంగా ఇంటివైపు నడిచింది. తన యజమాని తనని మరిచిపోయినా, రతి ఆమె వెంబడే గెంతుతూ వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయం - 18

## ముత్యాలసరం

**తమిళదేశ చరిత్రలో** మహోన్నత కీర్తి శిఖరాన్నందుకొన్న చక్రవర్తుల్లో మహేంద్రపల్లవ చక్రవర్తి ప్రధములంటే అతిశయోక్తి కానేరదు. ఎందుకంటే పండితులు, కవిపుంగవులు రాజుల మీద 'ఇంద్రుడు, చంద్రుడ'ని కురిపించే పొగడ్తలన్నీ ఆయన విషయంలో ముమ్మటికీ నిజమైవున్నాయి.

పరాక్రమంలో అర్జునుడు, అందంలో మన్మధుడు, బుద్ధిలో బృహస్పతి, విద్యలో సరస్వతి అని చెప్పదగ్గ బహుముఖ ప్రజ్ఞాశాలి ఆ చక్రవర్తి.

మహేంద్రవర్మ ఆజానుబాహువు. ఆయన వదనం అనేక వందల సంవత్సరాలుగా వంశపారంపర్యంగా వస్తున్న రాజకులపు వీరకళతోబాటు సునిశిత విద్యాసాధన వల్లను, కళాభ్యాసం వల్లను చేకూరిన తేజస్సుతో ప్రకాశిస్తోంది. కంచి మహానగరంలో పేరుగాంచిన కంసాలురు అద్వితీయమైన పనితనంతో చేసిన కిరీటం, కర్ణకుండలాలు, భుజకీర్తులు, రత్నమాలలు మొదలైన ఆభరణాలను ధరించివున్నారు. అపూర్వ నాణ్యత, పనితనం కలిగిన పట్టువస్త్రాలకు ఆ కాలంలోనే కంచి సుప్రసిద్ధంగా ఉండేది. అటువంటి పట్టుపీతాంబరాలను మహేంద్రపల్లవ చక్రవర్తి కళాత్మకంగా ధరించినప్పుడు, వాటి అందమే ఇనుమడించినట్లుంది.

మహేంద్రులు తమిళభాష, ఉత్తరభారత భాష, ప్రాకృతం మొదలైన మూడు భాషల్లోను గొప్ప పాండిత్యాన్ని సాధించినవారు. ఉత్తరాన తక్షశిలనుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు కవులు, పండితులు మహారసికులైన మహేంద్రపల్లవ  చక్రవరి ఆస్థానంలో ఆయన ఎదుట తమ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించాలని కంచి మహానగరానికి వచ్చేవారు.

అప్పటికి సుమారు ఐదువందల సంవత్సరాలకు మునుపు ఉత్తరాన ఉజ్జయిని రాజధానిగా ఏలుతూ కాళిదాదు వంటి కవులను, పండితులను పోషించిన చంద్రగుప్త విక్రమాదిత్యుని తర్వాత కవులకు, పండితులకు కల్పవృక్షంగా విరాజిల్లినది కంచి మహేంద్ర పల్లవ చక్రవర్తేనంటే అతిశయోక్తి కానేరదు.

చిత్రం, శిల్పం మొదలైన లలితకళల్లో నిష్ణాతులై, ఆయా కళల్లో పేరుగాంచిన కళాకారులు చూసి అచ్చెరువొందేలాగ కళాఖండాలను సృష్టించేవారు. ఆయన శిల్పకళాచాతుర్యాన్ని చూసి మెచ్చిన శిల్పాచార్యులు ఆయనకు 'విచిత్ర చిత్తులు' అన్న బిరుదాన్ని ఇచ్చారు. అలాగే ఆయన రచించిన అద్భుత చిత్రకళాఖండాలను చూసి, 'చిత్రకార పులి' అన్న బిరుదునిచ్చారు. ఉత్తర భారత భాషలో ఆయన రచించిన

'మత్తవిలాస ప్రహసనం' అన్న హాస్యనాటకం ఆయన రచనాకౌశలాన్ని నలుదిక్కులకు చాటింది.

సంగీతశాస్త్రసాగరాన్ని ఈది జయించిన రుద్రాచార్యుల వద్ద ఆయన సంగీతం నేర్చుకొని, ఏడు నరాలు అమర్చిన 'పరివాహిని' అనే వీణను అద్వితీయంగా వాయించేవారు. తాళాల్లో 'సంకీర్ణ జాతి' తాళాన్ని అపూర్వంగా వాయించగల నైపుణ్యతను సాధించి 'సంకీర్ణజాతి తాళ ప్రకరణకర్త' అన్న బిరుదాన్ని తనది చేసుకొన్నారు.

మహేంద్రులు చిన్నవయసులో జైనమతం పాటించినా, పిదప శైవమతాన్ని స్వీకరించి, తమ సామ్రాజ్యంలో బౌద్ధ, జైన, శైవ, వైష్ణవం మొదలైన అన్ని మతాలను సమతా భావంతో ఆదరించడం వల్ల, 'గుణపర' అన్న కీర్తిబిరుదాన్ని కూడ సొంతం చేసుకొన్నారు. 'తిరువదిగై' అన్న స్థలంలో ఆయన కైంకర్యంతో కట్టబడ్డ శివాలయం 'గుణపరేశ్వరం' అన్న పేరుతో పిలువబడుతూంది.

మహేంద్ర చక్రవర్తి కాలానికి సుమారు మూడు వందల సంవత్సరాలకు మునుపటినుంచే ఉత్తర దేశం నుంచి కవులు, పండితులు, బౌద్ధ భిక్షువులు, జైన మునులు ఎడతెరపి లేకుండ దక్షిణానికి వచ్చి కంచిలో తమ విద్యాపీఠాలను ఏర్పాటు చేయసాగారు. ఇందువల్ల మన వృత్తాంతం జరిగిన కాలానికి తమిళనాడులో సంస్కృతం, ప్రాకృతం బహుళ ప్రాచుర్యంలో ఉండి, తమిళభాష తన ప్రాధాన్యతను కాస్త కోల్పోయివుందని పాఠకులు గ్రహించాలి.

నావుక్కరసర్ మొదలైన శైవ నాయన్మారులు, పొయ్‌గయార్ మొదలైన వైష్ణవ ఆళ్వారులు తమిళభాషలో భక్తిరసం నిండిన పద్యాలను, పాటలను రచించి మళ్ళీ తమిళభాషను పెద్దపీటపైన కూర్చోబెట్టిన కాలం అప్పుడే ప్రారంభమైంది. కాబట్టి మహేంద్ర చక్రవర్తి రచనలు చాలవరకు ఉత్తరభాషలో ఉండడానికి కారణాన్ని పాఠకులు ఊహించి తెలుసుకోవచ్చు.

అటువంటి బహుముఖ ప్రజ్ఞాశాలి, జగద్విఖ్యాత మహేంద్రపల్లవ చక్రవర్తిని అయనర్ శిల్పి ఇంటి వాకిటనే నిలబెట్టేసినందుకు పాఠకులు క్షమించాలి. అయినా కూడ, చక్రవర్తి ఆగమనాన్ని సూచించిన భేరి శబ్దం విన్న వెంటనే ఆయనర్ శిల్పి త్వర త్వరగా తమ ఇంటి వాకిలికి వచ్చి చక్రవర్తిని ఆహ్వానించేందుకు సిద్ధంగా నిలిచివున్నారు.

చక్రవర్తి గుర్రం మీదినుంచి దిగేటప్పుడే, “అయనర్! ఆనాడు రాత్రి ఇంటికి క్షేమంగా వచ్చి చేరారా? శివకామి సౌఖ్యమా?” అని అడుతూనే దిగారు. ఆయనర్ ముందుకొచ్చి, “ప్రభూ! క్షేమంగా వచ్చి చేరాము. శివకామికే నాలుగు రోజులుగా కాస్త బాగుండలేదు" అన్నారు. వెంటనే చక్రవర్తి, “ఏమయ్యింది? ఇప్పుడెలాగుంది?” అని కాస్త దిగులుగా అడిగారు. అందుకు ఆయనర్, “ఈ రోజు కాస్త ఫరవాలేదు" అన్నారు.

అందరూ ఇంటి లోపల ప్రవేశించారు. చక్రవర్తి తమ శిలా సింహాసనం మీద ఆసీనులైన వెంటనే ఆయనర్, "ప్రభూ! ఆ రోజు శివకామి రంగప్రవేశం మధ్యలో ఆగిపోయినందువల్లే తను నిరుత్సాహంగా ఉంది. రసిక శిఖామణులైన తమరే ఆమెను ఆశీర్వదించి ఉత్సాహపరచాలి" అన్నారు.

"ఆయనర్! తమ కుమారి ఆనాడు నాట్యమాడినట్లే తోచలేదు. నాట్యకళే మానవరూపందాల్చి వచ్చి ఆడినట్లు కద నాకనిపించింది! ఆ రోజు అతిముఖ్యమైన కార్యం వచ్చినందువల్లే మధ్యలో లేచి పోవలసివచ్చింది" అన్నారు చక్రవర్తి.

"నేను కూడ విన్నాను ప్రభూ! మన సామ్రాజ్యంలో అన్యులు చొరబడ్డారట! ఎంత ధైర్యం! ఎంత తెగింపు!" అని ఆయనర్ శిల్పి ఉద్రేకంతో అన్నారు.

"ఆ తెగింపుకు, దుస్సాహసానికి వారు తగిన శిక్ష అనుభవిస్తారు. ఆయనర్! చాల ఏళ్ళుగా పల్లవ సామ్రాజ్యంలో పగవారి సైన్యం చొరబడలేదు. నేను యుద్ధరంగాన్ని కళ్ళారా చూడాలని నా తండ్రి నన్ను లంకలో జరిగిన పోరుకు పంపారు. కానీ నరసింహునికి ఇక్కడే పోరును చూసే భాగ్యం కలగబోతూంది. వాతాపి రాజు పులకేశి అతిపెద్ద సైన్యాన్ని కూడదీసుకొని దండెత్తి వస్తున్నాడు. మనం కూడ పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని సంకుల సమరం చేయవలసివస్తుంది. మన రాజ్యం మీదికి చాళుక్యులు దండెత్తి రావడం కన్న శివకామి రంగప్రవేశం మధ్యలో ఆగిపోవడమే ఎక్కువ కోపాన్ని కలిగిస్తూంది. అందుకు కారణమైన ఆ చాళుక్యులు తగిన శిక్ష అనుభవించే తీరుతారు!" అన్నారు చక్రవర్తి.

అది విన్న ఆయనర్ శిల్పి మనసు గర్వంతో ఉప్పొంగి, చెంతనే నిలుచొన్న కుమార్తెను ఆప్యాయంగా చూశారు.

చక్రవర్తి, "ఆ రంగప్రవేశం నాడు నేను ఎన్నెన్నో కార్యక్రమాలు చేయాలని పథకం వేసుకొన్నాను. కానీ ఏవీ నెరవేరలేదు. చివరకు నిండు సభలో చేయవలసిన సన్మానాన్ని ఇప్పుడు ఇక్కడ చేయదలుచుకొన్నాను. అందుకు మీకు అభ్యంతరమేమీ లేదు కద?" అంటూనే తమ చేతనున్న రత్నపు తిత్తి నుంచి ఒక అందమైన రెండు పేటల ముత్యాల సరాన్ని పైకి తీశారు.

అందుకు ఆయనర్, "ప్రభూ! నాకింతకన్న సంతోషకరమైన విషయం ఏముంటుంది?" అని చెప్పి, శివకామి వైపు చూసి, "అమ్మా! నీ భాగ్యమే భాగ్యం! సకల కళా నిష్ణాతులైన చక్రవర్తి నిన్ను సన్మానించబోతున్నారు!" అనగానే శివకామి ముందుకు వచ్చి వినయపూర్వకంగా చక్రవర్తి ముందు మోకరిల్లి చక్రవరి ఇవ్వబోయే బహుమనాన్ని అందుకోవడానికి అంజలి ఘటించింది.

అరెరె! ఏమది! చక్రవర్తి ఇచ్చిన ఆ సరం జారి కిందపడిపోయింది కద! ఆయనర్ ముఖం చటుక్కున చిన్నబోయింది. శివకామి మనసులో ఏమనుకొందో మనకు తెలియదు. కానీ మరుక్షణమే

ఆమె ముఖం విప్పారింది. ఎందుకంటే, కింద పడ్డ సరాన్ని నరసింహవర్మ వెంటనే తీసి ఆమెకందించాడు. శివకామి దాన్నందుకొని కళ్ళకద్దుకొని తన మెడలో ధరించింది. ఆ ముత్యాల సరాన్ని బహుమానంగా నరసింహవర్మ చేతుల మీదుగా అందుకోవడం వల్ల మనసులో ఉప్పొంగిన ఆనందం ఆమె ముఖంలో ప్రతిఫలించడం సహజమే కద!

~~~
~~~

# అధ్యాయం - 19

## బుద్ధుని శిల్పం

**కుమార చక్రవర్తి** కిందపడ్డ ముత్యాల సరాన్ని తీసి శివకామికివ్వడం, దాన్ని శివకామి విప్పారిన ముఖంతో అందుకోవడం చూడగానే ఆయనర్ ముఖం మళ్ళీ ప్రకాశవంతమైంది.

ఇదంతా చూసీచూడనట్లు మహేంద్ర చక్రవర్తి ఆయనర్ శిల్పిని చూసి, “మహా శిల్పాచార్యా! ఇలాంటి ఎన్నో ముత్యాలసరాలు శివకామికి బహుమతిగా లభించబోతున్నాయి. ఈ పల్లవ సామ్రాజ్యానికే ఆమెవల్ల ఎనలేని కీర్తిప్రతిష్ఠలు చేకూరబోతున్నాయి. ఏది ఏమైనా, శివకామి నాట్యకళాభ్యాసం ఆగకుండ ముందుకు సాగేటట్లు చూసుకోవడం మీ బాధ్యత!” అన్నారు.

ఆయనర్, “ప్రభూ! మీరు, కుమార చక్రవర్తి ఉన్నంతవరకు శివకామి ఉత్సాహానికి ఏమి కొరత రాబోతూంది?" అనగా, మహేంద్ర పల్లవ చక్రవర్తి, “ఆలాకాదు, ఆయనర్‌గారూ!  ఈ యుద్ధం వల్ల, నేను, కుమార చక్రవర్తి కొంతకాలం మీ శిల్పగృహానికి రాలేకపోవచ్చు. కానీ, శివకామి కళాభ్యాసం ఏ అడ్డంకి లేకుండ కొనసాగాలి. కాసేపటికి మునుపు శివకామి బౌద్ధ భిక్షుణి కావాలని కోరుకొంటూందన్నారు కద? అది ఒక విధంగా సమంజసమేననిపిస్తుంది. శివకామి సాధారణమైన అమ్మాయి కాదు. అందరిలా పెళ్ళి చేసుకొని పిల్లలను కనేందుకు పుట్టలేదు. ఆమె పుట్టింది ఈ నాట్యకళను మహోన్నత శిఖరాలకు తీసుకొని వెళ్ళి చిరకాలం ఈ భూమి మీద, మీ శిల్పసృష్టి మూలంగా, నిలిచేలా చేసేందుకే. కాబట్టి ఆమె నాట్యకళకే తనని అర్పించుకోవాలి!” అన్నారు.

ఈ మాటలు అక్కడున్న ముగ్గురి మనసుల్లో మూడువిధాలైన భావోద్వేగానుభూతులను కలిగించాయని వారి ముఖాలే చెప్పాయి.

ఆయనర్ శిల్పి తమ మనసులో ఉప్పొంగిన భావాలను మాటల్లో ఇలా వ్యక్తపరిచారు: “ప్రభూ! మీరు నా మనసులో ఉన్నమాటనే చెప్పారు! పెళ్ళి చేసుకొని పిల్లలను కనేందుకు లక్షలకొద్ది అమ్మాయిలున్నారు. కానీ ఈ అపూర్వకళను సాధించి, శోధించి వినూత్న అర్థభావాలతో విరాజిల్లజేసేందుకు ఎంతోమంది లేరు కద?” అన్నారు.

కానీ శివకామి చక్రవర్తి మాటలకు ప్రతిస్పందించిన విధం చాల వ్యత్యాసంగ ఉంది. వంచిన తలెత్తకుండ నేలచూపులు చూస్తూ నిలుచొంది. నాట్యకళలో,  నటనాకౌశలంలో ఆరితేరి తన కళ్ళతోను, కనురెప్పలతోను, కనుబొమలతోను అనేకానేక భావాలను ప్రదర్శించడంలో నిష్ణాతురాలైన శివకామి తన

మనోభావాలను తన ముఖంమీద చూపకుండ దాచడంలో కూడ అంతే నైపుణ్యత కలిగింది. కానీ నరసింహవర్మకు నటనకళ రాకపోవడంతో తన మనోభావాలను అక్కడున్న తక్కినవారు చూడడం ఇష్టం లేక, చుట్టూ ఉన్న శిల్పాలను, చిత్రాలను చూసే నెపంతో అక్కడినుంచి కాస్త పైదొలగారు.

చక్రవర్తి కూడ తమ ఆసనం మీదినుంచి లేచి, "శిల్పాచార్యా! నాకు అతిముఖ్యమైన కార్యాలెన్నో ఉన్నాయి. కానీ ఇక్కడికి వస్తే అన్నీ మరిచిపోతున్నాను. మీరు కొత్తగా చెక్కిన శిల్పాలను చూసి వెంటనే బయలుదేరాలి" అని చెబుతూనే ముందుకు నడిచారు. ఆయనర్, శివకామి కూడ ఆయన వెంట నడిచారు.

కొత్తగా ఆయనర్ శిల్పి చెక్కిన శిల్పాలను, వాటిలో ఆయన చూపించిన నాట్యభంగిమలను అభినందిస్తూ ముందుకు నడిచారు చక్రవర్తి. అవన్నీ చూసిన తర్వాత, చక్రవర్తి ఆయనర్ శిల్పాచార్యులను చూసి, "ఆచార్యా! ఇప్పుడు నాట్యశాస్త్రాన్ని రచించిన భరతముని ఇక్కడికి వచ్చి ఈ అపూర్వ శిల్పాల్లో మీరు పొందుపరిచిన నాట్యభంగిమలను చూస్తే, ఆయనే వీటినుంచి కొత్తగా నాట్యకళను నేర్చుకోవలసి వస్తుంది! శివకామి ఆ మహాముని కూడ ఊహించలేనన్ని ముద్రలను, భంగిమలను, ముఖభావాలను చూపగల అపూర్వ కళాకారిణి!" అని మెచ్చుకొన్నారు.

చివరగా కాస్త దూరాన ఉన్న బుద్ధుని శిల్పాన్ని చూసి, "ఆహా! ఆ బుద్ధ భగవానుడు ఎంతటి శాంత స్వభావుడు, కరుణామయుడు! ఆయన ఈ భూమండలంలో యుద్ధం, హింస అన్నవి లేకుండ సమూలంగ తుడిచేయాలని ఎంతగానో ప్రయత్నించారు. ఆయన బోధలను విని ప్రపంచంలోని రాజులందరు యుద్ధాన్ని విడనాడితే ఎంత బాగుంటుంది? ఆయన బోధలను నిజంగా అనుసరించింది మౌర్యవంశపు అశోక చక్రవర్తి మాత్రమే. ఆ తర్వాత అటువంటి అహింసామూర్తి యైన రాజు ఈ దేశంలో కానరాలేదు!" అన్నారు చక్రవర్తి.

ఆ పైన చక్రవర్తి ఇంటి వాకిలివైపు నడిచారు. వాకిలి దాటుతూ శిల్పాచార్యులవైపు తిరిగి చూసి, "ఆచార్యా! నేను మళ్ళీ మీ శిల్ప దేవాలయానికి వస్తానో రానో చెప్పలేను. కానీ ఒక మాట చెబుతాను - ఈ పురాతన పల్లవ సామ్రాజ్యం ఒకనాడు పతనమై నశించిపోవచ్చు" అన్నారు.

అది విని ఆయనర్ శిల్పి అదిరిపడి, "ప్రభూ! అలా ఎన్నటికీ జరగదు!" అని గగ్గోలు పెట్టారు.

"వినండి, శిల్పాచార్యా1 ప్రపంచంలో ఎన్నో సామ్రాజ్యాలు వచ్చాయి, వెళ్ళాయి. హస్తినాపురం కావచ్చు, పాటలీపుత్రం కావచ్చు, ఉజ్జయిని కావచ్చు. అవన్నీ ఇప్పుడు ఉన్నచోటు కూడ తెలియనట్లు తుడిచిపెట్టుకుపోయాయి. అలాగే ఈ పల్లవ సామ్రాజ్యానికి కూడ ఒకనాడు ముగింపు రావచ్చు. కానీ మీ శిల్ప సామ్రాజ్యం చిరస్థాయిగా విరాజిల్లుతుంది!" అన్నారు చక్రవర్తి.

అప్పుడు ఆయనర్ శిల్పి గద్గదస్వరంతో, "ప్రభూ! ఈ తమిళనాడులో నాలాంటి ఎందరో వేలకొద్ది

శిల్పులు వస్తారు, మరుగైపోతారు. కానీ ఈ నాట చిత్రకళ, శిల్పకళ ఉన్నంతవరకు మీ దివ్యనామం, కుమార చక్రవర్తి దివ్యనామం చిరంజీవంగా నెలకొనివుంటాయి!" అన్నారు.

ఆహా! ఆ మహాశిల్పి ఆనాడు అన్న మాటలు ఇప్పుడెంత నిజమన్నది పాఠకులకు తెలిసేవుంటుంది. ఇప్పుడు మహేంద్రవర్మ పేరు, మహామల్లు నరసింహవర్మ పేరు తప్ప, తమ అపూర్వ శిల్పకళాచాతుర్యంతో ఆ భూలోక స్వర్గాన్ని సృష్టించిన శిల్పుల పేర్లు ఎక్కడా కానరావడం లేదు కద?

చక్రవర్తి, ఆయన కుమారుడు తమ తమ అశ్వాలనధిరోహించిన పిమ్మట, చక్రవర్తి మళ్ళీ ఆయనర్ శిల్పివైపు తిరిగి చూసి, "చూశారా! ముఖ్యమైన విషయాన్నే మరిచాను. నేను ఉత్తరదేశానికి వెళ్ళే మునుపు మామల్లపురంలో జరగవలసిన కార్యక్రమాల గురించి మాట్లాడి తీర్మానించాలి. కాబట్టి రేపు మధ్యాహ్నం మీరు అక్కడి ఓడరేవు వద్దకు రావాలి!" అన్నారు.

ఆయనర్ వెంటనే, "ఆజ్ఞ, ప్రభూ! తప్పక వస్తాను" అన్నారు.

ఇంతసేపూ చక్రవర్తి, ఆయనర్ శిల్పి మాత్రమే సంభాషిస్తున్నారు. కుమార చక్రవర్తి, శివకామి ఒకరితోనొకరు ఒక్క మాట కూడ నోరు మెదిపి మాట్లాడుకోలేదు. కానీ కనుసైగలతోనే ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకొన్నారు. చివరగా శూలాన్నెత్తి పట్టి చిరునవ్వు నవ్వి వెనుదిరిగి గుర్రాన్ని వేగంగా పోనిచ్చారు.

శివకామి ఉత్సాహంగా ఇంటివైపు సాగింది. ఉన్నట్లుండి కుమార చక్రవర్తి శూలాన్నెత్తి పట్టి చేసిన సైగ గుర్తుకు రాగా, ఆ శూలానికి యజమానియైన ఆ వీరయువకుడెక్కడ అన్న ఆలోచన తోచింది శివకామికి. శిల్పాలున్న లోపలి ప్రాంగణంలోకి అడుగుపెట్టి నాలుగడుగులు వేయగానే ఆ పెద్ద బుద్ధశిల్పం వెనక నాగనంది భిక్షువు, పరంజ్యోతి దాగివుండడాన్ని చూసి, ఎనలేని ఆశ్చర్యానికి, దిగ్భ్రాంతికి లోనైంది శివకామి.

~~~
~~~

# అధ్యాయం - 20

## అజంతా రహస్యం

**మనమిప్పుడు** కాస్త వెనక్కు వెళ్ళి, శివకామి కాస్త నిరుత్సాహంతో జింకపిల్లను వెంటబెట్టుకొని తామరకొలను వైపు వెళ్ళిన తర్వాత ఆయనర్ శిల్పి ఇంట్లో ఏం జరిగిందో గమనించవలసివుంది.

ఆయనర్ శిల్పికి నాగనంది భిక్షువు శివకామి గురించి అన్న మాటలు అంతగా రుచించలేదని చూశాము. కాబట్టి ఆయన భిక్షువుతో సంభాషణ కాసేపు ఆపి, పరంజ్యోతివైపు చూసి, "అబ్బాయీ! నేను నీకేం చేయగలనో చెప్పు" అన్నారు.

"నా మామగారు నావుక్కరసర్ స్వామివారి మఠంలో చేరి చదువు నేర్చుకోమని చెప్పారు. అలాగే మీకు కూడ ఒక పత్రం రాసి ఇచ్చారు, మీరు నన్ను శిష్యునిగా తీసుకొని శిల్పం, చిత్రం నేర్పించమని. కాబట్టి వెంటనే మఠానికి వెళ్ళి చేరుదామని అనుకొంటున్నాను" అన్నాడు పరంజ్యోతి.

అంతలో నాగనంది భిక్షువు అడ్డుపడి, "ఇప్పుడు నావుక్కరసర్ స్థలయాత్రకు వెళ్ళివున్నారు, కాబట్టి నీవు మఠానికి వెళ్ళలేవు" అన్నారు.

అందుకు శిల్పాచార్యులు, "దానికేముంది? నా ప్రియస్నేహితుని మేనల్లుని నేనే స్వయంగా తీసుకొని వెళ్ళి మఠంలో చేర్పిస్తాను" అన్నారు.

"ఆ పని మాత్రం చేయకండి!" అని హెచ్చరికగా అన్నారు బౌద్ధ భిక్షువు.

"అదేల?" అని ఆశ్చర్యంగా అడిగారు శిల్పాచార్యులు.

"మీకు తెలియదేమో? ఆ రోజు రాత్రి కంచి నగరంలో దిక్కు తెలియకుండ తిరుగాడుతున్నప్పుడు, రక్షకభటులు ఇతన్ని గూఢచారి అని భావించి పట్టుకొని వెళ్ళి చెరసాలలో వేశారు. కానీ ఆ రాత్రే ఇతడు తప్పించుకొని బయటికొచ్చేశాడు" అని చెప్పారు బౌద్ధ భిక్షువు.

"ఎలా తప్పించుకొన్నాడు?" అని ఆయనర్ శిల్పి అడగగా, "మరెలా? చెరసాల గది చూరులో కన్నంవేసి అందులోనుంచి తప్పించుకొన్నాడు" అని వివరించి, ఇంకా ఇలా చెప్పారు: "చక్రవర్తి చెరసాలనుంచి తప్పించుకొన్నవారికి ఏం శిక్ష పడుతుందో తెలుసు కద, శిల్పాచార్యా? మరణదండన!" అని అన్నారు.

"అయ్యయ్యో! ఈ అమాయకపు పల్లెటూరి అబ్బాయిని ఎలా కాపాడడం?" అని వెంటనే ఒక

విషయం గుర్తొచ్చి, "సరే, నేనే ఈ అబ్బాయిని కాపాడుతాను. చక్రవర్తి వద్దకు నేనే ఇతన్ని నాతో తీసుకొని వెళ్ళి ఇతడే నన్ను, శివకామిని ఆ మదపుటేనుగు బారినుంచి కాపాడిన వీరయువకుడని, కాబట్టి చక్రవర్తి పెద్ద మనసు చేసి మన్నించాలని వేడుకొంటాను" అన్నారు.

"మీరా పని చేస్తే పరంజ్యోతికి ఇంకా ప్రమాదం. చక్రవర్తి యుద్ధానికి సైన్యం కూడదీస్తున్నారని చెప్పాను కద? ఏనుగు మీద శూలం విసరగల వీరుడు దొరికితే చక్రవర్తి ఊరుకొంటారా? వెంటనే సైన్యంలో చేర్చేసుకొంటారు. యుద్ధంలో ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు? పాపం తల్లికి ఒకడే కొడుకు. ఆలోచించండి" అన్నారు నాగనంది భిక్షువు.

ఆయనర్ శిల్పి ఏం చేయాలో తోచక దీర్ఘాలోచనలో పడిపోయారు. చటుక్కున ఆయనకు గుర్తొచ్చింది తాము, భిక్షువు పరంజ్యోతి ఏం చేయాలని చర్చించుకొంటున్నారు, అతని కోరిక ఏమని తెలుసుకోకనే. కాబట్టి ఇప్పుడు ఆయన పరంజ్యోతి వైపు తిరిగి, "అబ్బాయీ! ఇంతకీ నీవేం చేయాలని కోరుకొంటున్నావు?" అని మెత్తగా అడిగారు.

"అయ్యా! నేను చదువుకోవాలనుకొంటున్నాను. వీలైతే నావుక్కరసర్ మఠానికి వెళ్ళి చదువుకొంటాను" అన్నాడు పరంజ్యోతి.

వెంటనే బౌద్ధ భిక్షువు అడ్డుపడి, "అక్కడికి వెళ్ళి ప్రయోజనం లేదు. కంచి కోట ముట్టడి ఎప్పుడైనా జరగవచ్చు కాబట్టి చక్రవర్తే ఆయనను చోళదేశానికి స్థలయాత్రకు వెళ్ళమని పంపేశారు" అన్నారు.

"మరి ఇప్పుడేం చేస్తావబ్బాయి, నీవు?" అని పరంజ్యోతిని మళ్ళీ అడిగారు శిల్పాచార్యులు.

"మీకభ్యంతరం లేకపోతే మీ శిష్యుడిగా ఇక్కడే మీ దగ్గర చదువు, చిత్రం, శిల్పం నేర్చుకొంటాను" అన్నాడు (ఉత్సాహంగా) పరంజ్యోతి.

"చాల సంతోషం. నా ప్రియస్నేహితుడి మేనల్లుడు నా దగ్గర నేర్చుకొంటానంటే అంతకన్న ఏం కావాలి? ఈ రోజే మొదలుపెట్టవచ్చు" అన్నారు ఆయనర్ శిల్పి.

అంతలో నాగనంది భిక్షువు, "ఆచార్యా! గురుదక్షిణ చదువు చెప్పిన తర్వాత కాదు, ఇప్పుడే తీసుకోవాలి, అది కూడ ఏమిటో చెబుతాను, మీరు చాలయేళ్ళుగా వేచివున్నది, మీ శిల్ప, చిత్రకళా పిపాసకు స్ఫూర్తినిచ్చేది కూడాను!" అన్నారు.

"అదేమిటి?" అని ఆశ్చర్యంగా అడిగారు శిల్పాచార్యులు.

"ఇంకేది? అజంతా చిత్రాల రహస్యమే. ఇప్పుడా రహస్యం నాగార్జునకొండ బౌద్ధవిహారంలో

ఉంటున్న ప్రధాన భిక్షువుకు తెలియవచ్చిందని విన్నాను. కాబట్టి మీ కొత్త శిష్యుడిని వెంటనే అక్కడికి పంపించి ఆ రహస్యాన్ని తెలుసుకొని రమ్మనండి!" అన్నారు భిక్షువు.

అది వినగానే శిల్పాచార్యులు ఎగిరి గంతేసినంత పని చేశారు. "అబ్బాయీ! నీకు సమ్మతమేనా? వెళ్ళి రాగలవా?" అని పరంజ్యోతిని ఉత్సాహంగా అడిగారు.

అందుకు పరంజ్యోతి వినయంగా, "మీరాజ్ఞాపిస్తే తప్పక చేస్తాను, ఆచార్యా!" అన్నాడు.

అప్పుడు ఆయనర్ శిల్పి బౌద్ధ భిక్షువును చూసి, "కానీ ఈ అబ్బాయికి, అజంతా గురించి, అక్కడి చిత్రాల గురించి ఏమీ తెలియదు కదా? అది కూడ మీరే వివరంగా చెప్పండి" అన్నాడు.

అప్పుడు నాగనంది భిక్షువు పరంజ్యోతికి ఇలా వివరించారు:"చూడబ్బాయి! ఉత్తరాన చాల దూరంలో గోదావరి నదికి అవతల అజంతా అని ఒక కొండ ఉంది. ఆ కొండలో అనేక శతాబ్దాల క్రితం బౌద్ధ భిక్షువులు గుహలను తొలిచి ఆ గుహల గోడల మీద బుద్ధ భగవానుని జీవిత చరిత్రను, ఆయన అవతార చరిత్రను అతి చక్కగా అద్భుతమైన చిత్రాల రూపంలో లిఖించివున్నారు. ఇన్ని వందల ఏళ్ళ తర్వాత కూడ అవి చెక్కు చెదరకుండ, ఏ మాత్రం రంగు మాసిపోకుండ విరాజిల్లుతున్నాయి. ఆయనర్ శిల్పికి వాటి రహస్యం తెలుసుకోవాలని చాల కాలంగా ఆశవుంది, కానీ అది తెలిసిన వారు ఎవ్వరూ ఇటువైపు రావడం లేదు. నాక్కూడా అది తెలియదు. అందుకే శిల్పాచార్యులు నీవు వెళతానంటే చాల సంతోషపడుతున్నారు. అదీగాక, నీవు నాగార్జునకొండ మీదున్న బౌద్ధవిహారానికి వెళ్ళి వస్తే చాలు. అజంతా వెళ్ళనవసరం లేదు."

కానీ శిల్పాచార్యులు కాస్త దిగులుగా, "నాగార్జున కొండ అంటే ఉత్తరాన కృష్ణానది తీరాన ఉంది కదా? అంత దూరం ఈ చిన్న అబ్బాయి ఎలా క్షేమంగా వెళ్ళి రాగాలడు? దారి పొడుగునా ఎన్నో ప్రమాదాలు ఎదురవుతాయి కదా?" అన్నారు.

"మీరేం దిగులుపడకండి. ఈ అబ్బాయి, వీరుడు మాత్రమే కాదు, చాల ధైర్యవంతుడు కూడాను. ఒక మంచి గుర్రం ఇప్పిస్తే ఒక నెల రోజుల్లో వెళ్ళి రాగలడు" అన్నారు నాగనంది భిక్షువు.

శిల్పాచార్యులు కాసేపాలోచించి, "అలాగే. నేను చక్రవర్తినే సహాయం అడుగుతాను. ఆయనక్కూడ అజంతా చిత్రాలంటే చాల కుతూహలముంది. నేనడిగితే తప్పక ఒక మేలు జాతి గుర్రాన్నిప్పిస్తారు" అన్నారు.

"అది మాత్రమే కాదు, రాజముద్ర కూడ చక్రవర్తిని అడిగి తీసుకోండి. ఎందుకంటే దారిలో ఇతన్ని ఎవరైనా పట్టుకొని అనుమానిస్తే, రాజముద్ర చాల ఉపయోగానికొస్తుంది" అని హెచ్చరికగా అన్నారు బౌద్ధ భిక్షువు.

"అవునవును. తప్పక రాజముద్ర అడిగి తీసుకొంటాను" అన్నారు శిల్పాచార్యులు.

అదే సమయాన దూరాన చక్రవర్తి రాకను సూచిస్తూ భేరి మోగింది. అది విని నాగనంది భిక్షువు, “ఆడబోయిన తీర్థం ఎదురొచ్చినట్లు, చక్రవర్తే ఇప్పుడిక్కడికి వస్తున్నారు. కాబట్టి మీరు ఆయన్ని గుర్రం, రాజముద్ర మరువక అడిగి తీసుకోండి" అన్నారు.

“మీరిక్కడే ఉన్నారు కద? మీ సమక్షానే అడుగుతాను" అన్నారు శిల్పాచార్యులు.

“వద్దు, వద్దు. మీకు చక్రవర్తికి బౌద్ధ భిక్షువుల పట్ల ఎలాంటి భావముందని తెలుసుకద? కాసేపు చక్రవర్తి తిరిగి వెళ్ళేవరకు బుద్ధభగవానుని శరణుకోరుతాను" అంటూ ఆయనర్ శిల్పికి బదులు చెప్పే అవకాశమివ్వకుండ పరంజ్యోతిని కూడ తనతోబాటు లాక్కొంటూ వేగంగా వెళ్ళి ఆ బుద్ధ శిల్పం వెనుక మరుగయ్యారు.

మహేంద్ర పల్లవ చక్రవర్తి, కుమార చక్రవర్తి వచ్చి వెళ్ళిన తర్వాత నాగనంది భిక్షువు పరంజ్యోతిని వెంటబెట్టుకొని బుద్ధవిగ్రహం వెనుక నుంచి బయటికొచ్చారు. “శిల్పాచార్యా! చక్రవర్తిని గుర్రం, రాజముద్ర అడిగారా?” అని విచారించారు.

అందుకు శిల్పాచార్యులు, “స్వామీ! చక్రవర్తి ఆ రాబోతున్న భయంకరమైన యుద్ధం గురించి చెప్పిన తర్వాత నాకింకేమీ అడిగేందుకు నోరు పెగల్లేదు" అన్నారు దిగులుగా.

“అవును. నిజమే. అందు గురించి ఏం చేయాలో ఆలోచిద్దాం" అనగా ముగ్గురూ ఇంతకు మునుపు కూర్చొన్న రాతిబండల మీద కూర్చొని మాట్లాడుకోసాగారు.

~~~
~~~

# అధ్యాయం - 21

## సిద్ధపర్వత చిత్రాలు

**పదిహేను** విధాలైన అభినయాల్లో సందేహం, అసహ్యమూ కలగలిసిన చూపుతో శివకామి బౌద్ధభిక్షువును ఒక్క చూపు చూసేసి, తండ్రివైపు చూసి, “వీరింతవరకు ఇక్కడే ఉన్నారా?” అని అడిగింది.

“అవునమ్మా!” అని బదులిచ్చారు ఆయనర్ శిల్పి.

“బుద్ధ విగ్రహం వెనక దాక్కొని?”

“అవునమ్మా. కానీ అందుగురించి నీవేమీ అపోహ పడనవసరం లేదు" అన్నారు.

తండ్రి ఇంకా ముందుకేదో చెప్పబోయేలోపు శివకామి, “ఈ బుద్ధభగవానుని శిల్పాన్ని ఇంత పెద్దదిగా చెక్కినందువల్ల ఎంత ఉపయోగంగా ఉందో మరి!” అన్నది.

“అందుకే మహాయాన సిద్ధాంతాన్ని స్థాపించిన నాగార్జున భిక్షువును నేను వేనోళ్ళ పొగడుతున్నాను" అన్నారు నాగనంది భిక్షువు.

**బౌద్ధమతం** స్థాపించిన చాల కాలం వరకు బుద్ధభగవానుని శిల్పాలు చెక్కడంగాని, చిత్రాలను గీయడంగాని ఆపివేయబడివుండేది. మన ఈ కథ జరిగిన సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం నాగార్జున భిక్షువు అన్న మహాత్ములు ఉద్భవించి మహాయాన సిద్ధాంతాన్ని స్థాపించారు. ఉత్తరదేశాన నలందాలో ప్రసిద్ధ బౌద్ధమఠంలో ప్రధాన భిక్షువుగా ఉండి దేశమంతా తిరిగి, వాగ్యుద్ధంలో జయించి మహాయాన సిద్ధాంతాన్ని స్థాపించారు. అక్కడక్కడా బౌద్ధవిహారాలను స్థాపిస్తూ వెళ్ళారు. ఆ యాత్రలో భాగంగా దక్షిణాన కృష్ణానదీతీరాన ఉన్న శ్రీపర్వతం మీద ఒక బౌద్ధ విహారాన్ని (బౌద్ధ మఠాన్ని) స్థాపించారు. అప్పటినుంచి శ్రీపర్వతం నాగార్జునకొండగా పేరుగాంచింది.

నాగార్జునులు స్థాపించిన మహాయాన మతం బుద్ధభగవానుని శిల్పాలను స్థాపించేందుకు, బుద్ధుని గుళ్ళను కట్టేందుకు అనుమతినిచ్చింది. ఇందువల్ల "నాగార్జున భిక్షువును పొగడుతున్నాను" అని నాగనంది భిక్షువు అన్న మాటకు అర్థం ఇప్పుడు విశదమవుతుంది కద?

నాగనంది భిక్షువు చెప్పింది పట్టించుకోక శివకామి, “నాన్నా! చక్రవర్తి వచ్చినప్పుడు వీరెందుకు దాక్కొన్నారు" అని తండ్రిని అడిగింది.

“అమ్మా! మన నాగనంది గురువులు రాజవంశస్థులను చూడనని వ్రతం పూనివున్నారని నీకు

తెలుసు కద? ఈ అబ్బాయి ఆయనతో వచ్చినందువల్ల..."

"నాన్నా! చక్రవర్తి, మహామల్లుగారు ఈయన్ని చూస్తే ఎంత సంతోషపడుతారు? ఒకటి గమనించారా? కుమార చక్రవర్తి చేతనున్నది ఈ అబ్బాయి శూలమే..."

నాగనంది భిక్షువు మళ్ళీ అడ్డొచ్చి, "అందులో ఆశ్చర్యమేముంది, శివకామి! ఇప్పుడు ఊళ్ళో పడివున్న విరిగిన కత్తులు, కటారులు, శూలాలనన్నిటిని సేకరిస్తున్నారు కద?" అన్నారు.

శివకామి ఆ భిక్షువును కాల్చేసేటట్లు ఒక్క చూపు చూసేసి, "నాన్నా! కుమార చక్రవర్తి ఈ వీరయువకుని శూలాన్నే చేతపట్టుకొని తిరుగుతున్నారట. శుద్ధవీరత్వాన్ని మెచ్చుకోవడంలో కుమార చక్రవర్తిలాగ ఎవరున్నారు? మీరు ఈయనను వెంటనే చక్రవర్తి సమక్షానికి తీసుకొని వెళ్ళాలి" అన్నది.

ఆయనర్ తడబడుతూ, "అలాగేనమ్మా! ఈ అబ్బాయి ఉత్తరానికి వెళ్ళి వచ్చిన తర్వాత తప్పక చక్రవర్తి సమక్షానికి తీసుకొని వెళతాను" అన్నారు.

చక్రవర్తి వచ్చినప్పుడు దాక్కోవలసివచ్చినందువల్ల కలిగిన అవమానభారంతోను, శివకామి పట్ల సహజంగా ఏర్పడ్డ సంకోచంవల్లను మనసు, దేహం కుంగివున్న పరంజ్యోతి ఇప్పుడు శివకామి తనను వెనకేసుకొని మాట్లాడడగా, లోనుంచి వెల్లువగా ఉప్పొంగిన భావాలు కట్టలు తెంచుకోగా శివకామిని కృతజ్ఞతతో చూసి, ఆయనర్‌వైపు చూసి, "అయ్యా! తమ కుమారి చెప్పినది నిజమే. కుమారచక్రవర్తి చేతనున్నది నా శూలమే అని నాక్కూడా అనిపించింది. దాన్ని మీరు నాకిప్పిస్తే చాల మంచిదవుతుంది. దూరప్రయాణం చేసేటప్పుడు చేత ఒక ఆయుధం ఉండాలి కద?" అన్నాడు.

అప్పుడు నాగనంది భిక్షువు మళ్ళీ అడ్డుపడి, "ఆయుధాలతో ఇప్పుడేం పని? నీకు ఎన్ని శూలాలు, ఈటెలు కావాలో చెప్పు, నేను సంపాదించి ఇస్తాను. ముఖ్యమైన కార్యం కాలేదు కద? గుర్రం, రాజముద్ర అడిగి తీసుకోవడానికి మరిచిపోయారు కద, ఆచార్యా!" అన్నారు.

"అది నా బాధ్యత. నెరవేరుస్తాను. రేపు చక్రవర్తి నన్ను మామల్లపురానికి రమ్మని ఆజ్ఞాపించారు. అక్కడే ఆయన్ని అడిగి గుర్రం, రాజముద్ర తీసుకొంటాను. ప్రయాణానికి తక్కిన ఏర్పాట్లన్నీ మీరు చేస్తారా?" అని అడిగారు ఆయనర్ శిల్పి.

"నాన్నా! ఈ అన్నయ్య చాల దూరం ప్రయాణం చేయబోతున్నాడా? ఎక్కడికి? ఎందుకు? నాకేమీ అర్థం కావడం లేదు" అన్నది శివకామి.

"నేనే పంపుతున్నాను, బిడ్డా! తొమ్మిదేళ్ళుగా రేయింబవళ్ళు నేను కంటున్న కల నెరవేరబోతూంది. శివకామి! ఈ ఉత్తమ బౌద్ధ భిక్షువు వల్ల అది నెరవేరబోతూంది!" అని ఆయనర్ శిల్పి సంభ్రమంగాను, ఉత్సాహంగాను చెప్పుకొచ్చారు.

శివకామి, "తొమ్మిదేళ్ళుగా మీరేం కల కంటూన్నారు? అదిప్పుడెలా నెరవేరబోతూంది?" అని మళ్ళీ అడిగింది.

"అజంతా గుహల్లోని అద్భుత, అపూర్వ చిత్రాలను గురించి నీకు ఎన్నో సార్లు చెప్పాను కదమ్మా? ఇన్ని వందల సంవత్సరాల తర్వాత కూడ అవి చెక్కు చెదరకుండ వినూత్నంగా ఎలా ఉన్నాయోనన్న రహస్యం తెలుసుకోవాలన్నదే నా కల. అది తెలుసుకొని రావడానికే ఈ అబ్బాయిని, నా ప్రియస్నేహితుని మేనల్లుడిని, ఉత్తరానికి పంపబోతున్నాను..."

"ఐదు వందల సంవత్సాలేమిటి? చిత్రాలు మాసిపోకపోవడమేమిటి? నేను నమ్మను!" అన్నది శివకామి.

"అవునమ్మా! నేను కూడ మొదట నమ్మలేదు. కానీ చూసిన తర్వాత తప్పక నమ్మే తీరవలసివచ్చింది" అన్నారు శిల్పాచార్యులు.

అది విని బౌద్ధ భిక్షువు, శివకామి ఒక్కసారే అమితాశ్చర్యానికి లోనయ్యారు.

"అంటే, మీరు అజంతా గుహలకు వెళ్ళి ఆ చిత్రాలను చూశారా? ఎప్పుడు? ఎలా?" అని ఉద్వేగంతో అడిగారు బౌద్ధ భిక్షువు.

"లేదు; అజంతా గుహలకు వెళ్ళలేదు. కానీ ఆ చిత్రాలను ఎలా రూపొందించారో అలాగే సిద్ధ పర్వతంలో చూశాను. గురుదేవా! మీరు కూడ ఆ సిద్ధుల కొండకు వెళ్ళారని చెప్పారు కద? అక్కడ ఏమేమి విచిత్రాలు చూశారు? చెబుతారా?" అని మిక్కిలి ఆతురతతో భిక్షువును అడిగారు ఆయనర్ శిల్పి.

"ఆహ్! గుర్తుకొస్తూంది. ఆ పర్వత గుహల్లో జైన తీర్థంకరుల సజీవ చిత్రాలను చూశాను. గుహ వాకిలికి ఇరువైపుల ఇద్దరు అప్సరసల అద్భుతమైన చిత్రాలను చూశాను. అంతటి అద్భుతమైన చిత్రాలను దక్షిణ తమిళనాడులో రచించగలిగిన చిత్రకారులు నాకు తెలిసినంతవరకు ఒక్కరే!" అన్నారు భిక్షువు.

"అది ఎవరని ఇప్పుడు తెలిసిందా?"

"అవును, తెలిసింది మీరేనని. కానీ అవి తక్కిన చిత్రాలకన్న భిన్నంగా ఉన్నాయి. వాటి పైభాగం ఏ మాత్రం మాసిపోకుండ ఇప్పటికీ కళకళలాడుతున్నాయి. కానీ వాటి కింది అర్ధభాగాలు మాత్రం రంగు మాసివున్నాయి. ఎందుకని అర్థం కాలేదు.." అన్నారు బౌద్ధ భిక్షువు.

"అవును. నిజమే. తొమ్మిదేళ్లలో మాసి పోయేవుంటాయి" అని దిగులుగా అన్నారు ఆయనర్ శిల్పి. అలా చెప్పి తడబడుతూ ఆ వృత్తాంతాన్ని అక్కడున్న తక్కిన ముగ్గురికీ ఇలా వివరించారు ఆయనర్ శిల్పి.

**పన్నెండు** సంవత్సరాల క్రితం మహేంద్ర పల్లవ చక్రవర్తి ఇంకా జైన/శ్రమణ మత అనుయాయిగా ఉన్నప్పుడు చోళదేశానికి యాత్ర వెళ్ళారు. ఆయనర్ శిల్పిని కూడ తమతో తీసుకొని వెళ్ళారు. అక్కడ ఉరయూరులో చోళరాజు ఆతిథ్యం స్వీకరించిన పిమ్మట సిద్ధపర్వతానికి వెళ్ళాము. అక్కడి గుహల్లో చిత్రించబడివున్న చిత్రాలను చూసి ఇద్దరూ అమితాశ్చర్యం పొందారు.

ఆ చిత్రాలను గీసిన మునివర్యులు అప్పుడు అక్కడే నివసిస్తున్నారు. ఆయనర్ శిల్పి ఆయనతో మాట్లాడి ఆ చిత్ర రహస్యాన్ని చెప్పమని వేడుకొన్నారు. అందుకు ఆయన అలాగేనని చెప్పి, ఆయనర్ గుహ వాకిలి పక్క ఇద్దరు అప్సరసల చిత్రాలను గీయాలని, వాటి పైభాగాన్ని తాము రంగరించి ఇచ్చే రంగుతో గీయాలని, కింది భాగాన్ని తమతో తెచ్చుకొన్న రంగుతో గీయాలని, మూడేళ్ళ తర్వాత వచ్చి వాటిని చూసి, చిత్రాల కింది భాగం రంగు మాసిపోయి, పైభాగం మాసిపోక, చెక్కు చెదరక ఉంటే ఆయనర్ శ్రమణ మతాన్ని ఒప్పుకోవాలని, ఒప్పుకొంటే తమ చిత్రాల రహస్యాన్ని చెబుతానని నిబంధన విధించారు.

అందుకు ఒప్పుకొని అలాగే ఆ అప్సరసల చిత్రాలను గీశారు ఆయనర్ శిల్పి. మూడేళ్ళ తర్వాత వెళ్ళి చూస్తే, చిత్రాల కింది భాగాలు రంగు మాసిపోయివున్నాయి. పైభాగాలు మాత్రం చెక్కు చెదరకుండ ఉన్నాయి. ఆయనర్ శిల్పి తమ ఓటమిని ఒప్పుకొన్నారు. ఆ మునివర్యుల కోసం వెదికి చూస్తే ఆయన కనిపించలేదు! విచారించి చూస్తే, మహేంద్ర  చక్రవర్తి జైనమతాన్ని విడిచి, శైవమతం స్వీకరించినందుకు చాల మంది జైన మునులు కోపగించి వారి సామ్రాజ్యాన్నే విడిచివెళ్ళిపోయారు. వారితోబాటు ఆ చిత్రాలను గీచిన మునివర్యులు కూడ వెళ్ళిపోయారట. కాబట్టి ఆయనర్ శిల్పి కోరిక తీరకనే మిగిలిపోయింది. కానీ ఆయన తమ కలను వదిలిపెట్టలేదు.

**పై వృత్తాంతాన్ని** విన్న బౌద్ధ భిక్షువు, "ఆయనర్‌గారూ! దిగులు పడకండి! ఈ వీర, ధీర యువకుని మూలంగా మీ కోరిక త్వరలోనే నెరవేరబోతూంది!" అన్నారు.

పరంజ్యోతి కూడ చాల ఉత్సాహంతో, "అవును, ఆచార్యా! ఆ చిత్రాల రహస్యాలను తప్పక తెలుసుకొనే వెనుదిరిగి వస్తాను!" అన్నాడు.

శివకామి మనసులో మాత్రం ఎన్నెన్నో ఆలోచనలు పొడసూపాయి. తండ్రిగారి ఆశయం నెరవేరి, ఆ చిత్రాల రహస్యం తెలిస్తే ఆయన ఎంత ఆనందిస్తారో తెలుసు. కానీ అది ఈ బౌద్ధ భిక్షువు ప్రేరేపణ వల్ల జరుగుతుండడం వల్ల ఇందులో ఏదైనా కుట్ర, కుతంత్రం ఉండగల అవకాశం ఉందా అన్న సందేహం కలిగింది శివకామికి. కాబట్టి పరంజ్యోతిని ఒంటరిగా కలుసుకొని హెచ్చరించాలని నిర్ణయించుకొంది.

~~~
~~~

# అధ్యాయం - 22

## శత్రుఘ్నుడు

**ఆయనర్ శిల్పి** గృహంనుంచి బయలుదేరిన మహేంద్ర పల్లవ చక్రవర్తి గుర్రాన్ని వేగంగా నడుపుకొంటూ వెళ్ళి తమ పరివారాన్ని చేరుకొన్నారు. అక్కడ గుర్రాన్ని ఆపి, ఆ కూటమిలోవున్న ఒకతని మీద తమ చూపులు సారించారు. అది అర్థం చేసుకొన్న ఆ వ్యక్తి ముందుకొచ్చి వినయంగా చక్రవర్తి ముందు నిలబడ్డాడు.

"శత్రుఘ్నా! నీకు శిల్పకళలో ప్రవేశముందా?" అని అతన్ని ప్రశ్నించారు చక్రవర్తి.

శత్రుఘ్నుడు తన ముఖంలో ఎటువంటి భావాలు చూపక, "లేదు, ప్రభూ!" అన్నాడు.

"అదేమి? నీకు కొంచెమైన శిల్పకళలో ప్రవేశముండాలి. అందుకు ఈ చోటుకన్న మించినది లేదు. ఆయనర్ శిల్పాచార్యుల శిష్యులు చేసే శిల్పకార్యాలను చూస్తూంటేనే చాలు."

"ఆజ్ఞ, ప్రభూ! ఇప్పుడే మొదలుపెడతాను"

"కొత్తగా శిల్పకళను నేర్చుకోవడానికి ఇక్కడికెవరైనా వస్తే వారిని కూడ నీవు గమనించాలి. కానీ వారు నిన్ను గమనించనవసరం లేదు."

"అలాగే" అని అతడన్నప్పుడు అతని కనుబొమలు కాస్త పైకి వెళ్ళాయి.

"మంచిది. శిల్పకళ గురించి ఏదైన కొత్తగా తెలుసుకొంటే వెంటనే వచ్చి నాకు తెలియజేయాలి."

ఇలా చెప్పేసి చక్రవర్తి తమ గుర్రాన్ని అక్కడినుంచి అతివేగంగా అడవి మార్గాన పరుగెత్తించారు, నరసింహవర్మ వెంటరాగా. వారి పరివారం వారి వేగాన్ని అందుకోలేక కాస్త వెనకబడవలసి వచ్చింది.

చక్రవర్తికి, శత్రుఘ్ననికి మధ్య జరిగిన సంభాషణ నరసింహవర్మకు అస్పష్టంగానే వినిపించింది. అది ఆయనకు ఆందోళనను కలిగించింది. శివకామి చెప్పినట్లు ఆయనర్ శిల్పి ఇంట ఆ యువకుడు కనిపించకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది, ఇప్పుడు చక్రవర్తి పల్లవ సామ్రాజ్యంలోనే అతి సమర్థుడైన గూఢచారిని ఆయనర్ శిల్పి ఇంటి మీద నిఘా వేసివుంచమని ఆజ్ఞాపించడం మహామల్లుకు అమితాశ్చర్యాన్ని కలిగించింది. ఇదంతా చక్రవర్తిని అడిగి సందేహనివృత్తి చేసుకోవాలని చూస్తున్నారు నరసింహవర్మ. కానీ చక్రవర్తి అతిముఖ్యమైన కార్యం ఉంటే తప్ప అంత వేగంగా, పరివారాన్ని వెనకే విడిచిపెట్టి ముందుకు వెళ్ళరని తెలుసు కాబట్టి, మౌనంగా అంతే వేగంగా చక్రవర్తి వెంట సాగారు నరసింహవర్మ.

అడవి దాటగానే కంచి నుంచి మామల్లపురానికి వెళ్ళే రాజబాట కనిపించింది. దాని వారగా ఒక పెద్ద కాలువ ప్రవహిస్తూంది. అందులో ఒకదాని వెంబడి ఇంకొకటిగా పడవలు కంచివైపు వెళుతున్నాయి. వాటిలో చాల ఓడలు వడ్లమూటలు రవాణా చేస్తున్నాయి.

విశాలమైన రాజబాటకు రెండువైపుల ఏపుగా పెరిగిన చెట్లు, తేటతెల్లని నీరు పారుతున్న కాలువ, ఆ కాలువలో తేలుతూ వెళుతున్న అందమైన పడవలు, కాలువకవతల చాల దూరం వరకు చెట్లు, వాటి వెంబడి చూస్తే దూరాన పచ్చని బయలు, అన్నీ కలగలిసి మనోహరంగా ఉన్న ప్రకృతి దృశ్యమది. ఆ కాలువలో వెళుతున్న పడవల్లో ఒకదాని నుంచి పడవ నడిపేవాడు పాడుతున్న పాట వినిపించింది:

తీయని నోటితో ఒక

వేణువును ఊది

తేనెలొలికిస్తున్నది

ఎవరే? ఓ చిలుకా!

ఎర్రతామర మోమున

చిరునవ్వులొలుకుతూ

తలపులే తెరలుగాకొన్నవాడు

ఎవరే? ఓ చిలుకా?

అని తీయని గొంతుతో పాడిన ఆ కమ్మని పాట పిల్లతెమ్మెరల మీద తేలుతూ వచ్చింది.

అటువంటి ప్రశాంత వాతావరణాన్ని భంగం చేస్తూ, “ఇది నిజమైన ప్రశాంతత కాదు, త్వరలోనే ఉరుములు, మెరుపులతో గాలివాన రాబోతూంది" అని ప్రకటిస్తున్నట్లు, ఆ పడవల మధ్యలో ఆయుధాలు ఎక్కించిన ఇంకొక పడవనుంచి తమ్మెటల మోత వినిపించసాగింది. ఆ పడవలో కత్తులు, కటారులు, శూలాలు, ఈటెలు మొదలైన యుద్ధసామగ్రి నింపివుంది.

అంతవరకు మౌనంగా నిలుచొని ఆ దృశ్యాన్ని వీక్షిస్తున్న చక్రవర్తి ఆ యుద్ధసామగ్రి నిండిన పడవను చూసి, పరిహాసం, విముఖత నిండిన గొంతుతో, “పల్లవ సామ్రాజ్యంలో యుద్ధసన్నాహాలు జరుగుతున్నాయన్నమాట!” అన్నారు. తర్వాత తమ పక్కనే నిల్చొన్న కుమార చక్రవర్తిని చూసి, “ఏదో అడగాలనుకొంటున్నావు కాబోలు!” అన్నారు.

“నాన్నా! మీకెలా తెలిసింది?” అని ఆశ్చర్యంతో అడిగారు నరసింహవర్మ.

“నీ ముఖమే నాకు తెలిపింది. ఇప్పుడే కద అభినయం, ముఖభావాల గురించి మాట్లాడి

వచ్చాము? నీవేమి అడగాలనుకొన్నావో దాన్ని నిస్సంకోచంగా అడుగు!" అన్నారు చక్రవర్తి.

"శతృఘ్నుని ఎక్కడికి పంపారు?"

"ఆయనర్ శిల్పి ఇంటికి"

"ఎందుకని?"

"గూఢచారిని మరింకెందుకు పంపుతాము? వేగు తెలుసుకొని రావడానికే కద?"

"ఏమంటున్నారు, నాన్నా! ఆయనర్ శిల్పి ఇంటిమీద నిఘా వేసివుంచడానికి అవశ్యకత ఏముంది?"

"యుద్ధకాలంలో సర్వజాగరూకతతో ఉండాలి, మహామల్లా! ఇలాంటి సమయాల్లో కావిదుస్తుల్లో శత్రువుల గూడచారి దాగివుండవచ్చు..."

నరసింహవర్మ అదిరిపడి, "ఆః! ఇదేమి? ఆయనర్ శిల్పి మీకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారా? నేను నమ్మలేకున్నాను!" అన్నారు.

"ఆయనర్ శిల్పి కుట్ర పన్నుతున్నారని నేనలేదే? ఆ పరమసాధువు మన కోసం ప్రాణాలను కూడ ఇస్తారు కద?"

మహామల్లు కాస్త నెమ్మదిగొని, "మరి ఆయన ఇంటికి గూఢచారి నిఘా ఎందుకు?" అని అడిగారు.

"కల్లాకపటం తెలియని ఆ సాధు శిల్పి ఇంట శత్రుగూడచారులు దాగివుండవచ్చు కద?"

"ఆయనర్ శిల్పి ఇంట గూఢచారులా? తమకెలా తెలిసింది? నాకెవ్వరూ కనిపించలేదే?"

"మహామల్లా! రాజ్యాంగ నిర్వహణలో ఉన్నవారికి ఎప్పుడూ కళ్ళు, చెవులు తెరిచేవుండాలి. యుద్ధకాలంలో ఇది చాల అవసరం. అయనర్ శిల్పి ఇంట మనం ఉన్నప్పుడు నీ కళ్ళేం చేస్తూన్నాయి?"అని అడుగుతూ చక్రవర్తి నరసింహవర్మ ముఖాన్ని ఎగాదిగా చూశారు.

అక్కడున్నప్పుడు తమ కళ్ళు శివకామి కళ్ళతో కంటిబాసలో మాట్లాడుతూ ఉండిపోయిన విషయం గుర్తొచ్చి కుమార చక్రవర్తి లేతముఖం సిగ్గుతో ఎర్రబారింది. అదే సమయాన మునుపటి కన్న ఇంకాస్త దూరం నుంచి పడవ నడిపేవాడి కమ్మని పాట మళ్ళీ వినవచ్చింది.

~~~
~~~

# అధ్యాయం - 23

## రాజహంస

**నరసింహవర్మ** సిగ్గుపడడం గమనించి, తనకు ధైర్యం చెప్పే ఉద్దేశంతో చక్రవర్తి ఇలా అన్నారు: "నరసింహా! ఆయనర్ శిల్పి గృహంలోని అపూర్వమైన అద్భుత శిల్ప, చిత్రకళాఖండాలను చూసి ఎవరైన మైమరచిపోవడం సహజమే. నేను కూడాను. కానీ ఈరోజు అక్కడికి వెళ్ళేముందే నాకు కలిగిన ఒక సందేహంవల్ల చాల అప్రమత్తంగా ఉండి, సునిశితంగా గమనించాను..."

నరసింహవర్మ ఇప్పుడు తనని కాస్త సంభాళించుకొని, "అలా గమనించినందులో మీరేం చూశారు, నాన్నా?" అని చక్రవర్తిని అడిగారు.

"ఈ రోజు శిల్పాచార్యుల ప్రవర్తనలో నీకేమీ మార్పు కనిపించలేదా?"

మహామల్లు మౌనందాల్చారు.

"ఆయన చూపులు మాటిమాటికి ఆ బుద్ధవిగ్రహం వైపు వెళ్ళడం గమనించలేదా?"

ఇది విని నరసింహవర్మ ఆశ్చర్యంతో విప్పారాయి.

"మనం బుద్ధవిగ్రహం చెంతకు వెళ్ళగానే ఆయన తడబడడం కూడ నీవు గమనించలేదా?"

నరసింహవర్మ అదిరిపడి, "నాన్నా! ఒకవేళ ఆ బుద్ధవిగ్రహం వెనక ఎవరైనా దాక్కొనివున్నారా?" అని అడిగారు.

"అవును, నరసింహా! ఇద్దరు దాక్కొనివున్నారు. ఆరోజు రాత్రి రాజవిహారం వద్ద ఒక బౌద్ధభిక్షువును, ఒక యువకుని చూశాం కద, ఆ ఇద్దరే! కానీ దాక్కొనే కళలో వారు ఆరితేరలేదు..."

"ఇప్పుడు అర్థమవుతోంది, మనం ఆయనర్ శిల్పి ఇంట ఎందుకంత సమయం వెచ్చించామని" అన్నారు నరసింహవర్మ. అందుకు చక్రవర్తి ఏమీ బదులివ్వక కాలువ పడమటి దిక్కువైపు చూశారు.

ఉన్నట్లుండి, "నాన్నా! నేను మళ్ళీ ఆయనర్ శిల్పి ఇంటికి వెళ్ళి రావాలని కోరుకొంటున్నాను" అన్నారు నరసింహవర్మ.

"ఎందుకని, నరసింహా?"

"ఆ యువకుని చూసి, ఈ శూలాన్ని ఒప్పజెప్పాలి. బౌద్ధభిక్షువు వెంట ఆనాడు మనం చూసిన యువకునిదే ఈ శూలమని మీరు చెప్పారు కద?"

“ఆరోజు ఊహించిచెప్పాను; ఈరోజు నిజమని తేలింది. కానీ ఆ యువకునికి ఇక ఈ శూలం అవసరం లేదు, నరసింహా! అదిగో ఆ వెళుతున్న ఆయుధాల పడవలో దీన్ని పడేయవచ్చు!”

“ఏల, నాన్నా?”

“పరంజ్యోతి ఆయనర్ శిల్పి వద్ద శిల్ప కళ నేర్చుకోబోతున్నాడు. అందుకే.”

"పరంజ్యోతి! పరంజ్యోతి! ఆ వీరయువకుని నా ప్రాణస్నేహితునిగా చేసుకోవాలని ఎంతగానో కోరుకొంటున్నాను!”

“అది సాధ్యంకాదని నేను చెప్పలేదే!”

“ఎలా నెరవేరుతుంది? మన పగవారి గుఢచారులతో మనం ఎలా స్నేహం కలుపుకోగలం?”

“ఆ కుర్రవాడు గూఢచారి అని నేను చెప్పలేదే!”

“మరి ఎందుకని అతడలా దాక్కొన్నాడు?”

“ఆ యువకుడు అమాయకుడు, నిర్దోషి. అతన్ని తోడుతీసుకొని ఆ దొంగ సన్యాసి ఏదో కుట్ర పన్నుతున్నాడని అనిపిస్తూంది. వాతాపి రాజ్యపు మహా చతురుడైన గూడచారి ఆ భిక్షువు అని నేను ఊహిస్తున్నాను!”

“నాన్నా! కొన్నిసార్లు మీ నెమ్మది పోకడ నాకు చాల ఆశ్చర్యాన్ని కలిగిస్తూంది.”

“దేని గురించి చెబుతున్నావు, నరసింహా?”

“ఆ రోజు రాత్రే మీరా బౌద్ధభిక్షువు మీద సందేహంగొన్నారు. వెంటనే ఎందుకు పట్టి బంధించి చెరలో వేయలేదు? ఎందుకు బయట వదిలేసి చోద్యం చూస్తున్నారు?”

“ఆ రాత్రి చెరపట్టివుంటే పల్లవ సామ్రాజ్యానికి వచ్చిన ఒక పెద్ద ప్రమాదం నాకు తెలియకనే పోయేది...”

“పెద్ద అపాయమా?” అంటూ నరసింహవర్మ ఆతురతతోను, కంగారుతోను చక్రవర్తిని చూశారు.

“అవును; ఆ రాత్రి మనం వారిద్దరిని రాజవిహారంలో చూశాము; మరుసటి రోజు వారు రాజ విహారంలో కానరాలేదు; కానీ వారు ఏ కోట వాకిలినుంచి కూడ బయటికి వెళ్ళినట్లు తెలియలేదు కద?”

“అవును, నాన్నా!”

“కోట నుంచి బయటికి వెళ్ళేందుకు ఏదో దొంగదారి ఉండాలని సందేహించాను; ఆ దొంగదారి ఎక్కడుందని కాసేపటికి మునుపే తెలిసింది.”

“దాని గురించి ఆలోచిస్తున్నందువల్లే గుర్రాన్ని అంత వేగంగా నడుపుకొంటూ వచ్చారా?”

చక్రవర్తి మౌనందాల్చారు.

“దొంగదారి ఎక్కడుంది, నాన్నా?”

“రాజవిహారంలో బుద్ధభగవానుని శిల్పం వెనక చూడాలి, నరసింహా!”

నరసింహవర్మ చక్రవర్తి మేధాపటిమను చూసి సంభ్రమాశ్చర్యంగొని నిలువగా, చక్రవర్తి, “అదిగో, రాజహంస!” అని పశ్చిమదిక్కుగా చూశారు. కంచివైపునుంచి కాలువ వెంబడి మూడు పడవలు రావడం కనిపించింది. వాటిలో మధ్యనున్న పడవ రాజహంస ఆకారంలో ఉంది. అందులో బంగారు సింహాసనం, దాని వెనక విశాలమైన వెండి గొడుగు అమర్చబడివున్నాయి. అన్నిటికన్న పైన పల్లవసామ్రాజ్యపు వృషభ పతాకం ఎగురుతూంది. మొదటి పడవలోను, 'రాజహంస'లోను పడవ నడిపేవారు తప్ప ఇంకెవ్వరూ లేదు. కానీ మూడవ పడవలో పలువురు ఆసీనులైవున్నారు.

“ఆహా! మంత్రిమండలి వస్తున్నారే! వారిని మీరు రమ్మన్నారా?” అన్నారు నరసింహవర్మ.

“అవును; ఈ రోజు ఓడరేవులో మంత్రి మండలి సమావేశం కాబోతూంది. అంతకు ముందు నేను నీకు కొన్ని విషయాలు చెప్పబోతున్నాను; దానితోబాటు నీనుంచి ఒక వాగ్దానం కోరబోతున్నాను!” అన్నారు చక్రవర్తి.

నరసింహవర్మ అదిరిపడ్డారు. ఆయన మనసు దోచుకొన్న శివకామి తామర కొలను గట్టున తమను అడిగి ఒక మాట తీసుకొని ఒక ముహూర్తకాలం కూడ కాలేదు. ఇంతలో ఆయన ప్రేమకు, భక్తికి పాత్రులైన తండ్రి కూడ మాటివ్వమని అడుగుతున్నారు!

ఇలా నరసింహవర్మ ఆలోచిస్తుండగానే ఆ మూడు పడవలు వారిని సమీపించాయి.

~~~
~~~

# అధ్యాయం - 24

## వాగ్దానం

**చక్రవర్తి** వెనుక కాలినడకన వచ్చిన రాజపరివారం ఇంతలో కాలువ గట్టువద్దకు వచ్చి చేరారు.

వెంటనే పడవలనుంచి, కాలువ గట్టునున్న రాజపరివారం నుంచి వందిమాగధుల జయఘోషలు - శంఖనాదాలు, జయభేరులతో - దిక్కులు దద్దరిల్లేలా లేచాయి: "మహా రాజాధిరాజ రాజ మార్తాండ త్రిభువన చక్రవర్తి గుణపర మహేంద్ర చక్రవర్తి! జయహో! కుమార చక్రవర్తి మహామల్లు! జయహో!"

రాజపరివారం మొదట వచ్చిన పడవలో ఎక్కి అందరూ ఆసీనులైనారు. చక్రవర్తి, నరసింహవర్మ తమ గుర్రాలను అశ్వపాలురకు ఒప్పజెప్పి 'రాజహంస'లోకెక్కి వెండిగొడుగు కింద స్వర్ణ సింహాసనంమీద ఆసీనులైనారు.

పడవలు మూడూ నదీముఖద్వారంవైపు సాగాయి.

జయఘోషలు, వాద్యఘోషలు ఆగిన తర్వాత చక్రవర్తి తమ కుమారుని చూసి, "నరసింహా! నేను నిన్ను మాటివ్వమని అడిగినప్పుడు నీవు ఉత్తరమివ్వక మౌనందాల్చడం అర్థం చేసుకోగలను. ఎందుకంటే నేను నిన్నలా అడగడమే నీకు ఒక కొత్త వింతగా తోచివుంటుంది. ముఖ్యంగా, రాజ్యాంగంలో ఉన్నవారు విషయమిది అని తెలుసుకోకుండ మాటివ్వకూడదు" అన్నారు.

అందుకు నరసింహవర్మ, "తండ్రీ! నేనది ఆలోచించలేదు. మీరు నాకు తండ్రి మాత్రమే కాదు, చక్రవర్తి కూడాను. కాబట్టి మీరు నన్ను ఏం చేయమని ఆజ్ఞాపించినా శిరసావహించి నెరవేరుస్తాను. అది నా కర్తవ్యం!" అన్నారు ఉద్వేగంతో.

చక్రవర్తి కూడ భావోద్వేగంతో కాసేపు మౌనందాల్చి, తర్వాత కుమార చక్రవర్తిని చూసి ఇలా అన్నారు: "పల్లవ సింహమా! నేనెంతటి అయిష్టమైన ఆజ్ఞ వేసినా అది నీవు నెరవేరుస్తావన్న నమ్మకం నాకుంది. కానీ ఈ కార్యం ప్రాముఖ్యతనెంచి నీ దగ్గర మాట తీసుకోవాలని తలచాను. దానికి మునుపు నేను నీకు కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పి తీరాలి. ఎల్లుండి నేను ఉత్తరదిశగా యుద్ధస్థలానికి వెళ్ళబోతున్నాను. ఎప్పుడు తిరిగివస్తానని చెప్పలేను..."

"నాన్నా! ఏమంటున్నారు? యుద్ధరంగానికి వెళుతున్నారా? నన్నిక్కడ వదిలిపెట్టి?" అని ఆవేశంతో అన్నారు నరసింహవర్మ.

"నేను చెప్పవలసిందంతా చెప్పేస్తాను. తర్వాత నీ ప్రశ్నలడుగు. జవాబు చెబుతాను" అని

చక్రవర్తి చెప్పగానే, కుమార చక్రవర్తి మౌనందాల్చారు.

తర్వాత చక్రవర్తి ఇలా వివరించారు: "పురాతనమైన ఈ పల్లవ సామ్రాజ్యంలో యుద్ధం వచ్చి చాల కాలమైంది. పాతికేళ్ళ క్రితం నేనీ రాజ్యభారాన్ని తీసుకొన్నాను. అప్పటినుంచి ఎటువంటి యుద్ధం రాలేదు. నా తండ్రి సింహవిష్ణు మహారాజు కాలంలో కూడ పెద్ద యుద్ధమేదీ రాలేదు. పాండ్యులకు, చోళులకు మధ్య కలహం వచ్చినప్పుడు పాండ్య, చోళవంశ సంకర జాతిని సమూలంగా తుడిచేసి చోళరాజును ఉరయూరు సింహాసనం మీద కూర్చోండబెట్టారు. ఆ తర్వాత పల్లవసైన్యానికి పనే లేకపోయింది! ఇప్పుడే నా కాలంలో యుద్ధం వచ్చివుంది. దీన్ని నా ఇష్టప్రకారం నడిపించేందుకు మంత్రిమండలి అనుమతి కోరబోతున్నాను. నీవు కూడ అనుమతినివ్వాలి. గెలుపో, ఓటమో అది నాతోనే పోనివ్వనీ. నీవందుకు భాగస్వామివి కానవసరంలేదు..."

ఇంతవరకు మౌనంగా ఉన్న కుమార చక్రవర్తి ఇప్పుడు అడ్డుపడి, "నాన్నా! ఓటమి అన్న మాట ఎందుకంటున్నారు? యుద్ధంలో మనం పొందేది విజయమో, వీరమరణమో మాత్రమే కద? అందులో నాకు ఎలా భాగం లేకపోతుంది?" అని అడిగారు.

"వీర పల్లవ కులానికి తగిన మాటన్నావు, నరసింహ! విజయం లేదా వీరమరణం మన కులధర్మం. కానీ ఇద్దరూ ఒకేసారి వీరమరణాన్ని వరించనవసరం లేదు! ఒకరు చేసిన తప్పును సరిదిద్దేందుకు ఇంకొకరు ఉండాలి కద? ఒకరి కోసం ఇంకొకరు పగ తీర్చుకోవడానికి ఉండాలి కద?"

"నాన్నా! యుద్ధస్థలం నుంచి ఏదో చాల చెడ్డవార్త వచ్చివుండాలి. అందుకే మీరిలా మాట్లాడుతున్నారు!"

"అవును, బిడ్డా! చెడ్డవార్తే వచ్చివుంది! గంగపాడి సైన్యం పులకేశికి లొంగిపోయింది. నరసింహ! వాతాపి సైన్యం ఉత్తరపెన్నవైపు అతివేగంగా వస్తూంది."

"అంతే కద, నాన్నా! జవసత్వాలుడిగి నీతినియమం కోల్పోయినవాడి నుంచి అది మనం ఎదురుచూడదగినదే. అందువల్లనేమి? ఉత్తరపెన్న తీరాన మన సైన్యం సిద్ధంగా ఉంది కద? వేంగి రాజ్యం నుంచి నా మామ పెద్ద సైన్యంతో బయల్దేరి వస్తున్నాడు కద?"

"నరసింహ! వేంగి సైన్యం మనకు అక్కరకు రాదు. పులకేశి సోదరుడు విష్ణువర్ధనుడు పెద్దసైన్యంతో వేంగి వైపు వెళుతున్నాడు."

"ఆహ! వాతాపి సైన్యం అంత పెద్దదా? మనం మాత్రం ఎందుకు...?" అని చెప్పి ఆపేసినప్పుడు మహామల్లు గొంతులో ఆశాభంగం ధ్వనించింది.

"అది నా తప్పే, నరసింహ! నా జీవితంలో ఇటువంటి యుద్ధం వస్తుందని నేను ఎదురుచూడనే

లేదు. కాలాన్నంతా చిత్రం, శిల్పం, కవిత్వం అంటూ కళాపోషణకు వెచ్చించేసి సామ్రాజ్యరక్షణను మరిచాను..."

"అందువల్లనేమి, నాన్నా! ఇప్పుడే కద ఆయనర్ శిల్పి చెప్పారు? ప్రపంచంలో ఎందరో చక్రవర్తులు వస్తున్నారు, మరుగవుతున్నారు. లోకం వారి పేర్లను కూడ మరిచిపోతూంది. కానీ తమ పేరును లోకం ఎన్నటికీ మరువజాలదు!"

"అయినా కూడ, ఈ యుద్ధంలో మనం విజయం సాధించకపోతే మామల్లపురంలోని ఆ మహత్తరమైన శిల్పాలు మన అవమానానికి చిహ్నాలుగా మాత్రమే నిలిచివుంటాయి."

"ఏనాడూ లేదు; యుద్ధంలో ఓడిపోయి, ప్రాణాలు దక్కించుకొని వెనుదిరిగి వస్తేనే కద మీరు చెబుతున్నది జరుగుతుంది? యుద్ధరంగంలో వీరమరణానికి సిద్ధంగా ఉన్నప్పుడు అవమానానికి, నిందకు ఎందుకు భయపడాలి?" అని ఆవేశంతో అన్నారు మహామల్లు.

"చివరికి యుద్ధరంగంలో వీరమరణం ఉండనే ఉంది. అంతకు మునుపు పగవారిని సమూలంగా నాశనం చేయాలి కద? అది అసాధ్యం కాదు; అవకాశం మాత్రమే కావాలి. వాతాపి రాజు యుద్ధతంత్రాలలో ఆరితేరినవాడు, నరసింహా! అయినా కూడ చివరికి వాడిని మట్టుపెట్టి మనం విజయమాలను ధరించడం తథ్యం. అందుకు నీ పూర్ణసహకారం నాకు కావాలి."

నరసింహవర్మ గద్గదస్వరంతో, " నాన్నా! మీరు నన్ను సహాయం కోరాలా? మీరు నా ప్రీతికి పాత్రులైన తండ్రి మాత్రమే కాదు; నా మనసు, దేహం మీద సర్వాధికారమున్న రాజులు; మీరెంతటి కఠినమైన ఆజ్ఞ విధించినా కూడ, శిరసావహించి నేరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నాను!" అన్నారు.

చక్రవర్తి కాసేపు మౌనందాల్చి, ఓడరేవు వైపు తమ దృష్టిని సారించారు. ఆ దిశనుంచి వస్తున్న పడవల మీద వృషభపతాకాలు ఎగురుతున్నాయి. దక్షిణదిశగా చాలదూరం వరకు విస్తరించిన పెద్ద పెద్ద గుండ్రాళ్ళు కానవచ్చాయి. వాటికవతల మామల్లపురం కానవచ్చింది. ఆ దృశ్యాన్ని కాసేపు శ్రద్ధతో గమనించిన తర్వాత, "నరసింహా! నేను ఎల్లుండి ఉత్తరదిక్కున యుద్ధస్థలానికి వెళుతున్నానని చెప్పాను కద? తిరిగివచ్చి మనం ఈ మామల్లపురంలో ప్రారంభించిన శిల్పకార్యాన్ని పూర్తి చేస్తామని నాకు నమ్మకం ఉంది" అన్నారు.

నరసింహవర్మ మౌనందాల్చగా, చక్రవర్తి ముందుకిలా అన్నారు: "ఒకవేళ నేను తిరిగి రాకపోతే నీవే ఆ కార్యాన్ని పూర్తిచేయాలి."

"ఈ మాటనేనా మీరు నా దగ్గర కోరారు?"

"లేదు. అది నాకు తెలుసు. నేనడుగుతున్నది వేరొకటి. ఒకవేళ నేను తిరిగి రాకపోతే నా

తరఫున నీవు పగ సాధించాలి. పల్లవ సామ్రాజ్యానికి ఏర్పడ్డ అవమానాన్ని తుడిచిపెట్టాలి!'

"అది నా కర్తవ్యం కద? కర్తవ్యాన్ని నెరవేర్చేందుకు వాగ్దానమెందుకు?"

"కుమారా! అలా పగ తీర్చుకోవడానికి నీవు నీ ప్రాణాన్ని భద్రంగా కాపాడుకోవాలి."

నరసింహవర్మ మళ్ళీ మౌనందాల్చారు. ఇంకా ఏదో రాబోతోందని దిగులుతో ఎదురుచూడసాగారు.

"బిడ్డా! ఐదు వందల సంవత్సరాలుగా వస్తున్న ఈ పల్లవ కులం ఇంకా ముందుకు కొనసాగేలా చూడడం నీవల్లే సాధ్యం. నీ దగ్గరనుంచి నేనడిగే మాట ఇదే: నేను తిరిగి వచ్చేంతవరకు, లేక నేను తిరిగి రావడం అసాధ్యం అని నిర్ధారంగా తెలిసేవరకు, నీవు కంచి కోటను విడిచి బయటకు రాకూడదు. అలా అని నా చేతిలో చెయ్యేసి ప్రమాణం చేయి!" అంటూ తన కుడి చేతిని ముందుకు చాచారు మహేంద్ర చక్రవర్తి.

నరసింహవర్మ ఆయన చాచిన చేతిని తాకి, "అలాగే కానివ్వండి, నాన్నా! మీరు తిరిగి వచ్చేవరకు కంచి కోట లోపలే ఉంటాను!" అన్నారు.

అప్పుడు ఉన్నట్లుండి సముద్రంలో లేచిన హోరు కుమార చక్రవర్తి మనసులో ఉవ్వెత్తున లేచిన భావోద్వేగాలను ప్రతిబింబించేటట్లు వినవచ్చింది.

~~~
~~~

# అధ్యాయం - 25

## కడలి ఇచ్చిన బిడ్డ

**కొన్ని వేల** సంవత్సరాల క్రితం కంచి రాజ్య పురాతన రాజవంశం సంతతి లేక అంతరించింది.

"రాజు లేని రాజ్యం నశించిపోతుంది కద! ఏలిక లేని రాజ్యంలో ప్రజలు ఎనలేని కష్టాలకు లోనవుతారు!" అని పెద్దలు చాల వాపోయారు.

అప్పుడు దయామయుడైన ఒక మహాత్ముడు ప్రజలనుద్దేశించి, "దిగులు పడకండి; కంచి సామ్రాజ్యానికి రాజును కడలి ప్రసాదిస్తుంది! ఇది నా కలలో చూశాను!" అన్నారు.

అప్పటినుంచి ఆ సామ్రాజ్యపు సముద్రతీరం పొడవునా కళ్ళల్లో ఒత్తులేసుకొని కాపలా కాయసాగారు.

ఒకరోజు సముద్రతీరం వారగా ఒక ఓడ వచ్చింది. అది ఏ దేశానికి చెందినదో ఎక్కడినుంచి వస్తూందో తెలియలేదు. తీరాన ఉన్నవారు చూస్తూండగానే ఉన్నట్లుండి విపరీతమైన సుడిగాలి వీస్తూంది. ప్రళయ కాలం వచ్చినట్లు సముద్రం అల్లకల్లోలమౌతూంది. తీరం దగ్గరికి వచ్చేసిన ఆ ఓడ అటూ ఇటూ ఊగిసలాడుతూంది. చూస్తూండగానే దాని తెరచాప స్తంభాలు తునాతునకలవుతున్నాయి!

అయ్యో! ఏమీ వైపరీత్యం! ఆ ఓడ సుడులు తిరిగి తిరిగి తలకిందులైపోయిందే! అందులో ఉన్నవారి ఆక్రందనలు వినిపిస్తున్నాయి!

ఓడ తలకిందులై సముద్రంలో మునిగిందో లేదో, మరుక్షణం మీట నొక్కినట్లు సుడిగాలి ఆగిపోతుంది. అంతవరకు గట్టున నిలబడి ఆందోళనతో ఓడను చూస్తున్న ప్రజలు ఇప్పుడు ఆదుర్దాగా ముందుకొచ్చి, తమ తమ పడవలను సముద్రంలోకి తోసి, ఓడను సమీపిస్తున్నారు, ఓడలో ఎవరైన ఇంకా బ్రతికివుంటే వారిని కాపాడి ఒడ్డుకు తీసుకొని రావడానికి.

వారిలో ఒక అదృష్టశాలి ఉన్నాడు; అదృష్టం అతన్ని వెతుక్కొంటూ వస్తూంది. కానీ అది అతని అదృష్టం మాత్రమే కాదు, రాజ్యమంతటిదీను. ఆహా! ఏమది? నీలి కడలిలో సూర్యుడే తేలుతున్నాడా? లేదు, లేదు! ఒక పసిపాప అది! బల్లమీద దానితో చేర్చి ఒక పట్టువస్త్రంతో కట్టబడివుంది. ఆ బిడ్డ ముఖం ఎంత తేజోమయంగా ఉందీ! కానీ బిడ్డ బతికే ఉందా, లేక...? ఆహా! ఉంది, ప్రాణముంది! సుడిగాలి ఆగిన తర్వాత ప్రశాంత సముద్రంలో మెత్తగా లేస్తున్న చిన్న అలల నీటిబిందువులు ముఖం మీద పడగా, ఆ బిడ్డ కిలకిలా నవ్వుతూంది!

ఆ అదృష్టశాలియైన పడవ నడిపేవాడు ఆపుకోలేని ఆతురతతో బల్లను సమీపించి, బిడ్డ కట్లు విప్పి తన ఎదకు హత్తుకొంటున్నాడు. బిడ్డకు ఆతని ఎదమీది వెంట్రుకలు గుచ్చుకొని కేరుమని ఏడుస్తూంది. నావికుడు వెంటనే పడవలోకి చూసి అక్కడ పొద్దున పడవలోని సరుకులను కట్టేందుకు తెచ్చిన దొండతీగలు కనిపించగా, వాటిని ఆకుల సమేతంగా పొత్తికలాగ సర్ది, బిడ్డను అందులో భద్రంగా పడుకోబెడుతున్నాడు. బిడ్డ పడవ నడిపేవాడిని చూసి చిరునవ్వు నవ్వుతూంది!

గట్టును సమీపించేటప్పుడే కుతూహలంతో పెద్దగా కేకలేయడం చూసి, గట్టునున్నవారు పడవలో ఏదో విశేషముందని గ్రహిస్తున్నారు. పడవ తీరం చేరగానే జనాలు గుంపులు గుంపులుగా వచ్చి చేరి, పడవ చుట్టూ మూగుతున్నారు. దీర్ఘ దర్శనం చెప్పిన మహాత్ములు కూడ వస్తున్నారు. బిడ్డను చూసి, "నేను కలలో చూసిన రాబోయే కంచి ఏలిక వీడే. వీడి సంతతి కంచి సింహాసనాన్ని అధిష్టించి వెయ్యేళ్ళు ఏలబోతున్నారు!" అని చెబుతున్నారు. ప్రజలు జేజేలు పలుగుతున్నారు.

కడలి ఇచ్చిన బిడ్డ కాబట్టి 'ఇళంతిరైయన్' అని ఆ బిడ్డకు నామకరణం చేస్తున్నారు ఆ పెద్దాయన. "తొండై[2] ఆకుల మీద శయనిస్తూ వచ్చినందువల్ల తొండైమాన్ అన్న పేరు కూడ పొందికగా ఉంటుంది. వీడి వల్ల ఇక కంచి రాజ్యం తొండైమండలం అని పిలువబడుతుంది" అని ఆయన దీర్ఘ దర్శనం చెబుతున్నారు.

ఉత్తరదేశ కవి ఒకరు, ఆ బిడ్డ లేతాకుల మీద శయనిస్తూ వచ్చినందువల్ల ఆ బిడ్డను 'పల్లవ రాయ' అని పిలుస్తున్నారు.

కవులెందరో వచ్చి కడలి తెచ్చిన పాప గురించి ఎన్నెన్నో అందమైన కవితలు చెబుతున్నారు.

**తర్వాత** వచ్చిన తమిళ కవులకు పల్లవ శిశువును సముద్రం ప్రసాదించిందని చెప్పేసి వదిలిపెట్టేసేందుకు మనసు రాలేదు. "కడలి ఇచ్చిన బిడ్డ నిజానికి తమిళనాడులో అతి పురాతనమైన చోళవంశ శిశువు. ఒకప్పుడు చోళవంశ రాకుమారుడొకడు సముద్రప్రయాణం చేసి మణి పల్లవం అనే దీవిని చేరుకొన్నాడు. ఆ రాజు కుమార్తెను ప్రేమించి పెళ్ళాడాడు. వారికి ఒక బిడ్డ కూడ పుట్టింది. తర్వాత ఆ రాకుమారుడు తన మాతృదేశానికి తిరిగి రాగోరి భార్యాబిడ్డలతో ఓడలో వస్తుండగా అది ప్రమాదానికి గురై రాకుమారుడు, అతని భార్యయైన మణిపల్లవ రాకుమారి మరణించారు. వారి బిడ్డ బతికి, మనకు 'కడలి ఇచ్చిన బిడ్డ'గా దొరికాడు" అన్నారు.

ఉత్తరభాషాపండితులేమో "పాండవుల గురువైన ద్రోణాచార్యుని కుమారుడైన అశ్వత్థామ వంశంలో వచ్చినవారే పల్లవులు!" అని అందుకు ఒక కథను కూడ సృష్టించారు.* (*రచయిత మాట:

---

2 తొండై అంటే తమిళంలో దొండ తీగ

చివరిగా, సమీప కాలంలో, అంటే 20 వ శతాబ్దపు ప్రధమార్ధ భాగంలో, భారత చరిత్ర పరిశోధనలో నిమగ్నులైన యూరోప్ పరిశోధకులు పల్లవులకు ఇచ్చిన గొప్పతనాన్ని దక్షిణభారతానికో, ఉత్తరభారతానికో ఆపాదించడానికి ఇష్టపడక, ఇండియాకు పశ్చిమోత్తర దిక్కునుంచి వచ్చిన అన్యదేశీయులే కంచి మహానగరాన్ని వెతుక్కొంటూ వచ్చి పల్లవులయినారని రాసి, దాన్ని పుస్తకాల్లో కూడ అచ్చువేశారు. మన పాత కవుల కథలన్నీ కల్పనలని కొట్టిపారేసిన మనవాళ్ళేమో, పైన పేర్కొన నవీన యూరోప్ పరిశోధకుల మాటనే వేదవాక్కుగా ఒప్పుకొని, 'పల్లవులు అన్యులే' అని సత్యప్రమాణం చేశారు. తమిళనాడుకు ఎన్నో విధాల పేరుప్రఖ్యాతులు తెచ్చిన పల్లవులను అన్యదేశీయులని చెప్పడం కన్న పెద్ద కట్టుకథ లోకంలో ఇంకేదీ లేదని చెప్పవచ్చు.)

పల్లవ కులం పుట్టుపూర్వోత్తరాలను గురించి పైన పేర్కొన్న వృత్తాంతాల్లో ఎంత నిజం, ఎంత కల్పన అని మనం ఇప్పుడు నిశ్చయంగా చెప్పలేము. అప్పటి పల్లవకుల సంజాతులకే అది సరిగ్గా తెలిసివుండలేదు.

కానీ ఒకటి మాత్రంగా నిశ్చయంగా చెప్పవచ్చు - ఆ కులంలో పుట్టినవారందరికీ సముద్రప్రయాణమంటే మహాప్రీతి. అది వారి రాజ్యంతో ఒకటిగా పెనవేసుకొంది. దక్షిణాన సముద్రంలో చాల దూరాన ఉన్న ఎన్నెన్నో ద్వీప, ద్వీపాంతరాల్లో పల్లవరాజుల అతిపురాతన వృషభపతాకం, పిదపకాలపు సింహపతాకం గంభీరంగా ఎగిరాయి.

పల్లవరాజుల పాలన నడిచినప్పుడు తమిళనాడుకు, విదేశాలకు మధ్య సముద్రవాణిజ్యం పెద్ద ఎత్తున జరిగేది. ఆ ఓడల్లో వచ్చే సరుకులను దించేందుకు, ఇక్కడినుంచి సరుకులను ఎక్కించేందుకు తమిళనాడు సముద్రతీరం వెంబడి ఎన్నో ఓడరేవులు ఏర్పడ్డాయి. వాటిలో మొదటిది మామల్లపురమవుతుంది.

మామల్లపురానికి ఉత్తరాన సముద్రం లోపలికి చొచ్చుకొని వచ్చి దక్షిణంగా వంపు తిరిగి మామల్లపురాన్ని ఇంచుమించు ఒక ద్వీపంగా మార్చేసింది. అందులో పల్లవ రాజులు సముద్రవాణిజ్యానికి కావలసిన గిడ్డంగులను, అదికారులు, పనివాళ్ళు ఉండేందుకు భవనాలను, ఇళ్ళను ఏర్పాటు చేశారు.

మహేంద్ర పల్లవ చక్రవర్తి ఆ మామల్లపురంలో రాజ్యాంగ అధికారులను, శిల్పులను నియమించి, వారికి తగిన వసతులను ఏర్పరిచారు. వాటితోబాటు రాజకులస్థులు వ్యాహ్యాళిగా వచ్చి చక్కగా కాలం గడిపేందుకు రాజగృహాలను కట్టించారు. చక్రవర్తి తన కుమారుని పేర ఆ నగరానికి మామల్లపురం అని పేరుపెట్టారు. అక్కడ వారిద్దరు సృష్టించిన శిల్పకళాఖండాల మధ్యే ఇప్పుడు ఉన్నారు.

# అధ్యాయం - 26

## రాతిగుళ్ళు

**సముద్రతీరానున్న** ఆ ద్వీపకల్పం దక్షిణభాగాన బయలు ప్రదేశంలో వరుసగా ఐదు పెద్ద గుండ్రాళ్ళు నిలిచివున్నాయి. వాటిలో మూడు గుండ్రాళ్ళలో వందలకొద్ది శిల్పులు పనిచేస్తున్నారు. ఆ రాళ్ళను తొలిచి గుళ్ళుగా మలుస్తున్నారు.

ఒక రాతిలో శిల్పాచార్యులు తొలుస్తున్న గుడి ఇంచుమించు పూర్తి కావస్తూంది - ప్రధాన మంటపం, గర్భగుడి, పైన విమానం మొదలైన నిర్మాణాలన్నీ చివరి మెరుగులు అందుకొంటున్నాయి. ఇంకొక రాతిలో ప్రధాన మంటపం పూర్తయింది; పార్శ్వమంటపాలు, గర్భగుడి ఇంకా మొదలవలేదు. మూడవ గుండ్రాయిలో ఆలయాన్ని మలిచేందుకు శిల్పాచార్యులు తొలి రూపురేఖలు గీస్తున్నాయి.

ఆ పెద్ద గుండ్రాళ్ళున్న బయలు ప్రదేశంలో అలాంటివే మరింకెన్నో గుండ్రాళ్ళున్నాయి. వాటినన్నిటిలో అద్భుత శిల్పకళాఖండాలను రూపొందించాలన్నదే మహేంద్ర పల్లవ చక్రవర్తి కంటున్న కల.

ఆ బయలు ప్రదేశానికి దక్షిణంగాను, పశ్చిమంగాను కనుచూపు మేర ఇసుక విస్తరించి, అక్కడక్కడా రాతిబండలు, ముళ్ళపొదలు కనిపిస్తున్నాయి.

కానీ ఆ ప్రదేశానికి ఉత్తరంగాను, పశ్చిమోత్తరంగాను చూస్తే పూర్తిగా భిన్నమైన దృశ్యం కనిపిస్తుంది - ఆకాశన్నంటే భవనాలు, వాటి మధ్య ఎత్తుగా పెరిగిన కొబ్బరి చెట్లు మనోహరంగా కనిపిస్తున్నాయి. ఇంకా వాటికవతల వందల కొద్ది ఓడలు, పడవలు, వాటి తెరచాపల శిఖరాన గంభీరంగా ఎగురుతున్న వృషభపతాకాలు ఆ కాలంలో పరాకాష్ఠనందుకొన్న పల్లవ సామ్రాజ్య సముద్రవాణిజ్యానికి ప్రతీకగా కానవస్తున్నాయి.

శిల్పకార్యాలు జరుగుతున్న గుండ్రాళ్ళ మధ్య ఒక నల్లటి రాతి ఏనుగు గంభీరంగా నిలబడివుంది. దాని వెనుక అంతకన్న ఇంకా గంభీరంగా అలంకరించబడ్డ పల్లవ సామ్రాజ్య పట్టపుటేనుగు వచ్చి నిలిచింది.

ఏనుగు మీద వచ్చిన పల్లవ చక్రవర్తి, ఆయన కుమారుడు కిందికి దిగి రాతి ఏనుగు సమీపాన నిలబడ్డారు. వారి మీద ఎండ పడకుండ వెండి చామరాన్ని పట్టుకొని వారి సేవకులు నిలబడ్డారు.

**ఇదే చోట** ఏడేళ్ల క్రితం మహేంద్ర పల్లవ చక్రవర్తి, ఆయన కుమారుడు వచ్చి నిలబడేవారు. కానీ అప్పుడు ఆ రాతిబండలు, గుండ్రాళ్ళన్నీ బోడిగా, బోసిగా ఉండేవి.

"నాన్నా! ఆ రాతిబండ నీడను చూడండి! ఏనుగులాగ లేదు?" అన్నాడు పల్లవ కులదీపమైన బాల నరసింహుడు.

అది చూసి చక్రవర్తి కుమారుడు చెప్పినట్లే ఉండడం గమనించి ఆశ్చర్య సంభ్రమాలతో కాసేపు బాహ్యస్పృహ వీడి అలాగే నిలుచుండిపోయారు. అలా తమ కుమారుడు ఒక్కొక్క రాతిబండని, గుండ్రాయిని చూసి, వాటి ఆకారాలు, నీడలు ఏనుగుల్లాగను, ఆలయాల్లాగను ఉండడం చూసి ఉత్సాహంతో తండ్రికి చూపడం, ఆయన మనసులో ఎన్నెన్నో చెప్పలేని మధురభావాలు ఉదయించడం జరిగింది. ఆయన తమ కుమారుని చూసి, "అవును, కుమారా! అవన్నీ నీవు చూసినట్లే ఉన్నాయి! మనం వాటిని అలాగే చెక్కించి రూపొందిద్దాం! ఆ ఐదు గుండ్రాళ్ళను ఐదు గుళ్ళుగాను, ఆ పెద్ద రాతిబండలను ఏనుగులుగాను, సింహాలుగాను, నందిగాను చెక్కిద్దాం! వేవేల సంవత్సరాల తర్వాత కూడ ఈ ఓడరేవుకు వచ్చే ప్రజలు ఈ అద్భుత కళాఖండాలను చూసి భ్రమించిపోతారు!" అన్నారు.

త్వరలోనే అనేక శిల్పులు అక్కడికి వచ్చి ఆ రాళ్ళను తొలిచి చక్రవర్తి కలగన్నట్లే వాటిని అద్భుత శిల్పరూపాలుగా సృష్టించసాగారు. అన్నేళ్ళు నిశ్శబ్దంగా ఉన్న ఆ సముద్రతీర ప్రదేశం ఇప్పుడు ఆ శిల్పుల ఉలుల శబ్దాలతో మారుమోగసాగింది.

అప్పుడు, ఏడేళ్ళ క్రితం ప్రారంభమైన శిల్పకైంకర్యం ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇప్పుడు అప్పటి గుండ్రాళ్ళు, రాతిబండలు ఆలయాలుగాను, సింహాలు, ఏనుగులు, వృషభాలుగాను రూపు దిద్దుకొంటున్నాయి.  ఈ రోజు మహేంద్ర చక్రవర్తి, మహామల్లు అదే చోట, శిల్పకళాఖండాలుగా రూపొందుతున్న ఆ గుండ్రాళ్ళ మధ్య నిలబడివున్నారు.

"నరసింహా! ఈ యుద్ధం వచ్చింది నాకు ఒక విధంగా సంతోషమే. కానీ అందువల్ల మనం ప్రారంభించిన ఈ మహాశిల్పకార్యం నా కాలంలో పూర్తిచేయగలనో లేదోనన్నదే నా దిగులు. ఉత్తరాన కన్యాకుబ్జంలో హర్షవర్ధన చక్రవర్తి ప్రతియేడు జరిపించే ఉత్సవాల గురించి నీకు తెలుసు కద?"

"తెలుసు, నాన్నా! ఆయన శివాపరమాత్మకు, సూర్య నారాయణమూర్తికి, బుద్ధ భగవానునికి మూడు గుళ్ళు కట్టించారు. ప్రతి సంవత్సరం ఆ మూడు ఆలయాల్లో ఉత్సవాలు జరిపిస్తారు. మూడు మతాలకు చెందిన ప్రజలు కూడ అక్కడికి వచ్చి ఆ ఉత్సవాల వేడుకల్లో పాల్గొని ఆనందిస్తారు అని విన్నాను."

"మహామల్లు! హర్షవర్ధనుడు ఈ పల్లవ రాజ్యంకన్న చాల పెద్ద సామ్రాజ్యాన్ని ఏలుతున్నాడు. ఆయన సంపద పల్లవ సామ్రాజ్య సంపద కన్న పదిరెట్లెక్కువ. ఆయన కీర్తి ఈ భరతఖండం దాటి ప్రపంచమంతా వ్యాపించింది. కానీ నా ఉద్దేశమే నెరవేరితే, ఇంత వరకు ఏ రాజు, చక్రవర్తిగాని, ఇక రాబోయే

ఏ రాజు, చక్రవర్తి కూడ అందుకోని కీర్తిశిఖరాలను మన పల్లవకులం అందుకోగలదు. హర్షవర్ధనుడు నిర్మించిన దేవాలయాలు ఇటుకలతోను, చెక్కలతోను కట్టబడినవి. నూరేళ్ళకు శిథిలమైపోతాయి. కానీ మనం నిర్మిస్తున్న ఈ రాతిగుళ్ళు వేవేల సంవత్సరాలకు కూడ చెక్కు చెదరకుండ ఉంటాయి..!"

"ఈ రాతిగుళ్ళలో ఏయే దేవతామూర్తులను ప్రతిష్ఠించబోతున్నారు, నాన్నా? శివపరమాత్మ, పార్వతీదేవి, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, చండికేశ్వరుడు మొదలైన పంచమూర్తులనే కద?"

"లేదు, నరసింహ! హర్షవర్ధనుని కన్న ఒకడుగు ముందుకేయబోతున్నాను. ఆయన, శైవమతాన్ని, వైష్ణవమతాన్ని, బౌద్ధమతాన్ని ఆదరించి ఆయామతాలకు మూడు ఆలయాలను కట్టించాడు. కానీ, ఈ తమిళనాడులో ప్రధానంగా ఉన్న నాలుగు పెద్ద మతాలకు నాలుగు గుళ్ళను కైంకర్యం చేయబోతున్నాను. ఒక కోవెలలో శివపార్వతులు వెలసివుంటారు. రెండవ గుడిలో విష్ణుమూర్తి, లక్ష్మీదేవి ప్రసన్నులైవుంటారు. మూడవ గుడిని బుద్ధభగవానుని పెద్ద విగ్రహం అలంకరిస్తుంది. నాల్గవ ఆలయాన్ని జైన మతాన్ని స్థాపించిన వర్ధమాన మహావీరులకు అర్పిస్తున్నాను...!" అని చెప్పగానే కుమార చక్రవర్తి అమితాశ్చర్యానికి లోనయ్యారు.

"అవును, నరసింహ! నేను జైనమతాన్ని వదిలి శైవమతాన్ని స్వీకరించిందే మన సామ్రాజ్యంలో మతసామరస్యాన్ని పెంపొందించేందుకే. శైవమతం తక్కిన అన్ని మతాలను ఆదరిస్తుంది. కానీ జైనమతం అలా కాదు. అందుకే ఆ మతంనుంచి వైదొలగి, శైవమతాన్ని స్వీకరించాను. మన సామ్రాజ్యంలోని నాలుగు ప్రధాన మతాలకు సమాన గౌరవాదరాలను ఒసగి పూజించాలన్నదే నా ఉద్దేశం. ఇదంతా బహిరంగం చేసేందుకు బౌద్ధులు, జైనులు నామీదగొన్న కోపం చల్లారే తరుణం కోసం వేచివున్నాను. అంతలో ఈ జైనమునులు తొందరపడి కార్యాన్నంతా చెడగొట్టేశారు..."

"జైనమునులు చెడగొట్టేశారా?!"

"అవును. వారివల్ల వచ్చిందే ఈ యుద్ధం. కంచినుంచి నలుదిక్కులా వెళ్ళిన జైనమునులు ఊరకే కూర్చోలేదు. మన చిరకాల స్నేహితులను కూడ మనకు శత్రువులుగా మార్చేశారు. ఈ గంగపాడి దుర్వినీతునికి పట్టం కట్టిందెవరనుకొన్నావు? నీ తాతగారైన సింహవిష్ణు మహారాజే. ఆ దుర్వినీతుడు ఇప్పుడు మన వంశపారంపర్య విరోధియైన చాళుక్యులతో చేరిపోయాడు. పులకేశి సైన్యశిబిరంలో జైన మహాకవి రవికీర్తి, దుర్వినీతుని గురువు పూజ్యపాదులు ఉన్నారట. లౌకిక జీవితాన్ని విడనాడి సన్యాసం తీసుకొన్న మునులు, అందులోను జీవహింస చేయమని వ్రతంపూనిన జైనమునులు యుద్ధరంగానికి రావడమంటే, ఆహ్! వారికి నా మీద ఎంతటి ద్వేషం కలిగివుండాలి?"

"అందువల్ల దిగులేమి, నాన్నా? త్రినేత్రుని కరుణ వల్లను, చక్రాయుధపాణియైన విష్ణుమూర్తి

దయవల్లను విజయం మననే వరించబోతుంది."

"జయాపజయాల గురించి నేనంతగా దిగులుపడడం లేదు. నా ఉద్దేశాన్ని నెరవేర్చే మార్గంలో ఈ యుద్ధం అడ్డొచ్చింది కద అనే నా దిగులు" అని చక్రవర్తి అన్నప్పుడు ఆయన గొంతు జీరవోయింది.

మహామల్లు కాసేపు మౌనందాల్చారు. తర్వాత, ""ఐదవ ఆలయంలో ఏ దేవుని ప్రతిష్ఠించబోతున్నారు, నాన్నా?" అని అడిగారు.

"విదేశాలలో ఒక కొత్త మతం ఉద్భవించిందని విన్నాను. ఆ మతప్రవక్త పేరు ఏసుక్రీస్తు. ఆ కొత్త మతం వివరాలు నాకింకా తెలియలేదు. తెలిసిన వెంటనే ఆ కొత్త మతదైవాన్ని ఐదవ గుడిలో స్థాపించాలని నా అభిమతం. కానీ అదంతా పగటికలగా మిగిలిపోతుందేమోననిపిస్తూంది."

మహేంద్రుని ఆలోచనాస్రవంతిని విని దిగ్భ్రమించిన నరసింహవర్మ, "ఎందుకు పగటికలలుగా మిగిలిపోవాలి? యుద్ధం వల్ల ఎందుకు ఈ శిల్పకార్యం ఆగిపోవాలి?" అని అడిగారు.

"ఆగిపోకూడదన్నదే నా ఆశ. యుద్ధం ముగిసేలోపు ఈ ఐదు ఆలయాలు పూర్తికావాలని ఆశిస్తున్నాను. అందుకే ఆయనర్ శిల్పాచార్యులను ఇక్కడికి ఈరోజు రమ్మన్నాను. ఎక్కడో అడవి మధ్య ఉంటూ శిల్పాలు చెక్కుతూ ఉండడం కన్న ఆయన ఇక్కడుంటే ఆయన పర్యవేక్షణలో పనులు చాల వేగంగా జరుగుతాయని చెప్పి ఆయనను ఇక్కడికి రమ్మని చెప్పబోతున్నాను...అదిగో ఆయనర్ కూడ వచ్చేశారు!"

నరసింహవర్మ కుతూహలంతోను, ఆతురతతోను తిరిగి చూశారు.  కాస్త దూరాన వస్తున్న పల్లకిలో ఒకవైపు నుంచి ఆయనర్ శిల్పి తొంగి చూస్తూ కానవచ్చారు. ఇంకొక వైపు పట్టపగలే పూర్ణచంద్రుడు ప్రకాశిస్తున్నట్లు ఒక దృశ్యం కానవచ్చింది. ఆ పూర్ణచంద్రబింబం శివకామి వదనారవిందమేనని చెప్పనవసరం లేదుకద?

~~~
~~~

# అధ్యాయం - 27

## ఒక గుర్రం కావాలి

**చక్రవర్తిని,** ఆయన కుమారుని చూడగానే కాస్త దూరానే ఆయనర్ శిల్పి, శివకామి పల్లకి దిగి భయభక్తులతో నడిచి వచ్చారు.

"ఆయనర్‌గారూ! రండి! శివకామిని కూడ పిలుచుకొని వచ్చింది చాల మంచిదైంది! ప్రయాణం సుఖంగా జరిగిందా?" అని చక్రవర్తి శిల్పాచార్యులను విచారించారు.

"పల్లవేంద్రా! మీ ఏలికలో ప్రయాణం సుఖంగా జరిగిందా అని అడగనేల?" అని చెప్పి చక్రవర్తికి నమస్కరించారు. శివకామి కూడ చక్రవర్తికి నమస్కరించింది. ఆమె మనసులో చక్రవర్తి పట్ల అమిత భక్తిమర్యాదలు నిండివున్నాయి. అయినా కూడ ఆమెకు చక్రవర్తంటే ఏదో ఒక తెలియని భయం కూడ ఉంది.

"శివకామీ! నీకు మంగళమగుగాక! నీవు క్షుణ్ణంగా నేర్చుకొన్న భరతనాట్యం ఇంకా వృద్ధి చెంది నీవా కళలో పరిపూర్ణత పొందుగాక!" అని చక్రవర్తి శివకామిని ఆశీర్వదించేసి ఆయనర్‌వైపు తిరిగి ఇలా చెప్పసాగారు:

"ఆయనర్‌గారూ! ఈరోజు మీ ప్రయాణం సుఖంగా జరిగిందని చెప్పారు కద? ఇక ఎప్పుడూ అలా జరుగుతుందని చెప్పలేము. ఎందుకంటే రాబోయే యుద్ధకాలంలో దారి పొడుగునా సైనికులు తిరుగాడుతుంటారు. కాబట్టి కొంతకాలంపాటు, మీరు, శివకామి ఇక్కడికి వచ్చి నివసించడం మంచిది."

ఆయనర్ శిల్పి అదిరిపడ్డారు. అడవి మధ్యలోవున్న తమ శిల్పగృహంలో తాము చెక్కుతున్న శిల్పాలను అర్ధాంతరంగా విడిచిపెట్టి రావాలా? అలా అనుకోగానే అవన్నీ ఆయన మనోనేత్రం ముందు కానవచ్చాయి.

"పల్లవేంద్రా!..." అని ఏదో చెప్పబోయారు.

మహేంద్ర పల్లవ చక్రవర్తి తమ స్వరాన్ని కాస్త కఠినంగా మార్చుకొని, "ఎదురుమాట వద్దు. మీరు, మీ కుమార్తె రేపటినుంచి ఇక్కడికే వచ్చివుండాలి. ఇది మా ఆజ్ఞ!" అన్నారు.

ఆయనర్ శిల్పి, "పల్లవేంద్రా! తమ ఆజ్ఞకు తిరుగుందా? అలాగే చేస్తాను" అన్నారు.

"ఆయనర్‌గారూ! ఈ దేవాలయాలను ఎంత త్వరగా పూర్తిచేయనవుతుందో అంత త్వరగా చేయాలి. ఈ కోవెలలు పూర్తయ్యేవరకు మీరింకే పనిని గమనించనవసరం లేదు. ఈ కార్యం కోసం మీకు ఎంత ద్రవ్యం కావలసి వచ్చినా ఇవ్వవలసిందని దళాధిపతిని ఆజ్ఞాపించాను. ఇంకా పనివాళ్ళు శిల్పులు

కావలసి వస్తే వెంటనే ఇక్కడికి పంపించేందుకు ఏర్పాట్లు చేసివుంచాను. ఏ కారణం వల్లగాని ఈ శిల్పకార్యానికి ఆటంకం కలగడమో, ఆలస్యం కావడమో జరిగితే వెంటనే కుమార చక్రవర్తికి వార్త పంపించి మీకు కావలసింది తెలియజేయవచ్చు" అని చక్రవర్తి చెప్పగానే, దగ్గరే ఉన్న కుమార చక్రవర్తిని చూశారు ఆయనర్.

"అవును, శిల్పాచార్యా! ఇక కొంతకాలం పాటు మీకు కావలసింది మామల్లుకే తెలియజేసుకోవాలి. రేపు నేను పల్లవసైన్యంతో యుద్ధరంగానికి వెళుతున్నాను. నేను తిరిగి వచ్చేవరకు పల్లవ సామ్రాజ్యాన్ని నిర్వహించే సకల బాధ్యతలను మంత్రిమండలి కుమార చక్రవర్తి ఒప్పగించివున్నారు. రేపటినుంచి మహామల్లే చక్రవర్తి" అన్నారు మహేంద్ర పల్లవ చక్రవర్తి.

చక్రవర్తి ఆయనర్ శిల్పాచార్యుల పట్ల కాస్త కఠినంగా మాట్లాడడంవల్ల భయంగొన్న శివకామి ఆయన చివరిమాట విని పులకించింది. అంటే, కుమార చక్రవర్తి యుద్ధరంగానికి వెళ్ళరన్న మాట. ఇక్కడే ఉంటారు. మహేంద్ర చక్రవర్తి ఇక్కడ ఉండరు. కాబట్టి తామిద్దరు ఎప్పుడు కావాలంటే అప్పుడు కలుసుకోవచ్చు అని ఏవేవో తీయని ఆలోచనలతో మైమరచిన శివకామి తలెత్తి కుమార చక్రవర్తి వైపు చూసి అవాక్కైంది. ఎప్పుడూ శాంతంగా ఉండే ఆయన ముఖమిప్పుడు ఎందుకు అంత కఠినంగా ఉంది? ఎందుకాయన తనని తిరిగి చూడడం లేదు? ఒకవేళ తానిక్కడికి వచ్చిందే ఆయనకిష్టం లేదా?

ఆయనేమో శివకామివైపు తిరిగి చూడడమే లేదు. నిన్నటి సాయంత్రం తామరకొలను గట్టున తన్నే కళ్ళింతలు చేసుకొని చూసిన ఆయన ఇప్పుడేమో తనని చూడడానికి ఇష్టపడనట్లుండడానికి కారణమేమి? ఆమె కళ్ళలో కన్నీరుబికింది. వేగంగా వెళ్ళి ఒక రాతిబండ వెనక దాక్కొంది.

నరసింహవర్మ ఎందుకు కోపంగా ఉన్నారో మనకు తెలియదు. అసలు ఆయనకే తెలియదు. కాబట్టి మనకెలా తెలియగలదు?

ఆయన మనసులో శివకామి పట్ల ప్రేమ పొంగిపొర్లింది. వారి పల్లకి వచ్చిన వెంటనే ముందుకు వెళ్ళి శివకామిని పల్లకినుంచి చేయూతనిచ్చి కిందికి దించి నడిపించుకొని రావాలని ఆయన మనసు ఉవ్విళ్ళూరింది. కానీ అదేమీ చేయలేకపోవడంతో ఆశ నిరాశై కోపంగా మారింది. అసలు తన మహారాజవంశపు పుట్టుకమీదే కోపం వచ్చింది.

తాము యుద్ధరంగానికి వెళ్ళటోవడం లేదని తండ్రి చెప్పగానే శివకామి ముఖం విప్పారడం చూసి ఆయనకు కోపం వచ్చింది. యుద్ధరంగానికి వెళ్ళక అంతఃపురంలో కూర్చోవడం ఎంత అవమానకరమని ఆమెకు తెలుసా? యుద్ధానికి వెళ్ళకపోయినా ఆమెను తరచూ చూడగలుగుతామా? అది కూడ సాధ్యం కాదు. కంచి కోట దాటి బయటికి రాకూడదని తండ్రి తన వద్ద మాట తీసుకొన్నారు.

ఇదంతా తెలియని శివకామి ఆనందలహరిలో ఓలలాడుతూంది!

ఇలాంటి ఆలోచనలతో నరసింహుల కోపం ఇంకా హెచ్చుకాజొచ్చింది.

**మనోలోకంలో** ఈ నాటకం సాగుతున్నప్పుడు చక్రవర్తి, ఆయనర్ తమ సంభాషణను ముందుకు కొనసాగించారు. మాట్లాడేటప్పుడే ఆయనర్ తమని, మహామల్లును మార్చి, మార్చి చూస్తూండడాన్ని గమనించిన చక్రవర్తి, "ఆయనర్‌గారూ! ఏదైనా అడగాలా? నాకుగాని, మహామల్లుకుగాని తెలియజేయవలసిందేదైనా ఉందా?" అని అడిగారు.

ఆయనర్ కాస్త తడబడుతూ, "అవును, పల్లవేంద్రా! నాకు ఒక గుర్రం కావాలి" అన్నారు.

"ఏమడిగారు?"

"మంచి గుర్రం ఒకటి కావాలి!"

"గుర్రమా? గుర్రమా కావాలని అడిగారు? దానికన్న నా ప్రాణం కావాలని అడిగితే ఇచ్చేవాడిని. ఈ పల్లవ సామ్రాజ్యాన్నే అడిగివుండవచ్చు! గుర్రం అడిగారు కద! దక్షిణదేశం ఎన్నడూ ఎరగని మహాయుద్ధం రాబోతోందని మీకు తెలుసు కద? కంచినుంచి ప్రతిదినమూ నలుదిక్కులకూ ఎందరో దూతలు వెళ్ళాలి కద? వారికి గుర్రాలు అత్యవసరం కద? గుర్రం తప్ప ఇంకేదైనా అడగండి!" అని శర వర్షం కురిపించినట్లు చెప్పి ఆపారు.

మహేంద్రులు ఇంత ఉద్వేగంతో మాట్లాడి ఎరగని ఆయనర్ స్తంభించిపోయారు.

"ఓహో! మీకు గుర్రమే కావాలి; ఇంకేమీ వద్దు కాబోలు. పల్లవ సామ్రాజ్య మహాశిల్పి ఒక గుర్రాన్ని యాచించారు, అది చక్రవర్తి ఇవ్వలేదన్న అపనింద నాకు వద్దు. అలాగే, ఒక గుర్రాన్ని ఇప్పిస్తాను. కానీ ఎందుకని మాత్రం చెప్పండి. మీరు, శివకామి ప్రయాణం చేసేందుకు పల్లకి, దాన్ని మోసేందుకు బోయీలను ఇప్పించాను కద? మీకు గుర్రమెందుకు?" అని అడిగారు చక్రవర్తి.

ఇప్పుడు ఆయనర్ శిల్పి కాస్త ధైర్యం తెచ్చుకొని, "పల్లవేంద్రా! ఒక ముఖ్యమైన కార్యం కోసమే గుర్రం కావాలి!" అన్నారు.

"ఏమా ముఖ్యమైన కార్యం? నాకు చెప్పవచ్చా? లేక అది కూడ రహస్యమా?" అని అడిగారు చక్రవర్తి.

"ప్రభూ! రహస్యమే! కానీ మీకు చెప్పకూడనంత రహస్యమేముండగలదు? అజంతా వర్ణచిత్రాల రహస్యం గురించి మనమెన్నో సార్లు మాట్లాడుకొన్నాం కద? ఆ రహస్యం తెలిసిన గురువు ఒకరు ఇప్పుడు నాగార్జునకొండమీదున్న బౌద్ధ విహారంలో ఉన్నారు..."

“ఇది ముందే ఎందుకు చెప్పలేదు? చెప్పివుంటే నేను ఆక్షేపించివుండేవాడిని కాను కద? అజంతా అద్భుత చిత్రాలను ప్రత్యక్షంగా చూడగలిగేందుకు పులకేశితో స్నేహం కలుపుకోవాలని కూడ ఒకప్పుడు అనుకొన్నాను. అదంతా పగటికలగానే మిగిలింది. పోనివ్వండి. ఇప్పుడు గుర్రం మాత్రం చాలా, ఇంకేమైనా కావాలా?”

“పల్లవేంద్రుల వృషభచిహ్నం ముద్రించిన ప్రయాణపత్రం కూడ కావాలి. ఇది యుద్ధకాలం కద?”

“అది కూడ ఇస్తాను. ఇంత ముఖ్యమైన కార్యానికి ఎవరిని పంపిస్తున్నారు? ఒకవేళ మీరే...?”

“ప్రభూ! నాకు గుర్రమెక్కడం కూడ రాదు. నా శిష్యుడిని పంపబోతున్నాను.”

“పగవారి సైన్యాలు వచ్చేదారిలో అతడు ప్రయాణం చేయవలసి ఉంటుంది కద? చేత ఒక మంచి ఆయుధం ఉండడం మంచిది. ఇదిగో ఈ శూలాన్నివ్వండి!” అని చెప్పి చక్రవర్తి తాము నరసింహవర్మ దగ్గరినుంచి తీసివుంచిన శూలాన్ని చాచారు.

ఆయనర్ కాస్త జంకగా, “ఎందుకు జంకుతున్నారు? ఈ శూలం మీరు పంపబోతున్న యువకునిదే! వెర్రెక్కిన మదపుటేనుగు నుంచి తమని, శివకామిని కాపాడిన ఆయుధమే; పరంజ్యోతి దీన్ని తీసుకోవడానికి ఆక్షేపించడు!” అన్నారు చక్రవర్తి.

ఇదివిన్న ఆయనర్ మాత్రం కాదు, నరసింహవర్మ, శివకామి కూడ అమితాశ్చర్యానికి లోనయ్యారు.

ఆయనర్ శిల్పి తడబడుతూ, “పల్లవేంద్రా! తమకెలా తెలిసింది?” అని అడిగారు.

“బుద్ధ భగవానుడు నా కలలో వచ్చి చెప్పారు! ఆరోజు మీ ఇంట బుద్ధ భగవానుని శిల్పం వెనక దాక్కొన్నవారిని గూర్చి కూడ చెప్పారు. ఆయనర్‌గారూ1 పల్లవ సామ్రాజ్యంలో పల్లవ చక్రవర్తి కంటికి చెవికి అందకుండ ఏదీ జరగ సాధ్యం కాదని మీకు తెలియదా?”

వెంటనే ఆయనర్ శిల్పి చేతులు జోడించి నమస్కరించి, “పల్లవేంద్రా! అజంతా వర్ణచిత్రాల మీది ఆశవల్ల ఈ పనికి దిగాను. నేనేదైన పొరబాటుగా చెప్పివుంటే, చేసివుంటే మన్నించండి!” అని గొంతు కూరుకుపోగా చెప్పారు.

“శిల్పాచార్యా! అజంతా చిత్ర రహస్యం తెలుసుకోవడంలో మీకెంత ఆశవుందో నాకు కూడ అంత కుతూహలముంది. పరంజ్యోతిని ధారాళంగా పంపండి. కానీ ఇదంతా నాకు  తెలియవచ్చిందని ఆ బౌద్ధభిక్షువుకు మాత్రం చెప్పకండి. ఎందుకో తెలియదుగాని బౌద్ధభిక్షువులకు నామీద లేనిపోని అనుమానాలు కలుగుతున్నాయి. బుద్ధభగవానుని మీద నాకున్న భక్తిని వారెరుగరు. శిల్పాచార్యా!

గుండ్రాళ్లను తొలిచి నిర్మిస్తున్న ఈ ఐదు ఆలయాల్లో ఒకదాంట్లో బుద్ధభగవానుని బ్రహ్మాండమైన శిల్పాన్ని ప్రతిష్ఠించబోతున్నాను. అందుగురించే మీరు వస్తున్నప్పుడు మహామల్లుతో మాట్లాడుతున్నాను!" అన్నారు చక్రవర్తి.

ఇదంతా రాతిబండ వెనక దాక్కొని వింటున్న శివకామికి ముచ్చెమటలు పట్టాయి. ఈ చక్రవర్తికి తెలియనిదేమీ లేదేమోననిపించిందామెకు. ఆయనకు తెలియకుండ కుమారచక్రవర్తికి తానాయనను ఈ సాయంత్రం తామర కొలను గట్టున కలుసుకోగోరుతున్నానని ఎలా చెప్పడం? చటుక్కున ఒక ఆలోచన తట్టింది. వెంటనే కింద పడివున్న ఒక ఎర్రమట్టి బెడ్డను తీసుకొని ఆ బండ మీద నరసింహులకు మాత్రమే తెలిసేటట్లు కొలను నీటిని సూచించే రెండు అలలను, వాటిమీద రెండు తామర మొగ్గలను, ఒక తామరపూవును, గట్టున ఒక జింకపిల్లను కూడ చిత్రించింది. ఓరకంటితో చూసి ఆ చిత్రాన్ని కుమార చక్రవర్తి చూశారని గ్రహించి తృప్తిపడి, ఆ సాయంత్రం ఆయన తప్పక తామర కొలను వద్దకు వస్తారని ఆశించింది.

ఆమె ఆశ వమ్ము కాలేదు. చక్రవర్తి, మహామల్లు తిరిగి వెళ్ళేటప్పుడు కుమార చక్రవర్తి కాస్త వెనుకబడి, ఆ రాతిబండ దగ్గర గుర్రంమీదినుంచి దిగి, అదే ఎర్రమట్టి బెడ్డతో జింకపిల్లకు, తామరకు మధ్య ఒక శూలాన్ని గీచి ముందుకు సాగారు.

~~~
~~~

# అధ్యాయం - 28

## కొండ దారిన

**గత అధ్యాయంలో** వివరించిన సంభవం జరిగిన నాలుగు రోజుల తర్వాత పరంజ్యోతి యుద్ధవీరుడిలాగ దుస్తులు ధరించి, చేత శూలాన్ని పట్టుకొని ఒక మేలుజాతి గుర్రం మీద కొండదారిన ఒంటరిగా వెళుతున్నాడు.

సూర్యుడస్తమించేటందుకు ఇంకా రెండు ఘడియల సమయం మాత్రమే ఉంది. కానీ ఆ సాయంకాలపు సూర్యకిరణాలు అతడి ఎడమ చెంపను చుర్రుమనిపిస్తున్నాయి.

పగలంతా ప్రయాణం చేసిన పరంజ్యోతి ఇప్పుడలిసిపోయివున్నాడు. గుర్రం కూడ అలిసిపోయివుంది. కాబట్టి గుర్రాన్ని కాస్త మెల్లగా తోలుకొంటూ వెళ్ళసాగాడు పరంజ్యోతి.

గుర్రం ఆ కొండదారిన మెల్లమెల్లగా పైకి వెళుతుండగా పరంజ్యోతి ఆలోచనలు వెనక్కి వెళ్ళసాగాయి. గత వారం రోజుల్లో అతడు పొందిన విచిత్రానుభవాలు గుర్తుకు రాసాగాయి.

కంచి నగరిలో భిక్షువుతో ప్రవేశించిన ఆ రాత్రి జరిగిన సంభవాలు గుర్తుకొచ్చినప్పుడల్లా అవి నిజంగా జరిగినవేనా అని ఆశ్చర్యపోసాగాడు. పన్నెండు రోజుల క్రితం తిరుచెంగాట్టంగుడి నుంచి బయలుదేరిన పల్లెటూరి పిల్లాడేనా ఇప్పుడీ మేలుజాతి గుర్రాన్నెక్కి వెళుతున్నది అని ఆశ్చర్యపడ్డాడు.

ఎండ వేడిమి వల్ల విపరీతంగా చెమర్చినప్పుడల్లా తన సొంతవూరైన చోళనాడు అతడికి గుర్తుకు రాసాగింది. ఆహా! అక్కడ బాటలకిరువైపుల ఎత్తైన చెట్లు, వాటి నీడన వెళుతుంటే ఎండే తన మీద పడదు కద? బాటలకిరువైపుల పచ్చని చేలు, వాటి మీదనుంచి చల్లని పిల్ల తెమ్మెరలు వీస్తుంటే తనకు దాహమన్నదే తెలిసేది కాదు కద? ఎప్పుడైనా దాహమనిపించినా, అటూ ఇటూ ఎక్కడ చూసినా తామరలు, కలువలు, నీలోత్పల పుష్పాలతో నిండిన కొలనుల్లో నీరు తాగి సేద తీర్చుకోవచ్చు కద? అంతేగాగ చుట్టూ ఎక్కడ చూసిన వాగులు, వంకలు, సెలయేళ్ళు పారుతుంటాయి. వాటిలో దిగినప్పుడు ఆ చల్లటి నీరు అలిసిన తన పాదాలకు ఎంత హితంగా ఉంటుంది? ఆ చల్లని, తేట నీటి అందమే అందం. ఆ వాగులు ఎండిపోయినప్పుడు వాటి మెత్తని ఇసుక మీద నడుస్తూ వెళ్ళడం మరొక విధమైన తీయని అనుభవం. అలా నడుస్తూ వెళుతున్నప్పుడు ఆ వాగులకిరువైపులా ఏపుగా పెరిగివుండే అడవి మల్లెల సువాసన ఎంత మధురంగా ఉంటుంది?

అంతకన్న మధురమైన అనుభవమంటే బాటల వెంబడి ఇరువైపుల ఎత్తుగా పెరిగిన మర్రి

చెట్లు, వేప చెట్లు, వాటి నీడన మెల్ల మెల్లగా వెళ్ళడం. ఈ ఫాల్గుణమాసంలో వేప చెట్లు, మర్రి చెట్లు, రావి చెట్లు కొత్తగా చిగురుతున్న ఆకులతో ఎంత కమనీయంగా ఉంటాయి? ఎటు చూసినా అరటి తోటలు, కొబ్బరి తోటలు, మామిడి తోపులతో ప్రకృతి అందాలు ఎంత కంటికింపుగా ఉంటాయి? మరి మామిడాకుల తీరే వేరు. ఈ రోజు అతినీలంగా ఉండే లేతాకులు రేపటికల్లా లేత ఎర్రటి రంగుకు తిరిగివుంటాయి. మూడోనాటికి బంగారు వన్నె పులుముకొని ధగధగ మెరుస్తుంటాయి!

ఇటువంటి ప్రకృతి సౌందర్యాలను ఒసగిన దేవుని పొగడుతున్నట్లు అక్కడక్కడా చెట్ల కొమ్మల మీద కోయిలలు ఉయ్యాలలూగుతూ ఇంపుగా పాడుతుంటాయి.

తిరుచ్చెంగాడునుంచి కంచికి వచ్చేటప్పుడు పరంజ్యోతి అటువంటి కమనీయ దృశ్యాలను అంతగా చవిచూసి అనుభవించలేదు.

కానీ ఇప్పుడు కంచినుంచి ఉత్తరంగా వెళుతున్నప్పుడు ఎక్కడ చూసినా బోడి గుండ్రాళ్ళు, ఎండినట్లున్న బయలు ప్రదేశాలు మాత్రమే కానవస్తున్నాయి. ఈ దారిన వెళుతున్నప్పుడే తన చోళదేశపు తోపులు, కొలనులు, తొండైమండలపు అడవులు, నదులు, వాగులు అతడి మనోనేత్రం ముందు తరచూ కనిపిస్తున్నాయి.

**పశ్చిమదిశలో** కొండల వెనుక సూర్యుడు మరుగవుతున్నప్పుడు పరంజ్యోతి ఒక మలుపు తిరిగాడు. అంతవరకు ముళ్ళపొదలను తప్ప ఇంకేమీ చూడని అతని కళ్ళముందు ఒక విచిత్రమైన, అపూర్వమైన దృశ్యం కానవచ్చింది. కనుచూపు మేరకు దట్టంగా, ఎత్తుగా పెరిగిన మోదుగ చెట్లు, పూర్తిగా ఆకులు రాలిపోయినా, వాటి నిండుగా ఎర్రని మోదుగ పూలు. సాయంకాలపు సూర్యకిరణాలు సోకి వాటి రక్త వర్ణాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.

అది అపూర్వమైన దృశ్యమే. కానీ అతడికి అవి తన ఊరికి చెందిన ఒక భయంకరమైన తలపును గుర్తుకు తెస్తున్నాయి. తన గ్రామానికి నైఋతి దిశలో ఉన్న స్మశానంలో ఇవే మోదుగ చెట్లు కొన్ని ఉండేవి. అవి కూడ ఇదే ఫాల్గుణమాసంలో పూలతో నిండివుండేవి. కాబట్టి ఇప్పుడిక్కడ పూలు పూచివున్న మోదుగ చెట్లను చూడగానే తన ఊరి బయటి స్మశానం గుర్తుచ్చింది. అదీగాక ఇప్పుడు సూర్యుడు కుంకే వేళ. ఇవన్నీ కలిసి అతడి మనసులో ఒకవిధమైన భయాన్ని కలిగించాయి. తక్కిన విషయాల్లో మహాధైర్యశాలియైన పరంజ్యోతికి దెయ్యాలు, భూతాలంటే చాల భయం. కాబట్టి చీకటి పడ్డ తర్వాత ఈ దారిన ముందుకు వెళ్ళవలసివస్తుందేమో? ఆ తలపే అతడికి చాల భయాన్ని కలిగించింది. ఈ మలుపు తర్వాత అవతల ఉన్న ఇంకొక కొండకు, ఈ కొండకు మధ్య ఒక సత్రముందని తెలుసు. కానీ, చీకటి పడేలోపు అక్కడికి చేరుకోగలడా? ఈ ఆలోచన రాగానే గుర్రాన్ని వేగంగా నడిపేందుకు

ప్రయత్నించాడు. కానీ పాపం ఆ అలిసిపోయిన గుర్రం మాత్రం ఎలా వేగంగా పరుగెత్తగలదు?

నిర్మానుష్యమైన ఆ దారిలో చీకటి పడ్డ తర్వాత పక్షులు కూడ కూయవు. వాటికి బదులు నక్కలు ఈలలు వేయనారంభిస్తాయి. అది భయాన్ని ఇంకా అధికం చేస్తుంది.

నిన్నంతా రాజబాట వెంబడి ప్రయాణం చేస్తున్నప్పుడు ఆ దారి పొడవునా జనసంచారం ఎక్కువగా ఉండేది. అక్కడక్కడా అదికారులు అతన్ని ఆపగా, చక్రవర్తి తనకు ఇచ్చిన ప్రయాణపత్రాన్ని, రాజముద్రను చూపి ముందుకు సాగాడు.

ఈరోజు ఉదయాన రాజబాట వదిలి కొండదారి పట్టినప్పటి నుంచి అటువంటి ఇబ్బందులేవీ ఎదురుకాలేదు. కానీ ఇప్పుడు ఆ జనశూన్యమైన దారిలో ఒక పెద్ద సైన్యమే రాకూడదా అనిపించేసింది.

ఆ! అదేమి శబ్దం? గుర్రపు డెక్కల చప్పుడు కద? కానీ, ఒక గుర్రమా? లేక చాల గుర్రాలా? చటుక్కున తన గుర్రాన్ని ఆపేసి చెవులు రిక్కించి విన్నాడు. కానీ గుర్రపుడెక్కల చప్పుడు ఆగిపోయింది. ఒకవేళ అదంతా ఒట్టి భ్రమేనా?

పరంజ్యోతి మళ్ళీ తన గుర్రాన్ని ముందుకు పోనిచ్చాడు. మళ్ళీ తన వెనక గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. తిరిగి చూస్తే ఏమీ కనిపించలేదు. మెలికలు తిరిగిన ఆ కొండబాటలో తన వెనుక గుర్రం వస్తున్నా కంటికి తెలియదు.

ఇంతలో సూర్యుడస్తమించి నలువైపుల చీకటి కమ్ముకోసాగింది.

ఆ కొండదారి ఎక్కువ మెలికలు లేకుండ తిన్నగా వెళుతున్న చోటికి వచ్చినప్పుడు పరంజ్యోతి గుర్రాన్ని కాసేపు వేగంగా పోనిచ్చి చటుక్కున ఆపి, వెనక్కి తిరిగి చూశాడు. కాస్త దూరాన ఒక గుర్రం వస్తుండడం కానవచ్చింది. దాని మీద ఒకతను ఉన్నది కూడ కనిపించింది.

పరంజ్యోతి గుర్రం ఆగగానే ఆ గుర్రం కూడ ఆగింది. పరంజ్యోతికి ఎనలేని కోపమొచ్చింది. గుర్రాన్ని లాఘవంగా వెనక్కి తిప్పి ఆ గుర్రంవైపు వేగంగా పోనిచ్చాడు.

~~~
~~~

# అధ్యాయం - 29

## దారి తోడు

**పరంజ్యోతి** గుర్రాన్ని వెనక్కి తిప్పి తన వెనకొస్తున్న గుర్రం వైపు వేగంగా వెళుతున్నప్పుడు అతడి భీతి కోపంగా మారింది. చేతనున్న శూలాన్ని ఆ గుర్రంమీదున్న ఆగంతకుడి గుండెలకు గురిచూసి విసిరేందుకు సిద్ధంగా ఎత్తిపట్టుకొన్నాడు.

కానీ తను ఆ గుర్రాన్ని సమీపించగానే ఆ వ్యక్తి చేసిన విచిత్రమైన పని పరంజ్యోతి భయాన్ని, కోపాన్ని పారదోలి నవ్వు తెప్పించింది. ఆ వ్యక్తి, "అయ్యయ్యో! దెయ్యం! పిశాచి!" అని అరుస్తూ గుర్రంమీది నుంచి కిందికి దొర్లిపడ్డాడు. అది చూసి పరంజ్యోతి నవ్వాపుకోలేక గలగల నవ్వేశాడు. దెయ్యాలంటే భయమున్నవాడు తానొక్కడే కాదన్నమాట!

కిందపడ్డ వ్యక్తి మళ్ళీ "ఆయ్యయ్యో! దెయ్యం! భూతం!" అని మళ్ళీ అరవసాగాడు. సరదా బాగుందని పరంజ్యోతి గుర్రంమీద కూర్చొనే, తన శూలంతో అతడి చేతిని మెల్లగా గుచ్చుతూ, దెయ్యంలాగ లోగొంతులో, "అహ్హహ్హా! నిన్ను వదలను! మింగేస్తాను!" అన్నాడు.

మరుక్షణం పరంజ్యోతి ఏమాత్రం ఎదురుచూడని సంఘటన జరిగింది. అది ఏమని కూడ ఆ క్షణాన తెలుసుకోలేకపోయాడు. ఉన్నట్లుండి తలకిందులుగా గుర్రంమీది నుంచి కింద పడ్డాడు. మరుక్షణం తల మీద వెయ్యి పిడుగులు పడ్డట్లనిపించింది. అతడి ఎద మీద వింధ్యపర్వతం వచ్చి కూర్చొన్నట్లనిపించింది. తర్వాత ఒక బ్రహ్మాండమైన భూతం "హాహాహ" అని వికటాట్టహాసం చేస్తూ అతడి భుజాలను పట్టి కుదిపింది.

కాస్త సంభాళించుకొని మనసు దిటవు పరచుకొని ఆలోచించిన తర్వాతే జరిగిందేమని తెలిసింది పరంజ్యోతికి.

పరంజ్యోతి తన శూలంతో ఆ వ్యక్తిని మెత్తగా పొడిచినప్పుడు అతడు మెరుపువేగంతో దాన్ని లాగి, దానితోబాటు పరంజ్యోతిని కూడ కిందికి లాగాడు. అప్రమత్తంగా లేకపోవడంతో పరంజ్యోతి పట్టు తప్పి తలకిందులుగా పడిపోయాడు. వెంటనే ఆగంతకుడు అతడి గుండెల మీద కూర్చొని గట్టిగా కదలకుండ అదిమిపట్టాడు. జరిగిందది.

తర్వాత పరంజ్యోతి మీది నుంచి లేచి నిలబడి, పరంజ్యోతిని కూడ చేయూతనిచ్చి లేపి నిలబెట్టి, "తమ్ముడూ! ఈ స్మశానమార్గంలో ఒంటరిగా వెళ్ళాలి కద అని భయపడుతూ వచ్చాను. మంచివేళ నీవు

తోడు దొరికావు. నీవెక్కడికి వెళ్ళాలి?" అని చాల పరిచయమున్న వ్యక్తితో మాట్లాడేటట్లు అడిగాడు.

గత కొద్ది క్షణాల్లో జరిగిన సంఘటనల వల్ల అదిరిపాటుకు లోనైవున్న పరంజ్యోతికి, ఆ వ్యక్తి ఉన్నట్లుండి ధోరణి మార్చడంతో కోపం తన్నుకొచ్చింది. అవమానం మరొక వైపు పట్టి పీడించసాగింది. తననిలా అదరగొట్టిన మనిషి సామాన్యుడు కాడని, ఒక వీరపురుషుడని గ్రహించాడు. అందువల్ల అతడిపట్ల ఒకవిధమైన మర్యాద, గౌరవం కూడ కలిగింది.

కానీ, "ఏ ఊరికి వెళుతున్నావు?" అని అడిగినప్పుడు బౌద్ధభిక్షువు చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది. తన భుజంమీదినుంచి ఆ వ్యక్తి చేతిని పక్కకు తోసేసి, "నేనెక్కడికి వెళితే నీకేం?" అని కటువుగా అన్నాడు.

"నాకేమీ లేదు, తమ్ముడూ! ఏమీ లేదు. ఈ రోజు రాత్రి నాకు నీవు తోడుగా దొరికావు కద, అదే చాలు. ఏదో రహస్యకార్యం మీద వెళుతున్నట్లున్నావు..."

ఇలా చెప్పి, ఆ వీరుడు ఒక క్షణంపాటు పరంజ్యోతిని పరిశీలనగా చూశాడు. ఎందుకలా చూస్తున్నాడని పరంజ్యోతి ఆలోచించేలోపు మళ్ళీ నేలమీద పడివున్నాడు. అంతమాత్రమే కాదు, ఆ వీరుడు పరంజ్యోతి గొంతును గట్టిగా నొక్కసాగాడు.

"నీవు వాతాపి[3] గూఢచారివా, కాదా? నిజం చెప్పు!" అని కఠినమైన గొంతుతో అడిగాడు.

పరంజ్యోతికి కోపం, అవమానం కలగలిసి కళ్ళలో నీళ్ళుబికాలి. వెక్కుతూ, అతికష్టంమీద, "నీవు శుద్ధవీరుడివైతే నాకెదురుగా నిలబడి, శూలమో, ఖడ్గమో చేతబట్టి పోరాడు..." అన్నాడు.

"నీతో నేను యుద్ధం చేయాలా? ఎందుకబ్బాయ్? నీవు వాతాపి గూఢచారివైతే ఇప్పుడే యమపురికి అతిథిగా పంపిస్తాను. కాని పక్షాన నీతో స్నేహం కలుపుకొంటాను! నీవు గూఢచారివి కావని మాత్రం నిరూపించు. ఇదిగో, నీ దగ్గర ఇలాటి వృషభముద్ర ఉందా?" అని అడుగుతూనే ఆ వీరుడు తన బొడ్లో దోపుకొనివున్న ఒక తామ్రపు రాజముద్రను తీసి చూపించాడు. పల్లవసామ్రాజ్యంలో ప్రయాణం చేసే రాజదూతలకు గుర్తుగా ఇచ్చే రాజముద్ర అది.

పరంజ్యోతి కూడ అయిష్టంగా తనకు ఇవ్వబడ్డ పల్లవ రాజముద్రను తీసి చూపించాడు. వెంటనే ఆ వీరుడు పరంజ్యోతి గొంతు వదిలిపెట్టి, లేపి నిలబెట్టాడు. తర్వాత, "తమ్ముడూ! నిన్ననుమానించినందుకు నన్ను మన్నించు. ఇది యుద్ధకాలం కద? ఎవరినీ అంత సులభంగా నమ్మకూడదు. అందుకే నిన్నిలా నిర్బంధించి నిజం తెలుసుకోగోరాను. సరే. గుర్రం మీదికెక్కు.

3 వాతాపి = బాదామి

మాట్లాడుకొంటూ వెళదాం!"  అని చెప్పి ఆ వీరుడు తన గుర్రాన్ని సమీపించి అతిలాఘువంగా ఎగిరి కూర్చొన్నాడు.

పరంజ్యోతి తనలో, "వీడితో మాటేమి? ఈ కొండబాట దాటగానే వీడికి బుద్ధి చెబుతాను" అనుకొంటూ గుర్రమెక్కాడు. సూర్యుడస్తమించి చీకటి కమ్ముకొస్తూండగా ఆకాశాన చుక్కలు మెరుస్తూ సన్నటి వెలుతురు చిమ్ముతూ దారి చూపగా ఆ రెండు గుర్రాలూ ముందుకు సాగాయి.

~~~
~~~

# అధ్యాయం - 30

## మయూర శర్మ

**ఆ** కొండ అడవి మార్గాన కాసేపు ఆ రెండు గుర్రపు డెక్కల శబ్దం తప్ప ఇంకేదీ వినిపించలేదు. ప్రయాణీకులిద్దరు సుదీర్ఘమౌనంలో మునిగివున్నారు.

పరంజ్యోతి మనసులో అనేక ఆలోచనలు తోచి మరుగవుతున్నాయి. పెద్ద తలపాగ, గుబురు మీసాలతో ఆజానుబాహువుగా ఉన్న ఆ వీరపురుషుడెవరై ఉండవచ్చు? ఆతడు అనేక యుద్ధవిద్యల్లో ఆరితేరినవాడన్నది నిస్సందేహం. తనని రెండుసార్లు అనుకోని విధంగా అటకాయించిన విధమే అతని హస్తలాఘువాన్ని, యుద్ధవిద్యాప్రావీణ్యతను ఎత్తి చెబుతున్నాయి. అది పరంజ్యోతికి ఆతడిపట్ల చాల భయభక్తులు కలిగేందుకు కారణమైంది. ఆహా! ఇటువంటి మహావీరుని మైత్రి తనకు దొరికితే అంతకన్న భాగ్యమేముంది?

తిరుచెంగాట్టంగుడి నుంచి కంచికి వచ్చేదారిన పరిచయమైన బౌద్ధ భిక్షువుకు, ఈ వీరపురుషునికి ఎంత తేడా? ఆ భిక్షువు తనపట్ల ఎంతో ప్రీతి కనబరిచినా, ఎంతో సహాయం చేసివున్నా కూడ, ఆయన పట్ల ఏర్పడని భక్తి, వాత్సల్యం తనని కింద పడేసి ఎద మీద కూర్చొని తన పీక నొక్కిన ఈ వీరపురుషుని పట్ల ఎందుకు కలుగుతూంది?

అదే సమయాన బయల్దేరేటప్పుడు బౌద్ధభిక్షువు చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది. "వెళ్ళేదారిలో ఎవరినీ నమ్మకు. మిత్రులుగాగాని, శత్రువులుగాగాని నటించినా కూడ వారినెవరికీ నీవెక్కడికి వెళుతున్నావని గాని, నీవు ప్రయాణపత్రం తీసుకొని వెళుతున్నావని గాని చెప్పకు. అజంతా చిత్ర రహస్యం గురించి తెలుసుకోవాలని చాలమంది ప్రయత్నిస్తున్నారు. నీవా పని మీద వెళుతున్నావని తెలిస్తే, నీవా రహస్యం తెలుసుకొన్న మరుక్షణం నిన్ను చంపడానికి వెనుకంజ వేయరు! బహుపరాక్!"

ఇలా భిక్షువు తనకు చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చి, ఒకవేళ తనతో ఇప్పుడు వస్తున్న ఈ వ్యక్తి అటువంటి కుట్ర పన్నుతున్న మనిషా అని ఆలోచించాడు. తనని గుర్రం మీదినుంచి కింద పడేసినప్పుడు తన దగ్గరున్న భిక్షువిచ్చిన పత్రాన్ని కాజేశాడా అని సందేహం వచ్చింది. వెంటనే తన నడుం బట్టను తడిమి చూసుకొని, ఆ పత్రం భద్రంగా ఉందని నిర్ధారించుకొన్న తర్వాత అతడికి మనసు కుదుటపడింది.

అప్పుడు కాస్త దూరాన ఒక నక్క ఊల వేస్తున్న శబ్దం వినిపించింది. వెంటనే ఇంకొన్ని నక్కలు దానితోబాటు ఊల వేయసాగాయి. ఇలాంటి అడవి ప్రాంతంలో చీకటి పడ్డ తర్వాత నక్కలు గుంపులు

గుంపులుగా ఒళ్ళు జలదరించేలా, భయం పుట్టించేలా ఈలలు వేయడం కద్దు అన్న విషయం పరంజ్యోతికి తెలుసు. ఎలా ధైర్యం తెచ్చుకోవాలా అని ఆలోచిస్తూ మౌనంగా ముందుకు వెళ్ళసాగాడు.

ఇంతసేపూ మౌనంగా ఉన్న ఆ వీరపురుషుడు ఇప్పుడు, "ఇలాంటి ప్రదేశంలో ఒంటరిగా చీకటి పడ్డ తర్వాత కూడ ప్రయాణిస్తున్నావు కద, నీ ధైర్యాన్ని మెచ్చుకోవాలి! నా రోజుల్లో ఇలాంటి దారుల్లో ఒంటరిగా ప్రయాణం చేసివున్నాను. కానీ ఇక్కడ కాసేపటి క్రితం నాకే మతి తప్పి విపరీతమైన భీతి కలిగింది" అన్నాడు.

అప్పుడు పరంజ్యోతి, "అయ్యా! కాసేపటి క్రితం నన్ను చూసి 'దెయ్యం! పిశాచం' అని కేకలు వేస్తూ గుర్రం మీది నుంచి కింద పడ్డారు కద? నిజంగానే భయమేసిందా, లేక నన్ను గుర్రం మీదినుంచి కింద లాగి పడేసేందుకు అలా నటించారా? కాసేపటి క్రితం అలా కేకలు వేసిన మీరు ఇప్పుడేమో ఏ మాత్రం భయపడుతున్నట్లు కనిపించడం లేదే!" అన్నాడు.

"ఆహా! అది తెలియదా నీకు? దెయ్యాలు ఎవరైనా ఒంటరిగా వెళుతుంటే లాగి కొట్టేసి వాళ్ళ రక్తాన్ని తాగుతాయి. అదే ఇద్దరు లేదా ఎక్కువ మంది వెళుతుంటే ఒకటి కాదు కద, వందల వేల దెయ్యాలు కూడ ఏమీ చేయలేవు. వాటిని అదిలించి తరిమి కొట్టేయవచ్చు. ఇక్కడ వేల కొద్ది దెయ్యాలు తిరుగాడుతున్నాయని విన్నాను. అందుకే నీవు నాకు దారి తోడుగా దొరికితే ఇక్కడి దెయ్యాల బారి నుంచి తప్పించుకోవచ్చని ఆ ఉపాయం పన్నాను. తమ్ముడూ! ఈ ప్రదేశం కథ నీకు తెలుసా?" అని ఆ అశ్వవీరుడు అడిగాడు.

"తెలియదు, చెప్పండి!" అన్నాడు పరంజ్యోతి. అప్పుడు ఆ వీరుడు చెప్పిన వృత్తాంతమిది:

**సుమారు** రెండు వందల యాభై సంవత్సరాల క్రితం జరిగిన కథ ఇది. ఉత్తరదేశం నుంచి వీరశర్మ అనే బ్రాహ్మణుడు మయూరశర్మ అనే తన శిష్యునితో కంచి మహానగరానికి వచ్చాడు. ఆ ఇద్దరూ అప్పటికే వేద శాస్త్రాల్లో మిక్కిలి పాండిత్యం కలవారు. కానీ ఆ కాలంలో కంచి మహానగరంలోని సర్వకళాశాలలో ఉన్న మహాపండితుల చేత వారి పాండిత్యం పరీక్షించబడి ఒప్పుకొనబడ్డ తర్వాతే వారి విద్య పూర్తయ్యిందని చెప్పబడేది. అందుకోసమే వారిద్దరూ కంచికి వచ్చారు. ఒకరోజు వారు కంచి రాజవీధి వెంబడి నడిచి వెళుతున్నప్పుడు పల్లవరాజు అశ్వవీరులు కొందరు ఎదురొచ్చారు. వీధిలో నడుస్తూ ఏదో ఒక శాస్త్ర విషయచర్చలో మునిగివున్న గురుశిష్యులు ఆ అశ్వవీరులకు దారికి వదిలి పక్కకు ఒదికి నిలబడలేదు. ఇందుకు కోపగించిన అశ్వవీరుడొకడు గుర్రంమీదినుంచే వీరశర్మను తన్ని కిందపడదోశాడు. గురువుకు జరిగిన ఆ అవమానాన్ని చూసి సహించలేని మయూరశర్మ ఆ వీరుని చేతినుంచి ఖడ్గాన్ని లాక్కొని విసరగా, వాడు తెగి కింద పడ్డాడు. తక్కిన ఆశ్వవీరులు మయూరశర్మను పట్టుకోవడానికి

వచ్చారు. వారి చేత చిక్కితే తాను బతకనని గ్రహించిన మయూరశర్మ కిందపడ్డ వీరుని గుర్రంమీదికి ఎగిరి కూర్చొని, తనకడ్డొచ్చిన అశ్వవీరులను తెగనరుకుతూ కంచి మహానగరంనుంచి బయటపడ్డాడు.

పల్లవరాజ్యానికే అవమానకరమైన ఈ సంఘటనను విని, మయూరశర్మను పట్టి తేవడానికి పలువురు అశ్వవీరులు బయల్దేరారు. కానీ అతడు వారికి దొరకలేదు. చివరికి మయూరశర్మ కృష్ణానదీతీరాన ఉన్న శ్రీపర్వతాన్ని చేరుకొని, అక్కడున్న దట్టమైన అడవుల్లో, పల్లవవీరులకు భయపడి దాక్కొని జీవించాడు. తర్వాత అక్కడున్న కొండజాతివారిని కూడదీసుకొని ఒక పెద్ద సైన్యాన్ని సిద్ధం చేసుకోవడమేగాక, అక్కడ తన స్వతంత్రరాజ్యాన్ని స్థాపించాడు. తర్వాత తన పెద్ద సైన్యంతో తన గురువుకు జరిగిన అవమానానికి పగతీర్చుకోవడానికి కంచిమీద దండెత్తి వచ్చాడు. మయూరశర్మ సైన్యం, పల్లవసైన్యం ఈ కొండ అడవి ప్రదేశంలోనే ఢీకొన్నాయి. ఏడురోజులు ఎడతెరపి లేకుండ యుద్ధం జరిగింది. వేలకొద్ది వీరులు యుద్ధంలో మరణించారు. రక్తపుటేరులు పారి ఈ కొండ ప్రదేశాన్ని రక్తంలో తడిపాయి.

అలా రక్తపుటేరులు పారిన ఈ ప్రదేశంలోనే కొంతకాలం తర్వాత మోదుగ చెట్ల అడవి మొలిచింది. పైన పేర్కొన్న భయంకర యుద్ధం జరిగిన అదే ఫాల్గుణ మాసంలోనే ఈ మోదుగ చెట్లు ఆకులన్నీ రాలిపోయి రక్తవర్ణపు మోదుగ పూలతో నిండివుంటాయి. ఆ పోరులో చనిపోయిన వేలకొద్ది వీరుల ఆత్మలు ఇంకా ఇక్కడే తిరుగాడుతున్నాయని చుట్టుపక్కలున్న గ్రామప్రజలు నమ్ముతున్నారు. రాత్రి సమయంలో ఎవరైనా ఒంటరిగా ఈ దారిన ప్రయాణం చేస్తుంటే వారిని చంపి వారి రక్తాన్ని తాగి దాహం తీర్చుకొంటాయని చెప్పుకొంటున్నారు!

**పైన చెప్పబడ్డ** వృత్తాంతాన్ని వింటున్న పరంజ్యోతికి అందాక ఉన్న కాస్త కూస్త భయం కూడ ఎగిరిపోయింది. అక్కడ ఆత్మలు తిరుగుతున్నాయన్నది ఒట్టి మూఢనమ్మకమని రూఢిగా అనుకొన్నాడు. "నన్ను చూడగానే రెండు వందల ఏభైయేళ్ళకు మునుపు మరణించిన ఒక వీరుని ఆత్మ అనుకొని భయపడి అలా కేకలేస్తూ పడిపోయారు కాబోలు?" అని చెప్పి నవ్వాడు.

"రక్తమాంసాలున్న మనిషితో నేను పోరాడుతాను. కానీ దెయ్యంతో ఎవరు పోరాడగలరు?" అని ఆ వీరుడు కాస్త కఠినంగా చెప్పగా, పరంజ్యోతి మాట మార్చదలచి, "అలాగే కానివ్వండి! ఇక్కడ జరిగిన ఆ యుద్ధం ముగింపేమి? చివరికి ఎవరు గెలిచారు?" అని అడిగాడు.

"మయూరశర్మ సైన్యంకన్న పల్లవ సైన్యం మూడురెట్లు పెద్దది. కాబట్టి పల్లవసైన్యమే గెలిచింది. మయూరశర్మను ఒంటిమీద ముప్పైయారు గాయాలతో పట్టుకొని తీసుకొని వెళ్ళి పల్లవరాజు ముందు నిలబెట్టారు..."

"తర్వాతేం జరిగింది?" అని చాల ఆతురతతో అడిగాడు పరంజ్యోతి.

“ఏం జరిగివుండవచ్చని నీవే ఊహించి చెప్పు" అని అతడి ఆతురతను మరింత హెచ్చించాడు ఆ వీరుడు.

~~~
~~~

# అధ్యాయం - 31

## వైజయంతి

**దారి తోడుగా** దొరికిన ఈ వీరుడు ఏ మయూరశర్మ గురించి చెప్పాడో అదే మయూరశర్మ గురించి బౌద్ధభిక్షువు కూడ చెప్పిన అదే కథ పరంజ్యోతికి గుర్తుంది. కానీ ఆ కథ ఈ వీరుడు చెప్పినంత రసవత్తరంగా లేదు. పైగా ఆ బౌద్ధ భిక్షువు తనని, "నీవు కూడ ఆ మయూరశర్మలాగ అయినా అవవచ్చు" అని హెచ్చరించింది పరంజ్యోతి మనసులో జుగుప్స కలిగించింది. ఏల? మయూరశర్మ పట్లే జుగుప్స కలిగించింది భిక్షువు ఆ కథ చెప్పిన తీరు.

కానీ ఇప్పుడు ఈ వీరుడు అదే మయూరశర్మ గురించి చెప్పిన తీరు ఎలా ఉందంటే, ఆ మయూరశర్మ చేసిన వీరపోరాటం, ఒంటిమీద ముప్పైయారు గాయలతో పల్లవరాజు ముందు నిలబెట్టబడం విన్న తర్వాత ఆ వీరయువకుని పట్ల గౌరవం పదిరెట్లు పెరిగింది.

"అటువంటి వీరుడు పల్లవరాజును శరణు కోర నిరాకరించేవుంటాడు. సందేహం లేదు. అలా రాజుకెదురుగా కుట్ర పన్నిన వారిని ఆ కాలంలో గొంతుదాక నేలలో పూడ్చి, ఏనుగులతో తొక్కించేవారు. కాబట్టి అతడిక్కూడ అదే శిక్ష పడివుంటుంది" అని ఏవగింపుతో అన్నాడు పరంజ్యోతి.

"లేదు, తమ్ముడూ, లేదు! సాధారణంగా అంగ, వంగ, కళింగ, కాశ్మీర, కాంభోజ దేశాల్లో అలాగే శిక్షిస్తారు. కానీ కంచి పల్లవ రాజుల రీతి, రాజనీతి భిన్నంగా ఉంటుంది..."

"పల్లవరాజు ఏం చేశారు?"

"మయూరశర్మను మన్నించడమేగాక, అతడి వీరత్వాన్ని మెచ్చుకొని అతడు స్థాపించిన రాజ్యాన్ని అతడికే తిరిగి ఇచ్చేశారు. ఆయనే స్వయంగా వెళ్ళి మయూరశర్మకు పట్టం కట్టారు!"

"అలాగా!" అని పరంజ్యోతి ఆశ్చర్యపోయి, "అందుకు మయూరశర్మ కృతజ్ఞతలు తెలుపుకొన్నాడా?" అని అడిగాడు.

"మయూరశర్మ మాత్రమే కాదు, అతడు స్థాపించిన కదంబవంశంలో పుట్టినవారంతా గత రెండువందలయేళ్ళకు పైగా పల్లవరాజుకు కప్పం కడుతూ తమ కృతజ్ఞతను తెలుపుకొంటున్నారు. కృష్ణ – తుంగభద్ర నదీతీరం వెంబడి వారి రాజ్యంకూడ విస్తరించసాగింది. కొంతకాలం పిదప వైజయంతి పట్టణాన్ని తమ రాజధానిగా చేసుకొన్నారు. వారికి ఆపద వచ్చినప్పుడు పల్లవరాజులు వారికి కావలసిన సహాయం కూడ చేస్తూ వచ్చారు. ఇరవైయేళ్ళకు మునుపు పులకేశి చిన్నాన్న మంగళేశుడు కదంబరాజ్యం మీద

దండెత్తి వచ్చిన విషయం నీకు తెలుసో, లేదో...?"

"నాకు తెలియదే! అదేం విషయం?" అని ఆతురతతో అడిగాడు పరంజ్యోతి.

"అవును, నీకెలా తెలిసివుంటుంది. నీవింకా చిన్న పిల్లవాడివి. ఇప్పుడు రాక్షససైన్యంతో పల్లవసామ్రాజ్యం మీద దండెత్తి వస్తున్నాడే, ఆ పులకేశి, వాడి తమ్ముళ్ళు చిన్న పిల్లవాళ్ళుగా ఉండేటప్పుడు మంగలేశుడనే వాళ్ళ చిన్నాన్న వాతాపి రాజ్యాన్ని ఏలేవాడు. వాడికి ఉన్నట్లుండి ఇతరదేశాలను చేజిక్కించుకొని పెద్ద చక్రవర్తి కావాలన్న ఆశ పుట్టుకొచ్చింది. తుంగభద్రను దాటి కదంబరాజ్యంలో ప్రవేశించాడు. వైజయంతి నగరం వరకు వచ్చేసి ఆ నగరాన్ని చుట్టుముట్టాడు. అప్పుడు ఉత్తరాన ఉన్న పల్లవసైన్యమే కదంబరాజుకు సహాయంగా వెళ్ళింది. ఆ పట్టణం బయట ఒక పెద్ద యుద్ధం జరిగింది..."

"యుద్ధం ముగింపేమి?"

"అడగనేల? వీరపల్లవ సైన్యమే జయించింది. చాళుక్యులు ఓడిపోయి, వెన్నిచ్చి పారిపోయారు. ఆహా! అప్పుడుగనక పల్లవ సైన్యం వారిని వెన్నంటి వెళ్ళి సమూలంగా నాశనం చేసివుంటే ఇప్పుడీ యుద్ధమే వచ్చేది కాదు1' అన్నాడా వీరుడు.

ఆ పాత వృత్తాంతాలను తెలుసుకోవడంలో పరంజ్యోతికి చాల ఆసక్తి ఉంది. యుద్ధాల గురించి, అవి జరిగిన రీతి గురించి, గెలుపోటముల గురించి తెలుసుకోవడానికి అతడు చాల కుతూహలపడేవాడు. వెన్నెలలేని రోజు చీకటిపడ్డ తర్వాత ప్రయాణబడలిక తెలియకుండేందుకు ఇలాంటి వృత్తాంతాలు వినడం చాల బాగుందనిపించింది పరంజ్యోతికి.

"ఓడిపోయి పారిపోయిన చాళుక్యసైన్యాన్ని పల్లవసైన్యం ఎందుకు వెంబడించి పోలేదు?" అని అడిగాడు.

"అందుకు పలుకారణాలున్నాయి. ముఖ్యమైనదేమంటే, ఆ పోరులో పల్లవసైన్యం చాల పెద్ద నష్టానికి గురైంది - పల్లవసైన్యాధిపతి ఆ పోరులో మరణించారు!"

పరంజ్యోతి ఆలోచనలు చటుక్కున ఇంకొకవైపు మళ్ళాయి. "అయ్యా! ఆ వీరపల్లవ సైన్యాధిపతి పేరేమి?" అని అడిగాడు.

"నీవు వినేవుంటావు కద? సేనాధిపతి కళిప్పగైయారే. ఇప్పుడున్న కళిప్పగైయార్ మామగారు..."

"వినివున్నాను. ఆ మహావీరపురుషుని పెళ్ళి చేసుకోదలచిన తిలకవతి అమ్మగారి

గురించికూడ విన్నాను" అని పరంజ్యోతి భక్తిపారవశ్యంతో చెప్పాడు.

"నీకంతా బాగా తెలిసినట్లుందే! నీవు పెద్ద శైవుడిలాగుంది!" అన్నాడా వీరుడు.

"ఔనయ్యా! నా తలిదండ్రులు, బంధువులంతా శైవులే. నావుక్కరసర్ గురువులను దర్శించేందుకే నేను కంచికి బయల్దేరి వచ్చాను..." అని చెప్పి పరంజ్యోతి చటుక్కున ఆపేశాడు.

"అలాగా, తమ్ముడూ! నేనూ శైవుడినే. నీవు తిరునావుక్కరసు గురువులను కంచిలో దర్శించావా?"

"లేదు!"

"ఏల?"

"అంతలోపల ఈ పని పడింది."

"ఏ పని?"

పరంజ్యోతి కాస్త నిదానించి, "అయ్యా! మీరు నన్నా ప్రశ్న అడగకుంటే, నేనబద్ధం చెప్పవలసిరాదు!" అన్నాడు.

"ఆహా! నీవు చాల బుద్ధిశాలివి!" అన్నాడా వీరుడు. తర్వాత, "తమ్ముడూ! నీలాగే నాకొక కొడుకున్నాడు. నీ వయసే ఉంటుంది. ఈ ప్రయాణంలో నాతో తాను కూడ రావాలని చాల మొండిపట్టు పట్టాడు. నేను కూడదన్నాను. అందువల్ల వాడికి నా మీద కోపం..."

ఇటువంటి వీరుడైన తండ్రిని పొందిన ఆ అదృష్టశాలి మీద పరంజ్యోతి మనసులో కాస్త అసూయ కలిగింది.

ఆ తగని ఆలోచనను తొలగించే ప్రయత్నంగా, "అయ్యా! వైజయంతి యుద్ధం గురించి చెబుతూ మధ్యలో ఆపేశారే! ఆ పోరులో పల్లవ సైన్యాధిపతి కలిప్పగై అసువులుబాసారని చెప్పారు. కానీ పల్లవసైన్యానికి ఇంకెందరో సమర్థులైన సైన్యాధిపతులు ఉన్నారు కద? ఓడి పారిపోయిన చాళుక్యసైన్యాన్ని వెన్నంటి పల్లవసైన్యం ఎందుకు పోలేదు?" అని మళ్ళీ అడిగాడు.

"విచిత్రచిత్తులని బిరుదుగాంచిన కంచి చక్రవర్తిని నీవు చూసి ఎరుగుదువా, తమ్ముడూ?" అని అడిగాడా వీరుడు.

పరంజ్యోతి మౌనందాల్చాడు.

"విచిత్రచిత్తులని పేరుగాంచిన ఆ కంచి చక్రవర్తి ఆ కాలంలో చాల విచిత్రమైన భావాలుగొన్నవారై ఉండేవారు. లోకంలో యుద్ధమన్నదే జరగకూడదు. పగ, ద్వేషం కూడదు. అందరూ చిత్రం, శిల్పం

మొదలైన కళల్లో నిమగ్నమై ఆటపాటలతో ఆనందంగా కాలం గడపాలని కోరుకొనేవారు. తమకు ఉన్న రాజ్యం చాలన్న వైరాగ్యభావం కలిగివుండేవారు. అటువంటి సమయాన పులకేశినుంచి సమాధానం/సంధిని కోరుతూ సందేశం రాగానే, యుద్ధాన్ని ఆపేయమని ఆజ్ఞాపించారు."

"పులకేశి ఎప్పుడు రాజైనాడు?"

"చిన్నాన్న మంగలేశుడు రాజ్యంమీది కాంక్షతో పులకేశిని, వాడి తమ్ములను పట్టి చెరలో వేశాడు. మంగలేశుడు వైజయంతి మీద దండెత్తి వెళ్ళినప్పుడు వాళ్ళు తప్పించుకొని బయటికొచ్చేశారు. పరాజయం పొంది తిరిగొచ్చిన మంగలేశుని చంపి, వాతాపి రాజుగా పులకేశి పట్టం కట్టుకొన్నాడు. వెంటనే కంచి మహారాజుకు సంధి రాయబారం పంపాడు. నాగసర్పంతో సంధి చేసుకొన్నట్లు కంచి మహారాజు కూడ అప్పుడు పులకేశితో సంధి ఒడంబడిక చేసుకొన్నాడు. దాని విపరీత ఫలితాన్ని ఇప్పుడనుభవిస్తున్నాడు."

"ఏమా విపరీత ఫలితం?"

"అది ఏమనా అడుగుతున్నావు? పులకేశి సైన్యం వైజయంతిని చేజిక్కించుకొని ముందుకొస్తున్నారని నీకు తెలియదా? ఇంకొక భయంకరమైన వార్త వినవచ్చాను. వైజయంతి సంపదనంతా కొల్లగొట్టిన తర్వాత ఆ పట్టణాన్ని కాల్చి బూడిద చేయమని పులకేశి ఆజ్ఞాపించాడట! ఇది నేను నమ్మలేకున్నాను. ఒకవేళ అది నిజమైతే..."

"నిజమైతే?"

"నిజమైతే, 'కంచి మహేంద్రపల్లవ వర్మకు ఇది కావలసిందే, ఇంకాను కావలసిందే' అనే చెబుతాను. లోకంలో రాజులు, చక్రవర్తులు 'పోరులో పులి', 'యుద్ధంలో సింహం' అని బిరుదులు అందుకొంటారు. కానీ కంచి చక్రవర్తి 'చిత్రకళలో పులి' అని పట్టంగొన్నాడు కద? ఆయనకు ఇది తగిన శాస్తే కద?"

పరంజ్యోతి మళ్ళీ మౌనంలో మునిగాడు. వైజయంతి పట్టణం కాల్చివేయబడ్డదన్న వార్త అతడి మనసును కలచివేసింది.

కాసేపటి తర్వాత ఆ వీరుడు, "తమ్ముడూ! నీవు ఎక్కడికి వెళుతున్నావు, ఏ కార్యం మీద వెళుతున్నావు అని అడగను. ఈ రాత్రి ఎక్కడ బస చేయాలని అనుకొంటున్నావని అడగవచ్చు కద?" అన్నాడు.

"ఈ కొండకవతల ఒక మహేంద్ర వసతి ఉందని విన్నాను. అక్కడే బస చేద్దామని అనుకొంటున్నాను. చీకటి పడేలోపు అక్కడికి పోయి చేరుతానని అనుకొన్నాను..."

"అదిగో చూడు ఆ వెలుతురును! నీవు చెప్పిన ఆ మహేంద్ర వసతి ఆ వెలుతురు కనిపిస్తున్న కట్టడమే. నేను కూడ ఈ రాత్రి అక్కడే బస చేయబోతున్నాను" అన్నాడా వీరుడు.

~~~
~~~

# అధ్యాయం - 32

## కుంభకర్ణుడు

**ఆ ఇద్దరు** ప్రయాణీకులు అ వసతిగృహాన్ని సమీపించగానే, నలుగురు వీరులు ముందుకొచ్చి "ఆగు!" అని గద్దించారు. వాకిలి దగ్గర నిలుచొన్న ఇంకొక వీరుని చేతనున్న ప్రకాశవంతమైన దివిటీ వెలుతురులో వారు దూసిన కత్తులు తళతళ మెరిసాయి.

కానీ పరంజ్యోతి తోటి వీరుడు తన దగ్గరున్న ఏదో రాజముద్రను తీసి చూపగానే వారు చాల గౌరవంతో పక్కకు ఒదిగి నిలబడి దారి ఇచ్చారు. కానీ అతడి వెనక వస్తున్న పరంజ్యోతి దారికడ్డు నిలిచి ఆపారు. అప్పుడా మొదటి వీరుడు వెనక్కి తిరిగి, “ఆ అబ్బాయి కూడ నాతో వస్తున్నవాడు" అని చెప్పగానే పరంజ్యోతికి కూడ దారి వదిలారు.

లోపల ప్రవేశించిన తర్వాత వసతి గృహ ప్రధానాదికారికి కూడ ఆ వీరుడు అదే రాజముద్రను చూపగా, అతడు కూడ ఆ వీరుని చాల గౌరవంతో ఆహ్వానించాడు. ఆ వీరుడు తమకు ఆ రాత్రి బస చేసేందుకు రెండు మంచి గదులు కావాలని, గుర్రాలకు మేత కూడ ఏర్పాటు చేయాలని చెప్పాడు. ఇదంతా చూస్తున్న పరంజ్యోతికి చాల ఆశ్చర్యం కలిగింది. ఎవరీ వీరుడు? చక్రవర్తి సైన్యంలోనో లేదా అధికారవర్గంలోనో అతిముఖ్యమైన హోదాలో ఉన్న వ్యక్తి అయివుండాలనుకొన్నాడు. తానిప్పుడు చేపట్టిన కార్యాన్ని ముగించిన తర్వాత ఈతని వెతికి పట్టుకొని స్నేహం పెంచుకోవలనుకొన్నాడు.

భోజనం చేసేటప్పుడు ఆ వీరుడు, “తమ్ముడూ! నీకు వైజయంతి యుద్ధం గురించి చెప్పాను కద? అప్పుడు నాకు ఇంచుమించు నీ వయసే ఉండేది. ఒకసారి ఈ విడిదిలోనే బస చేశాను. ఆ రాత్రి నాకు ఒక విచిత్రమైన అనుభవం కలిగింది!” అన్నాడు.

"అదేమి?” అని పరంజ్యోతి ఆసక్తితో అడిగాడు.

“తమ్ముడూ! ఇంతసేపూ మనమిద్దరం ఒకరి పేరొకరు తెలుసుకోకుండానే మాట్లాడుకొంటున్నాము. నాపేరు తెలియజేయడానికి నాకే అభ్యంతరమూ లేదు. నాకు నా తలిదండ్రులు పెట్టిన పేరు వజ్రబాహు. కానీ నా స్నేహితులు నన్ను 'కుంభకర్ణ' అని పిలుస్తారు. ఎందుకంటే నేనలా నిద్రపోతాను! ఈ రోజులాగే ఆరోజు కూడా పగలంతా ప్రయాణం చేసివుండడం వల్ల ఆదమరచి నిద్రపోయాను. అప్పుడేం జరిగిందో తెలుసా?”

“ఏదైనా దెయ్యాల కల వచ్చి బెదిరిపోయి కేకలేస్తూ నిద్రనుంచి లేచారేమో!” అని చిలిపిగా

అన్నాడు పరంజ్యోతి.

అది విన్న వజ్రబాహు నవ్వేసి, "లేదు, లేదు! దానికన్న ప్రమాదకరమైన విషయం! ఇల్లు విరిగి నా మీద పడినట్లనిపించింది! మేలుకొని చూస్తే నలుగురైదురుగు లావుపాటివాళ్ళు నా మీద కూర్చొని నొక్కిపట్టుకొనివున్నారు. ఇద్దరు నా నడుమును తడిమి చూస్తున్నారు. ఎందుకో తెలుసా?"

"అయ్యా! నాకు జ్ఞానదృష్టి ఉందనుకొన్నారా ఏమి? మీరే చెప్పండి!"

"సరే! చెబుతాను, విను. నేను సేనాధిపతి కళిప్పియార్‌గారికి తీసుకొని వెళుతున్న పత్రాన్ని తస్కరించేందుకే!"

"ఆహా!" అన్నాడు పరంజ్యోతి. అతడికి తెలియకుండానే అతడి కుడిచేయి అతడి నడుంబట్టను తడిమింది. అది ఒక్క క్షణం మాత్రమే. కానీ వజ్రబాహు చురుకైన కళ్ళు దాన్ని గమనించాయి.

పరంజ్యోతి సర్దుకొని, "తర్వాత ఏం జరిగిందయ్యా? ఆ మొరటువాళ్ళకు మీరు తీసుకెళుతున్న పత్రం దొరికిందా?" అని అడిగాడు.

"దొరకలేదు. అందుకు బదులు ఒక్కొక్కడికీ నా ముష్టిప్రహారాలు ఐదారు దొరికాయి. అంతే! బతికుంటే బలుసాకైనా తిని బతకొచ్చని పారిపోయారు!"

పరంజ్యోతి నవ్వి, "భలే! ఎవడైన ఒంటరిగ వచ్చి మీ నడుంబట్టను మెల్లగా తడిమివుంటే దొరికివుండేదేమో? మీరే కద అన్నారు కుంభకర్ణునిలాగ నిద్రపోతానని?" అన్నాడు పరంజ్యోతి.

"నిజమే, కాని అప్పుడు కూడ దొరికేది కాదు. ఎందుకో తెలుసా?"

"మరింకెక్కడైనా భద్రంగ దాచుకొన్నారేమో?"

"కాదు! దాన్ని అప్పటికే అగ్నిదేవుని అర్పించేశాను!"

"ఆదేమి? భలే దూతగా ఉన్నారే మీరు? పత్రాన్ని కాల్చేసిన తర్వాత  ప్రయాణమెందుకు?"

"అలా కాల్చేసేముందు అందులోని విషయాలను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకొని గుర్తుపెట్టుకొన్నాను."

"ఓహో! రాజ్యాంగదూతలు అలా కూడ చేస్తారా?"

"సమయోచితంగా కార్యం చేయలేని వాడు రాజ్యాంగ దూతగా పనికిరాడు, తమ్ముడూ! ఇలాంటి అపాయం కలగొచ్చని ఊహించి ముందు జాగ్రత్తగా ఆ పని చేశాను. అందుకు చక్రవర్తినుంచి నాకు బహుమతి లభించింది."

ఇదంతా విన్న పరంజ్యోతి చాల ఆందోళనకు గురయ్యాడు. ఇలా ప్రయాణంలో రాత్రి బస

చేసేటప్పుడు ఇతరులు పడుకొనే గదిలో పడుకోకూడదని బౌద్ధభిక్షువు చేసిన హెచ్చరిక గుర్తుకొచ్చింది.

మంచివేళగా ఆ రాత్రి పడుకోవడానికి పరంజ్యోతికి ఒక విడి గదినే ఇచ్చారు. వజ్రబాహు కూడ, “తమ్ముడూ! ఇకమీదట నీదారి నీది. నాదారి నాది. నేను రేపు సూర్యోదయానికి మునుపే లేచి వెళ్ళిపోతాను. నీవు నాకు చాల నచ్చావు. ఎప్పుడైనా నీకేమైనా సహాయం కావాలంటే నా దగ్గరకు వచ్చి అడిగేందుకు జంకకు" అని చెప్పి సెలవు తీసుకొన్నాడు.

**పరంజ్యోతి** పడుకొనేటప్పుడు వజ్రబాహు చెప్పిన అనుభవం గుర్తుకొచ్చి, ఏదేమైనా తాను ఆదమరచి నిద్రపోకూడదని, ఏదైనా చిన్న శబ్దం విన్నా కూడ వెంటనే మేలుకోవాలని నిశ్చయించుకొన్నాడు. కానీ, పడుకొన్న కాసేపటికే, పగలంతా ప్రయాణం చేసి అలిసిపోయివుండడం వల్ల వెంటనే గాఢనిద్రలో మునిగిపోయాడు.

కానీ, అతడి నిద్ర ప్రశాంతమైన నిద్రగా లేదు. భయంకరమైన కలలు వచ్చిపోసాగాయి. ఎర్రటి మోదుగపూల కొండ అడవి ప్రాంతంలో ఆత్మరూపంలో వీరులు ఆయుధాలు ధరించి గుర్రాలమీద స్వైరవిహారం చేస్తున్నట్లు, వారి మధ్య తాను కూడ ఆత్మ రూపంలో ఒక గుర్రం మీద తిరుగాడుతున్నట్లు కలగన్నాడు. తిరిగి తిరిగి అలిసిపోయిన తర్వాత ఒక కొండగుహ లోపలికి వెళ్ళి పడుకొంటున్నాడు. కలలోపల కూడ నిద్రపోతున్నట్లు కలగంటున్నాడు! కానీ ఆ నిద్రలో మెలకువగా ఉన్నాడు. పిశాచాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చి అతడి నడుం బట్టను తడిమి చూస్తున్నాయి. 'మంచివేళ, పత్రం నడుంబట్టలో లేదు, తలగడ కిందవుంది' అని తనకు తానే చెప్పుకొంటున్నాడు. కళ్ళు తెరిచి చూస్తే ఆ పిశాచాలు పారిపోతాయని అనుకొంటున్నాడు. కానీ ఎంత ప్రయత్నించినా కళ్ళు తెరవలేకపోతున్నాడు.

తర్వాత ఎక్కడో దూరాన ఒక కొరివి దెయ్యం అగుపిస్తోంది. దాన్ని వెంటబెట్టుకొని ఒక నల్లపిశాచి తననే సమీపిస్తూంది! అవి చాల దగ్గరికి రాగానే ఆ కొరివిదెయ్యం నోటిలోపలి అగ్గినుంచి వస్తున్న వెలుతురుకు తట్టుకోలేక కళ్ళు తెరుచుకొంటున్నాయి.

కానీ, దగ్గరికొచ్చిన ఆకారాలు కొరివిదెయ్యమూ కాదు, నల్లపిశాచి కాదు అని అతడి కళ్ళే చెప్పాయి. వీరుడు వజ్రబాహు, అతడి వెనక ఆ విడిది ప్రధానాధికారి చేత దీపంతో వస్తున్నారు! పరంజ్యోతి అదిరిపడి లేచి కూర్చొన్నాడు. అతడి కుడిచేయి దగ్గరున్న శూలాన్ని పట్టింది.

~~~
~~~

# అధ్యాయం - 33

## పత్రాపహరణం

**వజ్రబాహు** శాంతస్వరంతో, “తమ్ముడూ, ఓపిక! శూలాన్ని చేపట్టే బదులు ఓపిక చేపట్టు. మేము దెయ్యాలు, పిశాచాలు కాము. నీవు నన్ను పరిహాసం ఛేశావు కద? కానీ నీవే దెయ్యాల కలగని పెట్టిన కేకలకు ఈ విడిదిలో నిద్రపోతున్న అందరూ మేల్కొనేశారు!” అన్నాడు.

పరంజ్యోతి తాను ఆ విధంగానే నిద్రలో వెర్రికేకలు పెట్టివుండాలని గ్రహించి కాస్త సిగ్గుపడి, దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక పేలవపు నవ్వు నవ్వేసి, శూలాన్ని పక్కకు పెట్టి, “పొద్దు పొడిచిందా? బయల్దేరుదామా?” అని అడిగాడు.

అందుకు వజ్రబాహు, “భలే అడిగావు, తమ్ముడూ! ఇంకా నడిరాత్రే. పగలే ఒంటరిగా ప్రయాణం చేసి భయపడ్డవాడివి ఈ నిశిరాత్రి లేచి వెళదామంటున్నావా? మధ్యదారిలో నీవు బెదిరిపోయి మూర్ఛవచ్చి పడిపోతే తర్వాత ఎవరు మీ అమ్మకు తెలియజెప్పేవారు? ఫరవాలేదు. నెమ్మదిగా నిద్రపో. ఉదయమే లేచి నీ ప్రయాణాన్ని ముందుకు కొనసాగించవచ్చు" అన్నాడు.

“మీరు చీకటిపడేటప్పుడు అలా దెయ్యాల కథలు చెప్పి భయపెట్టారు కద? అందుకే నాకలాంటి కలలొచ్చి బెదిరిపోయి అరిచాను" అన్నాడు పరంజ్యోతి, వజ్రబాహుదే తప్పంతా అన్నట్లు.

“పోనివ్వు. నీవు చీకటిలో మళ్ళీ భయపడకుండేందుకు ఈ దీపాన్ని ఇక్కడే పెట్టేసి వెళతాను. నెమ్మదిగా నిద్రపో" అని చెప్పి వజ్రబాహు విడిది ప్రధానాధికారి దగ్గర దీపాన్ని తీసుకొని, గదిలోవున్న మేడమీద పెట్టేసి ఇద్దరూ గది విడిచి అవతలికి వెళ్ళిపోయారు.

పరంజ్యోతి మళ్ళీ పడుకొన్నాడు. కానీ వెంటనే నిద్ర రాలేదు. కాసేపు అటూ ఇటూ దొర్లాడు. ఏవేవో ఆలోచనలు తోచసాగాయి, కానీ నిద్ర మాత్రం పట్టలేదు. తలగడ కింద దాచిన వెదురుబొంగు తీసి, దాని లోపలున్న తాళపత్ర సందేశాన్ని చేత తీసుకొని దీపం దగ్గరకు వెళ్ళి ఆ వెలుతురులో పరీక్షగా చూశాడు. సందేశం తమిళభాషలో లేదు. సంస్కృతమో, ప్రాకృతమో లాగుంది. కానీ పరంజ్యోతికి ఒక్క ముక్క కూడ అర్థం కాలేదు. తాను చక్కగా, బుద్ధిగా చదువు నేర్చుకోలేదు కద అని విచారించాడు.

దీపం దగ్గరినుంచి లేచి తానింతకు మునుపు పడుకొన్న చోటికి వెళ్ళి పడుకొందామని లేచాడు. కానీ రెండడుగులు వేసేలోపు విపరీతంగా నిద్ర ముంచుకొచ్చి దీపం పక్కనే నేలమీద పడి నిద్రలోకి జారిపోయాడు.

**కాసేపటి** తర్వాత వజ్రబాహు ఆ గది తలుపు నిశ్శబ్దంగా తెరిచి లోపలికొచ్చాడు. పరంజ్యోతి దీపం పక్కనే నేలమీద ఆదమరిచి నిద్రపోతుండడం, పక్కనే తాళపత్రమున్న వెదురుబొంగు పడివుండడం గమనించాడు. వెంటనే దాన్ని తీసుకొని గదినుంచి బయటికొచ్చి మళ్ళీ తలుపు దగ్గరగా వేసి, అక్కడినుంచి తాను బస చేసిన మూడవగదికి వెళ్ళాడు. ఆ గదిలో ఒక స్తంభదీపం ప్రకాశంగా వెలుగుతూంది. ఆ దీపం వెలుతుర్లో తాను పరంజ్యోతినుంచి అపహరించుకొని వచ్చిన తాళపత్ర సందేశాన్ని చదవనారంభించాడు. అది చదువుతున్నప్పుడు అతడి భ్రుకుటి ముడిపడింది. కాసేపు దీపాన్ని తదేకంగా చూస్తూన్నాడు. చివరికి నాలుగో ఆకు చదివి ముగించేటప్పటికి అతడి ముఖం ఉత్సాహంతో ప్రకాశించింది.

తర్వాత తనదగ్గరున్న నాలుగు ఖాళీ తాటి ఆకులను తీసి వాటిమీద గబగబా రాయసాగాడు. రాసి ముగించిన తర్వాత వాటిని పరంజ్యోతినుంచి ఎత్తుకొని వచ్చిన వాటితో పోల్చి చూసి, తృప్తిపడ్డాడు. పరంజ్యోతి తాళపత్రాల కట్టను అక్కడే పెట్టేసి వేగంగా అతడి గదికి వెళ్ళి ఇంకా అక్కడే నేలమీద ఇంతకు ముందు ఉన్న చోటే తాను రాసి తెచ్చిన తాళపత్రాల కట్టను పడేసి, దీపాన్ని ఆర్పేసి తిరిగి తన గదికి అతివేగంగాను, సద్దుచేయకుండాను వచ్చి చేరాడు.

తాను పరంజ్యోతినుంచి అపహరించి తీసుకొచ్చిన తాళపత్రసందేశాన్ని మళ్ళీ ఇంకొకసారి క్షుణ్ణంగా చదివాడు. తర్వాత ఆ కట్టనుంచి ఒక్కొక్క ఆకు తీసి తన దీపపు జ్వాలలో కాల్చాడు. అలా కాలుస్తున్నప్పుడు అతడి మనసు తీవ్రంగా ఆలోచిస్తూందని అతడి ముఖకవళికలు చెప్పాయి.

ఆ నాలుగు ఆకులను కాల్చి బూడిద చేసిన తర్వాత ఇంకో నాలుగు ఖాళీ ఆకులు తీసి, వాటి మీద ఘంటంతో రాయనారంభించాడు. కానీ ఇప్పుడు నిదానంగాను, సాలోచనగాను, అప్పుడప్పుడు ఆగుతూ రాశాడు. అతడు రాసి ముగించేటప్పటికి తూర్పున పొద్దు పొడుస్తోంది. అక్కడక్కడా ఒక్కొక్క పక్షి కూస్తూంది. నడి ఆకాశాన చుక్కలు పాలిపోతున్నాయి.

**పరంజ్యోతి** కళ్ళు తెరిచి చూసినప్పుడు గదిలోకి గవాక్షంగుండా ఉదయసూర్యుడి లేతకిరణాలు ప్రసరించి సన్నటి వెలుతురును పరుస్తున్నాయి. పక్కనే నేలమీద పడివున్న తాళపత్రాల కట్టను కంగారుగా తీసుకొని మళ్ళీ వెదురుబొంగులో దూర్చిపెట్టి నడుం బట్టలో కట్టుకొన్నాడు. గతరాత్రి తాను కన్న భయంకరమైన కలలు, తన కేకలు విని వచ్చిన వజ్రబాహు, విడిది ప్రధానాదికారి తనకు ధైర్యం చెప్పి దీపాన్ని అక్కడ పెట్టి వెళ్ళడం, తర్వాత నిద్ర రాక దీపం దగ్గర కూర్చొని తదేకంగా ఆ తాళపత్రాలను చదవ ప్రయత్నించడం, నిద్ర ముంచుకు రాగా అక్కడే నేలమీద నిద్రలోకి జారిపోవడం అంతా గుర్తుకొచ్చింది. అతడి తల ఇంకా తిరుగుతున్నట్లనిపించింది.

ఆ గదిలో ఒక అపూర్వమైన వాసన పరుచుకొని ఉండడాన్ని గ్రహించాడు. కానీ, తాను

అజాగ్రతగా ఆ ముఖ్యమైన తాళపత్రసందేశాన్ని నేలమీదే పడేసిన విషయమే అతన్ని చాల కలవరపరుస్తూ ఇతర ఆలోచనలను పక్కకు నెట్టింది. అదే సమయాన బయట గుర్రపు డెక్కల చప్పుడు వినరాగా, అదిరిపడి కిందా మీదా పడి లేచి గదినుంచి బయటికి పరుగెత్తి వెళ్ళి చూశాడు. అక్కడ విడిది ప్రధానాదికారి, నలుగురు వీరులు నిల్చొని దూరాన వెళుతున్న గుర్రాన్ని చూస్తూండడం కనిపించింది.

"ఓహో! వజ్రబాహు వెళుతున్నారు! అంతలోపే బయల్దేరేశారా?" అని పరంజ్యోతి సన్నగా గొణగడం వినిపించి వారు తిరిగి చూశారు.

గుర్రం కనుమరుగైన తర్వాత, "అయ్యా! ఆ వజ్రబాహు ఎవరని మీకు తెలుసా?" అని పరంజ్యోతి వారిని అడిగాడు.

"మేమే నిన్నడగాలని అనుకొంటున్నాం కద?" అన్నాడు కాపలా వీరుల్లో ఒకడు.

"ఎవరని తెలియకనే ఆయనకు అంత మర్యాదలు చేశారా?" అని ఆశ్చర్యంతో అడిగాడు పరంజ్యోతి.

"ఆయన ఎవరని తెలియకపోయినా, సింహ చిహ్నం ముద్రించిన రాజముద్రను చూపించాడు కద, అందుకే."

"సింహ చిహ్నం అంత విశేషం కలిగినదా?"

"అది ఆయన దగ్గర ఉండడం వల్ల ఆయన ఒక ప్రముఖ రాజ్యాంగ దూత అని తెలిసింది మాకు. అందుకే ఆయనకు అంత మర్యాదలు చేశాము" అన్నాడు విడిది ప్రధానాధికారి.

"ఆయన ఎవరై ఉండవచ్చు?" అని ఒక కాపలా వీరుడు తక్కిన వీరులను అడిగాడు.

"మంత్రివర్గంలో ఒకరై ఉండవచ్చు" అన్నాడు ఇంకొక వీరుడు.

"సేనాధిపతి కలిప్పగైగారిని పదవినుంచి తీసేసి ఇంకొక సేనాధిపతిని చక్రవర్తి పంపబోతున్నారని విన్నాను. ఈ వ్యక్తి బహుశ కొత్త సేనాధిపతి అయివుండవచ్చు" అన్నాడు మరొక కాపలా వీరుడు.

"సేనాధిపతిని మార్చేందుకు కారణమేమి? నీకు తెలుసా?" అని అడిగాడు విడిది ప్రధానాధికారి.

"మరింకేం కారణం కావాలి? వాతాపి సైన్యం ఉత్తరపెన్నను సమీపించేసిందని వార్త. అలా ఉండగా సేనాధిపతి ఉత్తరాన ఉన్న సైన్యాన్ని అక్కడే పెట్టేసి కంచికి వెళ్ళి చక్రవర్తిని ఏం చేయాలని అడిగారట! అది చాలదా? చక్రవర్తికి కోపమొచ్చి, 'మీరు సేనాధిపతి పదవి నిర్వహించింది చాలు' అని చెప్పేశారట!"

ఈ సంభాషణను వింటున్న పరంజ్యోతి, "అయ్యా! నా గుర్రమెక్కడ? నేను కూడ బయల్దేరాలి"

అన్నాడు.

పరంజ్యోతిని వారు ఇంకాస్త విచారించేసి, “నీవెక్కడికి వెళ్ళాలి?” అని అడిగారు.

“నేను కృష్ణానది (ఉత్తర పెన్న ) తీరానున్న శ్రీపర్వతం మీది బౌద్ధమఠానికి వెళ్ళాలి. ఇంకా ఎంత దూరం?” అని అడిగాడు పరంజ్యోతి.

వారు వజ్రబాహు వెళ్ళిన దిక్కును చూపి, “ఆ దిశగా వెళితే మిట్ట మధ్యాహ్నవేళకు ఉత్తరపెన్న చేరుకోవచ్చు. ఆ నదీతీరం వెంబడి పశ్చిమంగా వెళ్ళాలి. పాపాగ్ని నది ఉత్తర పెన్నను కలుసుకొనే చోటే ఆ బౌద్ధమఠం ఉంది" అని చెప్పి అతడి గుర్రాన్ని తీసుకొచ్చి ఇచ్చారా కాపలా వీరులు.

పరంజ్యోతి గుర్రంమీదెక్కి కూర్చొన్నప్పుడు, అరెరె, తాను కూడ ఆ వీరుని వెంటే బయల్దేరి ఉంటే దారి పొడుగునా అలసట తెలియకుండ చాల ఆసక్తికరమైన కథలు వింటూ వెళ్ళివుండవచ్చు కద అనుకొన్నాడు.

~~~
~~~

# అధ్యాయం - 34

## మఠాలయం

**పరంజ్యోతికి** గత అధ్యాయంలో చెప్పిన అనుభవాలు కలిగిన అదేరోజు సాయంత్రం, కంచి మహానగరంలో అతడి గురించి కుమార చక్రవర్తి, నావుక్కరసర్ స్వాములు మాట్లాడుకొంటున్నారు.

**మామల్లపురం** నుంచి తిరిగి వచ్చిన రాత్రి మహేంద్ర పల్లవ చక్రవర్తి తమ కుమారుని వెంటబెట్టుకొని మారువేషంలో కోటనుంచి బయటకు వచ్చారు. గుర్రాలను ఒక మరుగైన ప్రదేశాన నిలిపి, కాలినడకన చుక్కల మసక వెలుతురులో కోట చుట్టూ ఉన్న అగడ్త గట్టు వెంబడి నడిచి వెళ్ళసాగారు.

ఉన్నట్లుండి అగడ్తలో పడవ వెళ్ళే శబ్దం వినిపించి నరసింహవర్మ అమితాశ్చర్యంగొన్నారు. చక్రవర్తి నరసింహవర్మకు నిశ్శబ్దంగా ఉండమని సైగచేశారు. తర్వాత ఇద్దరూ ఒక పొద వెనక దాక్కొన్నారు.

అగడ్తలో వెళుతున్న పడవ అవతలి గట్టు, అంటే కోట గోడ వారగా, చేరగానే దానిలోనుంచి ఇద్దరు దిగారు. తర్వాత దాన్ని ఇద్దరూ లాక్కొని వెళ్ళి కోట గోడ పక్కన దట్టంగా పెరిగివున్న ఒక పొద వెనక దాచిపెట్టారు. మరుక్షణం ఇద్దరూ మాయమైనారు! ఆ కోట గోడ వారిని మింగేసిందా?

ఇదంతా గమనిస్తున్న కుమార చక్రవర్తి పొందిన దిగ్భ్రమ నుంచి తెరుకొనేలోపు ఇంకొక ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. పక్కనున్న ఇంకొక పొద వెనకనుంచి ఉన్నట్లుండి ఒక మనిషి బయటికొచ్చాడు. అతడు చక్రవర్తికి నమస్కరించి వినయంగా నిలబడ్డాడు.

అతడిని చూసి ఏమాత్రం ఆశ్చర్యపడని చక్రవర్తి, "శత్రుఘ్నా! ఈ గోడలో ఉన్న తలుపు ఎక్కడ వెళ్ళి తెరుచుకొంటుందని ఊహిస్తున్నావు?" అని అడిగారు.

"రాజవిహారంలో బుద్ధుని విగ్రహం వెనక తెరుచుకోవచ్చని ఊహిస్తున్నాను, ప్రభూ!" అన్నాడు శత్రుఘ్నుడు.

"కోటగోడలో తలుపు అమర్చినవాడు చాల సమర్థుడైవుండాలి!" అన్నారు చక్రవర్తి.

"వాడికన్న దానిమీద రంగు పూసినవాడు మరింత గట్టివాడైవుండాలి, ప్రభూ! పగలంతా వెతికి చూసినా నేను ఆ తలుపెక్కడుందో కనుక్కోలేకపోయాను."

"చాల మంచిది, శత్రుఘ్నా! రేపు నేను ఉత్తరదిశగా వెళుతున్నాను. కానీ నీవిక్కడే ఉండాలి. నీకు ఇంకొక ఆజ్ఞ వచ్చేవరకు నీవు ఈ నాగనంది వెంటనంటే ఉండాలి."

“తొండైనాడు విడిచి బయటికి వెళితే…”

“అప్పుడు కూడా.”

“చోళనాడు, పాండ్యనాడుకు వెళితే…”

“వెన్నంటే వెళ్ళాలి. ఎవరిచేతనైనా భిక్షువు తాళపత్రం రాసి పంపిస్తే..”

“ఏం చేయాలని తెలుసు, స్వామీ! కానీ చెంగాట్టంగుడి యువకుని ద్వారా ఆయన పంపిస్తున్న పత్రం…”

“అది నేను చూసుకొంటాను. ఏ కారణం వల్లనూ నాగనంది నీ కంటిచూపునుంచి జారిపోకూడదు. ఏదైనా విశేషం ఉంటే నాకు వెంటనే వార్త పంపాలి.”

“ఆజ్ఞ, ప్రభూ!”

చక్రవర్తి, నరసింహవర్మ రాజగృహానికి వెనుదిరిగినప్పుడు, కుమార చక్రవర్తి, “రాజవిహారాన్ని మూసేసి, కోటగోడలో ఉన్న ఆ తలుపును కూడ మూసేయాలి కద?” అని అడిగారు.

“కూడదు, అబ్బాయీ! అందుకు తగిన సమయం వచ్చినప్పుడు చేద్దాం. ఇప్పుడు పగవారి కుట్ర తెలుసుకోవడానికి ఆ రహస్యద్వారం మనకు చాల ఉపయోగపడుతుంది" అన్నారు చక్రవర్తి.

చక్రవర్తి ఉత్తరదిశగా ప్రయాణమై వెళ్ళిన తర్వాత కుమార చక్రవర్తికి కోట లోపల చేసేందుకు పనేమీ లేక చాల విసుగుపుడుతూంది. ఆయనెందుకు తాను కోట దాటకూడదని చెప్పి మాట తీసుకొన్నారని తెలుసు. కానీ రాజ్యంలో పెద్ద యుద్ధం రాబోతున్నా కోటలోపలే ఏమీ చేయకుండ కూర్చోవడం ఆయనకు చాల అసహనంగా ఉంది. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. చివరికి శివకామిని కూడ వెళ్ళి చూడలేని పరిస్థితి. తాము చక్రవర్తికి ఇచ్చినమాట ఆమెకు తెలిసే అవకాశం లేదు. అయినా తన మీద కోపంగొని ఉంటుంది.

ఇలాంటి ఆలోచనలతో ఆయన మనసు కలతబారి ఉన్నప్పుడు ఒకరోజు నావుక్కరసర్ స్వాములు కంచికి తిరిగి వచ్చారన్న వార్త వచ్చింది. వెంటనే ఆయనను వెళ్ళి దర్శించుకొందామనుకొన్నారు. అలాగే చక్రవర్తి ఆయనకు తెలియజేయమని చెప్పిన ఒక ముఖ్యమైన సమాచారం కూడ ఉంది. కాబట్టి ఒక రోజు సాయంత్రం ఏకాంబరేశ్వర దేవాలయంలో ఉన్న స్వాముల మఠానికి బయల్దేరి వెళ్ళారు.

స్వాములు  నరసింహవర్మను సాదరంగా ఆహ్వానించి , తమ స్థలయాత్రల విశేషాలను వివరించి చెప్పారు. చక్రవర్తి ఉత్తరదేశానికి వెళ్ళిన విషయం, రాజ్యంలో పెద్ద యుద్ధం రాబోతున్న విషయం అడిగి

తెలుసుకొన్నారు.

తర్వాత స్వాములు ఇలా అన్నారు: "మహామల్లుగారూ! చక్రవర్తికి నేనొక విషయం చెప్పదలుచుకొన్నాను. ఆయన ప్రయాణం మీద వెళ్ళడం వల్ల ఇప్పుడు మీకే చెబుతాను. ఈ మఠం నగరం మధ్యలో ఉండడం వల్ల ఇక్కడ ప్రశాంతత లేదు. పైగా మన శిష్యులకు, పక్కనే ఉన్న పాఠశాలలో ఉత్తరభాష నేర్చుకొంటున్న విద్యార్థులకు మధ్య ఎప్పుడూ వాగ్వివాదాలు జరుగుతున్నాయి. ఆర్యభాషను, తమిళభాషను ప్రసాదించింది శివపరమాత్మే అని వారికి ఎంత చెప్పినా వినిపించుకోరు. ఆ చిన్నవయసులో అలాంటి దుడుకుతనం సహజమే. తర్వాత, ఏకాంబరేశ్వరుని ఆలయంలో తిష్టవేసిన కాపాలికుల బెడద ఓర్చుకోవడం చాల కష్టమైపోతూంది. ఇవన్నీ ఆలోచించి, నేనొక నిర్ధారానికొచ్చాను. నగరానికి దూరంగా తిరుమేట్రళిలో విలసిల్లిన ఈశ్వరుని సన్నిధికి వెళ్ళిపోదామనుకొంటున్నాను. అక్కడ చాల ప్రశాంతంగా ఉంది."

స్వాములు  చెప్పింది శ్రద్ధగా విన్న కుమార చక్రవర్తి, "స్వామీ! నేను ఈ కాపాలికులను ఈ గుడినుంచి బయటికి తరిమేయాలన్నాను. మీరే వద్దన్నారు. ఇప్పుడు మీరు తిరుమేట్రళిలో మఠం ఏర్పాటు చేసుకోవాలని ఆశిస్తే అందుకు ఆక్షేపణ లేదు. కానీ చక్రవర్తి తెలియజేయమని చెప్పిన విషయాన్ని మీకు చెబుతాను. అది విన్న తర్వాత మీకేది ఉచితమని తోస్తే అలాగే చేయండి. వస్తున్న ఈ మహాయుద్ధం ఒక కొలిక్కి వచ్చేంతవరకు మీరు ఈ కంచి నగరాన్ని విడిచి చోళదేశానికి, పాండ్యదేశానికి స్థలయాత్ర వెళ్ళడం క్షేమమని చక్రవర్తి అభిప్రాయపడ్డారు. మీరు తిరిగి వచ్చేవరకు మీ మఠాన్ని మూసివుంచడం కూడ మంచిదని చెప్పారు. ఇందుగురించి మీరు ఆలోచించి ఉచితమైన నిర్ణయాన్ని తీసుకోవచ్చు" అన్నారు.

స్వాములు కాసేపు ఆలోచించిన తర్వాత, "చక్రవర్తి ఆలోచన నాకు కూడ సమ్మతంగానే అనిపిస్తూంది. కానీ ముందుగానే తెలియకపోయింది. తిరుమేట్రళిలో మఠకైంకర్యం ప్రారంభించేందుకు ఆయనర్ శిల్పాచార్యులను రమ్మని చెప్పివున్నాను. ఒకవిధంగా అది కూడ మంచిదే. దీర్ఘయాత్రకు మునుపు ఆయనర్ శిల్పాచార్యులను ఒకసారి చూసి వెళ్ళవచ్చు" అన్నారు.

ఆయనర్ వస్తున్నారని విన్న వెంటనే నరసింహవర్మ మనసులో కుతూహలం పుట్టింది. "ఆయనర్ ఎప్పుడు వస్తున్నారు, స్వామీ?" అని ఆతురతతో అడిగారు.

"ఒకవేళ ఈరోజు సాయంత్రమే రావచ్చు" అని స్వాములు చెప్పగానే, నరసింహవర్మ ఆరోజు సాయంత్రం వరకు అక్కడే ఉండాలని తీర్మానించుకొన్నారు. తర్వాత, "స్వామీ! తిరుచెంగాట్టంగుడి నుంచి మీకు ఒక తాళపత్ర సందేశం తెచ్చిన యువకుని ఇప్పుడు ఆయనర్ నాగార్జునపర్వతానికి పంపారు కద, ఆ విషయం మీకు తెలుసా?" అని అడిగారు.

స్వాములు ఆ విషయం తెలియదని చెప్పగా, నరసింహవర్మ తమకు పరంజ్యోతి గురించి తెలిసిన వివరాలను చెప్పారు.

వారు మాట్లాడుకొంటున్నప్పుడే స్వాముల శిష్యుడొకడు వేగంగా లోపలికొచ్చి, “ఆయనర్ వస్తున్నారు!” అని తెలియజేయగా, అందరి చూపులు వాకిలివైపు తిరిగాయి.

~~~
~~~

# అధ్యాయం - 35

## ద్వితీయ రంగప్రవేశం

**తిరునావుక్కరసు** స్వాములకప్పుడు సుమారు యాభైయేళ్ళ వయసు. సదా ఈశ్వరధ్యానంలో ఉండే ఆయన ముఖం ఒక అపూర్వమైన తేజస్సుతో ఎప్పుడూ ప్రకాశిస్తూంటుంది. ఇంకే స్వాముల దగ్గర కూడ చూడలేని ఒక విచిత్రమైన పరికరం ఆయన భుజం మీద ఎప్పుడూ ఆనివుంటుంది - వెళ్ళిన చోటల్లా ఉడతాభక్తిగా దేవాలయాల ప్రాంగణాల రాళ్ళ మధ్య మొలిచే గడ్డిని చెక్కి తీసి శుభ్రం చేసేందుకు ఆయన  తన వెంట ఎప్పుడూ తీసుకొని వెళ్ళే పరికరం అది. ఆయనలా గుడిగోడలను శుభ్రం చేయడం చూసి స్ఫూర్తి పొందిన స్థానిక ప్రజలు తమ తమ దేవాలయాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకొనేవారు.

ఆయనకు దేశమంతా తిరిగి అన్ని శివాలయాలకు వెళ్ళి సేవ చేసి ఆ ఆలయంలో విలసిల్లిన దేవతామూర్తిమీద భక్తిపాటలు ఆశువుగా పాడడం పరిపాటి. ఆయా ఆలయాలకు వచ్చే భక్తులు చాల భక్తిశ్రద్ధలతో ఆ పాటలను తాళపత్రాల మీద రాసి పదిలం చేసుకొని తమ జీవితం తరించిందని పరవశించేవారు.

ఆరోజు సాయంత్రం స్వాముల శిష్యుడొకడు పల్లవ సామ్రాజ్యంలోనే అతిప్రసిద్ధులైన ఆయనర్ శిల్పాచార్యులు ఆగమనాన్ని ప్రకటించగానే అక్కడున్న అందరూ, స్వాములతోబాటు, చాల ఆతురతతో మఠం ప్రధానద్వారంవైపు తమ చూపులు సారించారు.

కానీ, అందరికన్న ఎక్కువ ఆసక్తి, ఆతురత, కొంత కలవరపాటు మిళితమైన చూపులతో ఎవరు ఆ వాకిలివైపు చూస్తూంటారని పాఠకులు ఊహించగలరు కద? మరెవరు? ఆయనర్ శిల్పాచార్యులతోబాటు ఆయన కుమార్తె శివకామి కూడ తప్పక వస్తుందని ఎదురుచూస్తున్న కుమార చక్రవర్తే.

కుమార చక్రవర్తి ఆశ వమ్ము కాలేదు. అదిగో! ఆయనర్ శిల్పి వాకిలి దాటి లోపలికొస్తున్నారు. ఆయన వెనకే ఘల్లుఘల్లుమని గజ్జెల శబ్దం!

కుమార చక్రవర్తి శివకామిని చూశారు. ఆమె కూడ ఆయనను మొట్టమొదటిసారి చూస్తున్నట్లు ఆతురతతో ఆయన చూపులతో చూపులు కలిపింది. వాడిన పూవులాగున్న ఆమె ముఖం విప్పారింది. కానీ అది ఒక క్షణం మాత్రమే. వెంటనే ఆయనమీద కోపంగొని తల దించుకొంది.

ఇలా వీరిద్దరి మధ్య ఇంకెవరూ గమనించలేనట్లు రహస్యంగా కనుచూపుల సంభాషణ నడుస్తున్నప్పుడు వారి చుట్టూ మఠాలయంలో పెద్ద కలకలం లేచింది.

వినయానికి పేరుగాంచిన స్వాములు తమ పీఠంమీదినుంచి లేచి ముందుకు వచ్చి, “శిల్పకళా చక్రవర్తికి స్వాగతం!” అని ఆహ్వానించారు. అది విన్న ఆయనర్ శిల్పి కంగారుతో, “అపచారం! అపచారం!” అంటూ ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశారు.

అందరూ మళ్ళీ కూర్చొన్న తర్వాత కూడ శివకామి మాత్రం కూర్చోక తన తండ్రి వెనక ఒద్దికగా నిలుచొంది. అప్పుడే ఆమెను గమనించిన స్వాములు, “ఆహా! ఈ అమ్మాయి ఎవరు, ఆయనర్‌గారూ? మీ పుత్రిక శివకామియేనా?” అని అడిగారు. అందుకు శిల్పాచార్యులు, “అవును, స్వామీ! తాను మిమ్మల్ని దర్శించాలని కోరింది. అందుకే నాతోబాటు పిలుచుకొని వచ్చాను" అన్నారు.

“చాల సంతోషం. తమ కుమార్తెను చూడాలని నేను కూడ చాల ఆసక్తిగొన్నాను. తాను భరతనాట్యకళలో చాల నైపుణ్యత సాధించిందని విన్నాను. ఇటీవలే రంగప్రవేశం కూడ జరిగిందట కద? అది చూసేందుకు నేనిక్కడ కంచిలో లేకపోయాను" అన్నారు స్వాములు.

“నాకు కూడ అందుగురించి విచారమే, స్వామీ! ఆరోజు శివకామి నాట్యం చూసి రుద్రాచార్యులే దిగ్భ్రమించిపోయారు. చిత్రం, శిల్పం, సంగీతం మొదలైన కళలన్నిటికీ మూలం నాట్యమే అయివుండాలన్నారు. 'శివకామి నాట్యం చూసిన తర్వాత నేను సంగీతకళలో నేర్చుకోవలసింది చాల ఉంద'న్నారు రుద్రాచార్యులు.”

ఆయనర్ శిల్పి తమ కుమార్తె నాట్యకళ గురించి ఇలా చెబుతున్నప్పుడు ఆయన స్వరంలో అభిమానం తొణికింది.

అప్పుడు నావుక్కరసు స్వాములు, “శిల్పాచార్యా! సృష్టి, స్థితి, లయ అనే మూడు క్రియలకు మూలం నాట్యమే! బ్రహ్మాండాన్ని సృష్టించి, కాపాడి, తుడిచేస్తున్న ఆ పరమాత్మ కైలాసంలో చిద్విలాసంగా నాట్యమాడుతున్నాడు కద?” అన్నారు.

అందాక మౌనంగా ఉన్న కుమార చక్రవర్తి, “స్వామీ! నటరాజస్వామి ఆనంద నాట్యం గురించి మీరు రచించిన ఒక పాటను ఆయనర్ కుమార్తె ఆరోజు అభినయించి చూపింది. అది మీరు చూసి తీరాలి!” అన్నారు.

“అవును,స్వామీ! మీరు రచించిన మూడు పాటలను శివకామి అభినయించాలనుకొంది. కానీ తన రంగప్రవేశం మధ్యలో ఆగిపోయిన విషయం మీరు వినేవుంటారనుకొంటాను" అన్నారు ఆయనర్.

“విన్నాను, ఆయనర్‌గారూ! వస్తున్న యుద్ధంవల్ల శివకామి రంగప్రవేశం మాత్రమేనా

ఆగిపోయింది? ఇంకెన్నో కార్యాలకు ఆటంకం కలిగేలా ఉంది. నేను మిమ్మల్ని పిలిపించిన కార్యం కూడ అంతే!" అన్నారు స్వాములు.

"స్వామీ! నన్ను ఏ కార్యం మీద పిలిపించారు?" అని అడిగారు ఆయనర్ శిల్పి.

"మన మఠాన్ని ఏకాంబరేశ్వరాలయంనుంచి తిరుమేట్రళికి తీసుకొని వెళదామని ఆశిస్తున్నాను. ఇది నగరం మధ్యలో ఉండడంవల్ల విద్యార్థులకు ప్రశాంతంగా చదువుకోవడానికి అనుకూలంగా లేదు. అయితే తిరుమేట్రళిలో చాల ప్రశాంతంగా ఉంది. గుడి చుట్టూ ఉన్న పూలతోటవల్ల ఆ ప్రదేశం చాల ప్రశాంతంగాను, మనోహరంగాను, విద్యాభ్యాసానికి, దైవధ్యానానికి అనువుగాను ఉంది. "

"స్వామీ! తిరుమేట్రళి మీద తమరు రచించిన పాట ఏదైనా ఉందా?" అని శిల్పాచార్యులు అడగగానే, స్వాములు తమ శిష్యులవైపు చూశారు. వారిలో ఒకరు వెంటనే లేచి, ఆ క్షేత్రం గురించి స్వాములు రచించిన గీతాన్ని ఇంపైన గొంతుతో భక్తిపారవశ్యంతో పాడి వినిపించారు.

తమ శిష్యుడు ఆ పాటను పాడుతున్నప్పుడు స్వాముల అరమోడ్పు కనులవెంట భక్తిబాష్పాలు ప్రవహించసాగాయి. ఆయన వదనం అనిర్వచనీయమైన తేజస్సుతో ప్రకాశించింది. ఆయన తన అంతర్నేత్రంతో శివపరమాత్మనే చూస్తున్నట్లు అక్కడున్నవారందరికీ అనిపించింది.

స్వాములు  తమ భక్తిపారవశ్యంనుంచి వెలువడి తమ చుట్టు ఉన్న అందరిని పరికించి చూసినప్పుడు, ఆయనర్ శిల్పాచార్యులు, "స్వామీ! తమ గీతం వల్ల ఈ కంచి మహానగరం, తిరుమేట్రళి కూడ అమరమైనాయి. మీ కోరిక ప్రకారమే తిరుమేట్రళిలో మఠకైంకర్యం మొదలుపెట్టేందుకు సిద్ధంగా ఉన్నాను. కానీ చక్రవర్తి మామల్లపురంలో ఒక ముఖ్యమైన కార్యాన్ని పూర్తిచేయాలని ఆజ్ఞాపించివున్నారు. ఏది మొదట చేయాలన్నది కుమార చక్రవర్తి సెలవివ్వాలి" అన్నారు.

ఆయనర్ ప్రశ్నకు కుమార  చక్రవర్తి ఉత్తరమిచ్చేలోపు స్వాములు, "దానికి ఇప్పుడు అవశ్యకతే లేదు, శిల్పాచార్యా! మీరు వచ్చేటప్పుడే మహామల్లు, చక్రవర్తి అభిప్రాయాన్ని నాకు తెలియజేస్తూన్నారు. యుద్ధం ముగిసేవరకు నన్ను శిష్యులతోబాటు చోళనాడులోను, పాండ్యనాడులోను ఉన్న దివ్యక్షేత్రాలను దర్శించుకొని రమ్మని సూచించారు. నాకు కూడ చాలకాలంగా ఆ కోరిక ఉంది. కంచి కోటను బహుశ పగవారు ముట్టడించవచ్చు. అటువంటి సమయంలో నావంటి సన్యాసులు కాస్త దూరంగా తొలగివుందడమే ఉచితమనిపిస్తుంది" అన్నారు.

ఇలా నావుక్కరసర్ స్వాములు చెప్పగా విని నరసింహవర్మ, "స్వామీ! తమరు వెలిబుచ్చిన అభిప్రాయం చాల సమయోచితంగాను, సముచితంగాను ఉంది. దాన్ని ఒప్పుకొని జైన మునులు, బౌద్ధ భిక్షువులు రాజకీయ విషయాల్లో తలదూర్చకుంటే ఎంత బాగుంటుంది?" అన్నారు.

బౌద్ధభిక్షువు అన్న మాట వినగానే ఆయనర్ శిల్పికి చురుక్కుమంది. దానితోబాటు పరంజ్యోతి కూడ గుర్తొచ్చాడు. అప్పుడాయన స్వాములతో, "స్వామీ! నేను మీకొక విషయం చెప్పడానికి మరచాను. తమ మఠంలో చేరి తమిళం నేర్చుకోవాలని చోళనాడులో ఉన్న తిరుచెంగాట్టంగుడి అనే ఊరినుంచి పరంజ్యోతి అనే ఒక అబ్బాయి వచ్చాడు. తిరువెంగాడు నమశ్శివాయ వైద్యులనుంచి నాకు, తమకు కూడ పత్రం తీసుకొని వచ్చాడు. అజంతా చిత్రాల గురించిన ఒక మహారహస్యాన్ని తెలుసుకొని రావడానికి నేనతన్ని నాగార్జునకొండకు పంపాను..."

"అంత దూరం పంపారా? అక్కడల్లా యుద్ధం జరుగుతున్నట్లుంది కద? చిన్న పిల్లాడు అని చెబుతున్నారు?" అని స్వాములు కాస్త దిగులుగా అడిగారు.

"చిన్నపిల్లాడైనా పెద్ద వీరుడు, స్వామీ! మదపుటేనుగు మీదికి శూలం విసరగల ధైర్యం, శౌర్యంగలవాడు" అని చెప్పి పరంజ్యోతి తమని, శివకామిని అరంగేట్రం (రంగప్రవేశం) రోజు మదపుటేనుగు బారినుంచి రక్షించిన వృత్తాంతాన్ని వివరించారు.

చివరిగా, "పరంజ్యోతి తిరిగి రాగానే మీదగ్గరికి పంపించేస్తాను, స్వామీ!" అన్నారు.

"వద్దు, శిల్పాచార్యా! ఆ అబ్బాయి మీ దగ్గర శిష్యరికం మొదలుపెట్టాడు కద? అలాగే మీ దగ్గర శిల్పకళను నేర్చుకోనివ్వండి. శిల్పకళకన్న లోకంలో గొప్పదైన కళ ఇంకేముంది...?" అన్నారు.

అప్పుడు ఆయనర్ అడ్డుపడి, "గురుదేవా! శిల్పకళకన్న గొప్పదైన కళ ఇంకొకటుంది. మేము సృష్టించే రాతిగుళ్ళు కాలప్రవాహంలో మరుగైపోవచ్చు. కానీ గురుదేవులు సృజించిన దైవభక్తిగీతాలు అమరగీతాలుగా మిగిలిపోతాయి!" అన్నారు.

అప్పుడు కుమార చక్రవర్తి, "కాసేపటి క్రితం తమరిద్దరూ మాట్లాడి తీర్మానించిన విషయాన్ని మరిచిపోయినట్లున్నారు. అన్ని కళలకు ఆధారం నాట్యమే కద?" అనగానే అక్కడున్న అందరి ముఖాల్లోను చిరునవ్వు విరిసింది. కానీ శివకామి మాత్రం వంచిన తల ఎత్తలేదు.

స్వాములు, "మంచిది, కుమార చక్రవర్తి! మీరన్నట్లు అన్ని కళలకు మూలం నాట్యమే. ఆ నటరాజమూర్తి ముందు నిలిచినప్పుడు భక్తిపొంగివచ్చినట్లు ఇంకే మూర్తి ముందు నిలిచినప్పుడు కూడ భక్తి పొంగిరావడం లేదు" అని చెప్పి, ఆయనర్‌గారిని చూసి, "శిల్పాచార్యా! తమ కుమారి నాట్యాన్ని నేను చూడవద్దా? నేను దక్షిణదేశానికి తీర్థయాత్రకు వెళితే ఎప్పుడు తిరిగివస్తానో తెలియదు. దేశమంతా పొగడుతున్న శివకామి నాట్యాన్ని చూడకుండ వెళ్ళేందుకు నా మనసొప్పడం లేదు. ఒకే ఒక పాటను అభినయించి చూపితే కూడ చాలు!" అన్నారు.

ఆయనర్, "స్వామీ! అది శివకామి భాగ్యం!" అని చెప్పి, తమ వెనుక ఉన్న శివకామిని తిరిగి

చూశారు. ఆమె ముభావంగా తలవంచుకొని ఉండడం గమనించగానే ఆయనకు ఆశ్చర్యం కలిగింది.

ఇదంతా గమనించిన మహామల్లు, "ఒకవేళ నేనిక్కడ ఉండడం వల్ల శివకామి నాట్యమాడేందుకు ఇష్టపడడం లేదేమో! స్వామీ, సెలవివ్వండి! వెళ్ళి వస్తాను" అని స్వాములను చూసి అన్నారు.

ఈ మాట వినగానే శివకామి చటుక్కున లేచి నిలబడి, "నాన్నా! ఏ పాటను అభినయించి చూపాలి, చెప్పండి!" అన్నది.

"ఆ శివపరమాత్మ ఆనంద తాండవాన్ని వర్ణించే గీతాన్ని మొదట పాడి అభినయించు, బిడ్డా!" అన్నారు ఆయనర్ శిల్పాచార్యులు.

ఆ విధంగా శివకామి రెండవ రంగప్రవేశం స్వాములు, కుమార చక్రవర్తి, శిల్పాచార్యుల సమక్షాన మొదలైంది.

మలయమారుతం మీద తేలుతూ వచ్చే తుమ్మెద ఝుంకారనాదంవంటి స్వరంతో పాడుతూ, పల్లవికి అనుగుణంగా తన గజ్జెలను ఘల్లుఘల్లుమనిపిస్తూ శివకామి ఆ భక్తిపూరితమైన గీతాన్ని తన నాట్యంతో అభినయించగా అక్కడున్నవారందరూ ఇహలోకాన్ని మరిచి కైలాసానికే వెళ్ళిపోయారు. తమ కళ్ళ ముందున్నది శివకామి కాదు, సాక్షాత్తు శివపరమాత్మే అని వారికనిపించింది!

పాట, అభినయం పూర్తయిన కాసేపటి తర్వాతే అందరూ ఇహలోకానికి తిరిగివచ్చారు.

స్వాములు గద్గద స్వరంతో, "శిల్పాచార్యా! శ్రీకైలాసంలో విలసిల్లిన శివపరమాత్మను తమ కుమారి మా ముందు ప్రత్యక్షం చేసింది!" అన్నారు.

ఆయనర్ కూడ కళ్ళలో ఆనందబాష్పాలు ఉబికిరాగా, "అంతా తమ ఆశీర్వాదం, స్వామీ!" అని చెప్పి, శివకామిని చూసి, "ఇంకొక పాటను అభినయించి చూపుతావా, అమ్మా?" అని అడిగారు.

~~~
~~~

# అధ్యాయం - 36

## వాగీశ్వరుల[4] ఆశీర్వాదం

**ఆయనర్** తమ కుమార్తెను రెండవదిగా పాడి అభినయించమని కోరిన పాట 'అగత్తురై[5]' నుంచి ఎన్నుకొన్న ఒక అపూర్వ, అలౌకిక భక్తి/ప్రేమ గీతం.

బాల్య, కౌమార దశలను దాటి యవ్వనంలో అప్పుడే అడుగుపెట్టిన ఒక కన్య మొట్టమొదటిసారిగా దేవుని పేరు విన్నది. వినగానే ఆమె హృదయంలో ఉదయించిన భక్తి ప్రేమగా మారింది. తర్వాత అంచెలంచెలుగా పెరుగుతూ వచ్చింది. ఆ వృత్తాంతాన్ని అద్భుతంగా వర్ణించే గీతమది.

పాటను ఒకసారి పూర్తిగా పాడి వినిపించిన తర్వాత శివకామి పాటను నాట్యరూపంలో అభినయించనారంభించినప్పుడు అక్కడున్నవారందరికి ఈ లోకం పుట్టినప్పటినుంచి ఒక స్త్రీ హృదయంలో పుట్టి పొంగుతున్న భక్తిమయమైన ప్రేమ శివకామి రూపంలో వచ్చి వారి ముందు నాట్యమాడుతున్నట్లు అనిపించింది. మొదట, తొలిప్రేమతో వచ్చే సిగ్గుతో కూడిన తీపిదనాన్ని చూశారు. ప్రేమ పుట్టిన తొలిరోజుల్లో తన ప్రేమికుని పేరు విన్నప్పుడు, అతడి చోటు గురించి విన్నప్పుడు, అతడి గుణగణాల గురించి విన్నప్పుడు ఆమె హృదయంలో పొంగే ఆనందాన్ని, కుతూహలాన్ని, అందువల్ల ఆమె మేనులో పొడసూపే విచిత్రమైన మార్పులను చూశారు. ఆ ప్రేమ కాస్త ముదిరినప్పుడు అది ఆమెకు ఎలా పిచ్చెక్కేలా చేస్తుందో అది కూడ చూశారు. అటువంటి స్థితిలో ఆ ప్రేమికురాలు తన ప్రేమ కోసం, ప్రేమికుని కోసం ఎటువంటి త్యాగాలు చేసేందుకు సిద్ధమవుతుందో చూశారు. కన్న తలిదండ్రులను విడిచిపెట్టేందుకు, సాంఘిక

---

4 వాగీశ్వరులు = వాక్కు + ఈశ్వరులు :- తిరునావుక్కరసు స్వాముల పేరుకు తమిళంలో అర్థం

5 *Nammalvar's Thiruviruttam comes under the category of agatturai, a special genre of Tamil poetry of the Sangam era. There are dramatic characters in these poems which idealise human love. Nammalvar converted this into love for God (Bhakti.) "Viruttam" also means a "message" or an "event". It is generally held that the poem is a submission made by Nammalvar to God of an event, the event of his falling in love with Him.*

(excerpt from http://pnramachandran.blogspot.com/2013/02/nammalvar-thiruviruttam-selection.html)

ఆచారాలను త్రోసిపుచ్చేందుకు, ఊరివారి నిందలను మోసేందుకు ఎంతగా తెగిస్తూందో చూశారు.

మాటల్లో వివరించలేని ఆ భావాలను శివకామి అభినయించి చూపినప్పుడు సభలో కూర్చొని చూస్తున్న వారందరు అది సాధారణ మనుష్యప్రేమ కాదని, అదొక అలౌకికమైన, దైవప్రేమ అని గ్రహించారు.

అది అంతటితో ఆగిపోలేదు. ఆ ప్రేయసి తన కోసం ఎటువంటి త్యాగాలను చేయగలదో పరీక్షించాలని ఆ దైవప్రేమికుడు ఒకనాడు ఉన్నట్లుండి మాయమైపోతాడు. ఇందువల్ల శోకసముద్రంలో మునిగిపోయిన ఆమె బాహ్యప్రపంచాన్నే మరిచిపోతూంది. తననే మరిచిపోతూంది. ఎవరైన తన పేరడిగితే తన ప్రేమికుని పేరు చెబుతూంది. అటువంటి మనోస్థితిలో ఆమె ఉన్నప్పుడు ఆ దైవప్రేమికుడు మళ్ళీ ప్రత్యక్షమైనప్పుడు ఆమె అతడి కాళ్ళ మీద పడి తాను చేయని అపచారాలకు, నేరాలకు క్షమాపణ కోరుతూంది.

పైన వివరించిన భావాలను శివకామి తన కనులతోను, ముఖభావాలతోను, అంగవిన్యాసాల మూలంగాను అపూర్వంగా, అద్వితీయంగా అభినయించిన తర్వాత చేతులు జోడించి నిలిచింది. కానీ మరుక్షణం కొట్టేసిన చెట్టులా పడిపోయింది.

వెంటనే సభలో హాహాకారాలూ లేచాయి. ఆయనర్ 'శివకామీ!' అని కలవరపాటుతో అరుస్తూ ఆమె వద్దకు పరుగెత్తి వెళ్ళి కూలబడిపోయారు. వెనుకే వచ్చిన మహామల్లు ఆమెను మృదువుగా ఎత్తి ఆయన ఒడిలో పడుకోబెట్టారు.

ఏం చేయాలో దిక్కుతోచక సభికులందరూ గుమిగూడగా, వారిలో కొందరు 'నీరు! నీరు!' అని, ఇంకొందరు 'విసనకర్ర! విసనకర్ర!' అని పెద్దగా అరిచారు.

అప్పుడు, “దారి వదలండి" అని ఒక స్థిరమైన స్వరం వినిపించగా అందరూ తిరిగి చూశారు. స్వాములను చూడగానే వారికి దారి వదిలారు. అయన శివకామి చెంతకు వచ్చి, తమ కమండలంనుంచి మంత్ర తీర్థాన్ని తీసి ఆమె ముఖం మీద చల్లారు.

కాసేపటిలోనే శివకామికి స్పృహవచ్చింది. సూర్యుని ఉదయకిరణాలు సోకి విప్పారే తామర మొగ్గల్లాగ ఆమె కనురెప్పలు తెరుచుకొన్నాయి. మొదట ఆమె చూసింది స్వాములవారినే. అప్పుడు ఆయన ఆమెను చూసి, “అమ్మా! నీవు చిరకాలం సామ్రాజ్ఞిలాగ జీవించాలి" అని దీవించారు.

ఆమె అప్పుడు తాను అందరి ముందు తన తండ్రి ఒడిలో పడుకొనివున్న విషయం గ్రహించి, సిగ్గుతో చటుక్కున లేచి నిల్చొని స్వాములకు నమస్కరించింది.

తర్వాత ఆమె నల్లటి కళ్ళు వేటినో వెతుకుతున్నట్లు అటూఇటూ తిరిగాయి. చివరికి నరసింహవర్మ వదనం మీద ఆమె చూపులు నిలిచాయి. “స్వాముల ఆశీర్వాదం విన్నారా?” అని ఆమె

కళ్ళు కుమార చక్రవర్తిని కంటిబాసలో అడిగాయి.

అంతలో స్వాములు ఆయనర్ శిల్పాచార్యులను చూసి, "శిల్పాచార్యా! భరతనాట్య కళ గురించి, దాని గొప్పతనం గురించి నేను చదివాను, విన్నాను. కానీ ఆ కళ పూర్ణ మహిమను ఇప్పుడే, తమ కుమారి నాట్యంలో చూశాను. నా వాక్కులో ఇంతటి లోతైన భావసంపద ఉందని నాకే తెలియకపోయింది. ఇది ఒక అపూర్వమైన, దైవమిచ్చిన కళ. ఇది ఆ దైవానికే అర్పించవలసిన కళ!..."

ఇలా స్వాములు చెప్పిన దివ్యవాక్యాలను అక్కడున్న వారందరూ భక్తిశ్రద్ధలతో వింటుండగా వీధిలో గుర్రపు డెక్కల శబ్దం వినిపించింది. ఆ శబ్దం మఠం ముందు వచ్చి ఆగగానే కుమార చక్రవర్తి మఠం ప్రధానద్వారం వైపు వేగంగా వెళ్ళారు.

వాగీశ్వరులు అక్కడ సమావేశమైన వారందరిని ఉద్దేశించి, "ఇక మీరు వెళ్ళవచ్చు" అని సంజ్ఞామూలంగా తెలియజేయగానే అందరూ అక్కడినుంచి అవతలికి వెళ్ళిపోయారు.

మహామల్లు వాకిలి దగ్గర నిలబడి వచ్చిన భటునితో ఏదో మాట్లాడిన తర్వాత లోపలికొచ్చారు. స్వాములకు చేతులు జోడించి నమస్కరించి, "స్వామీ! మదురైనుంచి అతిముఖ్యమైన వార్తను మోసుకొని దూతలు వచ్చివున్నారు. నేను వెంటనే వెళ్ళాలి. సెలవివ్వండి" అన్నారు.

"అలాగే, కుమార చక్రవర్తీ! తండ్రికి సందేశం పంపించేటట్లయితే, ఆయన అభిప్రాయం ప్రకారమే నే దక్షిణదేశయాత్ర మీద వెళుతున్నానని తెలియజేయాలి" అన్నారు స్వాములు.

"అలాగే, స్వామీ!" అని చెప్పి మహామల్లు ఆయనర్ శిల్పిని చూసి, "ఆచార్యా! ఓడరేవు వెళ్ళి చేరగానే శివకామి క్షేమం గురించి వార్త పంపించండి. కొంత కాలం వరకు నేను కంచి విడిచి బయటికి రాలేను!" అన్నారు.

ఇలా మాట్లాడుతున్నప్పుడు మహామల్లు తరచూ శివకామి వైపు చూస్తూ ఆమె వద్ద కంటిబాస మూలంగా సెలవు తీసుకోవాలని ప్రయత్నించసాగారు. కానీ ఆమేమో వంచిన తల ఎత్తలేదు.

అందువల్ల, చివరికి కోపగించుకొని అక్కడినుంచి వేగంగా వెళ్ళిపోయారు. ఆయన తన కోసం వచ్చిన రథంలో ఎక్కి వెళ్ళిపోయిన తర్వాత గాని శివకామి తలెత్తలేదు. కానీ తాను తలెత్తి చూసి ఆయనకు సెలవివ్వనందువల్లే ఆయనకు కోపమొచ్చిందన్న విషయం కూడ ఆమె గ్రహించలేదు.

అదలా ఉండగా, స్వాముల వద్ద చివరిగా సెలవు తీసుకొని ఆయనర్, శివకామి బయల్దేరవలసిన సమయం వచ్చినప్పుడు, స్వాములు శిల్పాచార్యులకు ఆగమని సైగ చేశారు. ముందుకు వెళ్ళిన శివకామికి వినిపించనట్లు మెల్లని స్వరంతో ఇలా చెప్పారు:

"ఆయనర్‌గారూ! తమ కుమార్తెకు లభించిన ఈ కళ దైవప్రసాదం. అందుకనే ఆమె గురించి నాకు కాస్త దిగులుగా కూడ ఉంది. ఆమెను ఆ దైవం కఠిన పరీక్షకు గురి చేస్తాడని ఎందుకో నాకు తోస్తూంది..." అనగానే ఆయనర్ శిల్పి అదిరిపడి, "స్వామీ! ఏమంటున్నారు? కాసేపటి క్రితం నా బిడ్డ అపూర్వ కళను మెచ్చుకొని ఆనందకరమైన వాక్కులను పలికిన మీరే ఇలా అంటున్నారా? నా బిడ్డకు ఎటువంటి కష్టం కలగబోతూంది? దాన్ని ఎలా ఎదుర్కోవాలి? మీరే దిక్కు!" అని వాపోయారు.

"ఆయనర్‌గారూ! గట్టిగా మాట్లాడకండి, శివకామి ఇది తెలియనవసరం లేదు. కానీ మీరు ముందు జాగ్రత్తతో ఉండడం మంచిది. మీ ముద్దుల కుమార్తెను చూసినప్పుడే ఆమెకు ఏదో ఒక పెద్ద దుఃఖం రాబోతూందని నా దూరదృష్టివల్ల తెలుస్తూంది. అయ్యో! దేవుడెందుకు నాకీ దివ్యదృష్టి ప్రసాదించాడో కద!" అని స్వాములు కూడ వాపోయారు.

"అయినా కూడ, మీరు ధైర్యంగా ఉండాలి. మీ పని మీరు చేస్తూండండి. అదే మీ ధర్మం. ఎంతటి పరీక్షలెదురైనా మనసు కలతబారక ధైర్యంగా ఉంటూ, మీ పనిని నిర్వహించుకొంటూ వెళ్ళండి. దేవుడే మీకు తోడుంటాడు." అని ధైర్యం చెప్పారు స్వాములు.

ఇలా చెప్పి స్వాములు తమ మఠంలోపలికి వెళ్ళారు. వచ్చేటప్పుడు ఎంతో కుతూహలంతోను, ఉత్సాహంతోను వచ్చిన ఆయనర్ శిల్పాచార్యులో ఎనలేని దిగులుతో వెనుదిరిగారు. ఆయన అపూర్వ శిల్పకళాఖండాలుగా తీర్చి దిద్దే రాళ్ళలో ఒక పెద్ద రాతిని తీసి ఆయన గుండెల మీద ఉంచినట్లు కుంగిపోయారు.

~~~
~~~

# అధ్యాయం - 37

## కన్నబిరాన్

**అలా** బరువెక్కిన హృదయంతో మఠంనుంచి బయటికొచ్చిన ఆయనర్ శిల్పాచార్యులు తమ మనఃస్థితిని బయటికి చూపించుకోక, "అమ్మా! ఇక మనం ఇంటికి వెళ్ళవచ్చు కద?" అని అని తమ కుమార్తెనడిగారు.

"కమలిని చూసేసి పొద్దున వెళదాం, నాన్నా!" అని శివకామి చెబుతుండగానే టకటకమని రథం చక్రాల చప్పుడు వినిపించింది. రెండు గుర్రాలు పూన్చిన ఒక రాజరథం అక్కడికి వచ్చి నిలిచింది. ఆ రథసారథి కిందికి దూకి, మఠం ముందు నిలబడివున్న ఆయనర్‌ని, శివకామిని సమీపించాడు. అతడు మంచి దేహపుష్టిగల యువకుడు. వయసు సుమారు పాతికేళ్ళుండవచ్చు.

అతడు వచ్చి ఆయనర్‌ని శివకామిని చూసి, "ఇక్కడ ఆయనర్ శిల్పాచార్యులు, శివకామి అన్న పేర్లతో ఎవరైనా ఉన్నారా?" అని అమాయకంగా అడిగాడు.

అంతలో ఆయనర్ అతన్ని గుర్తుపట్టేసి, "ఓహో! ఎవరది? కన్నబిరానేనా?" అని అడిగారు.

"అదే తెలియడం లేదు కద! ఈ చప్పిడిముక్కు పిల్లను ఎక్కడో చూసినట్లుందే!" అని తన తల మీద మొటిక వేసుకొన్నాడు.

"అబ్బాయ్! నీ తలను నీవే పగలగొట్టుకొని మా మీద నింద పడేలా చేయకు! కమలి తర్వాత ఊరుకోదు. నీవు వెతుక్కొంటూ వచ్చిన అయనర్ శిల్పి, శివకామి మేమే!" అన్నారు శిల్పి.

"అవునా? మరి మీలో ఆయనర్ ఎవరు? శివకామి ఎవరు?" అని మళ్ళీ వెర్రి వెంగళప్పలాగ అడిగాడు కన్నబిరాన్.

శివకామి అప్పుడు గలగలా నవ్వేసి, "అన్నయ్యా! నీ పేరు కన్నబిరాన్. నా పేరు శివకామి. ఇది మా నాన్న ఆయనర్ శిల్పాచార్యులు. మనమున్నది భూలోకం, ఆకాశలోకం కాదు" అన్నది.

"ఓహో! అలాగా! కొలవబోయిన దైవం ఎదురొచ్చినట్లయింది! మీరు మా ఇంటికి రాబోతున్నారా?" అని అడిగాడు కన్నబిరాన్.

"అదేం అలా అడుగుతున్నావు? మేము మీ ఇంటికి రాకూడదా?" అని ఆశ్చర్యంతో అడిగారు శిల్పి.

"ఒక విధంగా చూస్తే రావచ్చు. ఇంకో విధంగా చూస్తే రావడం మంచిది కాదు."

“నాన్నా! అలాగైతే పద, మన ఊరికి వెళ్ళిపోదాం" అన్నది శివకామి.

“అమ్మా, తల్లీ! అలా అనకు. మిమ్మల్ని పిలుచుకొని వెళ్ళకపోతే, కమలి నన్ను ఇంట్లోకి రానివ్వదు. పొద్దున బయల్దేరేటప్పుడే చెప్పింది, మీరిద్దరూ నావుక్కరసు స్వాముల మఠానికి రాబోతారని, తప్పక ఇంటికి పిల్చుకొనే రావాలని. మరి తప్పదు కద?”

“అలాగైతే వెంటనే బయల్దేరుదాం, పద!” అన్నది శివకామి.

నిజానికి వారు వెంటనే బయల్దేరవలసిన పరిస్థితి ఏర్పడిందక్కడ. మఠాలయమున్న ఆ జనసమ్మర్దమైన ప్రదేశంలో సుప్రసిద్ధ ఆయనర్ శిల్పాచార్యులు, సాటిలేని మేటి నాట్యశిఖామణి శివకామి పల్లవ రాజగృహపు[6] రథసారథితో మాట్లాడుతుండడం చుట్టుపక్కలున్న వారందరినీ ఆకట్టుకొన్నదంటే అందులో ఆశ్చర్యం లేదు కద?

కాబట్టి, కన్నబిరాన్ వెంటనే వారిద్దరినీ తన రథంలో ఎక్కించుకొని ఆ కంచి మహానగరపు విశాలమైన వీధుల వెంబడి వేగంగా వెళ్ళసాగాడు.

దారిలో శివకామి "అన్నా! ఇంకొక విధంగా చూస్తే మేము మీ ఇంటికి రాకూడదని చెప్పావు కద? అదేల?” అని అడిగింది.

“చెల్లాయ్! మఠంనుంచి కుమార చక్రవర్తిని రథంలో తిరిగి తీసుకొని వెళ్ళాను కద? ఆయన రాజగృహపు వాకిట నాతో, 'కన్నా! నీవు వెంటనే మఠానికి వెళ్ళి ఆయనర్ శిల్పాచార్యులను, శివకామిని రథంలో ఎక్కించుకొని మామల్లపురంలో విడిచిపెట్టి రా! వారు వద్దని చెప్పినా వినకు' అన్నారు. కుమార చక్రవర్తి అలా ఆజ్ఞాపించివున్నప్పుడు నేను మా ఇంటికి తీసుకొని వెళ్ళవచ్చా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు కన్నబిరాన్.

“ఏదీ తిన్నగా చెప్పవు కద?”

“వీలు కాదు చెల్లాయ్, వీలు కాదు! అందుకొక కారణం ఉంది. నేను చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడు...”

“ఆపన్నయ్యా! నేనడిగింది అది కాదు. కుమార చక్రవర్తి మఠంనుంచి తొందర తొందరగా బయటపడ్డారు కద? ఏదైనా విశేషమా అని అడగవచ్చాను.”

“అవును. మదురైనుంచి దూతలు వచ్చారు.”

ఆ మాట వినగానే శివకామికి మునుపు తాను విన్న పెళ్ళి రాయబారం గుర్తొచ్చింది.

---

6 రాజగృహం = అరణ్మనై (తమిళం) = అరమనె (కన్నడ) = royal palace (English)

"అలాగా? ఆ దూతలు మదురై నుంచి ఏ వార్త తెచ్చారు?" అది దిగులుతో అడిగింది.

“అలాంటి రాజకీయ విషయాల్లో నేను తల దూర్చను, చెల్లాయ్!" అన్నాడు కన్నబిరాన్.

అది విన్న ఆయనర్, “చాల మంచిది, అబ్బాయ్! నీవు రాజకీయ విషయాలకు దూరంగా ఉండడమే మంచిది!" అన్నారు.

అప్పుడు రథం రాజవీధిలో రాజగృహపు ప్రధాన ద్వారాన్ని దాటుకొని ముందుకు వెళుతూంది. వీధివెంబడి ఒకవైపు పూర్తిగా ఆక్రమించుకొన్న రాజగృహపు బయటి ప్రాకారపు గోడను, ప్రధాన ద్వారం మీది గోపురాన్ని, దాన్ని కాపలా కాస్తున్న వీరులను, లోపలున్న విశాలమైన ప్రాంగణాన్ని, ఆ తర్వాత చాల అంతస్తులున్న మేడలను చూసింది శివకామి. తనని, తన హృదయాన్ని దోచుకొన్న (సు)కుమార చక్రవర్తిని వేరు చేస్తూ ఇన్ని గోడలు, మేడలు అడ్డుగా నిలిచివున్నాయి కద అని తలుచుకొని పెద్దగా నిట్టూర్చింది శివకామి.

~~~
~~~

# అధ్యాయం - 38

## కమలి

**కంచి** మహానగరంలో చక్రవర్తి ప్రధాన రాజగృహం వెనుకవైపు ఒక విశాలమైన ఉద్యానవనముండేది.  దాని వెనుక ప్రహరీ గోడనానుకొని అశ్వశాలలు, రథశాలలు ఉండేవి. వాటి తర్వాత రథసారథులు నివసించేందుకు కట్టబడిన ఇళ్ళుండేవి.

ఆ ఇళ్ళలో ఒక దాని ముందు రథమాగింది. రథం చప్పుడు వినగానే ఇంట్లోపలి నుంచి ఒక అమ్మాయి కుతూహలంతో ఎగిరి గంతులేస్తూ బయటికొచ్చింది.

“కమలీ! ఎవరొచ్చారో చూడు!” అంటూ కన్నబిరాన్ రథంనుంచి కిందికి దూకాడు. అతడలా పిలుస్తూండగానే శివకామి రథంనుంచి కిందికి దిగింది. ఆమెను చూస్తూనే కమలి పరుగెత్తుకొచ్చి గట్టిగా కావిలించుకొంది.

అప్పుడు ఇంట్లోపలినుంచి ఒక పెద్దాయన బయటికొచ్చారు.

“నాన్నా! ఎవరొచ్చారో చూడండి!” అన్నాడు కన్నబిరాన్. ఆ పెద్దాయన రథంనుంచి దిగిన ఆయనర్ శిల్పాచార్యులను చూసి, “అయ్యా! రండి! రండి!” అని సాదరంగా ఆహ్వానిస్తూ ఎదురేగారు.

పెద్దలిద్దరూ ఇంటి ముందున్న అరుగు మీద కూర్చొని మాటల్లో దిగారు.

అమ్మాయిలిద్దరూ ఇంట్లోపలికి పరుగెత్తారు.

శివకామి, కమలి బాల్యస్నేహితులు. ఆయనర్ శిల్పి కంచి నగరంలో నివసించేటప్పుడు కమలి వాళ్ళ ఇల్లు వాళ్ళింటి పక్కటిల్లు. శివకామి చిన్న బిడ్డగా ఉన్నప్పుడే, ఆమె కన్న ఒకటిన్నర సంవత్సరాలు పెద్దదైన కమలి తనని ఒళ్ళో వేసుకొని, “చెల్లాయి! చెల్లాయి!” అని మురిసిపోయేది. చిన్నపాపైన శివకామి కూడ "అక్కా! అక్కా!' అని గారాలు పోయేది.

ఇలా మొదలైన స్నేహం పెరిగి, పెరిగి చిక్కనైంది. ఆయనర్ అడవిలో శిల్పగృహం కట్టుకొని వెళ్ళిపోయిన తర్వాత కూడ కమలి తరచూ వాళ్ళింటికి వెళ్ళి, ఒక్కోసారి మాసాల తరబడి, వారితో ఉండేది. తన చెల్లాయి నాట్యమాడుతూంటే కూర్చొని కళ్ళార్పకుండ చూస్తూండేది. “నా చెల్లాయికి భరతనాట్యంలో ఈరేడు లోకాల్లో సాటి లేరు!' అని తనకు తానే చెప్పుకొని మురిసిపోయేది.

కమలి తండ్రి కంచిలో పేరుగాంచిన గుర్రాల వ్యాపారి. ఆయన మేలైన అరేబియా గుర్రాలను ఓడల్లో తెప్పించేవారు. అవి మామల్లపురం ఓడ రేవులో దింపబడేవి. అక్కడినుంచి వాటిని కంచికి

రప్పించగానే రాజగృహానికి వార్త పంపేవారు. చక్రవర్తిగారి అశ్వశాల అధిపతి, పల్లవ సైన్య గుర్రపుదండు నాయకుడు వచ్చి వారికి నచ్చిన మేలైన గుర్రాలను కొని తీసుకొని వెళ్ళేవారు. ఆ తర్వాతే మిగిలిన గుర్రాలను సాధారణ ప్రజలకు అమ్మవచ్చు.

ఈ కారణం  వల్ల రాజగృహపు అశ్వశాల అధిపతి తరచూ కమలి తండ్రిని చూసి మాట్లాడేందుకు వాళ్ళ ఇంటికి వచ్చేవాడు. ఆయనలా వచ్చేటప్పుడు ఆయనతోబాటు ఆయన కొడుకు కూడ వచ్చేవాడు. వాడే కన్నబిరాన్.

పెద్దలు వ్యాపార విషయాలు మాట్లాడుకొంటుండేటప్పుడు పిల్లలు, అంటే కన్నబిరాన్, కమలి, ఆడుతూ పాడుతూ సరదాగా కాలం గడిపేవారు.

కమలికి యుక్తవయస్సు రాగానే ఆమె తండ్రికి ఆమె ప్రణయగాధ కూడ తెలియవచ్చింది. ఆ సంబంధం వారిద్దరి తండ్రులకు నచ్చిందే కాబట్టి వారికి వెంటనే పెళ్ళి చేశారు.

ఇది జరిగి ఒకటిన్నర సంవత్సరాలైంది. ఈ అవధిలో కమలి, శివకామి కలుసుకోనేలేదు. అయినా కూడ వారు ఒకరినొకరు ఒక్కరోజు కూడ మరిచిపోలేదు.

రాత్రి భోజనమమైన తర్వాత పెద్దలిద్దరు ఇంటి ముందున్న అరుగుమీద పడుకొని యుద్ధ పరిస్థితి గురించి మాట్లాడుకోసాగారు.

ఇంట్లోపల రాజగృహపు పూలతోటకు పక్కనే ఒక గదిలో అమ్మాయిలిద్దరూ పడుకొని మాట్లాడుకోసాగారు. కానీ వారు మాట్లాడుకొంటున్నది యుద్ధం గురించి కాదు. కమలి వివాహజీవితమే వారి సంభాషణలో ముఖ్యంగా చోటుచేసుకొన్న విషయం. మధ్య మధ్యలో వాళ్ళిద్దరూ పడీ పడీ నవ్వుకోవడం కూడ వినిపిస్తూంది.

రాత్రి ఒకటిన్నర జాము దాటిన తర్వాత ఇంటి వాకిటనున్న అరుగు మీదినుంచి ఆయనర్, “శివకామీ! రాత్రి చాల పొద్దుపోయింది. పొద్దునే లేచి వెళ్ళాలి. కాబట్టి ఇప్పుడు పడుకొని నిద్రపో!” అన్నారు. వెంటనే కమలి, శివకామి కూడ తండ్రికి అలాగేనని చెప్పి కళ్ళు మూసుకొన్నారు.

కాసేపటి తర్వాత శివకామి నిద్రపోయిందని ఎంచి కమలి సద్దు చేయకుండ లేచి ఆ గదిలో పక్కనున్న తలుపు తెరిచి ఇంకొక గదిలోపలికి వెళ్ళింది.

**శివకామి** కళ్ళు మూసుకొంది కాని ఆమెకు నిద్రపట్టలేదు. ఆమె తలలో ఏవేవో ఆలోచనలు అలల్లాగ ఉవ్వెత్తున లేచి పడుతున్నాయి.

కమలికి కన్నబిరాన్ మీద ప్రేమ పుట్టినప్పటినుంచి ఆమె తన మనసులోని భావాలను తరచూ

శివకామితో పంచుకొనేది.

మొదటినుంచే కమలి ప్రేమగాథ ఆనందమయంగానే ఉంది. ఎలాంటి దుఃఖం, విరహం లేక సరదాగా, హాయిగా గడిచిపోయేది.

పెళ్ళయిన తర్వాత కూడ కన్నబిరాన్‌తో ఆమె జీవితం చాల సుఖమయంగానే సాగుతూంది.

కమలి ఆనందమయమైన ప్రేమజీవితాన్ని తన దుఃఖపూరితమైన ప్రేమగాథతో పోల్చుకొని చూస్తే వాటి మధ్యనున్న వ్యత్యాసం ఆమెకు కొట్టవచ్చినట్లు తెలియవచ్చింది. తనకు తగని ప్రేమ వెంట తాను వెళ్ళడమే అందుకు కారణమన్న తీర్మానానికొచ్చింది.

కానీ అందుకు కారణమెవరు? అడవి ఇంట్లో హాయిగా అడుతూ పాడుతూ ఉల్లాసంగా జీవనం సాగిస్తున్న తనని ఈ ప్రేమలోకి లాగి, ప్రేమాగ్నిని రగిలించిందెవ్వరు? కుమార చక్రవర్తే కద?

ఎంతసేపటికీ నిద్రపట్టకపోయేసరికి లేచి ఆ గది కిటికీలో కూర్చొంది. ఆమె ఎదురుచూసినట్లే ఫాల్గుణమాసపు చల్లని గాలి ఆ కిటికీ గుండా వీస్తూంది. అది ఊరకే రాలేదు. రాజగృహపు పూలతోటనుంచి చంపకాల, మల్లెల సువాసనలను తనతో మోసుకొచ్చింది.

ఆ సువాసనలను ఆఘ్రాణిస్తూ కూర్చొన్న శివకామి మనసులో ఏవేవో పాత జ్ఞాపకాలు చూచాయగా తలెత్తాయి. ఒకప్పుడు తన ప్రేమగాథ చాల మధురంగా ఉండేదనిపించింది. కానీ తన మనసు చూరగొన్న ఆ ప్రాణప్రదమైన ప్రేమికునికి తనకు మధ్య ఉన్నట్లుండి ఒక పెద్ద అగాధం ఏర్పడ్డట్లు ఏదో ఒక భ్రమ కలిగింది.

~~~
~~~

# అధ్యాయం - 39

## కమలి మనోరథం

**వివరించలేని** తీయదనాన్ని, దుఃఖాన్ని కూడ ఒక్కటిగా కలిగించిన ఆ తలపులను తట్టుకోలేక శివకామి గది వెనుకవైపు తలుపు శబ్దంచేయకుండ తెరుచుకొని పూలతోటలో ప్రవేశించింది. అప్పుడు రాత్రి మూడవ జాము. నెలవంక వెదజల్లుతున్న సన్నటి వెన్నెల వెలుతురులో ఆ పూలతోట ఒక స్వప్నలోకం లాగ కనిపిస్తూంది.

పూలతోటలో కాసేపు పచార్లు చేసివద్దామని బయల్దేరిన శివకామి ఇంటి గోడ వారగా నాలుగడుగులు వేసింది. వెంటనే ఎవరో మాట్లాడుకొంటున్న శబ్దం వినిపించింది - ఎవరో కాదు, పక్కగదిలో కమలి, కన్నబిరానే మెల్లగా మాట్లాడుకొంటున్నారు. వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోదామనుకొంది. కానీ అంతలో వారి మాటల మధ్య 'మహామల్లు', 'కుమార చక్రవర్తి' అన్న పేర్లు వినిపించగానే, ఆమె కాళ్ళు వెనుదిరగ నిరాకరించాయి. అక్కడే గోడవారగా నిలబడి వారి సంభాషణను వినసాగింది శివకామి.

“మహామల్లుగారికి పిల్లనిస్తానని పాండ్యరాజు సందేశం పంపడంలో ఆశ్చర్యమేముంది? ఆయనకు పిల్లనిచ్చేందుకు ఈ భూలోకంలో ఉన్న రాజాధిరాజులందరూ ఒకరితోనొకరు పోటీ పడి ముందుకు రారా?” అన్నది కమలి.

“మహామల్లుగారికి త్వరలోనే పెళ్ళి చేయాలని మహారాణికి చాలా ఆశ. మూడు దేశాల రాజులకు వివాహ సందేశం పంపాలనుకొన్నారు. కానీ ఈ యుద్ధం వచ్చినందువల్ల అందుకు ఆటంకం కలిగింది. ఇప్పుడు పాండ్యరాజే సందేశం పంపినందుకు రాణిగారికి చాల సంతోషంగా ఉంది" అన్నాడు కన్నబిరాన్.

“సరే, తర్వాత ఏం జరిగింది?” అని అడిగింది కమలి.

“రాజగృహం వద్ద కుమార చక్రవర్తిని విడిచిపెట్టానా? వెంటనే తల్లికీ, కొడుక్కీ మధ్య పెద్ద జగడం మొదలైంది!”

“జగడమా? ఎందుకు?”

“కుమార చక్రవర్తికి 'పెళ్ళి' అన్న మాట అంటే చాలు, కోపం ముంచుకొస్తుంది. 'ఇందుకేనా ఇంత త్వరగా రమ్మని పిలిపించారు? నేనేదో యుద్ధానికి సంబంధించిన అతిముఖ్యమైన వార్త వచ్చిందని కద పరుగెత్తుకొచ్చాను? ' అని వారు మహారాణితో కోపంగా మాట్లాడారు. కమలీ! నీకొక అతిముఖ్యమైన, అతిపెద్ద రహస్యం చెప్పనా?” అన్నాడు కన్నబిరాన్.

“ఆడవాళ్ళ నోటిలో నువ్వుగింజ కూడ నానదంటారు, నీకు తెలియదా? లేక, తెలిసి కూడ నాకా ముఖ్యమైన రహస్యాన్ని చెప్పదలుచుకొన్నావా?” అని నవ్వుతూ అడిగింది కమలి.

"ఈ రహస్యం తెలిస్తే నీకు కుమార చక్రవర్తి పెళ్ళి మాట వింటేనే ఎందుకు ఎగిరిపడుతున్నారన్న విషయం అర్థమౌతుంది. అందరూ అనుకోవడం కుమార చక్రవర్తికి పెళ్ళంటే ఇష్టం లేదని కద? కానీ అసలు సంగతి అది కాదు. అదే పెద్ద రహస్యం. అందులోను నీ చెల్లాయి శివకామి గురించిన రహస్యం, కమలీ!"

"ఏమిటేమిటీ? నా చెల్లాయ్ శివకామి గురించి నాకు తెలియని రహస్యం కూడ ఉందా? ఏదైనా చెడ్డగా చెప్పావో, చూడు నిన్నేం చేస్తానో?"

"చెడ్డవిషయమేమీ లేదు; చాల గర్వించదగిన, సంతోషపడదగిన విషయమే. చెప్తే నాకేమిస్తావు?"

"చెప్పిన తర్వాత అడుగు. వస్తువును చూసిన తర్వాతే కద దాని వెల కట్టనవుతుంది?"

"తర్వాత మోసం చేయకూడదు, సరేనా? కుమార చక్రవర్తి వీరత్వంలో అర్జునుని, అందంలో మన్మధుని, రథం నడపడంలో కన్నబిరాన్ని మించినవారు కద? అటువంటి కుమార చక్రవర్తి నీ చెల్లి శివకామి మీద ప్రేమగొన్నారు, కమలీ!"

"ఆ!" అన్న శబ్దం మాత్రమే కమలి నోటినుంచి వచ్చింది. ఆమె ఆశ్చర్యంతో అవాక్కయ్యింది.

బయట గోడవారగా నిలబడి వింటున్న శివకామికి ఆ శబ్దం వాడి బాణం ఎదలో గుచ్చినట్లనిపించింది. తనమీద ఇంత ఆప్యాయతగొన్న కమలినుంచి మనమీ రహస్యాన్ని ఇంతవరకు దాచిపెట్టాం కద అన్న తలపే ఆమెకు అలాంటి బాధను కలిగించింది. కాస్త సిగ్గుపడింది కూడాను.

"కమలీ! నేను చెప్పిన విషయం నీవు నమ్మలేకున్నావు కద?" అని అడిగాడు కన్నబిరాన్.

"ఎందుకు నమ్మలేను? మన కుమార చక్రవర్తి చాల తెలివైనవారని తరచూ చెబుతుంటాను కద? అందుకే ఆయన మన శివకామిని ప్రేమించారు" అని జవాబిచ్చింది కమలి.

"ఓహో! అలాగా! నీవు, నీ చెల్లాయి చేరి మాట్లాడుకొనే ఈపని చేశారు లాగుంది! నీవు నన్ను నీవలలో వేసుకొన్నావు! నీ చెల్లాయి కుమార చక్రవర్తిని తన వలలో వేసుకొంది!"

"ఏమన్నావు?" అని గంభీరస్వరంతో మొదలుపెట్టి, వాగ్బాణాలను కన్నబిరాన్‌మీదికి కురిపించింది కమలి: "నేనా నిన్ను నా వలలో వేసుకొన్నాను? నేనా ఇంట్లో మూలమూలలా వెతుక్కొంటూ వచ్చి చేతులు పట్టుకొని, 'నీవు కరుణించకపోతే నేను ప్రాణాలొదిలేస్తాను!' అని ఏడ్చాను? నేనా 'నన్ను పెళ్ళి చేసుకో' అని బతిమాలాను?"

"లేదు కమలీ, లేదు! నేనే నీ కళ్ళనే వలలో వచ్చి పడిపోయాను!"

"మన కథ అలా ఉండనీ. కుమార చక్రవర్తికి, నా చెల్లాయికి నేస్తమని నీకెలా తెలిసింది? అది చెప్పు" అన్నది కమలి.

"అరె! పాము కాలు పాముకు తెలియదా? దొంగ సంగతి దొంగకు తెలియదా? నేను నిన్ను మీ

పుట్టినింట్లో ఎంత ఆతురతతో ఎదురుచూస్తూండేవాడిని? గుర్తుంది కద? అదేలాగ కుమార చక్రవర్తి కూడ ఇప్పుడు నీ చెల్లాయిని అంతటి ఆతురతతో చూస్తున్నారు..."

"అంతేనా?"

"ఇంకా ఏం కావాలి? నావుక్కరసు స్వాముల మఠంలో నాట్యం చేసిన తర్వాత ఉన్నట్లుండి స్పృహ తప్పి పడిపోయింది కద? అప్పుడు మహామల్లుగారే కంగారుగా పరుగెత్తి వెళ్ళి ఆమెను మెత్తగా లేవనెత్తి ఆమె తండ్రి ఒడిలో పడుకోబెట్టారు. అది చూసిన తర్వాత నాకింత వరకు ఉన్న కాస్త సందేహం కూడ ఎగిరిపోయింది."

ఇది వింటున్న శివకామి ఒళ్ళంతా పులకరించింది. ముందుకు కొనసాగిన సంభాషణను చెవులు రిక్కించి వినసాగింది.

"ఇంత నిశితంగా గమనించావు కద? నీవు చాల బుద్ధిశాలివి! కుమార చక్రవర్తిగారేమో చాల భాగ్యశాలి!" అన్నది కమలి.

"మహామల్లుగారు భాగ్యశాలి అనా అంటున్నావు? ఇందువల్ల రాబోయే సంకటాలన్నీ ఆలోచిస్తే..."

"ఏం సంకటాలు?"

"కుమార చక్రవర్తి పెళ్ళంటే మన పెళ్ళిలాగ మామూలు పెళ్ళనుకొంటున్నావా? ఎన్నెన్నో ఆలోచిస్తారు..."

"కన్నా! నా చెల్లాయిని మాత్రం మామూలు ఆడపిల్లనుకొన్నావా? దమయంతిని పెళ్ళాడేందుకు దేవలోకంనుంచి దేవతలు వచ్చినట్లు శివకామిని వెతుక్కొంటూ రారా? ఏదో మనసు పడి దమయంతి నల మహారాజు మెడలో మాల వేసింది..."

"కానీ, కమలీ! దమయంతి అంతపురంలో పుట్టిన రాకుమార్తె కద?"

"నా  చెల్లాయి వేయిమంది రాకుమార్తెలకు సాటి కన్నా! నా మనోరథం ఒకనాడు తప్పక నెరవేరబోతూంది!"

"ఏమి నీ మనోరథం?"

"ఈ యుద్ధమంతా ముగిసిన తర్వాత కుమార చక్రవర్తికి మకుటాభిషేకం జరగబోతూంది. బంగారు రథంలో రత్నఖచిత సింహాసనంమీద ఆసీనులై నరసింహవర్మ రాజవీధుల్లో ఊరేగింపుగా వస్తున్నారు. ఆయన పక్కన, దేవేంద్రుని పక్కన ఇంద్రాణిలాగ, నా చెల్లాయి కూర్చొనివుంటుంది. రథసారథిగా నీవు రథాన్ని హుందాగా నడిపించుకొని వస్తున్నావు. నేను రాజగృహ ప్రధానద్వారం మీదున్న మేడ మీద నిల్చొనివున్నాను. రథం రాజగృహం వాకిలి ముందు వచ్చి ఆగగానే బుట్టలు

బుట్టలుగా మల్లెపూలను, సంపెంగపూలను వారిమీద కురిపిస్తున్నాను. మధ్య ఒక బుట్ట పూలను నీ మీద కూడ ఒంపుతున్నాను, ఇలా జరగాలన్నదే నా మనోరథం, కన్నా!"

"అలా జరిగితే నేను కూడ ఎంతో సంతోషిస్తాను కద?" అన్నాడు కన్నబిరాన్.

**శివకామి** తన గదికి తిరిగొచ్చి పడకమీద పడుకొంది. అప్పుడు రాత్రి నాలుగో జాము నడుస్తోంది. అయినా కూడ శివకామికి ఎంత ప్రయత్నించినా మళ్ళీ నిద్ర రాలేదు. ఏవేవో ఆలోచనలు కనిపించి మరుగౌతున్నాయి. తనకేదో పెద్ద అపాయం రాబోతూందని, అందునుంచి తాను తప్పించుకోలేకపోతున్నానని ఆమెకనిపించింది.

~~~
~~~

# అధ్యాయం - 40

## తప్పనిసరి ప్రయాణం

**మహేంద్ర** విడిది గృహంనుంచి పెందరాళే బయల్దేరిన పరంజ్యోతి ఆరోజు సూర్యాస్తమయ సమయానికి ఉత్తరపెన్నానది పాపాగ్ని నదిని కలిసే చోటవున్న బౌద్ధ విహారాన్ని చేరుకొన్నాడు.

బౌద్ధవిహారపు వాకిలి ముందు ఒక భిక్షువు నిలబడివున్నారు. ఆయన ధరించిన కాషాయ వస్త్రాలు సాయంత్రపు నీరెండలో బంగారు వన్నెతో ప్రకాశిస్తున్నాయి. పరంజ్యోతి గుర్రం దిగి ఆయన దగ్గరికి వెళ్ళగానే ఆయన పరంజ్యోతిని ఏదో అడిగారు. కానీ అది తమిళభాష కాకపోవడంతో పరంజ్యోతికి అర్థం కాలేదు. అయినా కూడ, ఆయన తానెవరని, తానక్కడికి వచ్చిన కారణమేమని అడుగుతున్నారని ఊహించుకొని, తమిళంలోనే తాను నాగార్జునకొండకు వెళుతున్నట్లు, తనని ఇక్కడ బస చేసి, దారి అడిగి వెళ్ళమని నాగనంది చెప్పి పంపించారని చెప్పాడు.

నాగనంది పేరు వినగానే ఆ భిక్షువు ముఖాన ఒక మార్పు కానవచ్చింది. ఆయన సైగతో, “కాసేపు ఇక్కడే ఉండు!” అని పరంజ్యోతికి చెప్పి లోపలికి వెళ్ళారు. కాసేపటికల్లా తిరిగివచ్చి పరంజ్యోతిని విహారం లోపలికి తీసుకొని వెళ్ళారు. ఆ బౌద్ధ విహారం కంచిలో చూసిన రాజవిహారంలాగ రాళ్ళు, చెక్క, సున్నంతో కట్టబడక, కొండరాతిని తొలిచి నిర్మించిన గుహాలయమని గ్రహించాడు. అది చిన్నదిగా ఉన్నా కూడ, నిర్మాణ విన్యాసంలో కంచిలో ఉన్న విహారంలాగే అన్ని హంగులూ కలిగివుంది. భిక్షువులు ధ్యానం చేసేందుకు, ప్రార్థన చేసేందుకు ఒక పెద్ద చైత్యం, దాని వెనక భాగాన పెద్ద రాతిగోడలో బ్రహ్మాండమైన బుద్ధుని శిల్పం ఉన్నాయి. ఆ బుద్ధ శిల్పం పైభాగాన బోధివృక్షం, బుద్ధుని మీద పుష్పాలు కురిపిస్తున్న గంధర్వులు - అన్నీ రాతిలో తొలిచి నిర్మించబడివున్నాయి. వరుసగా అమర్చిన అలంకారదీపాలు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. కుప్పలు కుప్పలుగా పోసివున్న పూలు, అగరొత్తుల సువాసన, అంతా కలిసి అక్కడ కూర్చొని ధ్యానం చేసేవారికి ఏకాగ్రత కలిగేందుకు తోడ్పడుతున్నాయి.

చైత్యం ఇరువైపులా భిక్షువులు నివసించేందుకు, విద్యార్థులు చదువుకోవడానికి తగినట్లు రాతిగోడలో గదులు తొలచబడివున్నాయి. ఒకవైపు చివర పైకి వెళ్ళేందుకు రాతిమెట్లు కానవచ్చాయి. వాటిమీదుగా భిక్షువు పరంజ్యోతిని తీసుకొనివెళ్ళారు. పైన కూడ అటువంటి గదులు తొలచబడివున్నాయి. ఆ గదుల్లో ఒక విశాలమైన గదిలో ఒక పెద్ద బౌద్ధ భిక్షువు పద్మాసనంలో కూర్చొనివున్నారు. పరంజ్యోతిని పిలుచుకొని వచ్చిన భిక్షువు అతన్ని ఆ పెద్ద భిక్షువు వద్ద విడిచిపెట్టారు.

ఆయనే బౌద్ధవిహారానికి ప్రధానభిక్షువని ఊహించుకొని పరంజ్యోతి ఆయనకు చేతులు జోడించి నమస్కరించాడు. “బుద్ధం శరణం గచ్చామి", “ధర్మం శరణం గచ్చామి", “సంఘం శరణం గచ్చామి" అని

చెప్పి ప్రధానభిక్షువు బుద్ధభగవానునికి ప్రణమిల్లి, పరంజ్యోతిని చూసి తమిళభాషలో "బిడ్డా! నీవెవరివి? ఏ కార్యం మీద వచ్చావు? ఎవరు నిన్ను పంపించారు?" అని అడిగారు.

పరంజ్యోతి నాగనంది భిక్షువు తనకు పత్రమిచ్చి పంపించిన విషయాన్ని వివరంగా చెప్పాడు.

“నాగనంది ఇచ్చిన తాళపత్రమెక్కడ? దాన్ని నేను చూడవచ్చా?” అని భిక్షువు అడిగారు.

“క్షమించాలి. పత్రాన్ని సత్యాశ్రయులకు తప్ప ఇంకెవరికీ చూపవద్దని నాగనంది భిక్షువుల ఆజ్ఞ" అన్నాడు పరంజ్యోతి.

సత్యాశ్రయుని పేరు వినగానే ప్రధానభిక్షువు ముఖాన ఒక మర్మభూయిష్టమైన చిరునవ్వు తోచింది. పరంజ్యోతి అది గమనించాడు గాని దాని అర్థమేమని తెలియలేదు.

“నాగనంది ఆజ్ఞ ప్రకారమే నడుచుకో. ఈ రోజు రాత్రి ఇక్కడే పడుకోవచ్చు. అక్కడికి వెళ్ళే దారంతా ఇప్పుడు చాల అపాయకరంగా ఉంది. శ్రీపర్వతానికి వెళ్ళే కొందరు వీరులు ఈ రాత్రే ఇక్కడికి వచ్చే అవకాశముంది. వారితోబాటు నీవు రేపు సూర్యోదయానికి మునుపే బయల్దేరి వెళ్ళవచ్చు. వారు నిన్ను భద్రంగా తీసుకొని వెళ్ళి చేరుస్తారు!” అని ఆచార్య (ప్రధాన) భిక్షువు చెప్పి, ఇంకొక భిక్షువును చూసి సంజ్ఞ చేశారు.

ఆయన పరంజ్యోతిని పిలుచుకొని వెళ్ళి భోజనమిప్పించి, ఆ తర్వాత అతడు పడుకోవడానికి చోటు చూపించారు. కిందటి రాత్రి సరిగ్గా నిద్రలేకపోవడం వల్ల, రోజంతా ప్రయాణం చేసి అలిసిపోయివుండడం వల్ల పరంజ్యోతికి వెంటనే నిద్రపట్టేసి గాఢనిద్రలో మునిగిపోయాడు.

**భుజాలను** పట్టుకొని ఎవరో కుదుపుతున్నట్లు గ్రహించి ఉలిక్కిపడి లేచి కూర్చొన్నాడు పరంజ్యోతి. గతదినం తనని మఠంలోపలికి పిలుచుకొని వచ్చిన భిక్షువు, ఆయన పక్కనే ప్రధాన భిక్షువు తన ముందు నిల్చొని ఉండడాన్ని గమనించాడు.

“తమ్ముడూ! నాగార్జునకొండకు వెళ్ళే వీరులు బయల్దేరుతున్నారు. నీవు కూడ బయల్దేరు" అన్నారు పెద్ద భిక్షువు.

పరంజ్యోతి గబగబా లేచి తలగడ కిందనున్న పత్రమున్న గొట్టాన్ని నడుం బట్టలో దోపుకొన్నాడు. భిక్షువుల వెంట మఠం వాకిలి దగ్గరికి వచ్చాడు.

అక్కడ పరంజ్యోతి గుర్రంతోబాటు మరి ఆరు గుర్రాలు, ఒక్కొక్క గుర్రం పక్కన ఒక ఆజానుబాహువైన వీరుడు నిలబడివుండడాన్ని చంద్రవంక మసక వెలుతురులో గమనించాడు పరంజ్యోతి.

“ఈ వీరులు అత్యవసర కార్యం మీద శ్రీపర్వతానికి వెళుతున్నారు. వీరితో వెళితే అడ్డదారిన శీఘ్రంగా చేరుకోవచ్చు" అన్నారు పెద్ద భిక్షువు.

మనసులో ఇదీ అని తెలియని సంకోచంతో గుర్రమెక్కాడు పరంజ్యోతి. గుర్రాలు ఉత్తరపెన్నానది

తీరం వెంబడి పడమటి దిక్కుగా వేగంగా దూసుకెళ్ళాయి.

~~~
~~~

# అధ్యాయం - 41

## గుడారం

**బౌద్ధ విహారం** నుంచి బయల్దేరిన కాసేపటికల్లా ఆ అశ్వవీరుల్లో ముగ్గురు పరంజ్యోతి ముందు, మరి ముగ్గురు అతడి వెనక స్వారీ చేస్తూ, అతన్ని తమ మధ్య పెట్టుకొని వేగంగా వెళ్ళసాగారు.

బాగా పొద్దు పొడిచిన తర్వాత వారిని స్పష్టంగా చూడగలిగిన పరంజ్యోతి, బౌద్ధ భిక్షువు తనని ఏదో ముఖ్యమైన కార్యం మీద వెళుతున్న ఈ యుద్ధవీరుల వెంబడి ఎందుకు పంపించారా అన్న సందేహం కలిగింది.

అదీగాక, వీరు తనతో స్నేహంగా ఉండే వీరులైనే ఎందుకు తనని ఇలా తమ మధ్యలో ఉంచుకొని వెళుతున్నారు, తానేమో వారి బందీ అయినట్లు?

శ్రీపర్వతం ఉత్తరంగా కృష్ణానదీతీరాన ఉందని తనకు తెలుసు. కానీ వీరు బయల్దేరినప్పటినుంచి పశ్చిమంగానే వెళుతున్నారేం?

మధ్యాహ్నానికి, ఇక తన ఓపిక పట్టలేక తన సందేహాన్ని ఎలాగైనా నివృత్తి చేసుకోవాలనుకొని, అదే సమయాన ఉత్తరానికి చీలి వెళుతున్న బాట వెంబడి తన గుర్రాన్ని ఉన్నట్లుండి తిప్పాడు.

అంతే! కన్ను మూసి తెరిచేలోపు ఆ ఆరుగురు వీరులు అతన్ని చుట్టుముట్టి తమ శూలాలను అతడివైపు గురిచూపి పట్టుకొన్నారు.

ఇక కోపాన్ని తట్టుకోలేక పరంజ్యోతి తన శూలాన్ని పైకెత్తి తనకెదురుగా ఉన్న వీరునిపై ప్రయోగించాలనుకొన్నాడు. కానీ, ఆశ్చర్యం! మళ్ళీ రెప్పపాటు కాలంలో ఏం జరుగుతోందో తెలుసుకొనే లోపు అతడి చేతనున్న శూలం ఎటో ఎగిరిపోయింది! తాను గుర్రం మీదినుంచి కిందపడ్డాడు! కిందపడ్డ తర్వాత చూస్తే తనని ఆ వీరుల్లో ఒకడు తాడు విసిరి లాగి కిందపడేసినట్లు గ్రహించాడు.

రెండవసారి తానలా గుర్రంమీదినుంచి కిందపడదోయబడ్డం తలుచుకొని అతడికి ఒకవైపు సిగ్గు, మరొకవైపు కోపం ముంచుకొచ్చాయి. అతడి గుర్రమేమో ఇక తన యజమానికి తనతో పని లేదని గ్రహించి వచ్చినదారినే పరుగు లంకించుకొంది.

తప్పించుకోవడానికి అవకాశమే లేకుండ చేసేశారు కద ఈ వీరులు! ఇక పోరాడి ప్రయోజనం లేదు, జరిగేది జరగనీ అనుకొని స్తబ్దుగా ఉండిపోయాడు పరంజ్యోతి.

అప్పుడు ఆ వీరుల్లో ఒకడు అతని చేతులు వెనక్కి విరిచి కట్టి తన గుర్రంమీద ఎక్కించి తాను అతడి వెనక కూర్చొన్నాడు. మళ్ళీ ఆ వీరులు ప్రయాణం ముందుకు కొనసాగించారు, అదే దిక్కున.

అస్తమించేందుకు ఒక జాముందనగా పరంజ్యోతి ఒక అద్భుతమైన దృశ్యాన్ని తన కళ్ళ

ముందు చూశాడు.

అప్పుడు వారొక ఎత్తైన పీఠభూమిని చేరుకొన్నారు. అక్కడ నిలబడి చూస్తే కనుచూపు మేర వరకు సమతలమైన బయలు ప్రదేశం కానవస్తూంది. ఆ బయలు ప్రదేశంలో కంటికానినంత వరకు ఒక మహాసైన్యం దిగివుంది.

వేలకొద్ది యుద్ధపుటేనుగులు నల్లటి గుండ్రాళ్ళలాగ బారులు తీరి నిలబడివున్నాయి. వాటి మధ్య తెల్లటి గుండ్రాళ్ళలాగ పెద్ద పెద్ద గుడారాలు. లెక్కలేనన్ని గుర్రాలు, ఒంటెలు, వృషభాలు, రధాలు, బండ్లు కానవచ్చాయి. వీటన్నిటి మధ్య యుద్ధవీరులు అక్కడక్కడా పెద్ద గుంపులుగాను, వేర్వేరుగాను కానవచ్చారు.

గుడారాలపైన వరుసగా జెండాలు ఎగురుతున్నాయి. వాటి మధ్య అన్నిటికన్న పెద్దదైన గుడారం మీద ఒక బ్రహ్మాండమైన పతాకం ఆకాశాన్నంటేటంత ఎత్తుగా ఎగురుతూంది. ఆ మహాసైన్యం నుంచి సముద్రఘోషలాంటి హోరు లేచివస్తూంది.

ఈ దృశ్యాన్ని చూసిన పరంజ్యోతి నోటినుంచి 'ఆహా!' అన్న శబ్దం తనకు తెలియకనే వెలువడింది.

అక్కడ దిగివున్న యుద్ధసైన్యం పల్లవసైన్యమే అని అనుకొన్న పరంజ్యోతి ఆ క్షణాన తాను కట్టబడివున్న స్థితిని కూడ మరిచి ఒక అనిర్వచనీయమైన ఉత్సాహంగొన్నాడు.

గాఢాంధకారంలో దిక్కు తెలియక వెళుతున్నవాడికి ఉన్నట్లుండి ఆకాశాన ఒక మెరుపు మెరిసి ముందు వెళ్ళవలసిన దారిని చూపినట్లు, ఆ క్షణాన తాను పుట్టిందెందుకని కొట్టవచ్చినట్లు తెలిసింది పరంజ్యోతికి. తాటాకుల మీద ఘంటంతో రాయడానికో, ఉలి తీసుకొని రాతిని శిల్పాలుగా చెక్కడానికో, గోడలమీద రంగుల చిత్రాలు గీయడానికో కాదు. చేత కత్తిబూని రణరంగంలో దిగి శత్రువుల తలలను కొబ్బరికాయల్లాగ తెగనరికి నేలకు దొర్లించి, వారి గుండెల్లో శూలాన్ని దించి, విజయశంఖాన్ని పూరించేందుకు, శత్రువులను ఓడించి తరిమికొట్టి 'వీరాధివీరుడ'ని లోకమంతా పొగడేందుకు అని ఆ క్షణాన గ్రహించాడు పరంజ్యోతి.

ఈ ఆలోచన పరంజ్యోతికి ఎనలేని ఉత్సాహాన్నిచ్చింది. ఆయనర్ శిల్పి ఇంట బుద్ధభగవానుని శిల్పం వెనక దాక్కొని తాను చూసిన మహేంద్రపల్లవ చక్రవర్తి గంభీర రూపం అతని మనోనేత్రం ముందు నిలిచింది. అదిగో ఆ పెద్ద గుడారంలో, ఈ మహాసైన్యానికి ప్రధమ నాయకుడిగా మహేంద్రపల్లవ చక్రవర్తి ఆసీనులైవుంటారు. ఆయన సమక్షానికే తనని తీసుకొని వెళుతున్నారు అని గాఢంగా నమ్మాడు పరంజ్యోతి. ఆయన సమక్షానికి చేరుకొన్న వెంటనే ఆయన పాదాల మీద పడి ఈ మహా పల్లవ సైన్యంలో ఈ పల్లెటూరి పిల్లాడికి చోటిచ్చి కరుణించాలని వేడుకోవాలనుకొన్నాడు. చిత్రం, శిల్పం, ఆయనర్ శిల్పి,

నాగనంది భిక్షువు ఏ ఏట్లోనైనా పడి కొట్టుకుపోనీ!

ఇలా అనుకొంటూ ఆ ప్రధాన గుడారాన్ని సమీపించినప్పుడు అతడి ఉత్సాహాన్ని మళ్ళీ సందేహమనే నీడ కుంగజేసింది. ఇక్కడ దిగివున్నది పల్లవసైన్యమేనా అన్న సందేహం మళ్ళీ పొడసూపింది.

పల్లవసామ్రాజ్యపు పతాకం వృషభపతాకం కద? మరి ఈ జెండామీద అడవిపంది ఉందేమిటి? ఒక వేళ ఇది పల్లవసామ్రాజ్యం మీద దండెత్తి వస్తున్న వాతాపి సైన్యమా??

గుడారాన్ని చేరగానే వీరులు గుర్రాల మీదినుంచి దిగి, పరంజ్యోతిని కూడ దింపి నడిపించుకొని తీసుకెళ్ళారు. లోపలికి వెళ్ళగానే అతడి సందేహం ఇంకా బలపడింది. లోపల అక్కడక్కడ నిలబడివున్న సైనికుల తీరు, వారి భాష ఇది పల్లవసైన్యం కానేరదన్న అభిప్రాయాన్ని బలపరిచాయి.

దానితో అతని ఉత్సాహం నీరుగారి నిరుత్సాహంగా మారింది. దానికి ప్రయాణపుటలసట చేరి అతని దేహశక్తిని పూర్తిగా లాగేశాయి. కట్లు అతన్ని మరింత బలహీనుణ్ణి చేశాయి. అడుగు ముందుకు వేయలేక  తడబడుతూ వెళ్ళాడు.

అప్పుడు కాస్త దూరాన ఒక పరిచయమైన ముఖం తనవైపు రావడాన్ని గమనించాడు. దగ్గరికి రాగానే అది మొన్న తనకు దారితోడుగా దొరికిన వజ్రబాహువు ముఖమేనని తెలిసింది.

మొదట పరంజ్యోతికి ఉత్సాహం కలిగింది. వెంటనే అతని మనసులో, 'తనకీ గతి కలిగేందుకు మూలకారణం ఈ మనిషే' అన్న అభిప్రాయం కలిగింది.

వజ్రబాహువేమో పరంజ్యోతిని చూసి చాల ఆశ్చర్యంగొన్నట్లు, “తమ్ముడూ! ఇదేం స్థితి?” అన్నాడు. తర్వాత అతన్ని తీసుకొచ్చిన వీరులను ఏదో అడిగేసి, “తమ్ముడూ! భయపడకు! సత్యాశ్రయ పులకేశి రాజు వద్ద ఉన్నది ఉన్నట్లు చెప్పు! నీకే హాని కలగదు!” అన్నాడు.

వజ్రబాహు మాటలకన్న అతని ప్రకాశవంతమైన కళ్ళలో మెరుపులాగ మెరిసిన సంజ్ఞ పరంజ్యోతికి ఎక్కువ ధైర్యాన్నిచ్చింది.

~~~
~~~

# అధ్యాయం - 42

## సత్యాశ్రయ పులకేశి

**వాతాపిని** రాజధానిగా చేసుకొని ఉత్తరాన నర్మదానదినుంచి దక్షిణాన తుంగభద్ర వరకు విస్తరించిన విశాల చాళుక్య సామ్రాజ్యాన్ని ఏలుతుండిన చక్రవర్తిని - భారతదేశంలో ఆ కాలపు వీరుల్లో సాటిలేని మహావీరుడుగా చెప్పదగ్గ సత్యాశ్రయ పులకేశిని - పాఠకులిప్పుడు కలుసుకోబోతున్నారు. దానికి ముందు ఆ వీరుని పూర్వచరిత్రను పాఠకులు తెలుసుకోవడం చాల ఉపయుక్తంగా ఉంటుంది.

**పులకేశి,** అతడి సహోదరులు చిన్నవారుగా ఉన్నప్పుడు వారి చిన్నాన్న మంగలేశుడి క్రూరత్వానికి గురయ్యారు. వాడి చెరనుంచి ఎలాగో తప్పించుకొని చాలకాలం అడవుల్లో తలదాచుకొన్నారు. అలా అజ్ఞాతవాసంలో ఉన్నప్పుడు వారనుభవించిన కష్టాలు వారిని రాటుదేలిన వజ్రకాయులుగాను, సాటిలేని మేటి వీరులు గాను తీర్చి దిద్దడమేగాక వారిని దయ, దాక్షిణ్యంలేని అతి క్రూరస్వభావులుగా మార్చాయి.

సమయం కూడి వచ్చినప్పుడు పులకేశి అడవి నుంచి బయటపడి, మంగలేశుని సులభంగా జయించి తరిమేసి వాతాపి సింహాసనాన్ని చేజిక్కించుకొన్నాడు. తర్వాత తన తమ్ముళ్ళను తోడు తీసుకొని వాతాపి రాజ్యాన్ని విస్తరించుకోనారంభించాడు. దక్షిణాన తుంగభద్ర వరకు విస్తరించుకొన్న తర్వాత అతడి దృష్టి ఉత్తరానికి మళ్ళింది. నర్మద వరకు ఆక్రమించుకొన్నాడు. కానీ ఆ మహా నదిని దాటి, విశాలమైన ఉత్తరభారతాన్ని దిగ్విజయంగా పాలిస్తున్న హర్షవర్ధనుని శక్తిని, సైన్యబలాన్ని పరీక్షించి చూసి, సరిగ్గా దెబ్బ తిన్నాడు. సంవత్సరాల తరబడి నర్మదకు ఇరువైపులా కొనసాగిన ఆ మహాయుద్ధంలో ఇక తాను విజయం సాధించలేడని గ్రహించిన పులకేశి హర్షునికి సంధి రాయబారం పంపించాడు. వెంటనే ఆ సామ్రాట్టు అందుకంగీకరించి నర్మదకు దక్షిణంగా ఉన్న దేశానికి పులకేశిని చక్రవర్తిగా గుర్తించాడు.

తర్వాత పులకేశి దృష్టి దక్షిణాన తుంగభద్రను దాటి ఇంకా ముందుకు వెళ్ళజూసింది. అందుకు ముఖ్యకారణమైనవారు, పులకేశిని ఎగదోసినవారు జైనమునులంటే పాఠకులు ఆశ్చర్యపడక తప్పదు.

పులకేశి సింహాసనమెక్కేందుకు జైనమునులు సహకరించినందువల్ల వాతాపిలో వారికి చాల పలుకుబడి ఏర్పడింది. వారి ప్రయత్నం వల్లే గంగపాడి రాజు దుర్వినీతుని కుమార్తెకు, పులకేశి సహోదరుడు విష్ణువర్ధనుడికి వివాహం జరిగింది.

ఈ సమయాన పల్లవ సామ్రాజ్యపు చక్రవర్తి మహేంద్రపల్లవుడు జైనమతాన్ని వదిలి శైవమతాన్ని స్వీకరించిన విషయం దేశమంతటా ఒక పెద్ద కలకలాన్ని రేపింది. అప్పుడు కంచి

మహానగరంలో జైనుల మహాపీఠం ఉండేది. అలాంటప్పుడు మహేంద్రపల్లవ చక్రవర్తి శైవమతాన్ని స్వీకరించడం జైన మునులందరికీ కోపాన్ని కలిగించింది. వారందరూ పులకేశిని ఆశ్రయించి అతన్ని కంచి మీదికి దండయాత్ర చేయమని ఎగదోశారు.

అంతేకాదు, పులకేశి సైన్యంతోబాటు వారు కూడ ప్రయాణం చేసి వారితోసే విడిది చేశారు. కానీ రాజధానికి, సైనిక గుడారానికి చాల తేడా ఉందని, చక్రవర్తి పులకేశికి, యుద్ధనాయకుడు పులకేశికి చాల వ్యత్యాసం ఉందని వారు త్వరలోనే గ్రహించారు. రాజధానిలో భరత పూజ్యపాదులకు, రవికీర్తికి చక్రవర్తి కన్న ఎక్కువ మన్నలందేవి. కానీ యుద్ధరంగంలో వారిని తిరిగి చూసేవాడు కూడ లేడు. వైజయంతిని కాల్చవద్దని వారెంత మొరపెట్టుకొన్నా వారి మాట వినక పులకేశి వైజయంతిని కాల్చి నేలమట్టం చేయడంతో, వారిక పులకేశితో వాదించి ప్రయోజనం లేదని గ్రహించి తిరిగి వెళ్ళిపోయారు.

చాళుక్య చక్రవర్తిని అతని సేనాపతులతోబాటు మనం యుద్ధశిబిరంలో చూసినప్పుడు వారు ఆ మునులు అక్కడినుంచి వెళ్ళిపోయిన విషయాన్నే చర్చించుకొంటున్నారు.

ఆ యుద్ధశిబిరంలో స్వర్ణ సింహాసనం మీద రత్నకిరీటం ధరించి ఆ చక్రవర్తి గంభీరంగా కూర్చొనివున్నాడు.

అతడి ముందు పరిచివున్న రత్నకంబళి మీద అతడి సేనాధిపతులందరూ వినయంగా కూర్చొని, అతన్ని భయభక్తులతో చూస్తున్నారు.

పులకేశి, అతడి సేనాపతులు మాట్లాడుకొంటున్న భాషలో తమిళ పదాలు, ప్రాకృత పదాలు కూడ మిళితమైవున్నాయి (రచయిత వ్యాఖ్య: ఈ మిశ్రిత భాషే తర్వాతి కాలంలో కన్నడ భాషగా మారింది[7]).

"లక్షణంగా ఉంది! ఈ దిగంబర సన్యాసులు ఏ ఉద్దేశంతో మన వెంట వచ్చారో తెలియడం లేదు. వాళ్ళు చెప్పినట్లు మనం యుద్ధాన్ని నడుపుతామని అనుకొన్నారా ఏమి?" అన్నాడు పులకేశి.

"వాళ్ళు వెళ్ళిపోయిందే మంచిది. లేకపోతే యుద్ధం బదులు గుళ్ళు, విహారాలు కట్టుకొంటూ వెళ్ళేవాళ్ళం!" అన్నాడొక సేనాపతి.

అది విని అందరూ గలగలమని నవ్వారు.

నవ్వుల సద్దు మణిగాక ఇంకొక సేనాపతి, "ఈ జైనమునులను పంపించేశాం సరే, కానీ ఈ యుద్ధం ఆ బౌద్ధభిక్షువు మాట ప్రకారం కద నడుస్తున్నట్లుంది?" అని అడిగాడు.

"అది వేరే విషయం. భిక్షువు ఆలోచన విన్నందువల్ల మనకింతవరకు ఎలాంటి నష్టమూ

---

7 అనువాదకుని మాట: ఇది తప్పు. కన్నడభాష క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం కన్న ముందు నుంచి ఉంది. పులకేశి కాలం క్రీ.శ. ఏడవ శతాబ్దం.

కలగలేదు. ఏ కార్యం కూడ తప్పుగా జరగలేదు" అన్నాడు పులకేశి.

తర్వాత ఒక సేనాపతిని చూసి, “మన గూఢచారుల దండు భలే పనిచేస్తూంది. భిక్షువు దూతను పట్టుకొని వచ్చేందుకు బదులు ఆ దూతే మనని వెతికి పట్టుకొన్నట్లుంది కద?” అన్నప్పుడు స్వతహాగానే కఠినంగా ఉండే అతడి గొంతు మరింత కఠినంగా ధ్వనించింది.

ఆ గూఢచారి దండు నాయకుడు కాసేపు తల వంచి నిలబడి, తర్వాత తలెత్తి, “ఏదో తిరకాసు జరిగింది. నేను పంపిన మనుషులు ఇంకా తిరిగి రాలేదు...” అని అంటూండగానే గుడారంలోకి ఎవరో ప్రవేశిస్తుండడాన్ని గమనించి తిరిగి చూసి, “ఆహా! ఇదిగో వచ్చేశారు!” అన్నాడు.

అప్పుడు  చేతులు వెనక్కి కట్టి, బంధించబడ్డ పరంజ్యోతిని అతన్ని చెరపట్టిన వీరులు లోపలికి తోసుకొని వస్తున్నారు.

అది చూసిన పులకేశి, “ఏమిది? ఎవరీ పిల్లాడు?” అని అడిగింది పరంజ్యోతి చెవిన పిడుగుపాటులాగ పడింది.

~~~
~~~

# అధ్యాయం - 43

## పత్రంలోని మర్మం

**పులకేశి** ఎత్తుగా, కాస్త సన్నగా, ఆజానుబహువుగా, అత్యంత దేహదారుఢ్యంతో కనిపిస్తాడు. అతడి డేగకళ్ళు చాల తీక్షణంగాను, దయాదాక్షిణ్యాలు లేని అతి కఠినమైన హృదయాన్ని ప్రతిఫలిస్తున్నాయి. అదాటున చూసినవారికి గుండె గుభేలుమనేటంత భయంకర రూపమతనిది.

ఇప్పుడు అతడి ముందు నిలబెట్టబడ్డ పరంజ్యోతికి అటువంటి అదిరిపాటు కలిగింది.

పరంజ్యోతిని పట్టుకొని వచ్చిన వీరుల నాయకుడు పులకేశికి నమస్కరించి, ఉత్తరపెన్న నదీతీరాన ఉన్న మఠం పెద్ద భిక్షువు ఈ కుర్రాడిని తమ వెంట పిలుచుకొని వెళ్ళమని చెప్పినప్పటినుంచి జరిగినదంత క్రమంగా వివరించాడు.

అతడు చెప్పి ముగించేవరకు ఓపిక పట్టలేని పులకేశి అడ్డుపడి, “అదంతా ఉండనీ. ఈ పిల్లాడెవరు? ఎందుకు పట్టుకొని వచ్చారు?” అని కోపంగా గర్జించాడు. ఆ వీరుల నాయకుడు వణికే గొంతుతో, “నాగనంది భిక్షువు సత్యాశ్రయులకు ఇమ్మని ఒక తాళపత్రాన్ని ఇచ్చినట్లు ఈ అబ్బాయి చెబుతున్నాడు. ఇదిగో చూడండి" అని పరంజ్యోతినుంచి చేజిక్కించుకొన్న తాళపత్రాన్ని పులకేశికందించాడు.

పులకేశి ఆ పత్రాన్ని విప్పి శ్రద్ధగా చదివాడు. అతడి ముఖకవళికలు అతడు అమిత ఆశ్చర్యాందోళనలకు గురైనట్లు ఎత్తి చూపుతున్నాయి. ఒకటికి రెండుసార్లు చదివిన తర్వాత కాస్త తేటపడినట్లు తోచింది.

కానీ ఇదంతా చూస్తున్న పరంజ్యోతి మనసేమో చాల గందరగోళమైన పరిస్థితిలో ఉంది. నాగనంది భిక్షువు దగ్గర పత్రం తీసుకొన్నప్పుడు ఇలా చిక్కుకొంటానని గాని, చెరపట్టబడి శత్రువుల రాజు ముందు నిలబడతాననిగాని ఊహించను కూడ లేదు. ఆ శత్రుగుడారంలో వజ్రబాహు ఉన్నట్లుండి కనిపించడం, పోతూ పోతూ "సత్యాశ్రయ పులకేశి రాజుకు ఉన్నది ఉన్నట్లు చెప్పు" అని చెప్పేసి వెళ్ళడం అతడి మనసును మరింత ఆందోళనకు గురి చేసింది.

ఇంకా, నాగనంది తనకు చెప్పిన హెచ్చరిక మాటలు గుర్తొచ్చి తల తిరిగినట్లయింది. “ఈ పత్రాన్ని సత్యాశ్రయులకు తప్ప ఇంకెవరికీ ఇవ్వకు. ఆయన నీకు మధ్య దారిలో దొరికినా దొరకవచ్చు. ఎప్పుడు ఎక్కడ ఏ వేషంలో కనిపిస్తారో చెప్పలేము. జాగ్రత్తగా మసలుకో!" అని హెచ్చరించి పంపారు. ఇంతకీ పత్రంలో పేర్కొన్న సత్యాశ్రయులు ఈ పులకేశి రాజేనా? కానీ పత్రంలో అజంతా చిత్రాల రహస్యం గురించేనా రాశారు? లేక ఒక పెద్ద మర్మభూయిష్టమైన కుట్రలో తాము చిక్కుకొన్నామా, ఏమి అని

పరంజ్యోతి తలచినప్పుడు అతడి తల నిజంగానే గిర్రున తిరిగింది.

పులకేశి చటుక్కున తలెత్తి ఎదురుగా ఉన్న దండు నాయకులను చూసి, “ఈ పత్రంలో ఏం రాసివుందో తెలుసా?” అన్నాడు. వెంటనే , “మీరేనాటికీ ఊహించలేరు" అని తానే ఉత్తరం కూడ చెప్పేసి పిడుగు పడినట్లు నవ్వాడు.

పిడుగు చటుక్కున ఆగిపోయేటట్లే తన నవ్వునాపేసి, కాపలావీరుల మధ్య కట్లతో నిల్చొన్న పరంజ్యోతిని గుచ్చి చూశాడు. పులకేశి తీక్షణ వీక్షణాలు పరంజ్యోతి హృదయాన్నే గుచ్చుతున్నట్లున్నాయి.

పులకేశి అతన్ని చూసి కఠినమైన స్వరంతో, “ఎవరు నీవు? ఎక్కడ వచ్చావు? పత్రాన్నిచ్చిందెవరు? ఇందులో ఉన్న విషయం ఇదీ అని నీకు తెలుసా?” అని ప్రశ్నల శరపరంపర కురిపించాడు. ఆ ప్రశ్నల్లో ఒక్కటి కూడ అర్థం చేసుకోలేని పరంజ్యోతి మౌనంగా నిలబడ్డాడు.

దాంతో పులకేశి కోపం ఇంకా పొంగింది. అది గమనించి సేనాపతుల్లో ఒకడు, “ఈ అబ్బాయి చెవిటివాడులాగున్నాడు" అన్నాడు.

ఇంకొకడు, “మూగవాడు!” అన్నాడు.

మరొకడు, “అదంతా కాదు. వీడికి మన భాష తెలియదు! అందుకే గుడ్లు మిటకరిస్తున్నాడు!” అన్నాడు.

అప్పుడు పులకేశి, “అవును, అలాగే ఉండాలి. ఇప్పుడు గనక ఆ జైనమునులే ఇక్కడ ఉంటే చాల తేలిగ్గా మన భాషను ఈ అబ్బాయికి తెలియజేసి, వాడి భాషను మనకు అనువదించి చెప్పేవారు. పోనివ్వండి. ప్రస్తుతానికి తీసుకెళ్ళి చెరలో వేయండి. తర్వాత చూసుకొందాం" అన్నాడు. కానీ ఉన్నట్లుండి, “వద్దు. ఇక్కడే ఉండనీ. కాసేపటి క్రితం వచ్చిన వీరుడు వజ్రబాహును పిలుచుకొని రండి!” అన్నాడు.

వజ్రబాహును పిలుచుకొని రావడానికి మనిషి వెళ్ళిన తర్వాత పులకేశి సేనాపతులను చూసి ఇలా అన్నాడు:

“ఈ పత్రంలో ఏం రాసివుందో, తెలుసా? వినండి విచిత్రాన్ని! ఈ పత్రాన్ని తీసుకొస్తున్న యువకుడికి అజంతా వర్ణ చిత్రాల రహస్యాన్ని చెప్పి పంపాలి. రెండేళ్ళపాటు ఆ అజంతా గుహల్లో నేను నివసించినప్పుడు కూడ ఆ భిక్షువులనుంచి ఆ వర్ణచిత్రాల రహస్యాన్ని రాబట్టలేకపోయాను. భిక్షువులు అంత జాగ్రత్తగా అజంతా చిత్రాల రహస్యాన్ని కాపాడుతున్నారు. అలా ఉండగా నాగనంది ఆ రహస్యాన్ని ఈ అబ్బాయికి చెప్పి పంపాలట. చేతివ్రాత చూస్తే మన నాగనంది భిక్షువు రాసినట్లే ఉంది. దీని గురించి మీ అభిప్రాయమేమి, మైత్రేయా?” అని చెబుతూనే పులకేశి ఆ పత్రాన్ని గూఢచారి దండు నాయకుడికి అందించాడు.

అది తీసుకొని చదివిన గూఢచారి నాయకుడు అందులో ఏదో మర్మముందని, పిల్లాడిని

అడగవలసిన రీతిలో అడిగితే చెబుతాడని సలహా ఇచ్చాడు. అది పనిచేయదని, రహస్యం లాగేందుకు వజ్రబాహువే సరైనవాడని పులకేశి అంటుండగానే ఆ వీర వజ్రబాహు ప్రవేశించాడు.

అప్పుడు పులకేశి అతన్ని చూసి, “వజ్రబాహు! మీలాగే ఈ అబ్బాయి కూడ నాకొక తాళపత్రం తీసుకొచ్చాడు. కానీ అది మర్మభూయిష్టంగా ఉంది. దాన్ని ఎవరిచ్చారు? ఎవరిదగ్గర ఇమ్మన్నారు అని విచారించి తెలియజేయండి!” అన్నాడు.

వజ్రబాహు పరంజ్యోతిని ఒక చూపు చూసి, “అరె! ఈ అబ్బాయిని నేను మొన్న రాత్రి మహేంద్ర మంటపంలో చూశాను కద! అప్పుడే సందేహం కలిగి విచారించి చూశాను. కానీ బదులేమివ్వలేదు. గట్టిపిండం!” అన్నాడు.

“ఇప్పుడు మళ్ళీ విచారించండి. బదులివ్వకపోతే మేము చెప్పిస్తాము" అన్నాడు వాతాపి రాజు.

“రారాజా! వీడు శుద్ధవీరుడిలాగా కనిపిస్తున్నాడు. భయపెట్టి సమాచారం లాగలేము. నేనే విచారించి చూస్తానుండండి" అని చెప్పి, పరంజ్యోతి వైపు తిరిగి చూసి, “తమ్ముడూ! నేనప్పుడే చెప్పాను కద? చక్రవర్తికి ఉన్నది ఉన్నట్లు చెప్పు. భయపడకు. నేను నిన్ను చూసుకొంటాను!” అని తమిళభాషలో అన్నాడు.

అందుకు పరంజ్యోతి, “అయ్యా! నాకెందుకు భయం? ప్రాణానికి మించినదేముంది? ఈ పత్రాన్ని నాగార్జునకొండకు తీసుకొని వెళ్ళి సత్యాశ్రయులకు ఇమ్మని నాగనంది భిక్షువు చెప్పారు. మీరంటున్నట్లు ఈ పత్రం వీరికే అంటే, తీసుకొని బదులు రాసిమ్మని చెప్పండి. తీసుకొని ఇప్పుడే వెనుదిరుగుతాను. అది వీరికి ఉద్దేశించింది కాకపోతే, తిరిగివ్వమనండి. నేను ఇంకేం చెప్పగలను?” అన్నాడు.

వజ్రబాహు పులకేశిని చూసి, “రారాజా! ఆ పత్రం ఇచ్చింది నాగనంది భిక్షువేనని, అందులో ఏదో అజంతా వర్ణచిత్రాల గురించి రాసివుందని పిల్లాడు చెబుతున్నాడు. దాన్ని నేనొకసారి చూడవచ్చా?” అన్నాడు.

పులకేశి పత్రాన్ని వజ్రబాహుకిచ్చి, “ఇందునుంచి తెలుసుకోదగినది ఏమీ లేదు. మీరు కావాలంటే చూడండి" అన్నాడు.

వజ్రబాహు పత్రాన్ని కాసేపు శ్రద్ధగా చదివి, “ప్రభూ! నాగార్జునకొండ బౌద్ధవిహారపు ప్రధాన భిక్షువు పేరు కూడ సత్యాశ్రయులే కద?” అన్నాడు.

“అవును, అందువల్లనేమి?”

"బహుశ ఇది ఆయనకుద్దేశించింది కావచ్చు కద?”

“కావచ్చు; కానీ నాగనంది భిక్షువు ఇటువంటి పత్రాన్ని ఆయనకు రాసిపంపడం న్యాయమే కాదు!”

"ప్రభూ! ఈ పత్రం చదువుతున్నప్పుడు నాగనంది భిక్షువు చెప్పిన ఇంకొక మాట గుర్తొస్తూంది. కృష్ణానది తీరం వెంబడి వేంగి రాజ్యం మీద దండెత్తి వెళుతున్న మీ సహోదరులకు కూడ ఒక పత్రం పంపాలని చెప్పారు. ఒకవేళ మీ సహోదరులు విష్ణువర్ధమహారాజుకు ఇందులో ఏదైనా సందేశం ఉండవచ్చు కద?"

ఇది వినగానే పులకేశి ముఖం ప్రకాశవంతమైంది. "వజ్రబాహు! మీరు చాల బుద్ధిశాలురు! మీరు మాతోనే ఎందుకు ఉండిపోకూడదు? అనేక కార్యాలకు అనుకూలంగా ఉంటుంది!" అన్నాడు.

తర్వాత, తన సేనాధిపతులతో కాస్త చర్చించి, "ఎలాగూ నేను విష్ణువర్ధనునికి పత్రం పంపాల్సి ఉంది. పత్రంతో తొమ్మిది వీరులు వెళ్ళనీ. వారితో ఈ పిల్లాడు కూడ వెళ్ళనీ. నా తమ్ముడిక్కాడ ఈ పత్రంలోని మర్మం అర్థం కాకపోతే వీడిని శిరచ్ఛేదం చేయమని ఆజ్ఞ వేయండి!" అన్నాడు. తర్వాత వజ్రబాహును చూసి, "ఈ విషయాన్ని ఆ పిల్లాడికి తెలియజేయండి!" అని ఆజ్ఞాపించాడు.

వజ్రబాహు పరంజ్యోతితో, "తమ్ముడూ! నాగార్జునకొండకు ఇక్కడినుంచి రేపుదయం పత్రం తీసుకొని తొమ్మిదిమంది వీరులు బయల్దేరబోతున్నారు. నీవు వారితోబాటే వెళ్ళు. నేను బహుశ రేపు రాత్రి నిన్ను దారిలో కలుస్తాను" అన్నాడు.

ఆ చివరి మాట వినగానే పరంజ్యోతికి ఉత్సాహం పొంగింది. "మీతోబాటు ప్రయాణమంటే చాల సరదాగా ఉంటుంది. మీరు చెప్పే కథలు వింటూ వెళ్ళవచ్చు!" అన్నాడు.

"అబ్బాయి ఏమంటున్నాడు?" అని పులకేశి అడిగినందుకు వజ్రబాహు, "అబ్బాయి చాల గట్టివాడు. పత్రం మీకు కాదంటే తనకే తిరిగి ఇవ్వమంటున్నాడు. లేగదూడకు భయమే లేనట్లు ఈ పిల్లాడికి కూడ ఏమాత్రం భయం లేనట్లుంది" అన్నాడు.

అందుకు పులకేశి నవ్వేసి, "అలాగా! ఫరవాలేదు. పత్రం వాడికే తిరిగి ఇచ్చేయండి. అలాగే వాడి కట్లు కూడ విప్పేయండి" అన్నాడు.

అదే విధంగా పరంజ్యోతిని పట్టుకొచ్చిన వీరులు అతడి కట్లు విప్పేసి, రాత్రి బస చేసే చోటికి తీసుకెళ్ళారు.

**మరునాడు** సాయంసంధ్యాసమయానికి పరంజ్యోతి, ఆ తొమ్మండుగురు వీరులు కొండ అడవి దారి వెంబడి ఇరుకైన కనుమ దాటి, అవతల దూరాన ఉన్న ఒక పాడుబడ్డ ఇంటిని సమీపించారు. ఆ ఇంటి దిన్నె/అరుగు మీద ఒక ముసలాడు కూర్చొని చేత జపమాల తిప్పుతున్నాడు. వీరు ఆ ఇంటి వాకిలి దగ్గరికొచ్చిన తర్వాత కూడ వారిని పట్టించుకోలేదు. వీరులు అప్పటికే చీకటి పడుతుండడం వల్ల రాత్రికి ఆ ఇంట్లోనే బసచేయడమని నిశ్చయించుకొన్నారు. తమలో నలుగురిని నాలుగు జాములకు కాపలా కాసేటట్లు ఏర్పాటు చేసుకొన్నారు.

పరంజ్యోతి బాగ అలిసివుండం వల్ల భోంచేసి పడుకొన్న వెంటనే గాఢనిద్రలో జారిపోయాడు. ఈ రాత్రి కూడ ఏవో కల వచ్చింది. అందులో సత్యాశ్రయ పులకేశి తననుద్దేశించి, “వీడిని ఏనుగులతో తొక్కించి చంపండి!” అని ఆజ్ఞాపిస్తున్నాడు. తాను ఆ ఏనుగు తన వైపు రాగానే దాని మీదికి శూలాన్ని విసిరి పరుగు లంకించుకొంటున్నాడు. కానీ ఆ ఏనుగు తనని వెంబడించి వచ్చి తన తొండంతో తన భుజాన్ని పట్టి కుదపడంతో పరంజ్యోతి అదిరిపడి లేచాడు. చూస్తే ఏనుగు ముఖం ఆ ఇంటి ముందు కూర్చొని జపమాల తిప్పుతూన్న ముసలాడి ముఖంగాను, ఏనుగు తొండం ఆ ముసలాడి చేయిగాను మారివున్నాయి.

ఇది కలకాదు, నిజంగానే ఆ ముసలాడు తన భుజాన్ని కుదిపి లేపుతున్నాడని గ్రహించగానే పరంజ్యోతి చటుక్కున లేచి కూర్చొన్నాడు.

~~~
~~~

# అధ్యాయం - 44

## మాయ ముసలాడు

**ముసలాడి** చేతిలో ఒక శూలం ఉండడాన్ని, దాన్ని తీసుకొని తనతో రమ్మని అతడు సైగ చేస్తున్నట్లు గవాక్షం గుండా వస్తున్న మసక వెన్నెలలో చూసి తెలుసుకొన్నాడు పరంజ్యోతి. అబ్బాయి కాస్త జంకడం చూసి ఆ ముసలాడు తన ఎడమచేత్తో పరంజ్యోతి రెక్క పట్టుకొని గట్టిగా ఒత్తగానే పరంజ్యోతికి ఒక పాత జ్ఞాపకం గుర్తుకు వచ్చి, వెంటనే ఆ శూలాన్ని తీసుకొని తుళ్ళి లేచాడు.

ఇద్దరూ ఇంటి పెరటి వాకిలి గుండా బయటికొచ్చారు. అక్కడ పరంజ్యోతి తన గుర్రం, దాని పక్క ఇంకొకటి సిద్ధంగా ఉండడాన్ని గమనించాడు. ఇద్దరూ గుర్రమెక్కారు.

పరంజ్యోతి ఎదురుచూసినట్లు ముసలాడి గుర్రం తన గుర్రంలాగ ముందుకు దూకలేదు. అతడు అటువైపు తిరిగి ఏదో చేస్తున్నాడు. కాబట్టి పరంజ్యోతి కూడ తన గుర్రాన్ని లాగి పట్టవలసివచ్చింది.

ఆలస్యం చేస్తున్న ముసలాడు మధ్యలో, “తమ్ముడూ! నేనెవరని తెలుస్తూందా?” అని అడిగాడు.

“మొదట గడ్డం చూసి ఏమారిపోయాను, కానీ నా చేయి పట్టుకొని నొక్కినప్పుడు తెలిసింది. దెయ్యాలకు భయపడని వీర వజ్రబాహువే కద మీరు?” అన్నాడు పరంజ్యోతి.

పెద్దగా నవ్వుతూ ఆ ముసలాడు ఇటు తిరిగినప్పుడు నెరిసిన గడ్డం మాయమై, వజ్రబాహు ముఖం కానవచ్చింది.

“ఆలోచించు చెప్పు, అబ్బాయ్! నీకు నాతో వచ్చేందుకు సమ్మతమేనా?” అని అడిగాడు వజ్రబాహు. అందుకు పరంజ్యోతి, “నాకు సమ్మతమే. కానీ, మీకే ఇక్కడినుంచి కదిలేందుకు ఇష్టం లేనట్లుంది. ఇంత పెద్దగా శబ్దం చేస్తూంటే నిద్రపోతున్న ఆ వీరులు మేల్కొని వచ్చేయరా?” అన్నాడు.

“వాళ్ళని లేపాలనే ఇంత గట్టిగా మాట్లాడాను. నిద్రపోతున్నవారిని ఏమార్చేసి పారిపోయాననే అపనింద అచ్యుత విక్రాంతుని వంశంలో పుట్టిన ఈ వజ్రబాహుకు తగునా?” అని చెప్పి, దేన్నో గుర్తు తెచ్చుకొన్నట్లు పడి పడి నవ్వాడు.

ఇంతలో ముందు వాకిట కాపలా కాస్తున్న వీరుడు గుర్రపు డెక్కల చప్పుడు, ఎవరో మాట్లాడుకొంటున్న శబ్దం విని, పెరటి వాకిలి దగ్గరికొచ్చి చూశాడు. ఇద్దరు గుర్రాల మీదెక్కి బయల్దేరేందుకు సిద్ధంగా ఉండడం చూసి, “ఓ!” అని పెద్దగా అరిచాడు. అది విని ఇంట్లోంచి తక్కిన వీరులు కూడ బయటికి రాసాగారు. వారంతా కంగారుగా అరుస్తూ, అటూ ఇటూ పరుగెత్తసాగారు.

వజ్రబాహు, పరంజ్యోతి ఎక్కిన గుర్రాలు వాళ్ళు మొదటిరోజు వచ్చిన దారినే తిరిగి

వెళ్ళనారంభించాయి. వజ్రబాహు గుర్రాన్ని మెల్లగా నడుపుకొని వెళుతుండడం అర్థం కాక పరంజ్యోతి ఎందుకిలా మెల్లగా వెళుతున్నామని అడిగాడు.

అందుకు బదులుగా వజ్రబాహు, "వాళ్ళు మనం ఎటు వెళుతున్నామో చూసి కనిపెట్టి మనవెంటే రావాలి కద? దారి తప్పి ఇంకెటైనా వెళ్ళిపోతే?" అన్నాడు.

"వెళ్ళిపోతేనేం"

"మనం నిన్న వచ్చిన కొండ కనుమ దారిలో ఉన్న కాళీకాదేవి గుడి చూడలేదా నీవు?"

"లేదు!"

"నీవెక్కడ చూసివుంటావు? నీ ధ్యానమంతా తిరుచెంగాంట్టంగుడి గ్రామంలోనే ఉండి ఉంటుంది. అది సరే. ఆ దేవికి తొమ్మిది వీరులను బలి ఇస్తానని మొక్కుకొన్నాను. మరి వీళ్ళు దారి తప్పిపోతే నా మొక్కు ఎలా తీర్చడం?"

పరంజ్యోతికి వజ్రబాహు మాటలు చెవిలో పడ్డా, మనసులో పదిలం కాలేదు. తన ఊరినుంచి బయల్దేరినప్పటినుంచి దారిలో ఎన్నెన్నో విచిత్ర సంఘటనలు జరిగాయి. వాటన్నిటి మధ్య తన మనసేమో అప్పుడప్పుడూ తన సొంతవూరికి వెళ్ళివస్తూంది. కానీ ఈ వజ్రబాహుకు తిరుచెంగాట్టంగుడి సంగతెలా తెలిసిందా అని విపరీతమైన ఆశ్చర్యంలో మునిగిపోయాడు.

ఇద్దరూ తెల్లవారేసరికి ఒక కొండ కనుమను చేరుకొన్నారు. అక్కడ వజ్రబాహు తన గుర్రాన్నాపాడు. పరంజ్యోతి కూడ తన గుర్రాన్నాపాడు.

అప్పుడు దూరాన గుర్రాల డెక్కల చప్పుడు వినిపించింది. వజ్రబాహు అది చెవులు రిక్కించి విని, తర్వాత పరంజ్యోతిని, "తమ్ముడూ! ఆ చాళుక్య వీరులు ఇక్కడికి వచ్చేలోపు త్వరగా ఆలోచించి చెప్పు. నీకు నాతో రావడం ఇష్టమేనా?"

"నేను మీతో వచ్చేశాను కద?" అన్నాడు పరంజ్యోతి.

"నీకిష్టం లేకపోతే ఆ వస్తున్న చాళుక్య వీరులతో తిరిగి వెళ్ళవచ్చు."

"వారెక్కడికి వెళుతున్నారు?"

"నాగార్జునకొండకు. కానీ వారు నిజానికి వెళ్ళబోతున్నది యమపురికి."

"వారిని యమపురికి పంపబోతున్నదెవరు?"

"నీవు నాతో చేరితే మనమిద్దరం చేరి, లేకపోతే నేనొక్కడినే."

"ఆ తర్వాత మీరెక్కడికి వెళ్ళబోతున్నారు?"

"పల్లవసైన్యశిబిరానికి."

"ఆహా! నేననుకొన్నట్లే!"

“నీకెలా తెలిసింది?”

“నిన్నంతా ఆలోచించి తెలుసుకొన్నాను.”

“ఇంకా ఏం తెలుసుకొన్నావు?”

“మీరు పల్లవసైన్య గూఢచారి అని.”

“అబ్బాయీ! నిన్ను ఏమో అనుకొన్నాను. నీవు చాల తెలివైనవాడివే.”

“అయ్యా! నేను మీతోబాటు వస్తే నన్ను పల్లవ సైన్యంలో చేర్చుకొంటారా?”

“తప్పకుండ. నీలాంటి శౌర్యవంతుడైన యువకుడి వల్ల పల్లవసైన్యానికి చాల మేలు కలుగుతుందనడంలో సందేహం లేదు.”

పరంజ్యోతి ఇందుకు బదులివ్వక మౌనందాల్చాడు. వజ్రబాహు మళ్ళీ, “అబ్బాయీ! ఏమాలోచిస్తున్నావు?” అని అడిగాడు.

అందుకు పరంజ్యోతి, “ఈ పత్రాన్ని ఏం చేయాలా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

“అదిగో ఆ పల్లంలో పారుతున్న వాగులో పడేయి. దాని వల్ల ఇక ప్రయోజనమేమీ లేదు.”

“నాగనంది, ఆయనర్ ఎంతగా నిరాశ చెందుతారో కద?”

“అవును, నాగనందికి చాల పెద్ద నిరాశే ఎదురౌతుంది!” అని చెప్పేసి వజ్రబాహు గలగలమని నవ్వాడు.

“ఎందుకు నవ్వుతున్నారు?”

“ఇలాంటి కుంభకర్ణుని చూసి ఆ బుద్ధ భిక్షువు అంత ముఖ్యమైన పత్రాన్నిచ్చారు కద అనే!”

“అయ్యా! నన్ను దయచేసి మన్నించండి. నేనిలాగే నాగార్జునకొండకు వెళ్ళి నాగనందిగారి పత్రాన్నిచ్చేసి పల్లవ సైన్యశిబిరానికి వస్తాను.”

“వృధా ప్రయాస, అబ్బాయీ! నాగనంది ఇచ్చిన పత్రం అగ్నిదేవునికి అర్పించేశాను!”

“ఆ! ఏమన్నారు? మరి నాదగ్గరున్న పత్రం? అది కాదా?”

“అది నేను రాసిపెట్టినది, తమ్ముడూ!”

“నా సందేహం సరైనదే!” అని చెప్పి పరంజ్యోతి పత్రం ఉన్న వెదురుగొట్టాన్ని తీసి పల్లంలో విసిరేశాడు.

“ఆ రాత్రి దీపంలో మత్తుమందు పోసేసి నన్ను నిద్రమత్తులో ముంచేసి నా దగ్గరున్న పత్రాన్ని తీసుకొన్నారు కద?” అని అడిగాడు.

“అబ్బాయీ! నీ శూలంలాగే నీ బుద్ధి కూడ మొనదేలివుంది!” అన్నాడు వజ్రబాహు.

పరంజ్యోతి ఆశ్చర్యం, భక్తి నిండిన చూపులతో వజ్రబాహును చూస్తూ, “అయ్యా! నాగనంది ఆ

పత్రంలో ఏం రాశారు?" అని అడిగాడు.

"పులకేశిని వెంటనే వచ్చి కంచిని ముట్టడించి దక్షిణదేశానికి చక్రవర్తిగా పట్టాభిషేకం చేసుకోమని రాసి వుంది ఆ పత్రంలో."

"అరెరె! అటువంటి ద్రోహానికి దోహదం చేసే పత్రాన్నా నేను తీసుకొని వచ్చాను? అయ్యో! ఏం మూఢత్వం!" అని వాపోయాడు పరంజ్యోతి.

"జరిగిపోయినదాన్ని గురించి తర్వాత విచారిద్దాం. ఇప్పుడు ఆ చాళుక్య వీరులు యమలోకానికి వెళ్ళేందుకు అతివేగంగా వస్తున్నారు. నీవేం చేయబోతున్నావు?" అని అడిగాడు వజ్రబాహు.

"మీ కోరిక ఎలాగో అలాగే!"

"సరే. ఈ కనుమకు ఇరువైపులా మనమిద్దరం నిల్చొందాం. మొదట వచ్చిన వాడిపైకి ఈ ఈటెను విసురు. తర్వాత ఈ కత్తితో నీకు చేతనైనంత వరకు సాధించు!" అని చెప్పి తనదగ్గరున్న రెండు కత్తుల్లో ఒకదాన్ని పరంజ్యోతికిచ్చాడు.

పరంజ్యోతి ఆతురతతో ఆ ఖడ్గాన్ని తీసుకొని తన మొదటి యుద్ధానికి సిద్ధమయ్యాడు.

~~~
~~~

# అధ్యాయం - 45

## కొండ కనుమ

**సూర్యుడు** ఉదయించి రెండు ఘడియల వేళ అయినప్పుడు ఆ కొండ కనుమ ప్రదేశం ఒక ఘోర రణరంగంగా కానవచ్చింది.

లేతసూర్యుని ఎర్రటి కిరణాలు ఆ ఎత్తైన రాతి బండల మీద అక్కడక్కడ చిందిన రక్తం మీద పడి ఆ ఘోర రణరంగ దృశ్యాన్ని మరింత ఘోరంగా ఎత్తిచూపుతున్నాయి. కాళ్ళు తెగి, చేతులు తెగి, తలలు పగిలి ఘోరమరణమొందిన తొమ్మిది మంది వీరుల మృతదేహాలు ఆ కొండ కనుమ దారిలో పడివున్నాయి.

అలా పడివున్న మృతదేహాల మధ్య వజ్రబాహు తిరుగాడుతూ, ఆ దేహాలను తడిమి చూస్తూ దేనికోసమో వెతుకుతున్నాడు.

కాస్త దూరాన పరంజ్యోతి ఒక రాతిబండ మీద తన కత్తిమీద ఊని కూర్చొనివున్నాడు. పక్కనే అతడి శూలం పడివుంది.

కాసేపటి క్రితం జరిగిన ఒక క్రూరమైన సంఘటన పరంజ్యోతి కళ్ళముందు ఇంకా కదలాడుతూంది. చాళుక్య వీరుల్లో ఐదు మంది వజ్రబాహు చేత వీరమరణమొందారు. ఇక ముగ్గురిని పరంజ్యోతి పైలోకానికి పంపించాడు. చివరి, తొమ్మిదవ వీరుడు, వెనుదిరిగి పారిపోతుండగా వజ్రబాహు అతడి మీదికి శూలాన్ని విసిరగా, వాడు కూడ చచ్చిపడ్డాడు. ఈ చివరి సంఘటనే పరంజ్యోతిని చాల ఆందోళనకు గురి చేసి, వజ్రబాహుమీద అసహ్యం కలిగేలా చేసింది. వెన్నుచూపి పారిపోతున్న శత్రువు మీద ఆయుధం విసిరి చంపడం వీరుల లక్షణమా?

ఉన్నట్లుండి 'ఆ!' అన్న శబ్దం విని పరంజ్యోతి అటు తిరిగి చూసినప్పుడు వజ్రబాహు ఒక తాళపత్రాన్ని చేత తీసుకొని చదువుతున్నాడు. తర్వాత పరంజ్యోతి కూర్చొనివున్న చోటికి వచ్చి అక్కడున్న తన గుర్రం మీదికెక్కి కూర్చొని, “తమ్ముడూ! నీవు రావడం లేదా?” అని పరంజ్యోతిని అడిగాడు.

పరంజ్యోతి ఆశాభంగం, అసహ్యం నిండిన చూపుతో వజ్రబాహును ఒకసారి చూసేసి మళ్ళీ తలదించుకొని మౌనం దాల్చాడు.

వజ్రబాహు అతడి దగ్గరికొచ్చి, “తమ్ముడూ! నీవు ఈ రోజు చూపిన శౌర్యపరాక్రమాలు చూస్తే నీవొక ఆరితేరిన వీరుడివని చెబుతున్నాయి. నిన్ను గురించి తప్పక పల్లవ సేనాధిపతికి చెప్పి నిన్ను ఒక అశ్వదళానికి నాయకుడిగా నియమించమని చెబుతాను. కానీ, ఇప్పుడు నీవింత విరక్తికి, శోకానికి గురైన కారణమేమి?” అని అడిగాడు.

అందులు పరంజ్యోతి బదులివ్వనూ లేదు; తలెత్తి చూడనూ లేదు. తూరుపు దిక్కున ధగధగ

మెరుస్తున్న సూర్య భగవానుని మీదికి తన చూపులు సారించాడు.

వజ్రబాహు ఇంకా దగ్గరికొచ్చి, "పరంజ్యోతీ! నిన్నిలా చూస్తుంటే నాకెవరు గుర్తు వస్తున్నారో తెలుసా? కురుక్షేత్రంలో ఇరుపక్షాల సైన్యాలు వచ్చి యుద్ధానికి సిద్ధంగా నిలిచివున్నప్పుడు వారి మధ్య అర్జునుడు ఆ ఇరుపక్షాలను చూసి, తన గాండీవాన్ని కింద పడేసి, తన రథసారథియైన శ్రీకృష్ణపరమాత్మను చూసి, "నాకు యుద్ధం వద్దు,ఏమీ వద్దు" అంటాడు కద, ఆ అర్జునుడు నాకిప్పుడు గుర్తొస్తున్నాడు." అన్నాడు.

అర్జునుని పేరు వినగానే పరంజ్యోతి చటుక్కున తలెత్తాడు. అతడి కళ్ళలో నిరాసక్తత తొలగి, కుతూహలం కానవచ్చింది. "తర్వాత ఏం జరిగింది?" అని వజ్రబాహును చాల ఆతురతతో అడిగాడు.

అందుకు వజ్రబాహు, "భలే అడిగావు! కృష్ణపరమాత్మ అర్జునుని చూసి, 'అర్జునా! నీవు క్షత్రియకుల సంజాతుడివి. యుద్ధం చేయడం నీ ధర్మం! లే! చేత తీసుకో నీ గాండీవాన్ని!' అన్నాడు. ఇలా ఇంకా పద్దెనిమిది అధ్యాయాలు ఉపదేశించాడు . అదే భగవద్గీత! అందువల్ల అర్జునుడు విరక్తి, నిరాసక్తత వీడి, యుద్ధోత్సాహంగొన్నాడు..." అని చెప్పి వజ్రబాహు కథనాన్ని ఆపాడు.

"తర్వాత?" అని అడిగాడు.

"తర్వాతేమి? అర్జునుడు తన వింటిని చేతబూని, దాని నారిని మీటాడు. శ్రీకృష్ణుడు తన శంఖాన్ని దిక్కులు దద్దరిల్లేలా పూరించాడు. కురుక్షేత్ర యుద్ధం మొదలైంది!"

"యుద్ధం ఎలా జరిగింది?" అని అడిగాడు పరంజ్యోతి.

"బాగా అడిగావు! ఇప్పుడు నేనిక్కడ కూర్చొని ఆ యుద్ధం ఎలా జరిగిందో చెబుతూంటే, ఇప్పుడు జరగవలసిన యుద్ధం గతేం కావాలి?" అనేసి తన గుర్రాన్ని వెనక్కి తిప్పి కొండ కనుమ దారిన వెళ్ళనారంభించాడు.

పరంజ్యోతి తుళ్ళి లేచి తన శూలాన్ని, ఖడ్గాన్ని చేత తీసుకొని తన గుర్రం మీదికెగిరి కూర్చొని త్వరలోనే వజ్రబాహును చేరుకొన్నాడు.

వజ్రబాయు పరంజ్యోతిని చూసి, "వచ్చేశావా? నీ ముఖం చూస్తే నాతో యుద్ధానికి దిగేవాడిలాగ అగుపించావు" అన్నాడు.

"భయపడకండి! నేనొక వేళ మీతో కొట్లాడాలనుకొన్నా, మీ ముందొచ్చి యుద్ధం చేస్తాను. వెనక నుంచి శూలం విసరను!"

వజ్రబాహు కాసేపు మౌనంగా ఉండి, తర్వాత, "అబ్బాయీ! నేను ఆ తప్పించుకొని పారిపోజూసినవాడి మీదికి శూలం విసిరి చంపివుండకపోతే ఏం జరిగివుండేదో తెలుసా?" అన్నాడు.

"ఏం జరిగివుంటుందేం?" అని అడిగాడు అమాయక పరంజ్యోతి.

“మనం చూసిన వాతాపి మహాసైన్యం ఒక్క నెలరోజుల్లో కంచి వాకిలి చేరేది. వైజయంతికి పట్టిన గతే కంచికి కూడ పట్టివుండేది!”

“అయ్యో! వైజయంతి లాగ కంచి కూడ కాలి బూడిదవుతుందా? పల్లవ సైన్యానికేమైంది? మహేంద్ర పల్లవ చక్రవర్తి ఏమైనారు?”

“అదే మర్మభూయిష్టంగా ఉంది, తమ్ముడూ! కంచి నుంచి బయల్దేరిన మహేంద్ర చక్రవర్తి ఎక్కడికెళ్ళారో, ఏమయ్యారో ఎవరికీ తెలియడం లేదు! ఆయన ఇంకా సైన్యశిబిరానికి వచ్చి చేరలేదట!” అన్నాడు వజ్రబాహు.

పరంజ్యోతి కాసేపు ఊరకుండేసి, “అయ్యా! తర్వాత అర్జునుడేం చేశాడు? చెప్పండి!” అన్నాడు.

~~~
~~~

# అధ్యాయం - 46

## పులకేశి ప్రేమ

**బయళ్ళు,** బంజరు భూములు, దట్టమైన అడవులు, నీరింకిపోయి తెల్లని ఇసుక పరుచుకొన్న నదులను, మామిడి తోపులను, అందమైన గ్రామాలను అన్నిటినీ దాటి వజ్రబాహు, పరంజ్యోతి ఎక్కడా ఆగకుండ వెళుతున్నారు.

కొన్నిసార్లు వీరరసం తొణికే మహాభారత కథలను పరంజ్యోతికి చెబుతాడు వజ్రబాహు. అర్జునుడి విలువిద్యా ప్రావీణ్యతను, అభిమన్యుని అసహాయ శూరత్వాన్ని, భీముని గదాయుద్ధ వీరగాధలను గురించి వజ్రబాహు చెప్పేటప్పుడు పరంజ్యోతికి రోమాంచితమయ్యేది. తాను కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల పక్షాన నిలబడి యుద్ధం చేస్తున్నట్లనిపించేది.

ఇంకొన్నిసార్లు వజ్రబాహు దీర్ఘాలోచనలో మునిగి మౌనంగా ముందుకు సాగేవాడు. అప్పుడు పరంజ్యోతి ఏమడిగినా ఉత్తరమివ్వడు. మిట్ట పల్లాలు, అడవులు, నీటి ప్రవాహాలు, వేటిని లెక్కచేయక గుర్రాన్ని శరవేగంతో పోనిచ్చేవాడు. పరంజ్యోతికి అతడి వెంట అంతే వేగంగా గుర్రాన్ని నడుపుకొని వెళ్ళడమే అతిప్రయాసగా ఉండేది.

ఇంకొన్నిసార్లు వజ్రబాహు వాతాపి సైన్యం గురించి, పల్లవ రాజ్యానికి రాబోతున్న మహాప్రమాదాన్ని గురించి చాల దిగులుగా మాట్లాడేవాడు. ప్రశాంతత నెలకొన్న గ్రామాల వెంబడి వెళుతున్నప్పుడు, “ఆహా! ఈ గ్రామాలన్నిటికీ ఇంకొంత కాలంలో ఏం గతి పట్టబోతుందో కద?” అని చెప్పి పెద్దగా నిట్టూర్చేవాడు.

విశాలంగా పరుచుకొన్న మర్రి, రావి చెట్లను, పచ్చని కొబ్బరితోటలను చూసినప్పుడల్లా, “మనం తిరిగి వచ్చేటప్పుడు ఈ పచ్చదనాన్ని మళ్ళీ చూస్తామా?” అని చెప్పి నిట్టూర్చేవాడు.

ఈ విచిత్రమైన దిగులుకు కారణమేమని పరంజ్యోతి నొక్కి అడిగినప్పుడు, వజ్రబాహు అన్నాడు: “అబ్బాయీ! నీవా వాతాపి సైన్యశిబిరాన్ని పూర్తిగా తిరుగాడి చూడలేదు. ఆ సైన్యంలో ఉన్న బ్రహ్మాండమైన ఏనుగుల దండును చూసి, ఈ పచ్చని చెట్లను చూస్తే, నా కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. ఒక ఏనుగు ఒక్క రోజులో ఎంత ఆహారం తింటుందో తెలుసా?”

“తెలియదయ్యా!”

“ఆరు శేర్ల అన్నం, తొమ్మిది అరటి గెలలు, ఇరవై అయిదు కొబ్బరికాయలు, ఒక మర్రిచెట్టులో సగం, ఇంతా తిన్న తర్వాత కూడ ఏనుగుకు ఆకలి తీరదు!”

“అబ్బబ్బా!” అన్నాడు పరంజ్యోతి.

"ఇంతా తిన్న తర్వాత కూడ ఆ ఏనుగు కడుపులో మావటికి కూడ జాగా ఉంటుంది. కానీ ఏనుగు శాకాహారి, కాబట్టి మావటిని తినదు."

పరంజ్యోతి నవ్వేసి, "వాతాపి సైన్యంలో అలాంటి ఏనుగులెన్ని ఉన్నాయి?" అని అడిగాడు.

"పదహారు వేల ఏనుగులు, అబ్బాయ్, పదహారు వేలు! ఒక్కసారి అన్ని ఏనుగులు కంచి మహానగరం వరకు వచ్చి వెళ్తే, అవి వచ్చి వెళ్ళిన దారంతా పచ్చదనం మాయమై, ఎడారిలాగ మారిపోతుంది!"

"కంచి నగరం వరకు వాతాపి సైన్యం వచ్చేస్తుందని తరచూ చెబుతున్నారు కద, అదేల?"

"పదహారు వేల ఏనుగులను, ఐదు లక్షల పదాతిసైన్యాన్ని ఎవరడ్డుకోగలరు? ఆ దేవుడే గతి!" అని చెప్పేసి వజ్రబాహు ఒక పేలవమైన నవ్వు నవ్వాడు.

పరంజ్యోతి, "ఎందుకలా నవ్వుతున్నారు?" అని అడిగాడు.

అందుకు వజ్రబాహు, "ఒకప్పుడు నేను కంచి కోట శత్రుదుర్భేద్యమని నమ్మేవాడిని. కానీ అది ఎంత తప్పని ఇప్పుడు తెలుస్తోంది" అన్నాడు.

"ఏల? కోటకు రక్షణ చాలదా?" అని అడిగాడు పరంజ్యోతి. కానీ అలా అడుగుతున్నప్పుడే నాగనంది తనని ఒక రహస్యమార్గం గుండా కోట బయటికి తీసుకెళ్ళిన సంఘటన గుర్తొచ్చి ఆలోచనలో పడ్డాడు.

"వాతాపి ఏనుగులు సారాయి తాగి కంచి కోట తలుపులను గుద్దితే వాటి గతి ఏమవుతుందకొంటున్నావు?"

"ఛీఛీ! ఏనుగులకు సారాయి తాగిస్తారా? అదేం నీచ, అనాగరిక యుద్ధనీతి?" అన్నాడు పరంజ్యోతి ఏవగింపుతో.

"యుద్ధమే అనాగరికం, తమ్ముడూ!" అన్నాడు వజ్రబాహు.

"అన్ని యుద్ధాలను అనాగరికమని చెప్పగలమా? దేశాన్ని కాపాడేందుకు మహేంద్రపల్లవ చక్రవర్తి చేస్తున్న యుద్ధం అనాగరికమా?" అని అడిగాడు పరంజ్యోతి.

"మహేంద్ర పల్లవుని పేరు మాత్రం నా చెవిలో పడనీయకు! దేశ రక్షణను అశ్రద్ధ చేసి, ఆట పాటల్లోను, శిల్పం, చిత్రం మొదలైన కళల్లోను కాలం వెళ్ళబుచ్చడాన్ని తలుచుకొంటే నాకు ఆయన మీద చాల కోపం వస్తుంది!"

పరంజ్యోతి కాసేపు వజ్రబాహు ముఖాన్ని నిశితంగా చూసిన తర్వాత, "అయితే కంచి కోటను రక్షించడం అసాధ్యమంటారా?" అని అడిగాడు.

"వాతాపి సైన్యం తిన్నగా కంచికే వచ్చేస్తే దేవుడు కూడ కంచిని కాపాడలేడు!"

"అలా రాలేరు కద?"

"అందు గురించే పారిపోజూసిన ఆ చివరి చాళుక్య సైనికుని శూలం విసిరి చంపాను. నాగనంది ఇచ్చినట్లు ఒక పత్రాన్ని పులకేశికి ఇచ్చివున్నాను. దాని గురించి పులకేశికి సందేహం రాకపోతే కంచిని కాపాడుకోవచ్చు."

"మీరిచ్చిన పత్రంలో ఏం రాసివుందయ్యా?"

"తమ్ముడూ! నీవది అడక్కపోతే నేను అబద్ధం చెప్పవలసిన అవసరం రాదు" అని మునుపొకసారి పరంజ్యోతి చెప్పిన మాటలనే ఇప్పుడు వజ్రబాహు తిరిగి చెప్పాడు.

పరంజ్యోతి కాసేపు ఊరకున్న తర్వాత, "అయ్యా! మీరిచ్చిన పత్రం ఫలితంగా వాతాపి సైన్యం తిరిగి వాతాపికి వెళ్ళిపోతుందా?" అని అడిగాడు.

"తమ్ముడూ! కంచి అన్న పేరు వినగానే పులకేశి కళ్ళలో మెరిసిన కాంక్షను నీవు చూసివుంటే ఇలా అడిగేవాడివి కావు. నన్ను అచ్యుత విక్రాంతుని వంశపరంపరలో వచ్చినవాడిని అని నమ్మి, పులకేశి తన మనసును బాగానే తెరిచి చూపించాడు..."

"అదెవరా అచ్యుత విక్రాంతుడు?" అని అడ్డుపడి అడిగాడు పరంజ్యోతి. ఏ విషయాన్నైనా కూలంకషంగా అడిగి తెలుసుకోవడం చాల ఇష్టం పరంజ్యోతికి.

"పాండ్యనాడుకు, చోళనాడుకు మధ్య రెండు వందల సంవత్సరాల క్రితం ఒక స్వతంత్ర రాజ్యాన్నేలిన అచ్యుత కళప్పాణనుడి గురించి వినివున్నావా? ఆ అచ్యుత కళప్పాణనుడి వంశంలో పుట్టినవాడిని నేనని నమ్మేశాడు పులకేశి. 'నీవు కంచి నగరాన్ని చూశావా?' అని అడిగాడు. 'చూశాను' అన్నాను. కంచి నగర విశేషాలను వివరంగా చెప్పమన్నాడు. నేనలాగే కంచిని వర్ణించి చెప్పినప్పుడు, పులకేశి ముఖంలో తోచిన కాంక్షాపూరిత సంభ్రమాన్ని చూసివుండాలి! ఎలుకను చూసి పిల్లి కళ్ళలో మెరిసే ఆశ పులకేశి కళ్ళలో నాకు కనిపించింది. రావణుడు సీతను చూసి ఏమన్నాడో తెలుసా? 'నీవు నన్ను ప్రేమిస్తావా? లేక నిన్ను ఫలహారం కింద రేపొద్దున తినేయనా?' అన్నాడట. అలా పులకేశి కంచిని కబళించి ఏలేందుకు ఆశపడ్డా పడవచ్చు. లేక వైజయంతిలాగ కాల్చి బూడిద చేసినా చేయవచ్చు. పులకేశి ప్రేమాపాయం నుంచి కంచి మహాదేవిని ఆ దేవుడే కాపాడాలి!" అని చెప్పేసి వజ్రబాహు దీర్ఘమౌనంలో మునిగిపోయాడు.

~~~
~~~

# అధ్యాయం - 47

## ప్రయాణం ముగింపు

**సూర్యాస్తమయ** సమయానికి కొండదారిలో ఒక మలుపు తిరగగానే పల్లవ సైన్యశిబిరం కనిపించింది. పల్లవసైన్యాన్ని చూసిన తర్వాతే వజ్రబాహు దిగులుకు కారణం అర్థమైంది పరంజ్యోతికి.

వాతాపి మహాసైన్యానికి, పల్లవ సైన్యానికి అంత మధ్యనున్న అంతరం అంత పెద్దది మరి.

"తమ్ముడూ! చూశావా?" అన్నాడు వజ్రబాహు.

"చూశానయ్యా!"

"ఇంకా పల్లవసైన్యం గెలుస్తుందని నమ్ముతున్నావా?"

"తప్పక జయిస్తుందయ్యా! సందేహమే లేదు!" అని ఘంటాపథంగా చెప్పాడు పరంజ్యోతి.

"అంత నిశ్చయంగా ఎలా చెప్పగలుగుతున్నావు?"

"ధర్మం పల్లవ సైన్యం వైపుంది. అదీగాక మహేంద్ర పల్లవ చక్రవర్తి ఉన్నారు!"

"అబ్బో! నీకు మహేంద్ర పల్లవ చక్రవర్తి మీద అంత అపారమైన నమ్మకంలాగుందే?"

"అవునయ్యా!"

"పల్లవ చక్రవర్తిని నీవెప్పుడైనా చూశావా?"

"రెండుసార్లు చూశానయ్యా. ఒకసారి ఆయనర్ శిల్పి ఇంట్లో బుద్ధ విగ్రహం వెనక దాక్కొని చూశాను. ఇంకొకసారి కంచిలో నడిరాత్రి మారువేషంలో చూశాను. అప్పుడు చక్రవర్తి ఇంచుమించు మీలాగే ఉన్నారు, బుర్ర మీసాలతో."

"అవును! నేను కూడ వినివున్నాను. మహేంద్ర చక్రవర్తి కొన్నిసార్లు మారువేషంలో తిరుగుతుంటారట. కొందరు చక్రవర్తిని నన్నని, నన్ను చక్రవర్తి అని పొరబడుతుంటారు."

"నాకలా సందేహమేమీ లేదయ్యా!"

"అదలా పోనీ. వాతాపి సైన్యం, పల్లవ సైన్యం రెంటినీ నీవు చూశావు. తమ్ముడూ! ఇంకా నీవు పల్లవ సైన్యంలోనే చేరాలనుకొంటున్నావా?"

"ఇష్టపడడం కాదు, తహతహలాడుతున్నాను! మనమిక్కడ నిలబడి ఊరకే మాట్లాడుకొంటుండడం కాలాన్ని వృథా చేస్తున్నట్లనిపిస్తూంది."

"అలాగైతే నాకు సెలవివ్వు!"

"ఏమి? నన్నిక్కడ విడిచిపెట్టా వెళుతున్నారు?"

"అవును. నేను ముందు వెళ్ళి పల్లవ చక్రవర్తిని చూసి నీ గురించి చెబుతాను. ఆయన

ఇష్టపడితే నిన్ను పిలుచుకొని రమ్మంటారు. అంత వరకు నీవు సైన్య శిబిరం బయటే వేచివుండాలి."

"చక్రవర్తి శిబిరంలో ఉన్నారా? కంచి నుంచి బయల్దేరినవారి గురించి తర్వాత ఏ వార్తా తెలియలేదన్నారు కద?"

"ఇంతలో ఒకవేళ వచ్చివుండవచ్చు కద?"

"అయ్యా! చక్రవర్తిని నేనొకసారి ప్రత్యక్షంగా చూడాలనుంది. అందుకు మీరు సహాయం చేస్తారా?"

"ఎందుకు చక్రవర్తిని చూడాలని అంత కుతూహలపడుతున్నావు?"

"కంచి కోటను పరిరక్షించే బాధ్యతను నాకొప్పజెప్పమని అడిగేందుకే!"

"ఓహో! మదపుటేనుగు మీద శూలం విసిరి శివకామి సుందరిని కాపాడావు. అలా ఇప్పుడు కంచి సుందరిని కాపాడాలనుకొంటున్నావా? నీలాంటి వీరుని, తాళం వేస్తూ పాశురాలు పాడేందుకు, ఉలి పట్టుకొని శిల్పాలు చెక్కేందుకు నీ మామ పంపించారు కద! అదెంత పెద్ద పొరబాటు!"

"శిల్ప కళ దైవ కళ, అయ్యా!"

"చాలు, చాలు! అలా చెప్పే మహేంద్ర పల్లవ చక్రవర్తి పల్లవ సామ్రాజ్యాన్ని ఈ గతికి తీసుకొచ్చారు. చక్రవర్తి వద్ద నేను కూడ ఒక విన్నపం చేయదలుచుకొన్నాను. 'కొండల్ని తొలవడం, బండల్ని చెక్కడం లాంటి పనుల్ని ఆపేసి, పల్లవ సామ్రాజ్యంలో ఉన్న అందరు శిల్పులను ప్రతి గ్రామానికి వెళ్ళి మంటపాలను కట్టించమని చెప్పండి. ఆ మంటపాలలో ప్రతిరోజు మహాభారతంలాంటి వీరరసపూరితమైన గాధలను చదివి ఊరి ప్రజలందరికి వినిపించేటట్లు ఏర్పాటు చేయండి' అని అడగబోతున్నాను."

"ఇదంతా ఎందుకు?" అని అడిగాడు.

"ఈ యుద్ధాన్ని మహేంద్ర పల్లవ చక్రవర్తి వల్ల, పల్లవ వీరుల వల్ల మాత్రమే జయించడం సాధ్యం కాదు. పల్లవనాడులో ఉన్న ప్రజలందరూ వీరత్వం, పౌరుషంగొనాలి. ప్రాణాన్ని తృణప్రాయంగా భావించేందుకు సిద్ధపడాలి."

వజ్రబాహు పరంజ్యోతినుంచి విడివడి వెళ్ళేముందు అతన్ని ఆప్యాయంగా హత్తుకొని, "తమ్ముడూ! నాకు నీ వయసున్న కొడుకున్నాడు. మీరిద్దరు చేరితే ఎన్నెన్నో ఘనకార్యాలు సాధించగలరు1" అన్నాడు.

పరంజ్యోతి గొంతు పూడుకు పోతుండగా, "అయ్యా! నేను చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయాను. నన్ను కూడ మీ కొడుకులాగే భావించండి!" అన్నాడు.

వీర వజ్రబాహు శిబిరంలోకెళ్ళిన తర్వాత బయట పరంజ్యోతికి క్షణమొక యుగంగా గడవసాగింది. తనని లోపలికి పిలుచుకొని రమ్మని ఎప్పుడు ఆజ్ఞ వస్తుందా అని ఎదురు చూడసాగాడు.

కాసేపటికల్లా ఆ పల్లవ సైన్యశిబిరంలో ఒక పెద్ద కలకలం లేచింది. శంఖానాదాలతోను, భేరి మోతలతోను ఆ కొండ ప్రాంతం మారుమోగింది.

సైన్యశిబిరం వాకిట కాపలా కాస్తున్న వీరులను పరంజ్యోతి కాస్త జంకుతూనే సమీపించి, శిబిరంలో లేచిన కోలాహలానికి కారణమేమని అడిగాడు.

అందుకు, “మహేంద్ర పల్లవ చక్రవర్తి వచ్చేశారు!” అని కుతూహలంతో బదులిచ్చారా పల్లవ వీరులు.

[ఇంతటితో మొదటి భాగం సమాప్తం]